www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వరద గోదారి



పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలంలో నీట మునిగి చెరువును తలపిస్తున్న వరి పొలాలు

ఎగువన వర్షాలతో గోదావరికి భారీగా వరద

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

ఏ క్షణమైనా రెండోది

నీట మునిగిన లంకలు..

పెద్ద సంఖ్యలో పునరావాస కేంద్రాల ఏర్పాటు

3

మంగళవారం | 23-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 98 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: విదియ ఉ. 10.23 తదుపరి తదియ; నక్షత్రం: ధనిష్ఠ రా. 8.18 తదుపరి శతభిషం; వర్జ్యం: రా. 2.52-4.20; దుర్ముహూర్తం: ఉ. 8.29-9.21, రా. 10.25-11.08; అమృతఘడియలు: ఉ. 10.27-12.15; రాహుకాలం: మ. 3.00-4.40; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.47 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఆర్థిక సర్వే పూర్తి వివరాలు ..బిజినెస్ పేజీలో

ఆంధ్రప్రదేశ్ లోని పురుషుల్లో 31.1 శాతం, మహిళల్లో 36.3 శాతం ఊబకాయులని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే పేర్కొందని ఆర్థిక సర్వే వివరించింది. తెలంగాణ పురుషుల్లో 32.3%, స్త్రీలలో 30.1% ఊబకాయులని తెలిపింది.

లోక్‌సభలో నేడు కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మల

ఆహార ధర దడ

రెండేళ్లలో రేట్లు రెట్టింపు!.. వాతావరణ మార్పులు, అకాల వర్షాలే కారణం

సవాళ్లు ఉన్నా 2024-25లో వృద్ధి 6.5-7 శాతం.. ఆర్థిక సర్వేలో వెల్లడి

మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.. 2050కల్లా దేశంలో వృద్ధుల సంఖ్య రెట్టింపు

వారి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలి.. పెద్దల్లో మూడింతలు పెరిగిన స్థూలకాయం

విద్య నాణ్యత పెంచాలి.. యువతలో సగం మందికే ఉద్యోగ నైపుణ్యాలు.. ఏటా 78 లక్షల కొలువులు

న్యూఢిల్లీ, జూలై 22: ఎన్ని సవాళ్లు ఎదురైనా దేశ ఆర్థిక వృద్ధి బాగానే ఉంటుందని ఆర్థిక సర్వే వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధి 6.5 శాతం నుంచి 7 శాతం వరకు ఉంటుందని తెలిపింది. దేశంలో ఆహార ద్రవ్యోల్బణం భారీగా పెరిగిందని తెలిపింది. 2022 ఆర్థిక సంవత్సరంలో ఇది 3.8 శాతం ఉండగా.. 2023లో 6.6 శాతానికి, 2024లో 7.5 శాతానికి పెరిగిందని వివరించింది. అంటే గడచిన రెండేళ్లలో 97 శాతం పెరిగిపోయినట్లు పేర్కొంది. వాతావరణ మార్పులు, వడగాడ్పులు, రుతుపవనాల విస్తరణలో వ్యత్యాసాలు, అకాల వర్షాలు వంటి కారణాలతో ఆహార ధరలు రెట్టింపయ్యాయని తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను మంగళవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా

మిగతా 2వ పేజీలో...

అప్రజాస్వామికంగా గొంతు నొక్కే యత్నం

పార్లమెంట్ ఉన్నది పార్టీల కోసం కాదు.. దేశం కోసం

2029 ఎన్నికల్లో మనం మరోసారి తలపడదాం

అప్పటి వరకు ప్రజా సమస్యలపై దృష్టిపెడదాం: మోదీ

బిహార్‌కు హోదా ఇవ్వలేం

కేంద్రం స్పష్టీకరణ

పాపాలకు 'నిప్పు'?

మదనపల్లి సబ్ కలెక్టర్ ఆఫీసు దహనం

'22ఏ' సెక్షన్‌లో రాజుకున్న మంటలు

25 విభాగాల్లోని ఫైళ్లు బూడిద.. కొన్ని ఫైళ్లు కుప్పగాపోసి నిప్పు



తగులబడుతున్న మదనపల్లి సబ్ కలెక్టర్ ఆఫీసు



సగం సగం కాలిన ఫైళ్లు

ఆదివారం అర్ధరాత్రి సంఘటన

సెలవురోజునా 'విధుల్లో' కొందరు

సీనియర్ అసిస్టెంట్ పాత్రపై అనుమానం

అందరి చూపూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి పైనే

పుంగనూరు అక్రమాల తీగ లాగిన సర్కారు

క్రమబద్ధీకరణ పేరిట భారీగా భూకబ్జాపర్వం

ఆ కీలక ఫైళ్లు మదనపల్లి కార్యాలయంలోనే

భూదందాపై విచారణకు సిద్ధమైన ప్రభుత్వం

సబ్ కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి నియామకం

ఇంతలోనే కార్యాలయానికి నిప్పు

ఫైళ్ల దహనంపై సీఎం సీరియస్

ఒక్కరోజులోనే మూడుసార్లు సమీక్ష

నేరుగా కలెక్టరుతోనే ఘటనపై ఆరా

తక్షణం వెళ్లాలని అధికారులకు ఆదేశం

హెలికాప్టర్‌లో అప్పటికప్పుడు మదనపల్లికి డీజీపీ, సీఐడీ ఏడీజీ

రాయచోటి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం మంటల్లో తగలబడింది. అందుకు కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణం కాదని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. ఇక... అసలు 'కుట్ర' ఏమిటో బయటపడాల్సి ఉంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన భూముల వ్యవహారాలతో ముడిపడిన ఫైళ్లు అక్కడే ఉండటం... అత్యంత కీలకమైన నిషేధిత భూముల జాబితా సెక్షన్‌లోనే అగ్ని రాజుకోవడంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ సంఘటనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. డీజీపీ

మిగతా 12వ పేజీలో...

యాక్సిడెంట్ కాదు.. ఇన్సిడెంట్

12

షార్ట్ సర్క్యూట్ జరగలేదు

కిటికీ వద్ద కాల్చిన అగ్గిపుల్లలున్నాయి

కీలకమైన 22ఏ సెక్షన్‌లోనే నిప్పు

దూరంగా కుప్పగా తగలబడిన ఫైళ్లు

పది ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

దీని వెనుక ఎవరున్నా వదిలేది లేదు

డీజీపీ ద్వారకా తిరుమల స్పష్టీకరణ



అలా వదిలేస్తారా?

ఫైళ్ల మాయం, దహనంపై చర్యలేవీ?

సర్కారు మారగానే వరుస ఘటనలు

ఒక్కదానిపైనా లోతైన దర్యాప్తు లేదు

'ఏం చేసినా ఓకే' అనేలా సంకేతాలు

చివరికి.. సబ్‌కలెక్టర్ ఆఫీసు దహనం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

తోటకూర నాడే దండిస్తే ఇక్కడిదాకా వచ్చేదా అనేది సామెత! ఇది ఫైళ్ల దహనం విషయంలో వంద శాతం వర్తిస్తుంది! వైసీపీ హయాంలో అడ్డగోలుగా సహజ వనరులు దోచేశారు. ఎక్సైజ్ పేరుతో వేలకోట్లు జేబుల్లో వేసుకున్నారు. అసైన్డ్ భూములు కొల్లగొట్టారు. 30 ఏళ్ల మాదే

మిగతా 12వ పేజీలో...



ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ నజీర్

ఐదేళ్లుగా అశాంతి

ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం మొదలు.. జగన్ దిగేదాకా కొనసాగింది

2014 నాటి విభజన నష్టం కంటే గత ఐదేళ్లలో జరిగిన నష్టమే ఎక్కువ

ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేశారు.. జనం జీవించే హక్కునే కోల్పోయారు

అమరావతిని నాశనం చేశారు.. పోలవరం పూర్తిగా పట్టాలు తప్పింది

కొత్తగా ఒక్క నీటి ప్రాజెక్టు లేదు.. ఒక్క పరిశ్రమ కూడా రాలేదు

ఖనిజ సంపదను కొల్లగొట్టారు.. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను దెబ్బతీశారు

ప్రజాస్వామ్య పునరుద్ధరణకు అపూర్వ తీర్పు.. ఉమ్మడి భేటీలో గవర్నర్ నజీర్ ప్రసంగం

అడ్డుకోవడానికే సభకు జగన్ అండ్ కో.. 16 నిమిషాలు నినాదాలు.. వాకౌట్

11

మన మంచే మన బ్రాండ్

దానిని అందరూ కాపాడండి.. గెలిపించిన ప్రజల ఆకాంక్షలేమిటో తెలుసుకోండి

ఇసుకలో రాజకీయ జోక్యం వద్దు.. ప్రతీకార రాజకీయాలు వద్దే వద్దు

కూటమి ఎమ్మెల్యేలకు చంద్రబాబు హితవు

జగన్ ఇంకా సీఎం అనుకుంటున్నారు

సభలో తీరు అభ్యంతరకరం: పవన్

నామినేటెడ్ పదవుల్లో మిత్రపక్షాలకూ అవకాశం ఇవ్వాలి: నాదెండ్ల మనోహర్

'వరద' సాయం పెంచాలి: ఎమ్మెల్యేలు

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): "కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి ఒక్కటే మన బ్రాండ్‌గా ప్రజల హృదయాల్లో నిలవాలి. రాజకీయ ప్రతీకారాలు, కక్ష సాధింపులు, దాడులు మనం చేస్తున్న మంచిని కప్పివేయకుండా చూసుకోండి" అని సీఎం చంద్రబాబు కూటమి పార్టీల మంత్రులు, ఎమ్మెల్యేలకు సూచించారు. అసెంబ్లీ సమావేశాల

మిగతా 11వ పేజీలో...

భారత పరీక్షా వ్యవస్థ

ఒక మోసం

డబ్బుంటే దానిని కొనవచ్చని చాలామంది నమ్ముతున్నారు

ప్రతిపక్షం భావన కూడా అదే.. లోక్‌సభలో రాహుల్‌గాంధీ

విద్యా మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలి: అఖిలేశ్

ప్రతిపక్ష నేతలది మొసలి కన్నీరు.. యూపీఏ హయాం నాటి లీకేజీ గణాంకాలు బయటికొస్తే వారే ఇబ్బందిపడతారు: ప్రధాన్

న్యూఢిల్లీ, జూలై 22: భారత పరీక్షా వ్యవస్థ ఒక మోసమని.. డబ్బుంటే దాన్ని కొనేయవచ్చని చాలామంది నమ్ముతున్నారని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షం భావన కూడా అదేనని ఆయన స్పష్టం చేశారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు తాము నీట్ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తుతూనే ఉంటామని తేల్చిచెప్పారు. "మన పరీక్షా వ్యవస్థలో తీవ్ర సమస్య ఉందని దేశం మొత్తానికీ తెలుసు. కానీ, మంత్రి (కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్రప్రధాన్) అందరినీ నిందిస్తున్నారు. దీనికి సంబంధించి మౌలిక విషయాలు కూడా ఆయనకు తెలుసని నేను అనుకోను. జరుగుతున్న పరిణామాల పట్ల లక్షలాది మంది విద్యార్థులు తీవ్రంగా ఆందోళన

మిగతా 2వ పేజీలో...

నీట్‌లో ఒక ప్రశ్నకు జవాబు గుర్తించేందుకు కమిటీ

ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్‌కు సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం



టీచర్ల అక్రమ బదిలీలు రద్దు

917 మంది బదిలీల ఫైలును తిరస్కరిస్తూ సీఎం కీలక నిర్ణయం

బొత్స హయాంలో అడ్డగోలు బదిలీలు

పలు దఫాలుగా 2,400 మంది ట్రాన్స్‌ఫర్

టీచర్ల నుంచి రూ.వంద కోట్లు వసూలు

ఎన్నికలకు ముందు చేసినవి ఇప్పుడు రద్దు

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అక్రమ బదిలీల వ్యవహారంలో చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలకు ముందు బదిలీ ఆర్డర్లు పొందిన 917 మంది బదిలీలను రద్దు చేసింది. స్వయంగా సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికలకు ముందు పలు దఫాలుగా అప్పటి ప్రభుత్వం భారీగా అక్రమ బదిలీలు చేసింది. వాటిలో 653 మంది బదిలీలను అప్పటి సీఎం ర్యాటిఫై చేశారు. 917 మందికి ఆర్డర్లు ఇచ్చినా ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాటిని ర్యాటిఫై

మిగతా 3వ పేజీలో...

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

12

పాత మండలాలకు కుదరదు

తహసీల్దార్ల పునర్నియామకాలపై సీసీఎల్ఏ స్పష్టత

గతంలో పనిచేసిన చోట పోస్టింగ్ ఇవ్వొద్దని ఆదేశం



అసెంబ్లీ వద్ద పోలీసు అధికారిపై విరుచుకుపడుతున్న వైసీపీ అధినేత జగన్

జగన్ చిందులు

పోలీసులపై కస్సుబుస్సు

ఎల్లకాలం ఇలాగే ఉండదు

'సింహాల'కు అర్థం తెలుసా?

అధికారంలో ఉన్నవాళ్లకు సెల్యూట్ కొట్టడం కాదు!

అసెంబ్లీ వద్ద హల్‌చల్

ప్లకార్డులు చించారంటూ ఫైర్

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ప్రాంగణంలో వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పోలీసు అధికారులపై రెచ్చిపోయారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల మొదటి రోజునే తన అసహనాన్ని ప్రదర్శించారు. పోలీసు అధికారిని ఏకవచనంతో, పేరుపెట్టి పిలిచి మరీ హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం జగన్ అధికారిక హోదా 'ఎమ్మెల్యే' మాత్రమే. ప్రతిపక్ష నేత హోదా కూడా లేదు. ముఖ్యమంత్రి, మంత్రులు

మిగతా 11వ పేజీలో...

అప్పుడలా.. ఇప్పుడిలా!

11

అసెంబ్లీ రూల్స్‌పై జగన్ క్లాసు.. నాడు సభలోకి ప్లకార్డులొద్దని సుద్దులు

నేడు అడ్డుకున్నందుకు చిందులు.. పోలీసు అధికారులకు వార్నింగ్

పోలవరానికి 12,157 కోట్లివ్వండి

కేంద్రానికి మంత్రి నిమ్మల వినతి.. జలశక్తి మంత్రి పాటిల్‌తో ఢిల్లీలో భేటీ

కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి కొత్త టెండరుకు వెళ్లాలా..?

పాత ఏజెన్సీతోనే కట్టించాలా?.. స్పష్టత కోరిన జలవనరుల మంత్రి

పోలవరం సందర్శించాలని పాటిల్‌కు ఆహ్వానం.. నిమ్మల వెంట రామ్మోహన్, వర్మ

12

మేం చెబితేనే చేయాలి!

'అసైన్డ్' రిజిస్ట్రేషన్‌పై ఎమ్మెల్యేల హుకుం

అనేక జిల్లాల్లో నిలిచిన ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు

జగన్ హయాంలో మంత్రులు, పెద్దల భూదందా.. చట్ట సవరణ ముసుగులో భారీగా కొనుగోళ్లు

సామాన్య, పేద లబ్ధిదారులకు జరగని మేలు.. సవరణ చట్టం కొనసాగిస్తారా? లేదా?

స్పష్టత ఇవ్వని కొత్త ప్రభుత్వం.. ఈలోపే ఎమ్మెల్యేల తెరచాటు మంత్రాంగం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

భూముల కథ ఏమవుతుంది? జగన్ సర్కారు అడ్డగోలుగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశారు సరే... అంతే అడ్డగోలుగా మార్చిన అసైన్డ్, చుక్కల భూముల చట్టాల మాటేమిటి? ఆ జీఓలను కొనసాగిస్తారా? రద్దుచేస్తారా? సవరిస్తారా? దీనిపై కొత్త ప్రభుత్వం ఏమీ తేల్చలేదు. ఇదే అదనుగా కొందరు ఎమ్మెల్యేలు తెరచాటు మంత్రాంగం మొదలుపెట్టినట్లు క్షేత్రస్థాయి నుంచి సమాచారం అందుతోంది. జగన్ హయాంలో జరిగింది ఒక తంతు అయితే... ఇప్పుడు జరుగుతున్నది మరొక తంతు.

జగన్ పాలనలో ఇలా...

జగన్ సర్కారు ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ చట్టం-1977ను

మిగతా 2వ పేజీలో...

భారత పరీక్షా వ్యవస్థ ఒక మోసం

(మొదటి పేజీ తరువాయి)



చెందుతున్నారు. భారత పరీక్షా వ్యవస్థ ఒక మోసమని వారు విశ్వసిస్తున్నారు. బాగా డబ్బు ఉంటే.. భారత పరీక్షా వ్యవస్థను కొనేయవచ్చని నమ్ముతున్నారు. ఇక్కడ ప్రతిపక్షంలో ఉన్నవారి భావన కూడా అదే" అని రాహుల్ సోమవారం లోక్‌సభలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నీట్ అక్రమాల గురించి అడుగుతుంటే ధర్మేంద్ర ప్రధాన్ సుప్రీంకోర్టు గురించి, ప్రధాని గురించి మాట్లాడుతున్నారే తప్ప.. ఈ సమస్యను పరిష్కరించడానికి తాము తీసుకుంటున్న చర్యల గురించి చెప్పలేకపోయారన్నారు. ఒక్క నీట్ పరీక్ష అనే కాక, అన్ని పెద్ద పరీక్షల పరిస్థితీ అలాగే ఉందని ధ్వజమెత్తారు. ఇక, నీట్ నిర్వహణలో అవకతవకలను దేశంలోనే అతిపెద్ద కుంభకోణంగా అభివర్ణించిన కాంగ్రెస్ ఎంపీ (ఎర్నాకుళం నియోజకవర్గం) హిబి ఈడెన్.. పేపర్ లీకేజీపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు. "ప్రభుత్వ గణాంకాల ప్రకారమే గడిచిన ఏడేళ్లలో 15 రాష్ట్రాల్లో 70 పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయ్యాయి" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేశ్ కూడా ధర్మేంద్ర ప్రధాన్‌పై మండిపడ్డారు. ఆయన విద్యా మంత్రిగా ఉన్నంతవరకూ విద్యార్థులకు న్యాయం జరగదని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వం పేపర్ లీకేజీల్లో రికార్డులు సృష్టిస్తోందని వ్యంగ్యంగా అన్నారు. రాహుల్, అఖిలేశ్ వ్యాఖ్యలపై ధర్మేంద్ర ప్రధాన్ ఘాటుగా స్పందించారు. గట్టిగా అరిచినంతమాత్రాన అబద్ధం నిజమైపోదని.. దేశంలో పరీక్షల వ్యవస్థను పనికిమాలిన వ్యవస్థగా విపక్ష నేత పేర్కొన డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. "లోక్‌సభలో విపక్ష నేత (రాహుల్), ఆయన దుష్టకూటమి మొసలికన్నీరు కారుస్తున్నారు. యూపీఏ హయాంలోను, ఉత్తరప్రదేశ్‌లో అఖిలేశ్ అధికారంలో ఉన్నప్పటి పేపర్ లీక్స్‌కు సంబంధించి క్షేత్రస్థాయి వాస్తవాలు బయటికొస్తే వారే ఇబ్బందిపడే పరిస్థితి నెలకొంటుంద"ని ప్రధాన్ ట్వీట్ చేశారు.

16 పరీక్షలే వాయిదా..

సాంకేతిక, న్యాయ, పాలనా కారణాల వల్లగానీ, కొవిడ్ కారణంగా గానీ.. 2018 నుంచి ఇప్పటిదాకా ఎన్‌టీఏ 16 పరీక్షలను వాయిదా వేసిందని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుకాంత మజుందార్ సోమవారం లోక్‌సభలో డీఎంకే ఎంపీ కనిమొళికి తెలిపారు. '2018లో ఏర్పాటైనప్పటి నుంచీ ఎన్‌టీఏ 5.4 కోట్ల మంది విద్యార్థులకు.. 240 పరీక్షలను విజయవంతంగా నిర్వహించిందన్నారు. ఎన్‌టీఏ పనితీరుపై సమీక్ష, సంస్కరణలపై ఏర్పాటు చేసిన ఏడుగురు సభ్యుల ప్యానెల్ తాజాగా.. ఐఐటీ కాన్పూర్‌కు చెందిన ఇద్దరు విద్యావేత్తలను సభ్యులుగా చేర్చుకుంది.

కమిటీ వెయ్యండి..

నీట్ ప్రశ్నపత్రంలో 'ఆటమ్స్ (అణువుల) లక్షణాలపై ఇచ్చిన ప్రశ్నకు సరైన సమాధానాన్ని గుర్తించడానికి ముగ్గురు నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలంటూ సుప్రీంకోర్టు ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్‌ను ఆదేశించింది. వారు గుర్తించిన సమాధానాన్ని మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకల్లా సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌కు సమర్పించాలని ఆ ఆదేశాల్లో పేర్కొంది. దీనికి ముందు.. నీట్ పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్లను విచారించిన ధర్మాసనం.. పేపర్ లీకేజీ పెద్ద ఎత్తున జరిగిందనడానికి ఆధారాలు ఉంటే సమర్పించాలని పిటిషనర్లను కోరింది. లీకేజీ విస్తృత స్థాయిలో జరిగిందనడానికి ఆధారాల్లేవని వ్యాఖ్యానించింది.

ఆర్‌హెచ్-560 సౌండింగ్ రాకెట్ పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట, జూలై 22: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక ముందడుగు వేసింది. భవిష్యత్ రాకెట్ ప్రయోగాల్లో ఆక్సిజన్ లేకుండానే ఇంధనం మండుకొనేలా అధునాతన సాంకేతికతతో రూపొందించిన ఆర్‌హెచ్-560 రాకెట్‌కు ప్రయోగ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సౌండింగ్ రాకెట్ కాంప్లెక్స్ నుంచి సోమవారం ఉదయం 7 గంటలకు ఈ ప్రయోగాన్ని చేపట్టింది. ప్రస్తుతం రాకెట్ల ప్రయోగ సమయంలో అందులో ఉన్న ఇంధనం మండుకొనేందుకు ఆక్సిజన్‌ను కూడా పంపుతున్నారు. భవిష్యత్ రాకెట్ ప్రయోగాల్లో ఆక్సిజన్ లేకుండానే ఇంధనం మండుకొనే సాంకేతికతను ఇస్రో అభివృద్ధి చేసింది. ఆ సాంకేతికతను ఆర్‌హెచ్-560 రాకెట్ ద్వారా ధ్రువీకరణ చేసుకొనేందుకు దాన్ని తాజాగా పరీక్షించింది. రెండు దశలతో కూడిన ఈ రాకెట్‌ను అధునాతన టెక్నాలజీ ప్రదర్శనకు సైతం ఉపయోగపడేలా రూపొందించారు. ఇస్రో సౌండింగ్ రాకెట్ల విభాగంలో ఇది అత్యంత భారీ రాకెట్ కావడం విశేషం.

తెరుచుకున్న తుంగభద్ర గేట్లు

» శ్రీశైలం జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో

కర్నూలు (ఆంధ్రజ్యోతి), శ్రీశైలం, జూలై 22: కర్ణాటక, ఆంధ్ర సంయుక్త జలాశయం తుంగభద్రకు వరద పోటెత్తుతోంది. ఎగువన తుంగ ప్రాజెక్టు గేట్లు తెరిచి దిగువకు వరద విడుదల చేస్తున్నారు. సోమవారం తుంగభద్ర ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తి నాలుగు వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. సోమవారం ఉదయం 8 గంటలకు 1627.21 అడుగుల వద్ద 83.95 టీఎంసీలకు వరద చేరింది. ఎగువన నుంచి 1,13,402 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. డ్యాంకు దిగువన ఉన్న కర్నూలు జిల్లా కౌతాళం, మంత్రాలయం, నందవరం, సి.బెళగల్, కర్నూలు రూరల్ మండలాల్లోని నదీతీర గ్రామాలను అప్రమత్తం చేయాలని టీబీపీ బోర్డు అధికారులు కలెక్టర్లకు హెచ్చరికలు జారీచేశారు.

శ్రీశైలానికి 1,09,814 క్యూసెక్కుల వరద

ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి సోమవారం భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. జూరాల జలాశయం నుంచి 1,74,717 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 1,09,814 క్యూసెక్కుల వరద శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 832.50 అడుగులు, జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.80 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ 52.14 టీఎంసీలుగా నమోదైంది. జలాశయం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో ఎలాంటి విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు.

ఆహార 'ధర' దడ

(మొదటి పేజీ తరువాయి)



బడ్జెట్‌ను రూపొందించిన ఆర్థికశాఖలోని అధికారుల బృందంతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల, సహాయ మంత్రి పంకజ్ చౌదరి

సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. ఈ క్రమంలో సోమవారం ఆమె 2023-24 ఆర్థిక సర్వేను విడుదల చేశారు. విద్య, ఆరోగ్యం, ఉద్యోగావకాశాలు, ఆహార ధరల పెరుగుదల, వృద్ధుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు వంటి వివిధ అంశాలపై ఆర్థిక సర్వే సమగ్ర సూచనలు చేసింది. దేశంలో నాణ్యమైన విద్యను అందించాలని.. అందుకు కేంద్రం, రాష్ట్రాలు, స్థానిక సంస్థలు కలిసి పనిచేయాలని స్పష్టం చేసింది. మానసిక ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించింది. 2050 నాటికి వృద్ధుల సంఖ్య రెట్టింపు కానుందని.. ఈ క్రమంలో వారి సంరక్షణకు ప్రాధాన్యమివ్వాలని పేర్కొంది. దేశంలో పెరిగిపోతున్న స్థూలకాయం సమస్యపై ఆందోళన వ్యక్తం చేసింది. దేశ ఆర్థికాభివృద్ధి కోసం వ్యవసాయేతర రంగంలో ఏటా సుమారు 78 లక్షల ఉద్యోగాలు కల్పించాలని సూచించింది. కృత్రిమ మేధ(ఏఐ) కారణంగా సేవల రంగంలో భారతదేశ ఎగుమతులు ఏటా తగ్గనున్నాయని పేర్కొంది.

సైకియాట్రిస్టుల సంఖ్య పెంచాలి

మానసిక ఆరోగ్యం విషయంలో మన పంథా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్థిక సర్వే పేర్కొంది. వ్యక్తిగత, దేశ అభివృద్ధిలో మానసిక ఆరోగ్యానిది కీలక పాత్ర అని తెలిపింది. సైకియాట్రిస్టుల సంఖ్య పెంచాలని, పాఠశాలల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచాలని స్పష్టం చేసింది. జాతీయ మానసిక ఆరోగ్య సర్వే (ఎన్‌ఎంహెచ్‌ఎస్) 2015-16 ప్రకారం దేశంలో 18 ఏళ్ల పైబడిన వారిలో 10.6 శాతం మంది మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని తెలిపింది. 70 నుంచి 92 శాతం మంది సరైన చికిత్స తీసుకోవడం లేదని గుర్తుచేసింది. ప్రస్తుతం దేశంలో వృద్ధుల సంరక్షణ రంగం విలువ రూ.57,881 కోట్లని తెలిపింది. కానీ, ఈ రంగంలో అనేక లోపాలు ఉన్నాయంది. మౌలిక వసతులు, వృద్ధాప్యంలో వచ్చే వ్యాధులపై పరిశోధన, పర్యవేక్షణ యంత్రాంగం, అత్యవసర స్పందన వ్యవస్థ వంటి అంశాల్లో చాలా లోపాలు ఉన్నాయని వివరించింది. 2022 నాటి ఐరాస గణాంకాల ప్రకారం భారత జనాభాలో 0-14 ఏళ్లలోపు వారి సంఖ్య నాలుగో వంతు (సుమారు 36 కోట్ల మంది) ఉండగా.. 60 ఏళ్ల పైబడిన వారి సంఖ్య పదో వంతు (సుమారు 14.7 కోట్ల మంది) ఉన్నట్లు తెలిపింది. 2050 నాటికి పిల్లల జనాభా 18 శాతానికి (30 కోట్ల మందికి) తగ్గిపోనుండగా.. వృద్ధుల సంఖ్య 20.8 శాతానికి (34.7 కోట్లకు) పెరుగుతుందని వెల్లడించింది.

ఊబకాయం.. ఆందోళనకరం..

పెరిగిపోతున్న స్థూలకాయం సమస్యపై ఆర్థిక సర్వేలో ఆందోళన వ్యక్తమైంది. అత్యధిక చక్కెర, కొవ్వులతో కూడిన ఆహార పదార్థాల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. దేశంలో 54 శాతం అనారోగ్య సమస్యలకు ఆహారపు అలవాట్లే కారణమని తెలిపింది. ఇటీవల భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) విడుదల చేసిన నివేదికను ప్రస్తావిస్తూ.. అధిక చక్కెర, కొవ్వులతో కూడిన ప్రాసెస్డ్ ఆహార వినియోగం విపరీతంగా పెరిగిందని సర్వే తెలిపింది.స్థూలకాయం విషయంలో వియత్నాం, నమీబియా తర్వాత స్థానంలో భారత్ ఉందంటూ ప్రపంచ ఒబెసిటీ సమాఖ్య నివేదికను ఉటంకించింది. ఆంధ్రప్రదేశ్‌లో పురుషుల్లో 31.1 శాతం, మహిళల్లో 36.3 శాతం ఊబకాయులేనని, తెలంగాణలో పురుషుల్లో 32.3 శాతం, స్త్రీలలో 30.1 శాతం ఊబకాయులని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే పేర్కొందని వివరించింది. విద్యా నాణ్యతను మెరుగుపర్చాలని, ప్రత్యేకించి ప్రాథమిక విద్యపై దృష్టి సారించాలని ఆర్థిక సర్వే సూచించింది.

65 శాతం మంది 35 ఏళ్లలోపు వారే..

వ్యవసాయేతర రంగంలో 2030 వరకు ఏటా సగటున 78 లక్షల ఉద్యోగాలు కల్పించాలని సర్వే స్పష్టం చేసింది. 2023లో దేశంలో మొత్తం పనిచేసేవారి వారి సంఖ్య 56.50 కోట్లు ఉండగా.. ఇందులో వ్యవసాయ రంగ కార్మికుల వాటా 45.8 శాతం ఉందని తెలిపింది. 2047 నాటికి ఇది నాలుగో వంతుకు తగ్గిపోతుందని అంచనా వేసింది. ఈ వ్యత్యాసాన్ని భర్తీ చేయడానికి వ్యవసాయేతర రంగంలో ఏటా సగటున 78 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించాలని పేర్కొంది. ఇక తయారీ రంగంలో ఉపాధి కల్పన వృద్ధి రేటు తగ్గిపోతోందని తెలిపింది. దేశంలోని 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని.. చాలా మందికి ఆధునిక నైపుణ్యాలు లేవని తెలిపింది. ఇక దేశ యువతలో 51.25 శాతం మందికి ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు ఉన్నాయని పేర్కొంది. అయితే పదేళ్ల కిందట ఇది 34 శాతమే ఉందని.. ప్రస్తుతం మెరుగుపడిందని సర్వే వెల్లడించింది.

● కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా సేవల రంగంలో భారతదేశ ఎగుమతుల వృద్ధి రేటు రాబోయే పదేళ్లలో ఏటా 0.3 నుంచి 0.4 పర్సంటేజీ పాయింట్లు తగ్గిపోయే అవకాశం ఉందని ఆర్థిక సర్వే తెలిపింది.

బడ్జెట్‌పై చర్చకు 20 గంటలు!

లోక్‌సభలో మంగళవారం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌తో పాటు రైల్వే, విద్య, ఆరోగ్య, ఎంఎస్‌ఎంఈ, ఆహార ప్రాసెసింగ్ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చ జరపాలని లోక్‌సభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సోమవారం నిర్ణయించింది. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల ఎజెండాను నిర్ణయించేందుకు లోక్‌సభ, రాజ్యసభల బీఏసీలు సోమవారం సమావేశమయ్యాయి. లోక్‌సభ, రాజ్యసభ.. రెండూ బడ్జెట్‌పై చర్చకు 20 గంటల చొప్పున సమయం కేటాయించాలని నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

లోకం తీరు



బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేం

లోక్‌సభలో కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ

ఎన్డీయే కీలక భాగస్వామి జేడీయూకు షాక్

న్యూఢిల్లీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక హోదా కోసం బిహార్ ప్రభుత్వ చేసిన వినతిని కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. దీనిపై సోమవారం లోక్‌సభలో స్పష్టమైన వైఖరిని తెలియజేసింది. బడ్జెట్ పార్లమెంటు సమావేశాలకు సన్నాహకంగా ఆదివారం జరిగిన అఖిలపక్ష పార్టీల సమావేశంలో ఎన్డీయే ముఖ్య భాగస్వామి, బిహార్ అధికార పక్షం జేడీయూ ప్రత్యేక హోదా అంశాన్ని ప్రస్తావించింది. ప్రత్యేక హోదాను, ప్రత్యేక ప్యాకేజీని బిహార్ నుంచి జార్ఖండ్‌ను విభజించిన నాటి నుంచీ తాము కోరుతున్నామని జేడీయూ నేత మనోజ్‌కుమార్ ఝా వివరించారు. "కేంద్రం బిహార్‌ను చౌక శ్రమల సరఫరాదారుగానే చూస్తోంది. ఆ దృష్టి మారాలి. రాజకీయాలకు అతీతంగా మేం.. ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర విధానం మారాలని కోరుకుంటున్నాం. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ రెండూ బిహార్‌కు ఇవ్వాల్సిందే"నని ఆయన స్పష్టం చేశారు. అయితే, రాష్ట్రాలకు ప్రత్యేక హోదాపై తన పాత వైఖరినే మోదీ ప్రభుత్వం పునరుద్ఘాటించింది. పర్వత ప్రాంతాలు, తక్కువ జనాభా, అధిక సంఖ్యలో గిరిజన జనాభా, సరిహద్దులు, ఆర్థిక, మౌలికసదుపాయాల్లో వెనుకబాటుతనం, రాష్ట్ర నిధులు ఏ మాత్రం సరిపోకపోవడం వంటి సమస్యలు ఉన్న రాష్ట్రాలకే ప్రత్యేక హోదా కల్పించాలని జాతీయ అభివృద్ధి మండలి నిర్ణయించిందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభలో తెలిపారు. ఈ లక్షణాలు బిహార్‌కు లేవని, అందుకే ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదా లభించదని తెలిపారు. కాగా, ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా పొందే అర్హత లేదు.

పార్లమెంట్‌లో అప్రజాస్వామికంగా నా గొంతునొక్కే ప్రయత్నం



» బడ్జెట్ సెషన్‌కు ముందు మీడియాతో ప్రధాని

న్యూఢిల్లీ, జూలై 22: పార్లమెంట్ సాక్షిగా విపక్షాలు అప్రజాస్వామికంగా తన గొంతు నొక్కేయాలని ప్రయత్నించాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. గత సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి మోదీ ధన్యవాదాలు చెబుతుండగా.. విపక్షాలు ఆందోళన చేయడాన్ని ఆయన గుర్తుచేశారు. "రాజకీయాలకు పార్లమెంట్ వేదిక కాదు. పార్లమెంట్ అనేది పార్టీల కోసం కాదు. దేశ ప్రజల కోసం. ఎన్నికల్లో పోరాడాం. ఎన్నికలు అయిపోయాయి. మళ్లీ 2029 ఎన్నికల్లో పోరాడుదాం. అప్పటి వరకు పార్లమెంట్‌లో మహిళలు, యువత, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిద్దాం" అని వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన పార్లమెంట్ సమావేశాలకు ముందు విలేకరులతో మాట్లాడారు. మంగళవారం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ రాబోయే ఐదేళ్లకు మార్గదర్శకంగా ఉంటుందని, విపక్షాలు కూడా 2047లోగా సాధించాలని సంకల్పించిన 'వికసిత్ భారత్' కోసం కృషి చేయాలని కోరారు. మోదీ 'గొంతు నొక్కడం' వ్యాఖ్యలను కాంగ్రెస్ ఖండించింది. "విపక్షాలు తన గొంతు నొక్కాయని ప్రధాని కన్నీళ్లు కారుస్తున్నారు. కానీ, గడిచిన పదేళ్లుగా మోదీయే దేశం గొంతు నొక్కుతున్నారు" అని విమర్శించింది. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది.

చిక్కుల్లో శాంతి..!

» వైసీపీ ప్రభుత్వంలో అధికార దర్పం

» ఆమెపై ఆరు అభియోగాల నమోదు

» 15 రోజుల్లో వివరణ ఇవ్వాలన్న కమిషనర్

(అమరావతి/విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులతో అంటకాగిన అధికారులు ఒక్కొక్కరుగా చిక్కుల్లో పడుతున్నారు. ఇదే కోవకు చెందిన దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2020లో అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శాంతి విశాఖలో అనేక అక్రమాలకు పాల్పడ్డారు. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అండదండలతో విశాఖ తనదే అన్నట్లు చక్రం తిప్పారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారులను లెక్క చేయకుండా, వారి ఆదేశాలను పాటించకుండా భూములు ధారాదత్తం చేశారు. తనకు ఎక్కడ కావాలంటే అక్కడ పోస్టింగ్ తెప్పించుకున్నారు. సర్వీస్‌లోకి వచ్చిన కొత్తలోనే సాయిరెడ్డి అండదండలతో విశాఖ, ఎన్టీఆర్ లాంటి ప్రధాన జిల్లాల్లో అసిస్టెంట్ కమిషనర్‌గా చాన్స్ కొట్టేశారు. ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్నప్పుడు ఆమె విజయవాడ బ్రాహ్మణ స్ట్రీట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి షాపుల లీజు విషయంలో కమిషనర్‌కు తప్పుడు నివేదిక పంపించారు. దీనిపై ఆమెను కమిషనర్ సస్పెండ్ చేశారు. ఆమె విజయవాడ హెడ్ క్వార్టర్స్‌లోనే ఉండాలని,దాటి వెళ్లడానికి వీల్లేదని పేర్కొన్నారు. ఒకవైపు సస్పెన్షన్‌లో ఉన్న ఆమెకు వ్యక్తిగత వ్యవహారం ఇబ్బందికరంగా మారింది. తన వ్యక్తిగత వ్యవహారంపై కమిషనర్ అనుమతి లేకుండా పెట్టిన మీడియా సమావేశం ఇబ్బందుల్లోకి నెట్టింది. ఆమె భర్త మదన్‌మోహన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో దానిపై ఆమె వివరణ ఇచ్చారు. మరోవైపు విజయసాయిరెడ్డి విశాఖపట్నంలో మీడియా సమావేశంలో వివరణ ఇచ్చారు. శాంతి, ఆమె భర్త మదన్‌మోహన్ వ్యక్తిగత వ్యవహారం కాస్త దేవదాయ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తయారైంది. ఇలాంటి వ్యవహారాల వల్ల శాఖ పట్ల ప్రజల్లో చులకన భావం ఏర్పడుతుంది. దీంతో దేవదాయ శాఖ కమిషనర్ మరోసారి నోటీసులు ఇచ్చారు. విధుల్లో చేరినప్పుడు, తర్వాత ప్రసూతి సెలవుల కోసం కమిషనరేట్‌కు దరఖాస్తు చేసుకున్నప్పుడు కూడా శాంతి తన భర్త పేరు మదన్‌మోహన్‌గా రికార్డుల్లో నమోదు చేశారు. కానీ మీడియా సమావేశంలో మాత్రం మదన్‌మోహన్‌తో విడాకులు తీసుకున్నానని, తన భర్త సుభాష్ అని పేర్కొన్నారు. సీసీఎల్ నిబంధనల ప్రకారం దీనిపై వివరణ ఇవ్వాలని కమిషనర్ నోటీసుల్లో పేర్కొన్నారు. కమిషనర్ అనుమతి లేకుండా మీడియా సమావేశం నిర్వహించడంపై కూడా వివరణ ఇవ్వాలని కోరారు. మొత్తంగా ఆమెపై ఆరు అభియోగాలు నమోదు చేశారు. ఇందులో ముఖ్యంగా అనకాపల్లి సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయం భూములు, విఘ్నేశ్వర స్వామి ఆలయం, పెద్దేశ్వరమ్మ ఆలయం, చోడవరంలోని హర్డేంజ్ రెస్ట్ హౌస్, పాయకరావుపేట పాండురంగస్వామి ఆలయం, విశాఖలో ధర్మలింగేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించిన షాపులను అక్రమంగా లీజుకు ఇచ్చేశారు. ఈ విషయంపై ఆర్జేసీ, డీసీ కూడా సమాచారం ఇవ్వలేదు. వీటన్నింటిపై ఆమె 15 రోజుల్లోగా కమిషనర్‌కు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. తన పైఅధికారులపైన, కిందిస్థాయి ఉద్యోగులపైన అధికార దర్పాన్ని ప్రదర్శించారు. కొత్త ప్రభుత్వం రావడంతో గతంలో చేసిన తప్పులు ఆమె మెడకు చుట్టుకుంటున్నాయి.

విశాఖలో పోలీసు కేసు

శాంతి చేసిన దుందుడుకు పనులు అన్నీ ఇన్నీ కావు. డిప్యూటీ కమిషనర్ చాంబర్‌కు వెళ్లి అందరి ముందు ఆయనపై ఇసుక చల్లిన ఆమె ఆ తరువాత అలాంటిదే మరో పనిచేశారు. విశాఖలోని విశాలాక్షినగర్‌లో ఆమె రూ.80 లక్షలు పెట్టి ఒక ఫ్లాట్ కొనుగోలు చేశారు. ఆ ఫ్లాట్‌లో పూలమొక్కలకు పోసిన నీళ్లు కింద ఫ్లాట్‌లోకి వెళుతుండడంతో ఆ ఫ్లాట్ యజమాని అపార్టుమెంట్ వాట్సాప్ గ్రూపులో మెసేజ్ పెట్టారు. 'నాపై మెసేజ్ పెడతావా?' అంటూ శాంతి వారి ఫ్లాట్‌కు వెళ్లి దంపతులు అశోక్, మీనాలపై చేయి చేసుకున్నారనే ఆరోపణ ఉంది. దాంతో వారు ఫిర్యాదు చేశారు.

ఎన్నో వివాదాలు

రెండేళ్లు విశాఖలో పనిచేసిన శాంతిని 2022లో ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ అధికారిగా బదిలీ చేశారు. అక్కడికి వెళ్లిన తరువాత తనకు ఖర్చులు ఎక్కువని మంచి ఆదాయం వచ్చే నెమలిలో వేణుగోపాలస్వామి ఆలయం ఈఓగా అదనపు బాధ్యతలు ఇవ్వాలని పట్టుబట్టి తీసుకున్నారు. ఆ తరువాత తన పిల్లలు ఇద్దరు విశాఖలో ఉంటున్నారని, వారికి దూరంగా ఉండలేకపోతున్నానని, వారిని చూసుకోవడానికి విశాఖలో కనకమహాలక్ష్మి దేవస్థానం ఈఓగా అదనపు బాధ్యతలు ఇవ్వాలని కమిషనర్‌కు లేఖ రాశారు. 2022 నవంబరు 4న 'వర్కింగ్ అడ్జస్ట్‌మెంట్' కింద బదిలీ చేశారు. ఇంత చేస్తే... అనకాపల్లిలో చేరడానికి ఆమె నిరాకరించారు.

శాంతి నియామకంపై విచారణ

అసిస్టెంట్ కమిషనర్ శాంతి నియామకం జరిగిన తీరుపై ఆరోపణలు వస్తుండటంతో విచారణ జరపాలని అనుకొంటున్నామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీ ఆవరణలో మాట్లాడుతూ.. 'ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా ఉన్న సమయంలో శాంతి నియామకం జరిగింది. ఆ నియామకంపై ఆరోపణలు అందాయి. దానిపై విచారణ జరపాలని ఏపీపీఎస్సీకి లేఖ రాయాలని నిర్ణయించాం. శాఖాపరంగా విచారణ జరుపుతాం. విశాఖ నగరంలో ప్రేమ సమాజం సంస్థకు చెందిన విలువైన భూములు పరాధీనం కావడంలో మరికొందరితో పాటు శాంతి పాత్ర ఉందని ఫిర్యాదులు అందాయి. వాటిపై విచారణ జరుపుతున్నాం. ఆ సమయంలో దేవదాయ శాఖకు జీపీగా వ్యవహరించిన సుభాష్ రెడ్డి భూముల వ్యవహారంలో కీలక పాత్ర వహించారని ఫిర్యాదులు అందాయి. వీటిపై సమగ్రంగా విచారణ జరుపుతున్నాం' అని ఆయన చెప్పారు.

ఆహారమేమిటో చెప్పాలి

శాకాహారమా? మాంసాహారమా? అనేది చూపితే చాలు

» కావడి మార్గంలో పేర్ల ప్రదర్శనపై సుప్రీం కోర్టు

» యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఆదేశాలపై స్టే



న్యూఢిల్లీ, జూలై 22: శ్రావణ మాసంలో జరిగే కావడి యాత్ర సందర్భంగా భక్తులు వెళ్లే మార్గంలో ఉన్న హోటళ్లు, దాబాలు, తోపుడు బండ్ల ఎదుట వాటి యజమానులు సిబ్బంది సహా వ్యక్తిగత వివరాలను ప్రదర్శించాలంటూ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు జారీ చేసిన ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే విధించింది. హోటళ్ల యజమానులు పేర్లు కాదు.. అందించే ఆహార పదార్థాలు శాకాహారమా? మాంసాహారమా? అనే వివరాలను మాత్రమే ప్రదర్శించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ టీఎంసీ ఎంపీ మహువాతో పాటు విద్యావేత్త అపూర్వానంద్, కాలమిస్ట్ ఆకార్ పటేల్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలతో పాటు ఉజ్జయిని మున్సిపాలిటీ కూడా ఇదే తరహా ఆదేశాలు ఇచ్చినందుకు మధ్యప్రదేశ్ సర్కారుకూ నోటీసులు జారీ చేసింది. కాగా, విచారణ సందర్భంగా మొయిత్రా తరఫు ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదిస్తూ.. పేర్ల ప్రదర్శనపై ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశాల వెనుక అసలు ఉద్దేశం వేరే ఉందని ఆరోపించారు. నిబంధనను ఉల్లంఘించినవారికి జరిమానా విధించే అంశాన్ని ప్రస్తావించారు. వ్యక్తి ఎవరో తెలుసుకుని దూరం పెట్టే ఉద్దేశం ఉందని, ఇది రాజ్యాంగానికి విరుద్ధమని అన్నారు. విచారణకు యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల తరఫున న్యాయవాదులు హాజరు కాలేదు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ.. కేసు తదుపరి విచారణను సుప్రీం కోర్టు ఈ నెల 26వ తేదీకి వాయిదా వేసింది.

గొడ్డు మాంసం ఎగుమతిదార్ల పేర్లు అడిగే దమ్ముందా!

నటుడు ప్రకాశ్‌రాజ్ వివాదాస్పద పోస్టు

హైదరాబాద్, జూలై 22: "గొడ్డు మాంసం ఎగుమతి చేసే కంపెనీల యజమానుల పేర్లు, కులం, మతమేమిటో అడిగే దమ్ము ఈ మతోన్మాదులకు ఉందా" అంటూ ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ ఎక్స్‌లో పోస్టు చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు దుమారం రేపుతున్నాయి. కావడి యాత్ర వివాదాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రప్రభుత్వాల ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమన్నారు. మతోన్మాదులు ఇంకా పాఠాలు నేర్చుకోలేదన్నారు.

కేరళలో ముస్లిం నడిపే హోటల్‌కు వెళ్లా..

కేసు విచారణ సదర్భంగా జస్టిస్ ఎస్వీఎన్ భట్టి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తాను కేరళలో జడ్జిగా ఉన్నప్పుడు ముస్లిం వ్యక్తి నడిపే శాకాహార హోటల్‌కు తరచూ వెళ్లేవాడినని తెలిపారు. అది అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉండేదన్నారు. కాగా, కావడి యాత్రపై యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఆదేశాల మీద సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం పట్ల అధికార ఎన్డీఏ కూటమిలోని జేడీయూ, కాంగ్రెస్, సమాజ్‌వాదీ వంటి ప్రతిపక్ష పార్టీలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రధాని మోదీ.. "రాజధర్మం" గురించి వారి సీఎంలకు చెబుతారని తాము ఆశిస్తున్నట్లు కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా వ్యాఖ్యానించారు.

మేం చెబితేనే చేయాలి!

(మొదటి పేజీ తరువాయి)

సవరించిన సంగతి తెలిసిందే. 20 ఏళ్లు పైబడిన అసైన్డ్ భూములకు శాశ్వత యాజమాన్య హక్కులు కల్పిస్తామని చట్టసవరణ చేశారు. దీన్ని అమలు చేసేందుకు గత ఏడాది డిసెంబరు 19న జీఓ 596 తీసుకొచ్చారు. దీని ప్రకారం.. 20 ఏళ్ల అసైన్‌మెంట్ దాటిన భూములను నిషేధ జాబితా నుంచి తొలగించి, వాటిని రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలి. అసైన్డ్ భూముల్లోనూ 1.12 లక్షల ఎకరాల చుక్కల భూములు కలిసి ఉన్నాయి. వీటితోపాటు 21 లక్షల ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. ఈ భూములపై వైసీపీ నేతలు ముందే కన్నేశారు. జీఓ వచ్చిందే తడవుగా పేద, దళిత, గిరిజన రైతుల నుంచి కారుచౌకగా భూములు కొట్టేశారు. జీఓ 596 రాగానే శరవేగంగా 40 వేల ఎకరాల అసైన్డ్ భూములను 22(ఏ) నుంచి తీసేయించి ఫ్రీహోల్డ్ పట్టాలు పొందారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా భూముల రిజిస్ట్రేషన్ కొనసాగించారు. నాటి సలహాదారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నేతలు అసైన్డ్ భూములను చేజిక్కించుకున్నారు. కలెక్టర్లు... వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పిన భూములను మాత్రమే 22(ఏ) నుంచి తీసి ఫ్రీహోల్డ్ చేశారు. ఆ తర్వాత ఆ భూములను వైసీపీ నేతలు రిజిస్ట్రేషన్ చేయించుకొని భూ రికార్డులను కూడా శరవేగంగా మార్పించుకున్నారు. ఇదీ అప్పుడు జరిగింది! అసైన్డ్ చట్టసవరణతో ఏ ఒక్క నిరుపేదకూ మేలు జరగలేదు.

కొత్త ప్రభుత్వంలో ఇలా...

చంద్రబాబు ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసింది. కానీ.. అసైన్డ్ భూముల చట్ట సవరణ సంగతి మాత్రం తేల్చలేదు. దానిని అలాగే కొనసాగిస్తారా, సవరిస్తారా అనే విషయంపై స్పష్టత రాలేదు. దీనిని అలాగే కొనసాగించే పక్షంలో.. నిరుపేదలు, సామాన్యుల అసైన్డ్ భూములకు నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించాలి. 'ఫ్రీహోల్డ్' ముసుగులో వైసీపీ నేతలు సాగించిన భూదందాను బయటికి తీయాలి. కొత్త ప్రభుత్వం వచ్చిన తొలి వారంలోనూ 'ఫ్రీహోల్డ్' భూముల రిజిస్ట్రేషన్లు జరిగాయి. కానీ... జూన్ 20 తర్వాత ఆగిపోయాయి. తొలుత కొత్త ప్రభుత్వం వచ్చింది కాబట్టి రిజిస్ట్రేషన్‌లు చేయడం లేదేమో అని అంతా భావించారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వమే నిలిపివేసిందనుకున్నారు. కానీ.. దీని వెనుక కొత్త ఎమ్మెల్యేల పాత్ర ఉన్నట్లు స్పష్టమైంది. దాదాపు సగం మంది శాసనసభ్యులు ఇందులో వేలుపెట్టినట్లు సమాచారం. తమకు చెప్పకుండా ఫ్రీహోల్డ్ భూములను రిజిస్టర్ చేయొద్దని సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించినట్లు తెలుస్తోంది. దీనిపై ఎమ్మెల్యేల వాదన ఇంకో రకంగా ఉంది. "జగన్ పాలనలో అసైన్డ్ భూములను వైసీపీ నేతలు దోచుకున్నారు. రిజిస్ట్రేషన్‌లు చేశారు. కూటమి ప్రభుత్వంలో మాకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయడానికి వీల్లేదు. భూముల రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారిని మా వద్దకు పంపండి. మేం చెప్పిన తర్వాతే ఆ భూముల రిజిస్ట్రేషన్ చేయాలి" అని ఎమ్మెల్యేలు అధికారులకు హుకుం జారీ చేశారు. ఇందులో చుక్కల భూములు కూడా ఉండటం కీలకమైన అంశం. అడ్డగోలుగా అసైన్డ్ భూములను దక్కించుకున్న వారిని నిలువరించడం మంచిదే. కానీ... ఎమ్మెల్యేల కారణంగా సామాన్య, పేదలకూ అన్యాయం జరుగుతోందనే వాదన వినిపిస్తోంది.

ప్రభుత్వం స్పష్టత ఎందుకివ్వదు?

అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన జీఓ 596 అమలుపై ప్రభుత్వం ఇప్పటిదాకా ఏ నిర్ణయం వెలువరించలేదు. "ఫ్రీహోల్డ్‌ను కొనసాగిస్తారా? రద్దుచేస్తారా? అన్నవిషయంపై స్పష్టత ఇవ్వాలి. అది ఇవ్వనంత వరకు ఎమ్మెల్యేలు ఈ పనులు చేస్తుంటారు" అని ఒక ఐఏఎస్ చెప్పారు.


డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గురజాపులంకలో నీట మునిగిన బెండ తోట


పి.గన్నవరం మండలం చాకలిపాలెం కనకాయలంక కాజ్‌వే వద్ద పడవపై అరటి గెలలు, లంక గ్రామస్థులు


దిగువ కాఫర్ డ్యాం స్లూయిజ్ వద్ద వరద జలాలు

వరద గోదారి

ఎగువన వర్షాలతో గోదావరికి పెరుగుతున్న వరద

- సంద్రంలా రాజమహేంద్రవరం అఖండ గోదావరి
- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
- ఏ క్షణమైనా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం
- బ్యారేజీ నుంచి 12,65,967 క్యూసెక్కులు సముద్రంలోకి
- ఇప్పటికే భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక
- నీట మునిగిన లంకలు.. పునరావాస కేంద్రాల ఏర్పాటు

పొంగుతున్న కాల్వలు.. ముంపులో పొలాలు

పశ్చిమ గోదావరి జిల్లాలో ఎర్ర కాల్వ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీని ప్రభావంతో వేలాది ఎకరాల్లోని పంట పొలాలు నీటమునిగాయి. తణుకు మండలం ముద్దాపురం, కోనాల, దువ్వ, తేతలి, మండపాక గ్రామాలకు వరద పోటెత్తడంతో రోడ్లు, పొలాలు, కాల్వలు ఏకమయ్యాయి. యనమదుర్రు కాలువ కూడా ఉధృతంగా ప్రవహించడంతో పొలాలన్నీ నీట మునిగాయి. పెంటపాడు మండలం పరిమెళ్ళ చినకాపవరం కాలువ వద్ద గట్లకు గండి పడే ప్రమాదం ఉండటంతో రైతులు ఇసుక బస్తాలు అమర్చారు.

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉగ్ర రూపం దాల్చింది. గోదావరికి వరద ఉధృతి పెరుగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం రాత్రి 7గంటలకు భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండగా, నీటి మట్టం 49.4 అడుగులుగా ఉందని, ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 12.05 లక్షల క్యూసెక్కులు ఉందని తెలిపింది. మంగళవారం తెల్లవారేలోగా ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని పేర్కొంది. రెండో ప్రమాద హెచ్చరికతో వరద ప్రభావిత జిల్లాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు వివరించింది. గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర సహాయ చర్యలకు 4 ఎన్డీఆర్ఎఫ్, 6 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. అయినా ప్రజలు పూర్తి అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి

భద్రాచలం వద్ద ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేయగా.. మూడో ప్రమాద హెచ్చరిక దిశగా గోదావరి పరవళ్లు తొక్కుతోంది. దీంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి పెరిగింది. సోమవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద నీటిమట్టం 49 అడుగులకు చేరింది. ఇది 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. ఈ పరిస్థితుల్లో పాపికొండలు, విలీన మండలాలను ముంచుతూ వరద ప్రవాహం పోలవరం స్పిల్‌వే నుంచి ధవళేశ్వరం బ్యారేజీకి పరుగులు పెడుతోంది. దీంతో రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల మధ్య అఖండ గోదావరి సంద్రాన్ని తలపిస్తోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సోమవారం ఉదయం 7 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. రాత్రి 11 గంటలకు బ్యారేజీ నీటిమట్టం 13.60 అడుగులుగా నమోదైంది. బ్యారేజి నుంచి 175 గేట్ల ద్వారా సముద్రంలోకి 12,65,967 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. సీతానగరం మండలం మిర్తిపాడు గ్రామంలో వరద ఉధృతి అధికంగా ఉండడంతో కాలువలో ఒక యువకుడు గల్లంతయ్యాడు. ఇల్లు కూలడంతో గోకవరం గ్రామానికి చెందిన మేకానీ సుబ్బలక్ష్మి అనే మహిళ గాయపడింది. రాజమహేంద్రవరంలో బ్రిడ్జిలంక, కేతావారి లంక, ఎదుర్లమ్మలంక ప్రాంతాల్లోని 55 కుటుంబాలకు చెందిన 136 మందిని పడవల మీద పునరావాస కేంద్రాలకు తరలించారు. నిడదవోలు తిమ్మరాజుపాలెం, సింగవరం, తాళ్లపాలెం, రావి మెట్ల, కంసాలి పాలెం తదితర గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు 1000 మందికి పైగా తరలించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు వద్ద శబరి నది 39 అడుగుల నీటిమట్టంతో పరుగులు పెడుతోంది. ఒడిసాలోనూ నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఆ వరదంతా డొంకరాయి, సీలేరు, జ్వాలాపుట్, బలిమెల, గుంటవాడలోని జల విద్యుత్ కేంద్ర రిజర్వాయర్లలోకి వేగంగా వచ్చి చేరుతోంది. చింతూరు, వరరామచంద్రపురం, కూనవరం, ఎటపాక మండలాల్లో 100కు పైగా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

విలీన మండలాలకు పెనుముప్పు

పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం 24.710 మీటర్లకు చేరింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు ఉపనదులైన శబరి, మంజీర, ప్రవర, పర్ణ, ప్రాణహిత, ఇంద్రావతి, కిన్నెరసాని, మానేరు గోదావరిలోకి కలుస్తున్న వరద జలాలను 48 గేట్ల ద్వారా ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తున్నారు. విలీన మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరులపై గోదావరి కన్నెర్ర చేస్తోంది. రుద్రమ్మకోట, రేపాకగొమ్ము, తాటుకూరుగొమ్ము, తిరుమలాపురం, నాళ్ళవరం, చిగురుమామిడి గ్రామాలను వరద చుట్టుముట్టడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

ఎగువ కాఫర్ డ్యాం ఎగువన భారీ వరద

- 2 డ్యాంల నడుమ భారీగా సీపేజీ జలాలు
- ప్రమాద స్థాయిలో ప్రధాన రోడ్డు

పోలవరం, జూలై 22: పోలవరం ప్రాజెక్టు ఎగువ కాఫర్ డ్యాం ఎగువన భారీగా నిలిచిన గోదావరి వరద వెనుదిరిగి స్పిల్‌వే వైపు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో ఉభయ కాఫర్ డ్యాంల నడుమ సీపేజీ భారీగా పెరిగింది. కాఫర్ డ్యాంల నడుమ 21.01 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ఇటీవల జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడి ఆదేశాలతో దిగువ కాఫర్ డ్యాం కుడివైపున సీపేజీ బయటకు పోయేందుకు.. యుద్ధప్రాతిపదికన స్లూయిజ్ గేట్లు అమర్చారు. స్పిల్ చానల్ నుంచి విడుదలవుతున్న వరద కాఫర్ డ్యాంల మధ్యకు రాకుండా ఇవి అడ్డుకుంటున్నాయి. ఈ నెల మొదట్లో అంతర్జాతీయ నిపుణుల బృందం పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు వచ్చినప్పుడు ఎగువ కాఫర్ డ్యాంకు మూడు చోట్ల బోరింగ్ పైపులు దింపి మట్టి నమూనాలు తీశారు. ఇప్పుడా ప్రాంతాల్లో పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈ రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో గుంతలు పూడ్చివేస్తున్నారు. కాగా.. పోలవరం ప్రాజెకుకు రాకపోకలు సాగించే ప్రధానరోడ్డు మార్గం ప్రమాద స్థాయిలో కోతకు గురైంది. దీంతో ఆ రోడ్డు సగం మేర స్పిల్ చానల్లోకి కూలిపోయింది. అధికారులు ఏర్పాటుచేసిన భారీ కేడింగ్ సైతం స్పిల్ చానల్ వైపు కూలి ప్రమాదకరంగా మారింది. గోదావరి నీటిమట్టం మరింత పెరిగినా, కొండవాగుల ప్రవాహం ఎక్కువైనా రోడ్డు పూర్తిగా కోతకు గురై ప్రాజెక్టుకు రాకపోకలు నిలిచిపోయే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పలుచోట్ల వర్షాలు

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. రుతుపవన ద్రోణి తూర్పుభాగం సంబల్‌పూర్, పూరీ మీదుగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకూ విస్తరించింది. ఇంకా కేరళ నుంచి గుజరాత్ వరకు అరేబియా సముద్రం తీరం పొడవునా ఉపరితలద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావం వల్ల రాష్ట్రంలో రుతుపవనాలు చురుగ్గా మారడంతో సోమవారం పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఉత్తరకోస్తాలో ముసురు వాతావరణం నెలకొంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరకోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

జనజీవనం అస్తవ్యస్తం

ధవళేశ్వరం బ్యారేజీ నుంచి దిగువకు 11 లక్షలకు పైగా మిగులు జలాలను సముద్రంలోకి వదులుతుండడంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని దిగువన నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లంక గ్రామాల్లోకి వరద నీరు వచ్చేసింది. పల్లపు ప్రాంతాల్లో బెండ, బీర, వంగ, ఆనబ తదితర పంటలు నీట మునుగుతున్నాయి. వరద ఉధృతి దృష్ట్యా లంక గ్రామాల్లో రైతులు వ్యవసాయ ఉత్పత్తులు, కూరగాయలను బయటకు తరలించుకుంటున్నారు. పి.గన్నవరం మండలంలోని గంటిపెదపూడి, ఊడిమూడి గ్రామాల శివారు నాలుగు లంకగ్రామాల ప్రజలు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇంజన్ బోట్లపై రాకపోకలు సాగిస్తుండగా, చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే నీటమునగడంతో స్థానిక ప్రజానీకం పడవలపై ప్రయాణం సాగిస్తున్నారు. గురజాపులంకలో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశించింది. లోతట్టు ప్రాంతాల్లోని రైతులు పశువులు, పశుగ్రాసాన్ని మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు.

వరద ప్రాంతాల్లో తక్షణమే తాగునీరు

- యుద్ధ ప్రాతిపదికన చర్యలు : ఉపముఖ్యమంత్రి పవన్ ఆదేశాలు

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరద ప్రభావిత గ్రామాల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. సురక్షిత తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. సోమవారం శాసనసభలోని తన కార్యాలయంలో నిర్వహించిన జనసేన శాసనసభాపక్ష సమావేశంలో ఉమ్మడి గోదావరి జిల్లాల్లో వరద ప్రభావిత ప్రాంతాల శాసనసభ్యులు అక్కడ పరిస్థితులను వివరించారు. పోలవరం నియోజకవర్గం వేలేరుపాడు మండలంలోని 12 గ్రామాలు పూర్తిగా నీట మునిగి ఉన్న పరిస్థితి గురించి పవన్ ఆరా తీశారు. పెద్దవాగు ప్రాజెక్టు ప్రభావంతో అక్కడి గ్రామాలు వరద బారిన పడుతున్న విషయం చర్చకు వచ్చింది. వేలేరుపాడుతో పాటు కుక్కునూరు మండలంలోని గ్రామాల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి సరఫరాతో పాటు అంటు వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో రహదారులకు ఈ వర్షాల వల్ల ఏ మేరకు నష్టం వాటిల్లిందో నివేదిక ఇవ్వాలని, తక్షణమే మరమ్మతులు చేయాల్సిన రహదారులను గుర్తించాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

రైతులకు న్యాయం జరిగేలా బీమా: మంత్రుల కమిటీ నిర్ణయం

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విపత్తు సమయాల్లో రైతులకు న్యాయం జరిగేలా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, ఆర్థిక, పౌరసరఫరాల శాఖల మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. సోమవారం అమరావతి సచివాలయం నాలుగో బ్లాక్‌లో పంటల బీమా అమలుపై మంత్రుల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. పంటల బీమా పథకంలో కేంద్రప్రభుత్వం సూచించిన విధానాల్లో ఉత్తమ విధానంఅమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో బీమా వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, ప్రీమియం చెల్లింపులు సక్రమంగా జరగలేదని వ్యాఖ్యానించారు. ఇకపై అలా జరగడానికి వీల్లేదన్నారు. దిగుబడి, వాతావరణ పరిస్థితులను బట్టి బీమా అమలు అవకాశాలపై వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులతో మంత్రులు చర్చించారు. వైసీపీ సర్కారులో మామిడి రైతులకు బీమా అమలు చేయలేదని, ఈ ప్రభుత్వంలో వారికి కూడా అమలు చేసే అవకాశాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. బీమా అమలు, క్లైములు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించి, నివేదికను ముఖ్యమంత్రికి అందజేయనున్నట్లు మంత్రులు తెలిపారు.

టీచర్ల అక్రమ బదిలీలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేయలేదు. దీంతో బదిలీ అయినప్పటికీ వారు పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. ప్రభుత్వం మారిన వెంటనే ఆ ఆదేశాలను నిలుపుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆ తర్వాత తమను బదిలీ చేసినా రిలీవ్ చేయట్లేదంటూ 215 మంది టీచర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరుగుతున్న సమయంలోనే పాఠశాల విద్యాశాఖ అప్పటి బదిలీలకు సంబంధించిన రాటిఫికేషన్ ఫైలును సీఎంకు పంపింది. దానిని పరిశీలించిన సీఎం చంద్రబాబు తిరస్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో 917 మంది బదిలీ ఉత్తర్వులు రద్దయిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఈ అక్రమ బదిలీలను ఒక వ్యాపారంగా మార్చేసింది. అడిగినంత ఇస్తే బదిలీ అన్నట్టుగా అడ్డగోలుగా వ్యవహరించింది. తద్వారా రూ.వంద కోట్ల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.

చేసింది చాలా.. ఆగింది కొన్నే

సాధారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయ బదిలీలపై ఎప్పుడూ నిషేధం ఉంటుంది. బదిలీలు చేయాలని నిర్ణయించినప్పుడు సీఎం ఆమోదంతో ఆ నిషేధాన్ని కొద్దిరోజులు సడలిస్తారు. సడలింపులు లేకుండా బదిలీలు చేయాలనుకుంటే ఆ ఫైలుకు సీఎం ఆమోదం తప్పనిసరి. అయితే, అప్పటి సీఎం జగన్ ఆదేశాలతోనే గత ప్రభుత్వంలో పెద్దఎత్తున అక్రమ బదిలీలు చేశారు. దాదాపు రెండేళ్ల వ్యవధిలో 2,400 బదిలీలకు ఆర్డర్లు జారీచేశారు. వీటికి 'సిఫారసు బదిలీలు' అనే పేరు పెట్టారు. అంతకుముందు ఏ ప్రభుత్వంలోనూ ఇంత భారీ సంఖ్యలో సిఫారసు బదిలీలు చేయలేదు. ఒక్కో టీచర్ నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు వసూలు చేసి ఈ బదిలీలు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎన్నికలకు చాలా కాలం ముందే ఈ తరహాలో బదిలీలు పూర్తిచేశారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మరోసారి ఈ తరహా అక్రమ బదిలీలకు తెరదీశారు. వాటిలో 653 మంది బదిలీలకు అప్పటి సీఎం జగన్ ఆమోదముద్ర వేశారు. దీంతో వాటిని ఆపే పరిస్థితి లేకుండా పోయింది. కానీ సరిగ్గా ఎన్నికలకు ముందు మరో 917 మందికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చేశారు. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆ బదిలీలను సీఎం రాటిఫై చేయలేదు. కోడ్ ఉన్నందున కొత్త స్థానాలకు వెళ్లొద్దని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. దీంతో అప్పుడు బ్రేక్ పడగా, ఇప్పుడు ఏకంగా రద్దయ్యాయి.

విచారణకు డిమాండ్లు

టీచర్ల అక్రమ బదిలీలపై విచారణ చేయాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయన కార్యాలయం జోక్యం ఈ బదిలీల్లో ఎక్కువగా ఉంది. అలాగే కొందరు అధికారులు, రెండు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రత్యక్షంగా ఇందులో భాగస్వామ్యం కావడంతో వారిపై చర్యలు తీసుకోవాలని టీచర్లు పట్టుబడుతున్నారు. రాష్ట్రంలో 1.7 లక్షల మంది టీచర్లు పనిచేస్తున్నారు. వారిలో ఎక్కువ మంది కౌన్సెలింగ్ విధానంలో నిబంధనల ప్రకారం బదిలీ అయ్యా రు. ఇలా కొద్ది మంది నగదు, రాజకీయ సిఫారసులతో దొడ్డిదారిన బదిలీ చేయించుకోవడాన్ని మిగిలిన టీచర్లు సహించలేకపోతున్నారు. ఇలాగైతే అందరూ ఏదో ఒక సిఫారసు పట్టుకుని బదిలీ చేయించుకుంటారని, ఇప్పుడు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఈ విధానం కొనసా గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్పందించని ప్రభుత్వం

ఇకపై టీచర్ల బదిలీల్లో ఎలాంటి రాజకీయ ప్రమేయం ఉండదని మంత్రి నారా లోకేశ్ ఇటీవల ప్రకటించారు. దీనికోసం గత ప్రభుత్వం ప్రతిపాదించిన టీచర్ల బదిలీల చట్టం రూపకల్పన అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఇంత వరకూ బాగానే ఉన్నా అంతకంటే ముందు జరిగిన బదిలీల సంగతేంటనే దానిపై ప్రభుత్వం స్పందించట్లేదు. దానిపై విచారణ జరిపించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నా దానిపై ఎలాంటి ప్రకటన చేయట్లేదు. ఎలాగూ బదిలీలు జరిగిపోయాయి కాబట్టి ఇప్పుడు చేసేదేం లేదు అనే భావనలో కొత్త ప్రభుత్వం ఉన్నట్లు అర్థమవుతోంది. కానీ టీచర్లు మాత్రం విచారణ చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

మల్లవల్లి భూ సమస్యలు పరిష్కరించండి: మంత్రి భరత్

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో పారిశ్రామికవేత్తలకు కేటాయించిన వివాదాస్పద భూములు కాకుండా.. పరిశ్రమల స్థాపనకు అనువైన స్థలాలు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ ఏపీఐఐసీ అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రతినిధులు హైదరాబాద్‌లో మంత్రి భరత్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం తమను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేసిందని ఫిర్యాదు చేశారు. ఏపీలో మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున అక్కడ పరిశ్రమలు నెలకొల్పడానికి సిద్ధంగా ఉన్నామని, తాము నెలకొల్పే పారిశ్రామిక యూనిట్ల ద్వారా రూ. 1100 కోట్లకు పైగా పెట్టుబడులు ఏపీకి వస్తాయని వివరించారు. సుమారు 12 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని, పన్నుల ద్వారా వందల కోట్లు ఆదాయం ప్రభుత్వానికి సమకూరుతుందని తెలిపారు. అయితే వివాదాస్పద భూములు కాకుండా.. వేరే అనువైన స్థలాలు కేటాయిస్తే.. వెంటనే మల్లవల్లి పార్కులో పరిశ్రమలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని మల్లవల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి చెప్పారు. దీనిపై మంత్రి భరత్ సానుకూలంగా స్పందించారు. వెంటనే అక్కడి నుంచే పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్‌కు ఆదేశాలు జారీ చేశారు.

బ్లాక్‌లిస్టులోకి టీటీడీ నెయ్యి సరఫరాదారు!

- నాణ్యతలేకపోవడమే కారణం
- టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడి

తిరుమల, జూలై 22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూల తయారీకి వినియోగించే నెయ్యి నాణ్యతలో నిబంధనల ప్రకారం ఉండాల్సిన ప్రమాణాలు పాటించని ఓ కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోనున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. లడ్డూల్లో నాణ్యత, సువాసన తగ్గిపోవడానికి ప్రధాన కారణంగా నెయ్యిలో నాణ్యత లేకపోవడంగానే గుర్తించామని ఈవో శ్యామలరావు రెండు రోజుల క్రితం వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సోమవారం ఆయన తిరుపతిలో నెయ్యి సేకరణ నిపుణుల కమిటీతో సమీక్షా నిర్వహించారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న ఐదుగురు సరఫరాదారుల్లో ఒకరు అందించిన నెయ్యి నాణ్యత ప్రమాణాలు సరిపోలడం లేదని, కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్నట్టు పరీక్షల్లో నిర్ధారణ అయిందని తెలిపారు. టెండర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు సరఫరాదారును బ్లాక్ లిస్ట్‌లో ఉంచేందుకు షోకాజ్ నోటీసు కూడా జారీ చేసినట్టు చెప్పారు. కాగా, బ్లాక్ లిస్ట్‌లోకి వెళ్లింది తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెట్ అని సమాచారం. 8.50 లక్షల కేజీల నెయ్యిని సరఫరా చేసేందుకు టెండరు దక్కించుకున్న ఈ సంస్థ ఇప్పటివరకు 68 వేల కేజీలు సరఫరా చేయగా, ఇందులో 20 వేల కిలోల నెయ్యి నాణ్యత బాగలేదని తిరస్కరించినట్టు సమాచారం.



ఆదిత్యను ప్రశంసిస్తూ ప్రధాని చేసిన ట్వీట్

శ్రీ చైతన్య విద్యార్థికి ప్రధాని ప్రశంసలు

హైదరాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బావదాన్ పుణేకు చెందిన శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థి ఆదిత్యను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా ప్రశంసించారని శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ సుష్మ తెలిపారు. దేశానికి చెందిన ఆరుగురు సభ్యుల విద్యార్థి బృందం యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బాత్‌లో జరిగిన 65వ అంతర్జాతీయ మ్యాథ్స్ ఒలింపియాడ్- 2024లో నాలుగు బంగారు, ఒక రజత పతకంతో పాటు మొత్తంగా 4వ ర్యాంకులో నిలిచిందని ఆమె చెప్పారు. ఈ బృందంలో శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థి ఎం.వి. ఆదిత్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రధాని మోదీ ప్రశంసలు అందుకున్నాడని సుష్మ పేర్కొన్నారు.

నూతన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల కోటాలో ఇటీవల ఎన్నికైన ఇద్దరు ఎమ్మెల్సీలు సి రామచంద్రయ్య, పిడుగు హరిప్రసాద్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. వారితో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అమరావతి అసెంబ్లీలోని తన కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర కార్యక్రమాన్ని నిర్వహించారు.


ప్రమాణం చేస్తున్న హరిప్రసాద్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బైడెన్ లేని పోటీ

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరినుంచి జోబైడెన్ నిష్క్రమణ ఆయన పార్టీనేతల, సభ్యుల ఒత్తిడిమేరకు జరిగిపోయింది. బైడెన్ అడ్డంకి తొలగిపోతే, మరింత సమర్థవంతమైన నాయకత్వంలో రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్‌ను ఢీకొనగలమని డెమోక్రాట్లు నమ్ముతున్నారు. అధ్యక్ష ఎన్నికల వేడి రాజుకోకముందే చాలా సర్వేలు బైడెన్ వెనుకబడివున్న విషయాన్ని తేల్చాయి. జూన్ 28న జరిగిన తొలి ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో బైడెన్ తడబాటు, గందరగోళం తరువాత ఉన్న ఆ కాస్త మద్దతు కూడా నీరుగారిపోయింది. మరోపక్క, ట్రంప్‌మీద జరిగిన హత్యాయత్నంతో ఆయనమీద సానుభూతిహెచ్చిందనీ, పాపులారిటీ పెరిగిందనీ అందరూ నమ్మారు. ఈ దశలో ట్రంప్‌ను ఓడించాలంటే వేరొకరు రావాలన్న పార్టీలోని అత్యధికుల విశ్వాసం సరైనదో కాదో రేపటి ఎన్నికల్లో తేలుతుంది కానీ, బైడెన్‌కు బైబైచెప్పే విషయంలో జరిగిన జాప్యం పార్టీకి కొంత నష్టం చేసిన మాట నిజం.

న్యాయ వివాదాల్లో, కేసుల్లో ఇరుక్కున్నప్పటికీ, అధ్యక్ష ఎన్నికల దిశగా ట్రంప్ తన నడకలో ఎన్నడూ తడబడలేదు. ప్రచారం ఉధృతంగా సాగుతున్న తరుణంలో హత్యాయత్నం జరగడం, ఒక్కక్షణం ట్రంప్ నిర్ఘాంతపోయినా మరుక్షణం తేరుకొని పిడికిలిబిగించి నినదించడం, భద్రతాసిబ్బంది వాహనంలోకి ఎక్కించేవరకూ రక్తమోడుతున్న తన మొఖాన్ని చూపించడం వంటివి ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేసే అంశాలే. తనమీద జరిగిన హత్యాయత్నాన్ని రాజకీయంగా వాడుకున్నప్పటికీ, ఆ తరువాత రిపబ్లికన్ పార్టీనుంచి నామినేషన్‌ను స్వీకరిస్తున్న సందర్భంలో ఆయన బాధ్యతాయుతంగా మాట్లాడారు. అధికారంకోసం సమాజంలో విద్వేషాలు రగల్చడానికీ, మనుషులను చీల్చడానికీ, వ్యవస్థలమీద దాడులు చేయించడానికీ వెనుకాడని ట్రంప్ ఈ హత్యాయత్నం తరువాత సమైక్యత గురించి మాట్లాడటం ద్వారా తటస్థ ఓటర్లను సైతం ఆకర్షించాడని వార్తలు వచ్చాయి.

ట్రంప్ విజయం ఖాయమైన ఈ ఆఖరుదశలో, పోటీనుంచి తప్పుకోవడం ద్వారా బైడెన్ తన పార్టీకి చేయగలిగే మేలు ఎక్కువగా ఉండకపోవచ్చు. కమలా హారిస్‌కు మద్దతు ఇవ్వడానికి ఆయన ఆఖరుక్షణం వరకూ ఇష్టపడలేదని వార్తలు వచ్చాయి కానీ, ఆయన ప్రకటన తరువాత పార్టీఅంతా ఆమె పక్షాన రావచ్చు. కానీ, ఆమెకు పార్టీలో మిగతావారినుంచి ఏ మాత్రం పోటీ ఉండబోదని ఇప్పుడే కచ్చితంగా చెప్పలేం. ఒకసారి బైడెన్ తప్పుకున్న తరువాత కమలకంటే ట్రంప్‌ను బలంగా ఢీకొట్టగలిగేవారు ఎవరైనా ఉన్నారా అన్న ప్రశ్న, చర్చ తప్పవు. స్వల్పకాలంలోనే ఆ అన్వేషణ ముగిసి, కమల ఖాయమైన తరువాత పార్టీ తన పూర్తి శక్తియుక్తులను ఆమె పక్షాన మోహరించడం జరుగుతుంది. విధిగా తప్పుకోవాల్సివచ్చిన ఈ స్థితిలో, కమలకు మద్దతు ప్రకటించి బైడెన్ డెమోక్రాటిక్ పార్టీ మూలసిద్ధాంతాలకు అనుగుణంగా వ్యవహరించారు. భారత్–జమైకా సంతతికి చెందిన ఈమెకు ఆఫ్రికా, ఇండియా మూలాలున్న ఓటర్లు అండగా నిలవవచ్చు. అలాగే, ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో, అబార్షన్ హక్కుల విషయంలో ఆమె ప్రదర్శించిన పోరాటస్ఫూర్తి మహిళా ఓటర్లను విస్తృతంగా ఆకర్షించింది. బైడెన్ వయసు లక్ష్యంగా ట్రంప్ దాడి సాగింది కనుక, ఇప్పుడు తమ అభ్యర్థిని మార్చుకుంటున్న డెమోక్రాట్లు ట్రంప్‌ను హాయిగా అపహాస్యం చేయవచ్చు. కమలాహారిస్ అంత అద్భుతమైన వక్త కాదు కానీ, బైడెన్‌కు ఉన్న మతిమరుపు సమస్య ఆమెకు లేదు కనుక, లోతైన అధ్యయనంతో అన్ని అంశాలమీదా ట్రంప్‌ను ఆమె బలంగా ఢీకొట్టవచ్చు. ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో ట్రంప్ గతాన్ని ప్రజలకు బలంగా గుర్తుచేసి, తన అభిమానులను రెచ్చగొట్టి అమెరికన్ కాంగ్రెస్ భవనంమీద దాడులుచేయించిన ఆయన తన చర్యలు, చేష్టలతో అమెరికాకు తెచ్చిన అపకీర్తిని ఏకరువుపెట్టవచ్చు. ఆయనమీద ఉన్న కేసులు దేశం పరువు దిగజార్చిన మాట వాస్తవం. అధ్యక్ష రేసునుంచి బైడెన్ తప్పుకున్నప్పటికీ, ఫలితం ఏకపక్షంగానే ఉండబోతోందన్న విశ్లేషణలు పూర్తిగా కొట్టిపారేయలేనివి. బైడెన్ మద్దతు తరువాత కూడా కమలాహారిస్‌కు ప్రత్యామ్నాయంగా మిచెల్లే ఒబామా వంటి కొన్ని పేర్లు కనీసం ప్రచారంలో ఉన్న మాట నిజం. ఎన్నికలు ముంచుకొస్తున్న ఈ చివరిదశలో డెమోక్రాట్ల తరఫున బరిలోకి దిగినవారెవ్వరైనా ట్రంప్ మీద విజయం సాధించగలిగితే అది మహాద్భుతమే అవుతుంది. ఒకవేళ అలా జరగకపోయినా, ఇప్పటికే జరిగిపోయిన నష్టాన్ని కొంతమేరకు పూడ్చుకొని కనీసం గట్టిపోటీ ఇవ్వగలరా అన్నది చూడాలి.

వ్యర్థాల శుద్ధితో సంపద సృష్టి

'పనికిరాదని పడేసే చెత్తతో కోట్ల రూపాయల సంపద సృష్టించవచ్చు, లక్షల మందికి ఉపాధి కల్పించవచ్చు'... ఇటీవల పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో సాలిడ్ అండ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సి.శ్రీనివాసన్ ఆధ్వర్యంలో గార్బేజ్ టు గోల్డ్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్న మాటలివి. నిజమే... ప్రపంచంలోని అనేక దేశాలు చెత్త నుంచి సంపద సృష్టించే పలు విధానాలు అమలు చేస్తున్నాయి. పునశ్శుద్ధి, నిర్వహణ విషయంలో మాత్రం మన దేశం ఇంకా ఎంతో వెనుకబడి ఉంది. పరిశుభ్రతే నయా జీవన సంస్కృతిగా స్థిరపడాలని అభిలషిస్తూ దేశంలోని నాలుగు వేలకు పైగా నగరాలూ, పట్టణాల్లో ఘన వ్యర్థాల శుద్ధి ఏర్పాటుకు, చెత్త నుండి విద్యుత్, ఎరువుల తయారీకి మోదీ ప్రభుత్వం పిలుపునిచ్చినా – బండి నడక మందకొడిగా సాగుతోంది. దేశంలో ఉత్పత్తి అయ్యే అన్ని రకాల ఘన వ్యర్థాలు 2030 నాటికి 16.5 కోట్ల టన్నులకు, 2050 నాటికి 43.6 కోట్ల టన్నులకు పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వ అంచనా. రోజుకు 300 టన్నుల చెత్తను మండించి కరెంటు సాధించాలని తలపెట్టి 1987లోనే ఆరంభించిన తిమార్పూర్ (ఢిల్లీ) ప్రయోగం అర్ధాంతరంగా చతికిలపడింది. 14 లక్షల టన్నులకు పైబడిన సామర్థ్యంతో 470 దాకా అధీకృత రీసైక్లర్లు పనిచేస్తున్నట్లు కేంద్రం చెబుతున్నా – అందులో సగం మేరకైనా వినియోగంలోకి రాలేదు.

మరోవైపు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ వంటి ఈ-వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఈ-వ్యర్థాల ఉత్పత్తికి సంబంధించి ప్రపంచంలో చైనా, అమెరికా తరువాత మూడో స్థానంలో నిలిచిన భారత్ వాటా 32 లక్షల టన్నులు. దేశవ్యాప్తంగా ఈ-వ్యర్థాల్లో 78 శాతం దాకా సేకరణకే నోచుకోవడం లేదు. పాతబడిన టీవీలు, కంప్యూటర్లు, ఏసీలు, సెల్ ఫోన్లు, ఫ్రిజ్‌లు యథాతథంగా చెత్తకుప్పల్లోకి చేరిపోతున్నాయి. ఆయా పరికరాల్లోని మూలకాలు, రసాయనాలు నేరుగా భూమి పొరల్లోకి ఇంకి మానవాళికి అనర్థాలు తెచ్చిపెడుతున్నాయి. తగినంతగా రీసైక్లింగ్, పునశ్శుద్ధి లేని కారణంగా ఇనుము, సీసం, రాగితో పాటు బంగారం, నియోడిమియం, కాడ్మియం వంటి విలువైన లోహాలు చేజారిపోతున్నాయి. ఏడాది కాలంలో ఈ-వ్యర్థాల నుంచి సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయల విలువైన బంగారం వెలికితీసే అవకాశాన్ని ఇండియా కోల్పోతుందని ఫిక్కీ ఆ మధ్య లెక్కగట్టింది.



బృహత్ ప్రణాళికతో చెత్త నుండి సంపద, ఉపాధి కల్పన సృష్టించే కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టడం అభినందనీయం. ఇళ్ల నుంచి వీధి కూడళ్ల నుంచి వ్యర్థాలను సేకరించి తీసుకుపోయి ఎక్కడో ఓ చోట పడేయడమే ఏళ్ల తరబడి ఇండియాలో జరుగుతున్న చెత్త విధానం. అసలు రోజూ వందల టన్నుల్లో పోగవుతున్న చెత్తను సేకరించడం ఒక ఎత్తయితే, డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయడం, అక్కడికి తరలించడం ప్రభుత్వాలకు సమస్య

ఇక ప్లాస్టిక్ సంగతి చెప్పనవసరం లేదు. గాలిలో, నీటిలో, భూమ్మీద పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలైతే మానవాళికి పెను సవాళ్లు విసురుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు శరీర కణజాలాన్ని, డీఎన్ఏను దెబ్బ తీస్తాయని, వాటివల్ల క్యాన్సర్ ముప్పు ఉందని ఇప్పటికే నిపుణులు హెచ్చరిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో పారేస్తున్న ప్లాస్టిక్ సంచులు అసంఖ్యాక మూగజీవాల్ని నరకయాతన పాలు చేస్తున్నాయి. చనిపోతున్న ఆవులు, గేదెల పొట్టల్లో 30, 40 కిలోల దాకా ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతున్నాయి. ఒక్క 2024 సంవత్సరంలోనే ప్రపంచ వ్యాప్తంగా 22 కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోగుపడతాయని ఎర్త్ యాక్షన్ సంస్థ చెపుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ ఉత్పత్తి 1950 నుంచి గణనీయంగా పెరిగింది. నాడు దీని ఉత్పత్తి కేవలం 20 లక్షల టన్నులు. 2019 నాటికి ఇది 45 కోట్ల టన్నులకు చేరింది. పరిస్థితి ఇలానే కొనసాగితే 2060 నాటికి ఈ ఉత్పత్తి మూడింతలు అవుతుందని అంచనా. భూగర్భం నుంచి వెలికి తీస్తున్న చమురు, సహజ వాయువుల్లో 10 శాతం ప్లాస్టిక్ ఉత్పత్తికే సరిపోతుంది. దీని తయారీకి అవసరమైన విద్యుత్ కోసం బొగ్గును మండిస్తున్నారు. ఇవన్నీ పర్యావరణానికి హాని కలిగించేవే. భారత్‌లో ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్‌ను నిషేధించినా, ఇప్పటికీ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా లేని ప్లాస్టిక్ చేతిసంచుల వాడకం యధేచ్ఛగా కొనసాగుతోంది. మొత్తం సముద్ర వ్యర్థాలలో 85 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటాయి.

ఏదిఏమైనా విస్తరిస్తున్న పట్టణీకరణ, జీవనశైలి మార్పులు, వస్తు వినియోగం పెరగడం తదితర కారణాలతో ఘన, ద్రవ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. గృహాల నుంచి ఘన, ద్రవ వ్యర్థాలతో పాటు ఎలక్ట్రానిక్, ప్లాస్టిక్, బ్యాటరీ వ్యర్థాలు, కాలం చెల్లిన ఉపకరణాలు వెలువడుతున్నాయి. ఇవి గుట్టలు గుట్టలుగా పేరుకుపోయి పర్యావరణానికి హాని కలుగచేస్తున్నాయి. ఇళ్ల నుంచి వీధి కూడళ్ల నుంచి వ్యర్థాలను సేకరించి తీసుకుపోయి ఎక్కడో ఓ చోట పడేయడమే ఏళ్ల తరబడి ఇండియాలో జరుగుతున్న చెత్త విధానం. అసలు రోజూ వందల టన్నుల్లో పోగవుతున్న చెత్తను సేకరించడం ఒక ఎత్తయితే, డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయడం, అక్కడికి తరలించడం ప్రభుత్వాలకు సమస్యగా మారింది. చాలాచోట్ల స్థలాలే దొరకడం లేదు. పైగా డంపింగ్ యార్డులలో చెత్తను తగులబెట్టడంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది.

వీటికి పరిష్కారం లేకపోలేదు. కావలసిందల్లా చిత్తశుద్ధి, సరైన ప్రణాళిక. వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థలు వలయ ఆర్థిక వ్యవస్థ (సర్క్యులర్ ఎకానమీ) రూపకల్పనకు వివిధ నమూనాలను రూపొందిస్తున్నాయి. ఈ విధానంలోకి మళ్లడం వల్ల వ్యయాలు తగ్గి, 2040 నాటికి 1.27 లక్షల కోట్ల డాలర్లను పొదుపు చేయడానికి ప్రభుత్వాలకు అవకాశం దక్కుతుంది. ముఖ్యంగా వాతావరణ మార్పులు, వాయు కాలుష్యం తగ్గడంతో పాటు ప్రజల ఆరోగ్యం మెరుగై ఆర్థిక వ్యవస్థలో మరో 3.25 లక్షల కోట్ల డాలర్ల మిగులు సాధ్యమవుతుందని ఐరాస గతంలో ఒక నివేదికలో తెలియజేసింది. సర్క్యులర్ ఎకానమీ వలన 2040 నాటికి ఏడు లక్షల నూతన ఉద్యోగాల సృష్టి జరుగుతుందని అది వెల్లడించింది. ఘన వ్యర్థాల పునశ్శుద్ధి 2030 నాటికి దేశంలో 2 వేల కోట్ల డాలర్ల మేర సంపద సృష్టికి అవకాశాలు కల్పిస్తుందని అవెండస్ క్యాపిటల్ అనే సంస్థ ఇటీవల తన నివేదికలో వెల్లడించింది.

గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో మన రాష్ట్రంలో హరిత రాయబారుల ద్వారా వ్యర్థాలు సేకరించి, వాటి నుంచి ఎరువుల తయారీ-విక్రయాల ద్వారా పంచాయితీలకు ఆదాయం సమకూర్చాలనే ఉద్దేశ్యంతో పంచాయితీకో సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. 13 వేలకు పైగా ఈ కేంద్రాలు ఏర్పాటు చేసి దాదాపు 40 వేల మంది హరిత రాయబారులను నియమించారు. ఎంతో చక్కగా అమలైన ఈ కార్యక్రమం వైసీపీ అధికారంలోకి వచ్చాక తారుమారైంది. నిధుల కొరత, కార్మికులకు జీతాలు చెల్లించని కారణంగా చాలా కేంద్రాల్లో కార్యక్రమాలు నిలిచిపోయాయి. చెత్త సేకరణకు వినియోగించే రిక్షాలు, ఆటోలు అనేక చోట్ల మరమ్మతులకు గురయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 25 వేలకు పైగా ఉన్న రిక్షాల్లో 13 వేలకు పైగా నిర్వహణ లోపంతో మూలకు చేరాయి. ఇదీ రాష్ట్రంలోని పరిస్థితి. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాకతో మార్పు మొదలైంది. బృహత్ ప్రణాళికతో చెత్త నుండి సంపద, ఉపాధి కల్పన సృష్టించే కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి చేపట్టడం అభినందనీయం. పిఠాపురం నుండి ప్రారంభం కాబోతున్న ఈ పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమై రాష్ట్రమంతా అమలులోకి వస్తే పవన్ కళ్యాణ్ చెప్పినట్టు గ్రామీణ ప్రాంతాల్లోనే ఏడాదికి రూ.2,643 కోట్ల సంపద సృష్టి జరిగి, 2.42 లక్షల మందికి ఉపాధి దొరికి రాష్ట్ర రూపురేఖలు మారిపోతాయి. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆశిద్దాం.

■ కూసంపూడి శ్రీనివాస్
జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి

విశ్వవిద్యాలయాల ప్రక్షాళన
అంత సులువు కాదు!

గత ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డి అనుసరించిన విద్యా వ్యతిరేక విధానాల కారణంగా ఉన్నత విద్యా సంస్థల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఉన్నత విద్యకు నిలయాలైన యూనివర్సిటీలన్నీ సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. ఇవి అధికార పార్టీకి అనుబంధ సంస్థలుగా మారిపోయాయి. కాబట్టే ప్రభుత్వం మారగానే దాదాపు అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతులు తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో జగన్ ప్రభుత్వం వీసీల నియామకంలో ఎలా వ్యవహరించిందో అర్థమవుతుంది. ఉపకులపతి పోస్టులకు సంబంధించి అప్పటికే ఉన్న నిబంధనలను సడలించి, తమ వారికి వైసీపీ పట్టం కట్టింది. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో వీసీగా పని చేసిన వ్యక్తికి ప్రొఫెసర్‌గా పదేళ్ల సర్వీసు లేకపోవడంతో అప్పటికే నియమించిన సెర్చి కమిటీని రద్దు చేసి, ఆయన కోసమే ఆ నిబంధన మార్చి, మరోసారి సెర్చ్ కమిటీ వేసి ఆ వ్యక్తినే వీసీగా నియమించారు. ఈ వ్యవహారంలో కీలక మంత్రి ఒకరు చక్రం తిప్పారన్నది బహిరంగ రహస్యం. ఆయన అనంతరం ఆ పదవిలోకి వచ్చిన వ్యక్తి కూడా మాజీ మంత్రి చెబితే తప్ప, ఆ పదవి నుంచి వైదొలగనన్నారు. అయితే యూనివర్సిటీలో ఆయన వల్ల నష్టపోయిన బాధితులంతా ఏకమవడంతో ఇక్కట్లు తప్పవని గ్రహించి రాజీనామా చేసి వెళ్లిపోయారు.



గత ప్రభుత్వంలో యూనివర్సిటీలన్నీ సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. ఇవి అధికార పార్టీకి అనుబంధ సంస్థలుగా మారిపోయాయి. కొత్త ప్రభుత్వం గాడి తప్పిన పాలనా వ్యవస్థను చక్కదిద్దడంతో పాటు ఆచార్య పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తే తప్ప రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలకు మనుగడ ఉండదు.

ఆంధ్ర విశ్వకళాపరిషత్ (ఏయూ) వీసీగా పని చేసిన ప్రసాద రెడ్డి వ్యవహారం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వీసీగా ఆయన పదవీ కాలం ముగియడంతో ఇన్‌ఛార్జ్ వీసీగా అప్పటికే రెక్టారుగా పని చేస్తున్న మహిళను నియమిస్తే, ప్రసాద రెడ్డి సహించలేకపోయారు. రెండు రోజుల పాటు వీసీ ఛాంబర్‌లో ఆమెను కూర్చోనివ్వలేదు. దీంతో ఆమె రెక్టార్ ఛాంబరులోనే వీసీగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీల వ్యవహారం ఇదే తరహాలో నడిచింది. ఇక వర్సిటీల పాలక మండళ్లయితే గత ప్రభుత్వంలో పూర్తిగా అధికార పార్టీకి చెందిన రాజకీయ నిరుద్యోగులతోనే నిండిపోయాయి.

యూనివర్సిటీలు రాజకీయ కేంద్రాలుగా మారడంతో బోధనారంగం తీవ్రంగా నష్టపోయింది. ఏ ఒక్క వర్సిటీలోనూ తగినంత మంది శాశ్వత ఆచార్యులు లేరు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనల ప్రకారం అధ్యాపక విద్యార్థుల నిష్పత్తి 1:20గా ఉండాలి. ఏ ఒక్క యూనివర్సిటీలోనూ ఈ నిష్పత్తి లేదు. విద్యార్థులకు సరైన విద్య అందక వర్సిటీలంటే పీజీ పట్టాలిచ్చే కేంద్రాలుగా మిగిలిపోతున్నాయి. అధ్యాపకుల కొరత పరిశోధనా రంగంపై మరింత తీవ్రంగా పడుతున్నది. బోధన కోసం తాత్కాలిక పద్ధతుల్లో కాంట్రాక్టు అధ్యాపకులను నియమించుకుని నెట్టుకు వచ్చినా, పరిశోధనా రంగం విషయంలో అటువంటి అవకాశం లేదు. అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్లుగా శాశ్వత ఉద్యోగులకు మాత్రమే పరిశోధనలు (పీహెచ్‌డీ) చేయించే అవకాశం ఉంది. దీంతో పరిశోధకులకు మార్గ నిర్దేశం చేయాల్సిన అధ్యాపకుల కొరత తీవ్రమై ఈ ప్రభావం ఆ రంగాన్ని కోలుకోలేని దెబ్బ కొట్టింది. రాష్ట్రంలోని ఒక ప్రఖ్యాత వర్సిటీలోని తెలుగు అధ్యయనశాఖలో 16 మంది శాశ్వత అధ్యాపకులు ఉండాల్సిన చోట ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. పరిశోధనలన్నీ ఆ ఒక్కరి వద్ద జరగడం అసాధ్యం. దాదాపు అన్ని వర్సిటీల్లో ఇదే స్థితి. ఈ తరహా విపత్కర పరిస్థితుల నేపథ్యంలోనే ఏటా నిర్వహించాల్సిన రీసెట్‌లు సక్రమంగా జరగడం లేదు. ఏటా రెండుసార్లు యూజీసీ నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్టు (నెట్) సాధించి, ఆర్థిక భరోసాతో పరిశోధనలు చేయడానికి వస్తున్న పీహెచ్‌డీ ఆశావహులకు ఏపీలోని యూనివర్సిటీల్లో దాదాపు అన్ని విభాగాల్లోనూ రెడ్ బోర్డులే ఎదురవుతున్నాయి. దీంతో పాటు శాశ్వత అధ్యాపకులకు మాత్రమే యూజీసీ, ఐసీఎస్ఎస్ఆర్ వంటి అనేక సంస్థలు నుంచి అందివచ్చే రీసెర్చి ప్రాజెక్టులు అందడం లేదు. వివిధ సంస్థలు ఇచ్చే పోస్టు డాక్టోరల్ ఫెలోషిప్‌లపైనా ఈ ప్రభావం ఉంటున్నది. సైన్సు విభాగాలైతే కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను కోల్పోతున్నాయి. అవసరమైన స్థాయిలో నియామకాలు లేకనే పరిశోధనా రంగానికి ఈ స్థాయి నష్టం జరుగుతోంది.

వర్సిటీలకు స్వతంత్ర ప్రతిపత్తి ఉంటుంది. గతంలో ఏ వర్సిటీకి ఆ వర్సిటీ తమ వద్ద ఉన్న ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చి భర్తీ చేసుకొనేవి. అయితే వివిధ కారణాలతో పోస్టుల క్రమబద్ధీకరణ చేయాలని గత ప్రభుత్వాలు భావించడంతో కొత్త సమస్యలు తలెత్తాయి. 2018లో ఒక నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్షలు పూర్తయ్యాయి. తరువాత లోపాల కారణంగా ఆ నోటిఫికేషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాలు చేస్తూ కొందరు అభ్యర్థులు సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. ఇవన్నీ పట్టించుకోని జగన్‌రెడ్డి ప్రభుత్వం మరోసారి రేషనలైజేషన్ పేరుతో ఇష్టానుసారం వ్యవహరించింది. ఒక్కో యూనివర్సిటీలో ఒక్కో రకంగా నిర్ణయాలు జరిగాయి. ఉదాహరణకు ఎస్వీయూలోని ఆంత్రోపాలజీ విభాగాన్ని మరో విభాగంలో అంతర్భాగం చేసి అక్కడ ఉన్న ఆచార్య పోస్టులను తగ్గించారు. ఏయూలో అదే ఆంత్రోపాలజీని అలాగే కొనసాగించారు. ఇష్టానుసారం విభాగాలను కుదించడం, కలిపివేయడం, ఒక డిపార్టుమెంటులోని పోస్టులను మరోచోట చూపించడం వంటివి సాధారణమయ్యాయి. ఇటువంటి వింతలతో ఆ రేషనలైజేషన్ లోపభూయిష్టంగా ఉండడంతో, దీనిపై ఆయా వర్సిటీల్లో పెద్ద చర్చే నడిచింది. మూడు వేలకు పైగా పోస్టులను తామే భర్తీ చేస్తామంటూ గత ప్రభుత్వం ఎన్నికల సమయానికి నోటిఫికేషన్ ఇచ్చింది. పోస్టుల రోస్టరు పాయింట్లకు సంబంధించి అనేక లొసుగులు వెలుగు చూశాయి. మహిళా రిజర్వేషన్ కింద వారికి ఏ నెంబరు పోస్టో స్పష్టం చేయలేదు. దివ్యాంగుల రోస్టరు పాయింట్లను పూర్తిగా విస్మరించి, మోసగించి 42 వేల మంది అభ్యర్థుల నుంచి ఫీజుల రూపంలో కోట్లాది రూపాయల్ని దండుకొని వారి ఆశలతో ఆటలాడుకుంది. అనంతరం కోర్టుల్లో ఎదురైన ప్రశ్నలకు సమాధానం కూడా చెప్పుకోలేని స్థితిని జగన్ ప్రభుత్వం ఎదుర్కొంది.

జగన్ పాలనలో సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న వర్సిటీల్లో పోస్టులు భర్తీ చేయడం కూటమి ప్రభుత్వానికి అంత సులభం కాదు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో రోస్టర్ పాయింట్లకు యూనివర్సిటీని యూనిట్‌గా తీసుకోవాలా లేదా డిపార్ట్‌మెంట్‌ను యూనిట్‌గా తీసుకోవాలా అనే అంశం, జగన్ ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని లోపాలు, కాపులకు గతంలో ఇచ్చిన ఐదు శాతం ఈడబ్ల్యూఎస్ కోటా అమలు (దీన్ని జగన్ ప్రభుత్వం తొలగించింది), మహిళా, దివ్యాంగుల రోస్టరు పాయింట్లు అనేవి మరోసారి సమస్యగా మారవచ్చు. ఇప్పటికే వర్సిటీలకు సంబంధించి వందలాది కేసులు వివిధ కోర్టుల్లో ఉన్నాయి.

దాదాపు రెండు దశాబ్దాలుగా శాశ్వత నియామకాలు లేకపోవడంతో బోధన కోసం అన్ని వర్సిటీల్లో కాంట్రాక్టు, టీచింగ్ అసిస్టెంట్లు, అతిథి అధ్యాపకుల రూపంలో వేలాదిగా పనిచేస్తున్నారు. వారికి అందుతున్నవి అరకొర వేతనాలే. అవి కూడా ఒక్కో వర్సిటీలో ఒక్కో వేతనం ఉంది. ఎంతో కాలంగా యూనివర్సిటీలనే నమ్ముకుని బతుకీడుస్తున్న వారికి శాశ్వత అధ్యాపక పోస్టుల నియామకాలలో న్యాయం చేయాల్సి ఉంటుంది. ఈ చిక్కుముడులన్నీ విప్పడంతో పాటు కొత్త సమస్యలు రాకుండా చూసుకోవాలి. గాడితప్పిన పాలనా వ్యవస్థను చక్కదిద్దడంతో పాటు ఆచార్య పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తే తప్ప రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలకు మనుగడ ఉండదు.

○ డాక్టర్ సిఎన్. క్షేత్రపాల్ రెడ్డి

టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో విజయ్, పేస్

క్రికెట్ ప్రతిధ్వనులు తప్ప మరే చప్పుడూ వినిపించని భారత్‌లో ఇద్దరు ఆటగాళ్ళు వరల్డ్ లవ్ గేమ్‌లో లెజెండ్స్‌గా, గ్రేట్స్‌గా నిలుస్తారని ఎవరైనా ఊహించారా? వనరులు, ప్రమాణాలు, ప్రోత్సాహకాలు, స్పాన్సర్లు దక్కనిచోట ఆటనే శ్వాసగా చేసుకుని దేశం కోసం పోరాడిన ఇద్దరు యోధులు ఇప్పుడు అపురూపమైన సత్కారం అందుకుంటారని ఎవరైనా ఊహించారా? టెన్నిస్ దిగ్గజాలు విజయ్ అమృత్‌రాజ్, లియాండర్ పేస్ అంతర్జాతీయ టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటుచేసుకోవడం అపురూపమైన దృశ్యమే కదా.. భారత్‌లో ఎన్నో తరాలకు స్ఫూర్తిగా నిలిచిన ఈ ఇద్దరు దిగ్గజాలు... టెన్నిస్ గ్రేట్స్ మెకెన్రో బ్రదర్స్, అగస్సీ, నవ్రతిలోవా, క్రిస్ ఎవర్ట్, కిమ్ క్లియ్‌స్టర్స్ తదితరుల సమక్షంలో సత్కారం అందుకోవడం కన్నులపండువ కాక మరేమిటి?

ఆసియా నుంచి ఈ ఘనత సాధించింది కూడా ఈ ఇద్దరే. అంతర్జాతీయ టెన్నిస్‌కు చేసిన సేవలకు విజయ్ అమృత్‌రాజ్, సాధించిన ఘనతకు లియాండర్ పేస్‌కు ఈ అరుదైన గౌరవం దక్కింది. 1970వ దశకంలో భారత్ నుంచి ఒక ఆటగాడు 19 ఏళ్ళ వయసులో వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరడం అంటే ఆషామాషీ కాదు. మొన్నటి వింబుల్డన్ చాంపియన్ అల్కరాజ్‌కు కూడా ఈ రికార్డు లేదు. (అల్కరాజ్ వింబుల్డన్ క్వార్టర్స్ ఫైనల్స్ చేరడానికి 20 ఏళ్ళు పట్టింది) భారత్‌లో అప్పుడున్న పరిస్థితుల మధ్య విజయ్ అమృత్‌రాజ్ లాంటి ఆటగాడు 19 ఏళ్ళ వయసులోనే వింబుల్డన్ మెన్స్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోవడం అంటే ఆషామాషీ కాదు. ఇదొక్కటే కాదు గ్రాండ్ శ్లామ్ టోర్నమెంట్స్‌లో విజయ్ అమృత్‌రాజ్ నాలుగు సార్లు మెన్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరారు. డబుల్స్‌లో ప్రపంచ 23వ ర్యాంకర్‌గా 13 డబుల్స్ టైటిల్స్ నెగ్గారు. రెండుసార్లు ఇండియాకు డేవిస్ కప్‌ను అందించారు. అన్ని విభాగాలనూ కలిపితే విజయ్ అమృతరాజ్ సాధించిన టైటిల్స్ 28. నిజానికి ఏడేళ్ళ వయసులో విజయ్ అమృత్‌రాజ్ తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడిన విజయ్ అసలు లేచి పరిగెత్తగలడా అని ఆయన తల్లి తల్లడిల్లిపోయింది. అలాంటి విజయ్ అమృతరాజ్ తన విజయాలతో కొత్త చరిత్ర లిఖించారు. అద్భుతాలతో భారత టెన్నిస్‌ను మలుపు తిప్పి తర్వాత తరానికి స్ఫూర్తిగా నిలిచారు. తర్వాత కాలంలో రమేష్ కృష్ణన్ భారత టెన్నిస్‌కు కాస్తోకూస్తో విజయాలు సాధించిపెట్టినా దీర్ఘ కాలం నిలవలేకపోయాడు.



1970వ దశకంలో 19 ఏళ్ళ పిన్న వయసులో వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరిన విజయ్ అమృతరాజ్ ఆ తరువాత అనేక అద్భుత విజయాలతో భారత టెన్నిస్‌ను మలుపు తిప్పి తర్వాత తరానికి స్ఫూర్తిగా నిలిచిన దిగ్గజ క్రీడాకారుడు. టెన్నిస్‌లో భారత్‌కు ఒలింపిక్ పతకం సాధించి పెట్టిన ఏకైక ఆటగాడు లియాండర్ పేస్.

విజయ్ అమృతరాజ్‌ది ఓ రకమైన స్ఫూర్తిదాయకమైన పోరాటమైతే, పేస్‌ది మరో కథ.. పేస్ తండ్రి భారత హాకీ ఒలింపియన్. పేస్‌ను ఫుట్‌బాలర్‌గా చూడాలనుకుని ఫుట్‌బాల్ కోచింగ్ ఇప్పించారు. ఆ తర్వాత యూరోపియన్ క్లబ్స్‌లో ఆడించేందుకు పంపారు. యూరోపియన్ క్లబ్స్‌లో ఆడాలంటే భారత గుర్తింపును వదిలేయాలంటూ షరతులతో పేస్ వెనక్కివచ్చేశాడు. హాకీ అనుకున్నా అదీ కుదరలేదు. దీంతో చెన్నై విజయ్ అమృత్‌రాజ్ అకాడమీలో చేరాక పేస్ ప్రస్థానం ప్రారంభమైంది. విజయ్ అమృతరాజ్ శిక్షణలో పేస్ రాటుదేలాడు. ఆ తర్వాత మళ్ళీ లియాండర్ పేస్ రూపంలో భారత్ టెన్నిస్ మలుపు తిరిగింది. పేరుకు తగినట్టే పేస్... రాకెట్‌తో దూసుకెళ్ళాడు. ఆ రోజుల్లోనే క్రికెట్ నీడలో వెనుకబడిన భారత టెన్నిస్‌ను పేస్ తన భుజాన వేసుకున్నాడు. భూపతితో పాటు పలువురు ప్లేయర్లతో కలిసి మెన్స్ డబుల్స్‌ను, టెన్నిస్ గ్రేట్స్ మార్టినా నవ్రతిలోవా, హింగిస్ తదితరులతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌ను ఆడి ఎన్నో గొప్ప విజయాలు సాధించాడు. మెన్స్ డబుల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో పేస్ పేరు అంతర్జాతీయంగా మార్మోగింది. 23 ఏళ్ళ నెలా 17 రోజుల వయసులో 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో పేస్ పతకం సాధించాడు. టెన్నిస్‌లో భారత్‌కు ఒలింపిక్ పతకం సాధించి పెట్టిన ఆటగాడు ఇప్పటి వరకూ పేస్ ఒక్కడే. మెన్స్ డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ అన్నింటినీ కలుపుకుంటే మొత్తం 19 గ్రాండ్ శ్లామ్ టైటిల్స్‌ను పేస్ సాధించాడు. అతడు గొప్ప అథ్లెట్ అని, అతను రాకెట్ పట్టుకుంటే ఆర్కెస్ట్రాలా ఉంటుందని నవ్రతిలోవావంటి టెన్నిస్ గ్రేట్ ప్రశంసలను అందుకున్నాడు. తన అభిమాన మిక్స్‌డ్ డబుల్స్ ప్లేయర్ పేస్ అంటూ ఎన్నో ఏళ్ళ క్రితం భారత్‌కు వచ్చినప్పుడే నవ్రతిలోవా చెప్పింది. పేస్–నవ్రతిలోవా రెండు గ్రాండ్‌శ్లామ్ టైటిల్స్ సాధించారు. పేస్‌తో మిక్స్‌డ్ డబుల్స్ ఆడటం గౌరవంగా భావిస్తున్నానని నవ్రతిలోవా ఎప్పుడూ చెబుతూ ఉంటుంది. నిజానికి పురుషులు–మహిళలు తారతమ్యం లేకుండా ఆడే ఆట టెన్నిస్ ఒక్కటే. అందుకే ఎవరు ఆడినా, ఎవరు తలపడినా ఈ ఆట ప్రపంచానికి లవ్ గేమ్‌గా మారింది.

తనను ఇంతటిస్థాయికి తెచ్చిన తన తండ్రి, గురువులు, టెన్నిస్ గ్రేట్స్‌కు చెమర్చిన కళ్ళతో పేస్ కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఎన్ని టైటిల్స్ ఎంత ప్రైజ్‌మనీ సాధించామన్నది ముఖ్యం కాదు. ఎంత మందికి స్ఫూర్తిగా నిలుస్తామన్నదే ముఖ్యం–అంటూ తండ్రి చెప్పిన మాటను పేస్ గుర్తు చేసుకున్నాడు. ఇదే స్ఫూర్తితో రాబోయే 15 ఏళ్ళలో 25 కోట్ల మందికి టెన్నిస్‌ను చేరువ చేయడమే ఆశయమని ప్రకటించాడు. లవ్ గేమ్‌లో 51 ఏళ్ళ ఈ చాంపియన్ తన లక్ష్యాన్ని చేరుకోవాలని, లవ్ ఆల్‌గా తీర్చిదిద్దాలని కోరుకోవడంలో తప్పేమీ లేదేమో!

● కేవీఎస్ నాగరాజు
జర్నలిస్టు


'వినుట' అనే విప్లవం మళ్లీ రావాలి!

సినిమాహాలు, ఎగ్జామ్‌హాలు, గర్భగుడి... లాటి కొన్నిచోట్ల తప్ప ఎక్కడయినా చూడండి– బస్సూ, రైలూ, మెట్రో, వెయిటింగ్ హాళ్ళూ, మ్యారేజిహాళ్ళూ... ఇందుగలదందులేదని కాక ఎందెందు వెతికి చూడకుండానే అందరి చేతిలో కనిపించేవి మొబైల్‌ఫోన్లు. 'కనికట్టు' అన్నపదం విన్నాం కానీ, చూడలేదు. ఇప్పుడు మాత్రం అందరి కంటిచూపుల్ని తన స్క్రీన్‌కి కట్టిపడేస్తున్నాయి సెల్‌ఫోన్లు. చివరికి బండ్లు నడిపేవాళ్ళు కూడా. అయితే ప్రయాణీకుల అదృష్టవశాత్తూ సెల్‌ఫోన్లను గుండెలకు హత్తుకొని శబ్దాల్ని మాత్రం చెవులకెత్తుకుంటున్న దృశ్యాలూ చూస్తున్నాము. ఇక ఇండ్లల్లో టీవీలూ, ఆఫీసుల్లో కంప్యూటర్లూ, ల్యాప్‌టాపులూ... ఇలా జెట్ వేగంతో విస్తరిస్తున్న గ్యాడ్జెట్లూ.

పెళ్ళాం – మొగుడు, తల్లి – పిల్ల, బాసూ – సబార్డినేటూ... అన్న స్థాయీభేదాల్ని సైతం రూపుమాపి అందరినీ ఎవరి సెల్లుల్లో వారిని బంధింపచేస్తున్నాయి. స్వచ్ఛంద బందీలయిపోతున్నాం అందరమూనూ. ఇలాటి వాటికి ఒకే ఒక ఆరోగ్యవంతమూ, ఆనందప్రదమూ, విషయ, విజ్ఞాన ప్రేరకమూ అయిన అతి పాత మాధ్యమం రేడియో. అదే అందరికీ 'అమ్మ'లా తెలిసిన ఆకాశవాణి.

పాపం! ఏ అమ్మ కూడా తన పిల్లలతో చెప్పదు 'కొంచెం! నన్ను చూసుకోండ్రా' అని. 'నన్ను మరవకండ్రా' అని. ఇదిగో అలాంటి అమ్మే ఆకాశవాణి. అంటే రేడియో. అమ్మ సహజంగానే అందరి గుండెల్లో ప్రేమైక రాశిలా ఉంటుంది. ఆకాశవాణి ప్రసక్తి వస్తే చాలు – నా చిన్నప్పుడు.. అంటూ ఎన్నో తీయని ముచ్చట్లు. కానీ.. ఆ విషయాలన్నీ గతకాలపు తీపిగురుతులుగానే ఉండాలా? హు..హు... అయితే మరి ఆ తీయదనాన్ని మళ్ళీ అందరికీ దగ్గర చేద్దాం. అనుభవిస్తే అది ఎంత ఆరోగ్యవంతమో రుజువవుతుంది. ఇదివరకు పెద్దపెద్ద రేడియోసెట్లు, ఏరియళ్ళ ట్రాన్సిస్టర్ రేడియోలు, గ్రామ పంచాయతీల్లో, పార్కుల్లో ప్రతిధ్వనించే లౌడ్ స్పీకర్లు. ఇపుడు ఇలాటివి చూడాలంటే పాత సినిమాలు చూడాల్సిందే.

టెక్నాలజీ పుణ్యమా అని రేడియోసెట్లు లేకున్నా మొబైల్ ఫోన్లలో యాప్స్ రూపంలో అన్ని రేడియో కేంద్రాలు అందుబాటులో వున్నాయి. ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకుని వింటూ ఉంటే ఎన్నెన్నో మనలోకి స్పీడ్‌గా అప్‌లోడ్ అవుతాయి. అసలు రేడియో గొప్పతనం ఏంటంట? అంటే ఒకే పదంలో సమాధానం 'చెప్పలేనంత'. విశ్వసనీయమయిన, సూటిగా, సరళంగా చెప్పే వార్తలు, శాస్త్రీయ, జానపద, సినీ సంగీతాలు, రూపకాలు, నాటకాలు, ప్రసంగాలు, పరిచయాలు, ప్రత్యక్ష ఫోన్‌ఇన్ కార్యక్రమాలూ. గర్భస్థ శిశువుల ఆరోగ్యం నుండి వయోధికుల దాకా.... అందరూ ఆకాశవాణి కుటుంబ సభ్యులే. బాలబాలికలు, యువతీయువకులు, కర్షకులు, కార్మికులు, మహిళాలోకం, విద్యా, వైద్య, వర్తమాన విజ్ఞాన రంగాలు, సృజనాత్మకత ప్రతిబింబించే కళా ప్రక్రియలు, సంగీత సాహిత్యాలూ, రూపకాలూ, నాటకాలూ... అసలు ఆకాశవాణి అంటే ఒక అద్భుత శబ్ద ప్రపంచం.



ఆకాశవాణి– భాషకు స్వరాభిషేకం చేస్తుంది. గాత్ర వాద్య సంగీతాలకు చిరంజీవిత్వాన్నిస్తుంది. మహామహుల స్వరాల్ని వినిపిస్తుంది, భద్రపరుస్తుంది. సస్య విప్లవ వైభవాన్ని గుర్తు చేస్తుంది. సతత హరిత సాగుబడికీ, శ్వేతవిప్లవ ధవళ ధారకూ, రైతులోకానికి అండగా నిలబడుతుంది. ఆయా ప్రాంతాల యాసలతో పరవశిస్తుంది. భాషలోని సొగసుతో పరిమళిస్తుంది. సూక్తులతో ఆరోజంతటికీ సానుకూల దృక్పథపు దారి పరుస్తుంది. తత్వాలు, సుప్రభాతాలు, కీర్తనలు, పద్యాలు, పాటల మాధుర్యాన్ని హాయిగా కండ్లు మూసుకుని ఆస్వాదించమంటుంది.

విన్నవారికి విన్నంత – భావించిన వారికి భావించినంత. రూపాన్ని మనసు తెరపై చిత్రించే శబ్ద చిత్రాలు... మనకు తెలియకుండానే మన ఊహాశక్తికీ, కాల్పనిక సృజనకూ పదును పెడతాయి. విద్యావిధానంలో, ఉద్యోగాన్వేషణకోసం పోటీ పరీక్షలలో, స్వయం ఉపాధి కల్పనలో నైపుణ్యశిక్షణ అంటూ నినదిస్తున్నది సమకాలం. మన కాల్పనిక శక్తికి ఏ మాత్రం అవకాశం కల్పించని, మిక్సీలో గ్రైండ్ చేసి నేరుగా జీర్ణాశయంలో పోసిన ఆహారంలాగా విజువల్ మీడియా, సోషల్ మీడియా ఉధృతిలో కొట్టుకుపోతున్నాం. సహజంగానే వినిపించే రేడియో అయినా, చదివించే పుస్తకాలైనా కొంచెం ముఖం చిన్న బుచ్చుకుంటున్నాయి. టెక్నాలజీని ఆహ్వానిద్దాం. నూతన ఆవిష్కరణల ఫలితాల్ని ఆదరిద్దాం, ఆస్వాదిద్దాం. అదే సమయంలో కొంతలోకొంత సంప్రదాయ మాధ్యమం రేడియో విలువను మళ్లీ గ్రహిద్దాం... అర్థవంతమైన, అందమైన కార్యక్రమాల్ని ప్రతిరోజూ ఆస్వాదిద్దాం.

నేను 1987లో కడప కేంద్రంలో పనిచేసిన రోజులు గుర్తుకు తెచ్చుకుంటే.. రేడియో ప్రేమికులందరూ ఎంతో సంతోషిస్తారు. ఆకాశవాణి కడప కేంద్రంలో షిఫ్ట్ డ్యూటీ ముగించుకుని సైకిల్‌మీద బజారులో వెళుతుంటే... ఇస్త్రీషాపులు, పాన్‌షాపులు, కిరాణా అంగళ్ళు.. ఇంటి వసారాల్లో రేడియోలు మోగుతూనే వుండేవి. ఒక సినిమాపాట రమారమి మూడు, నాలుగు నిమిషాలు ఉంటుంది. పల్లవి, చరణాలేవీ మిస్ కాకుండా అలా రోడ్లపై వెళుతూ కూడా పాట మొత్తం వినే అవకాశం వుండేది.

ఆకాశవాణి– భాషకు స్వరాభిషేకం చేస్తుంది. గాత్ర వాద్య సంగీతాలకు చిరంజీవిత్వాన్నిస్తుంది. మహామహుల స్వరాల్ని వినిపిస్తుంది, భద్రపరుస్తుంది. సస్య విప్లవ వైభవాన్ని గుర్తు చేస్తుంది. సతత హరిత సాగుబడికీ, శ్వేతవిప్లవ ధవళ ధారకూ, రైతులోకానికి అండగా నిలబడుతుంది. ఆయా ప్రాంతాల యాసలతో పరవశిస్తుంది. భాషలోని సొగసుతో పరిమళిస్తుంది. సూక్తులతో ఆరోజంతటికీ సానుకూల దృక్పథపు దారి పరుస్తుంది. తత్వాలు, సుప్రభాతాలు, కీర్తనలు, పద్యాలు, పాటల మాధుర్యాన్ని హాయిగా కండ్లు మూసుకుని ఆస్వాదించమంటుంది. నీ పనికి ఏ మాత్రం ఆటంకంగా ఉండను అంటుంది. ఉదయాన్నే యోగా చేసుకోండి, వ్యాయామం చేయండి, వంట చేస్తూనో, ఇస్త్రీ చేస్తూనో, బట్టలు కుడుతూనో, బుట్టలల్లుతూనో, వస్త్రాలు నేస్తూనో... ఎవరి వ్యాపకాల్ని వారు కొనసాగిస్తూ ఉండండి. మొత్తం ప్రపంచాన్ని నీ శ్రవణేంద్రియాలద్వారా మనో ఫలకాలపై ముద్రిస్తాను అంటుంది ఆకాశవాణి. ఎడ్లబండికి రేడియో కట్టండి, కారులో రేడియో పెట్టండి.. మీ పనిలో మీరు మీ కోసమే ఆకాశవాణి పనిలో ఆకాశవాణి. అందుకే ఆకాశవాణి లక్ష్యమూ, లక్షణమూ 'బహుజన హితాయ – బహుజన సుఖాయ'.

టెక్నాలజీ పుణ్యమా అని ఇపుడు ప్రతియింటా కాదు ప్రతి జేబులో, ప్రతి హ్యాండ్ బ్యాగ్‌లో ఆకాశవాణి సిద్ధంగా వుంది. యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. ఆకాశవాణి వినటం అంటే అమ్మ మాట వినటమే. ఆకాశవాణి మన భారతీయ సమష్టి కుటుంబ ఆస్తి. నిరుపేదలకైనా, ఆగర్భ శ్రీమంతులకైనా అంతే అందుబాటులో ఉన్న ప్రజాప్రసార సాధనం.

◆ మడిపల్లి దక్షిణామూర్తి
ఆకాశవాణిలో సుదీర్ఘకాలం పనిచేసిన వ్యాఖ్యాత

(నేడు జాతీయ ప్రసార దినోత్సవం)



ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. తెలంగాణాలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కట్టలేరు, వైరా వాగుల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువ నుంచి 9,631 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. వజినేపల్లి 56, పాలేరు 75, కీసర నుంచి 9,497 క్యూసెక్కుల నీరు వస్తోంది. బ్యారేజీ 12 గేట్లను అడుగు మేర ఎత్తి 8,700 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీటి నుంచి కేఈబీకి 602, రైవస్ 602, కేఈ మెయిన్ 1,204, కేడబ్ల్యూ 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఏలూరు కాల్వకు నీటి విడుదలను నిలుపుదల చేశారు. అక్కడి అధికారుల నుంచి ఎలాంటి ప్రతిపాదనలు లేనందున ఆ కాల్వకు నీటి విడుదలను ఆపేశామని అధికారులు చెబుతున్నారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం 11.9 అడుగుల వరకు నీటిమట్టం ఉంది.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

అదే ఉధృతి

- ప్రకాశం బ్యారేజీ వద్దకు భారీగా వరద నీరు
- ఎగువ నుంచి 9,631 క్యూసెక్కులు రాక



రైల్వే కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్)లో అవినీతి వ్యవహారాలు బయటపడుతున్నాయి. అర్హతలను, నిబంధనలను తుంగలో తొక్కి, ఇబ్బడిముబ్బడిగా రుణాలు ఇవ్వటంతో పాటు ప్రైవేట్ వ్యక్తుల మాయలు వెలుగులోకి వస్తున్నాయి. గత పాలకవర్గంలో జరిగిన ఈ ఆర్థిక అరాచకాలపై కొత్తగా బాధ్యతలను చేపట్టిన దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ) దృష్టిపెట్టింది. అవినీతి వ్యవహారాలపై అధ్యయనం చేసిన మీదట ఆడిట్‌కు ఆదేశించింది.

రైల్వే సీసీఎస్‌లో దారుణాలు

గత పాలకవర్గంలో నిబంధనలకు విరుద్ధంగా రుణాలు

- రూ.కోట్లలో రికవరీ కాని సొత్తు.. స్టేక్ హోల్డర్స్‌కు నష్టాలు
- సొసైటీ కార్యకలాపాలపై ఆడిటింగ్‌కు ఆదేశించిన ఎస్‌సీఆర్ఎంయూ
- పెచ్చుమీరుతున్న ప్రైవేట్ వ్యక్తులు, కాల్‌మనీ బ్యాచ్ దురాగతాలు
- దొంగ పే స్లిప్పులు తయారు చేయించి ఇస్తున్న ముఠా



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రైల్వే కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ (సీసీఎస్)లో అర్హతలు, నిబంధనలకు విరుద్ధంగా భారీ ఎత్తున రుణాలు ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇవ్వటం వల్ల సీసీఎస్ స్టేక్ హోల్డర్స్‌పై భారం పడినట్టు సమాచారం. రైల్వే సీసీఎస్‌లో సభ్యులు రెండోసారి రుణాలు తీసుకునే విషయంలో ఉన్న నిబంధనలను కాలరాసి ఎడాపెడా మంజూరు చేసేశారు. ఫలితంగా రికవరీ తగ్గింది. కోట్ల రూపాయల మేర చెల్లింపులు ఆగిపోవడం వల్ల సొసైటీ స్టేక్ హోల్డర్స్‌పై అంతులేని భారం పడింది. సొసైటీకి తీవ్ర నష్టం వాటిల్లింది. గత పాలకవర్గ నిబంధనలకు పాతరేయటం వల్ల ప్రైవేట్ వ్యక్తులు రైల్వే సీసీఎస్‌ను అడ్డాగా చేసుకుని వ్యాపారాలు ప్రారంభించారు.

నిబంధనలు తోసిపుచ్చి..

రైల్వే సొసైటీ ద్వారా సభ్యులైన ఉద్యోగులు రకరకాల రుణాలు తీసుకుంటారు. ఒక్కోసారి ఒకటికి మించి మూడు, నాలుగు రుణాలు కూడా తీసుకుంటారు. ఇన్ని రుణాలు తీసుకున్నాక మళ్లీ కొత్తగా రుణం కావాలంటే.. జీతంలో 30 శాతం నెట్ పేమెంట్ ఉండాలి. అంత శాతం లేకపోతే ఆ ఉద్యోగి కొత్త రుణాన్ని తీర్చలేడు. కానీ, కిందటి పాలకవర్గంలో ఈ నిబంధనలను కాలరాశారు. ఈ కారణంగా ప్రైవేట్ వ్యక్తులు సీసీఎస్‌లోకి ప్రవేశించారు. ఉద్యోగులకు దొంగ పే స్లిప్పులు తయారుచేసి ఇచ్చే ముఠా ఇక్కడ పాగా వేసింది. ఈ ముఠా ఇచ్చిన దొంగ పే స్లిప్పుల ఆధారంగా జీతం ఎక్కువ చూపించి రుణాలు పొందిన వారున్నారు. అంతేకాదు.. సీసీఎస్‌ను అడ్డాగా చేసుకుని కాల్‌మనీ బ్యాచ్ కూడా రంగంలోకి దిగింది. కొత్త రుణం పొందాలంటే జీతంలో నెట్ పేమెంట్ 30 శాతం ఉండాలనే నిబంధనను అలుసుగా తీసుకుంది. పాత రుణాన్ని కాల్‌మనీ బ్యాచ్ తీర్చి, ఆ ఉద్యోగి నెట్ పేమెంట్ 30 శాతానికి అర్హత లభించేలా చేస్తుంది. దీంతో ఆ ఉద్యోగి కొత్త రుణం తీసుకునే అవకాశం లభిస్తుంది. దీనికి ప్రతిగా కాల్‌మనీ బ్యాచ్ రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు ఉద్యోగుల నుంచి వసూలు చేస్తుంది. సీసీఎస్ రుణం రావటానికి సహకరించినందుకు.. కాల్‌మనీ బ్యాచ్ ఒక్క రోజులోనే అనధికార వడ్డీ రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు సంపాదిస్తుంది. రైల్వే సీసీఎస్‌లో డజన్లకొద్దీ కాల్‌మనీ బ్యాచ్ తిష్టవేయటంతో సొసైటీలో ఆర్థిక అరాచకం పెరిగిపోయింది. దీనికి తోడు సొసైటీలోని కొంతమంది సిబ్బంది కూడా అవినీతి కార్యక్రమాల్లో భాగస్వాములుగా మారారు. గత పాలకవర్గం చెప్పినట్టుగా నడుచుకుని వ్యవస్థను భ్రష్టు పట్టించారు. దక్షిణ మధ్య రైల్వేలో ప్రతి డివిజన్ స్థాయిలోనూ సీసీఎస్ బ్రాంచ్ ఆఫీసులుంటాయి. విజయవాడ డివిజన్ పరిధిలో ఉన్న బ్రాంచ్ ఆఫీసులో రుణానికి అనుమతి ఇవ్వాలి. విజయవాడ బ్రాంచ్ ఆఫీసుతో సంబంధం లేకుండా జోన్ హెడ్డాఫీసులో అనుమతులు ఇచ్చేవారు.

ఆడిట్ చేయించాలని నిర్ణయం

గత పాలకవర్గంలో చేసిన ఈ పనులతో సొసైటీకి కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. ఈ క్రమంలో సొసైటీ ఎన్నికలు జరగటంతో స్టేక్ హోల్డర్స్.. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (ఎస్‌సీఆర్ఎంయూ)ను గెలిపించారు. ప్రస్తుతం భారీ ఎత్తున అవినీతి వ్యవహారాలు వెలుగులోకి రావటంతో కొత్త పాలకవర్గం ఆడిటింగ్ చేయించాలని నిర్ణయించింది. ఇదే సందర్భంలో అర్హత ప్రకారం రుణా లిచ్చేందుకు చర్యలు చేపట్టగా, తమకు రుణాలు రావటం లేదని ఉద్యోగుల నుంచి వ్యతిరేకత వస్తోంది. పాత పద్ధతిలో చేస్తే సొసైటీ దివాళా తీస్తుందని, భవిష్యత్తులో స్టేక్ హోల్డర్స్, ఉద్యోగులకు తీరని నష్టం జరగుతుందన్న ఆలోచనలతో నిబంధనలను అమలు చేస్తున్నారు. రిపోర్టు వచ్చాక దిద్దుబాటు చర్యలు తీసుకోనున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో జంప్ జిలానీలు!



గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో గత ఐదేళ్లలో జరిగిన అక్రమాల్లో భాగస్వాములుగా ఉన్న అధికారులు ఇక్కడి నుంచి చెక్కేసే పనిలో ఉన్నారు. గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలోని పలువురు ఉద్యోగులు ఇతర శాఖలకు వెళ్లిపోవడానికి క్యూ కడుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లో చోటుచేసుకున్న భారీ కుంభకోణాలకు సంబంధించిన నివేదిక ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టికి వెళ్లటంతో.. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఉద్యోగులు వేరే శాఖలకు వెళ్లిపోయేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది వెళ్లిపోయారు. మరికొందరు ఈ రేస్‌లో ఉన్నారు.

వైసీపీ హయాంలో అక్రమాలకు సహకరించిన ఉద్యోగుల్లో టెన్షన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వేరే డిపార్ట్‌మెంట్‌కు వెళ్లాలంటే ఆయా డిపార్ట్‌మెంట్ల నుంచి లేఖలను తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయ ఉద్యోగులకు సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ), వైద్య, ఆరోగ్య సంస్థలు.. తమ శాఖల్లోకి రావటానికి వీలుగా లేఖలు ఇస్తున్నాయి. ప్రస్తుతం ఈఎన్‌సీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు ఈ శాఖల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. సర్వశిక్షా అభియాన్ నుంచి లేఖ తెచ్చుకున్న జేఈ ఖాదర్ ఫైలుకు ఈఎన్‌సీ ఆమోదముద్ర వేయటానికి రంగం సిద్ధం చేసినట్టుగా తెలుస్తోంది.

వైసీపీ వీరాభిమానిగా వ్యవహరించి..

ఖాదర్ గతంలో విజయవాడ సర్కిల్ కార్యాలయంలో ఏడేళ్లపాటు పనిచేశారు. ఆ తర్వాత బదిలీల్లో భాగంగా ఈఎన్‌సీ కార్యాలయానికి వచ్చారు. ఉద్యోగిగా పార్టీలకు అతీతంగా వ్యవహరించాలి. కానీ ఈయన మాత్రం తన స్వామి భక్తిని చూపించేవారు. వైసీపీకి వీరాభిమానిగా ఉండేవారు. ఆయన ఫేస్‌బుక్‌లలో వైసీపీ అనుకూల పోస్టులు, వాట్సాప్ గ్రూప్‌లలో ఆయన పెట్టిన జగన్ వీరభక్త పోస్టులు ఇప్పటికే బయటకు వచ్చి హల్‌చల్ చేశాయి. ఈ ఉద్యోగిని వేరే డిపార్ట్‌మెంట్‌కు మార్చేందుకు రంగం సిద్ధం చేయటం వెనుక కూడా భారీ ఎత్తున ముడుపులపర్వం నడిచిందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ కారణంగానే.. జేఈ ఖాదర్ ఫైల్ ఆగమేఘాలపై కదిలింది. ఖాదర్‌తో పాటు మరికొందరి ఫైల్స్ కూడా క్యూలో ఉన్నాయి. మరికొద్ది రోజుల్లో ఉన్నతాధికారి పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో గుట్టుగా పని కానిచ్చేసే కార్యక్రమం చేపట్టారు.

- ఇతర డిపార్ట్‌మెంట్లకు వెళ్లేందుకు క్యూ
- అడ్డగోలుగా పంపేందుకు ఈఎన్‌సీ కార్యాలయంలో ఆర్డర్లు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 50 ఏఈలకుగానూ 20 పోస్టులు ఖాళీ
- ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చేలా ఈఎన్‌సీ అధికారుల వ్యవహారం

ముడుపులకు వెనకాడకుండా..

ఎంత డబ్బు ఖర్చు పెట్టి అయినా సరే వేరే డిపార్ట్‌మెంట్‌లోకి వెళ్లిపోయేందుకు సన్నద్ధమౌతున్నారు. ఒకపక్క ఆర్‌డబ్ల్యూఎస్‌లో పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. మంజూరైన పోస్టుల కంటే ఖాళీ పోస్టులు ఎక్కువగా ఉన్నాయి. ఉన్న ఉద్యోగులపై పనిభారం పడుతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

ఇక్కడి గ్రామీణ నీటి సరఫరా విభాగంలో సర్కిల్ ఆఫీసు, డివిజినల్ ఆఫీసులు కలిపి మొత్తం 50 ఏఈ పోస్టులు ఉండగా.. 30 మంది మాత్రమే ఫీల్డ్ ఆఫీసుల్లో పనిచేస్తున్నారు. మరో 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక్క ఉమ్మడి కృష్ణాజిల్లాలోనే 20 ఖాళీలు ఉంటే, మిగిలిన చోట్ల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాల్సిందే. సొంత శాఖలో భారీస్థాయిలో ఖాళీలు ఉండగా, వేరే శాఖలకు ఉన్న వారిని పంపించాల్సిన అవసరం ఏమొచ్చిందన్నది ఉన్నతాధికారులకే ఎరుక.

ఎవరికీ పట్టని గ్రంథాలయాలు



పాఠశాలల్లో అకడమిక్ గ్రంథాలయాల ఊసేదీ..?

విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాల కొరత

- చాలాచోట్ల తలుపులు తెరుచుకోని లైబ్రరీలు
- భర్తీకాని లైబ్రేరియన్ల పోస్టులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : విద్యార్థులకు గ్రంథాలయాలను దగ్గర చేయాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో ఏర్పాటుచేసిన అకడమిక్ గ్రంథాలయాలు మౌనవ్రతం చేస్తున్నాయి. వీటి తలుపులు తెరుచుకోవడమే గగనంగా మారింది.

విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాలనే సదుద్దేశంతో పాఠశాలల్లో ఏర్పాటుచేసిన అకడమిక్ గ్రంథాలయాలు అక్కరకు రాకుండా పోతున్నాయి. విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు లేకపోవడం ఓ కారణమైతే, లైబ్రేరియన్ల నియామకాలు జరగకపోవడం మరో కారణంగా

టైం టేబుల్ ప్రకారం..

జిల్లా పరిషత్ పాఠశాలల్లో అకడమిక్ గ్రంథాలయాలను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. వాటిని నిర్వహించడానికి ప్రత్యేకంగా ఒక లైబ్రేరియన్‌ను నియమించారు. అయితే, తరగతి గదుల్లో ఉండే పాఠ్యపుస్తకాలకు సంబంధం లేని పుస్తకాలను ఈ గ్రంథాలయాల్లో ఉంచారు. బాలల కథలు, ప్రముఖ రచయితలు రాసిన పుస్తకాలు, దేశంలోని ప్రముఖ నేతల బయోగ్రఫీ, తెలుగు సాహిత్యం, సైన్స్ ఫిక్షన్, చారిత్రక ఘట్టాలకు సంబంధించిన పుస్తకాలను అకడమిక్ లైబ్రరీకి సమకూర్చారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 30-40 జిల్లా పరిషత్ పాఠశాలల్లో అకడమిక్ గ్రంథాలయాలు కొలువుదీరాయి. ఈ పుస్తకాలను విద్యార్థులతో చదివించడానికి ప్రత్యేకంగా ఒక పీరియడ్‌ను టైం టేబుల్‌లో పొందుపరిచారు. వారంలో ఒక పీరియడ్‌ను గ్రంథాలయ పఠనం కోసం కేటాయిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్నం నుంచి ఆఖరి పీరియడ్ (ఎనిమిదో పీరియడ్)ను గ్రంథాలయాల్లో పఠనం కోసం ఇస్తున్నారు. మరికొన్ని పాఠశాలల్లో ఆరు, ఏడు పీరియడ్లలో ఏదో ఒకదాన్ని కేటాయించేవారు. ఈ గ్రంథాలయాలను నిర్వహించడానికి ఒక లైబ్రేరియన్‌ను జిల్లా పరిషత్ నియమించింది. కొన్ని పాఠశాలల్లో ఇన్‌చార్జులను నియమించింది.

చెదలు పడుతున్న పుస్తకాలు

పాఠశాలల్లో ఉన్న అకడమిక్ గ్రంథాలయాల్లో లైబ్రేరియన్ల కొరత ఉంది. వాస్తవానికి ఈ గ్రంథాలయాలకు గ్రంథాలయ సంస్థ నుంచి లైబ్రేరియన్లను ఇవ్వాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గ్రంథాలయ సంస్థ ఆధీనంలో నిర్వహించే గ్రంథాలయాల్లోనే సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నందున అకడమిక్ గ్రంథాలయాలను పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది. కొన్ని పాఠశాలల్లో లైబ్రేరియన్ లేకపోయినప్పటికీ ఉపాధ్యాయుల్లో ఎవరో ఒకరికి ఆ బాధ్యతలను అప్పగిస్తున్నారు. ఈ బాధ్యతలను స్వీకరించడానికి ఉపాధ్యాయులు ముందుకురాని పరిస్థితి. ఫలితంగా అందులో ఉన్న పుస్తకాలు పాడైపోతున్నాయి. ఎలుకలు కొరికేస్తున్నాయి. కొన్నిచోట్ల చెదలు పడుతున్నాయి. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి ఉపయోగపడే పుస్తకాలు ఎందుకూ పనికిరాకుండా మిగిలిపోతున్నాయి.

ప్రత్యేక పిరియడ్ ద్వారా నడిపిస్తున్నాం..

అకడమిక్ గ్రంథాలయాలు జిల్లా పరిషత్ పాఠశాలల్లో మాత్రమే ఉంటాయి. ఇక్కడ వివిధ రకాల పుస్తకాలు ఉంటాయి. వాటిని విద్యార్థులతో చదివించడానికి వారంలో ఒక పీరియడ్ ఉంటుంది. ఎనిమిదో పీరియడ్‌ను లైబ్రరీ పీరియడ్‌గా ఇస్తారు. కొన్నిచోట్ల లైబ్రేరియన్లు ఉన్నారు. లేనిచోట్ల మాత్రం ఉపాధ్యాయుడు నిర్వహిస్తున్నాడు. - సుబ్బారావు, జిల్లా విద్యాశాఖాధికారి

ఉన్నట్టా.. లేనట్టా..!?


మచిలీపట్నం ఎంఈవో కార్యాలయం

గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఎంఈవో-2 పోస్టులను రద్దు చేస్తారా? లేక కొనసాగిస్తారా? అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని 49 మండలాలతో పాటు విజయవాడ రూరల్‌లోని ప్రాంతాలను కలుపుకొని గతేడాది అక్టోబరులో మొత్తం 53 మందిని ఎంఈవో-2లుగా నియమించారు. సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో-2లుగా అవకాశం కల్పించారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఈ పోస్టులను ఆయా మండలాల్లో భర్తీ చేశారు. వైసీపీ హయాంలో పంచాయతీరాజ్ విభాగంలో పనిచేసే సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో -2లుగా పదోన్నతులు ఇచ్చారు. కానీ, ఎంఈవో-1ల మాదిరిగా అధికారాలు మాత్రం ఇవ్వలేదు. దీంతో వారు ఏ పనీ చేయడానికి వీల్లేకుండా పరిస్థితి మారింది. పోస్టులైనా తీసేయాలని లేదా ఇద్దరికీ సమాన పని కేటాయించాలనే డిమాండ్ వస్తోంది.

ఎంఈవో-2 పోస్టుల కొనసాగింపుపై సందిగ్ధత

- ఎంఈవో-1లకు పూర్తిస్థాయి అధికారాలు
- ఎంఈవో-2లకు నామమాత్రపు విధులు
- ఇద్దరికీ సమానంగా అధికారాలు ఇవ్వాలని డిమాండ్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : పాఠశాలలను తనిఖీ చేయడం, టీచర్ల జీతభత్యాలకు సంబంధించిన బిల్లులను మంజూరు చేయడం, టీచర్లకు శిక్షణా తరగతులు నిర్వహించడం, స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహించడం, నూతన పాఠశాలలకు గుర్తింపు ఇవ్వడం, పాఠశాలలను అప్‌గ్రేడ్ కోసం వివరాలు డీఈవో కార్యాలయానికి పంపడం, టీచర్ల కొరతపై నివేదికలు ఇవ్వడం, టీచర్ల బదిలీలు, సర్వీస్ మేటర్‌లను పర్యవేక్షణ చేయడం, టీచర్లకు సెలవులు మంజూరు చేయడం తదితర అంశాలన్నీ ఎంఈవో-1లకు అప్పగించారు.

- ఎంఈవో-2లకు.. పాఠశాలలను సంసిద్ధత చేయడం, పిల్లల హాజరును పరిశీలించడం, బడిబయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం, ప్రత్యేక అవసరాలతో కూడిన వృత్తివిద్యను అందించడం, విద్యార్థుల హాజరును నమోదుచేసి, యూడైస్‌కు వివరాలు పంపడం, ఎన్‌సీసీ, సైన్స్ ఎగ్జిబిషన్‌ల నిర్వహణ వంటి పనులను అప్పగించారు. పరిపాలనాపరంగా పూర్తి అధికారాలు ఎంఈవో-1లకు అప్పగించి, ఎంఈవోలకు-2లకు మాత్రం నామమాత్రపు విధులు నిర్వహించాలని చెప్పడం గమనార్హం. ఎంఈవో-2లు తమ విధులపట్ల అసంతృప్తిగానే ఉన్నారు. ఇదే అదనుగా కొందరు కార్యాలయానికి వచ్చి కూర్చుని వెళ్లిపోతున్నారు. ఎంఈవో-2 పోస్టులను తెరపైకి తెచ్చిన సమయంలో రాష్ట్ర ఆర్థికశాఖ ఈ అంశంపై అభ్యంతరాలను వ్యక్తంచేసినా గత పాలకులు పట్టించుకోలేదని టీచర్లు అంటున్నారు. ఫలితంగా అధికారాలు అస్తవ్యస్తంగా మారాయి.

ఇద్దరికీ సమానంగా అధికారాలు ఇవ్వాలంటూ...

మండలస్థాయిలో ఎంఈవో-1, 2 పోస్టులను ఇచ్చిన నేపథ్యంలో ఒక్కో మండలాన్ని రెండుగా విభజించి, అందులోని పాఠశాలలను సమంగా విడగొట్టి ఇద్దరు ఎంఈవోలకు పూర్తిస్థాయి అధికారాలు, విధులు కేటాయించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు గతంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంఈవో-2 వ్యవస్థను బలోపేతం చేయాలని కూడా ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. ఇద్దరు ఎంఈవోలు ఒకే కార్యాలయంలో పనిచేస్తున్నారని, ఒకరికి పూర్తిస్థాయి అధికారాలు ఇచ్చి, మరో ఎంఈవోకు నామమాత్రపు పనులు చేయమంటున్నారని, దీంతో ఎంఈవో-2లు ఏ పనీ చేయలేక చేష్టలుడిగి చూసే స్థితిలో ఉన్నారని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు చేసిన సూచనలను గత ప్రభుత్వ పెద్దలు పక్కనపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎంఈవో-2 పోస్టులను రద్దు చేయాలని లేదా ఇద్దరికీ సమానంగా అధికారాలు కేటాయించాలని కోరుతూ పలువురు ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇటీవల మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వివరించారు. ఈ అంశంపై ప్రభుత్వం రానున్న రోజుల్లో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై ఉపాధ్యాయులు, ఎంఈవోలు ఎదురుచూస్తున్నారు.

లబ్ధిదారులందరికీ టిడ్కో ఇళ్లు

- అన్ని వసతులతో పూర్తిస్థాయిలో అందిస్తాం
- గృహ నిర్మాణాల్లో అక్రమాలపై విచారణ జరిపిస్తున్నాం

అధికారులతో మంత్రి సారథి సమీక్ష

6లో..

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లావాసులకు కలెక్టర్ సృజన పిలుపు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

తక్కువ పెట్టుబడి.. అధిక లాభం

» ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలి : కలెక్టర్ బాలాజీ

పామర్రు, జూలై 22 : సంప్రదాయ సాగు నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు నడిపించే ప్రయత్నంలో భాగంగా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే ఆయిల్ పామ్ సాగు పట్ల రైతులకు అవగాహన కల్పించి పోత్సహించాల్సిన బాధ్యత వ్యవసాయ, ఉద్యాన అధికారులు తీసుకోవాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో సోమవారం జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్‌సాగు పట్ల ఉద్యాన, వ్యవసాయ సహాయక సిబ్బందికి జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయిల్ పామ్‌సాగుతో తక్కువ పెట్టుబడి, అధిక లాభాలు ఆర్జించేందుకు ఎక్కువ అవకాశముందన్నారు. పంట కాపు తరువాత ఏడాదిలో ఎకరానికి రూ.లక్ష మేర లాభం వస్తుందన్నారు. రైతులు సంప్రదాయ పంటలకు బదులు అధిక లాభాలు అందించే ప్రత్యామ్నాయ పంటల సాగు పట్ల మక్కువ చూపాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుచేసే రైతులకు నూరుశాతం రాయితీపై హెక్టారుకు రూ.29వేలు విలువగల 143 ఆయిల్ మొక్కలను రాష్ట్రప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. దీంతోపాటు సాగును మరింతగా పోత్సహించేందుకు పెద్దఎత్తున రాయితీలను కల్పిస్తుందన్నారు. ఈ పంట దిగుబడిని మార్కెటింగ్ చేయడం ఎంతో సులభమని, ముందస్తుగానే ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు వచ్చి నిర్ణీత మద్దతు ధరకు కొనుగోలు చేస్తాయని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలు, అధిక వర్షాల వల్ల ఆయిల్ పంట సాగుకు ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశంలేదని, కూలీల అవసరం చాల తక్కువగా ఉంటుందని రైతులు గ్రహించాలన్నారు. పంట మార్పిడి విధానాన్ని రైతులు స్వాగతించి రాష్ట్ర, కేంద్రప్రభుత్వం అందించే ప్రోత్సాహకలను సద్వినియోగ పరచుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు పీడీ విజయలక్ష్మి, పతంజలి ఫుడ్స్, 3పిఎఫ్ కంపెనీల ప్రతినిధులు, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, పామర్రు ఉద్యాన శాఖ ఎవో కీర్తి, పమిడిముక్కల, పెదపారుపూడి, మొవ్వ, తోట్లవల్లూరు ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ ఇన్‌చార్జి రెక్టార్‌గా బసవేశ్వరరావు



వీసీ నుంచి నియామక పత్రం అందుకుంటూ..

మచిలీపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాయూనివర్సిటీ ఇన్‌చార్జి రెక్టార్‌గా ఎంవీ బసవేశ్వరరావును నియమిస్తూ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆర్.శ్రీనివాసరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బసవేశ్వరరావుకు వీసీ, రిజిస్ట్రార్ శోభన్‌బాబు ఉత్తర్వులను వీసీ ఛాంబరులో అందజేశారు. రెక్టార్‌గా నియమితులైన ఆయనను ప్రొఫెసర్లు వైకే సుందరకృష్ణ, చెరుకూరి జయశంకరప్రసాద్ తదితరులు అభినందించారు.

సెల్‌ఫోన్ సర్వీసింగ్, ఫోటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

ఉంగుటూరు, జూలై 22 : ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణంలోని యూనియన్‌బ్యాంక్ గ్రామీణ స్వయంఉపాధి శిక్షణా సంస్థ(యూబీఆర్ఎస్ఈటీఐ)లో ఈనెల 29నుంచి ఆగస్టు 27వతేదీ వరకు(30రోజులు)సెల్‌ఫోన్ సర్వీసింగ్, ఫోటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ కోర్సుల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాల్లోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్టు శిక్షణాకేంద్రం డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెల్లరేషన్‌కార్డు కలిగి, 18నుంచి 45సం.ల మధ్య వయసు, తెలుగులో చదవడం, రాయడం వచ్చిన కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని గ్రామీణప్రాంతాల యువకులు ఈకోర్సులు నేర్చుకునేందుకు అర్హులన్నారు. శిక్షణాకాలంలో అభ్యర్థులకు భోజన, వసతి సదుపాయాలు, శిక్షణానంతరం సర్టిఫికెట్లు, కోర్సులకు సంబంధించిన మెటీరియల్ ఉచితంగా అందిస్తామని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు రేషన్, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతోపాటు, నాలుగు పాస్‌పోర్ట్‌సైజ్ ఫోటోలతో నేరుగా శిక్షణాకేంద్రానికి విచ్చేసి పేర్లను నమోదుచేసుకోవాలని సూచించారు. వివరాలకు 9951920120, 6304254730, 6302171225 నెంబర్లలో సంప్రదించాలని సంస్థ డైరెక్టర్ పేర్కొన్నారు.

25న కృష్ణా అండర్-7 చెస్ ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్, జూలై 22 : నగరంలోని కానూరు గాంధీ బొమ్మ సెంటర్‌లో ది ఐ ప్లే స్కూల్లో కృష్ణా జిల్లా అండర్-7 బాలబాలికలకు చెస్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎన్ఎం ఫణికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలు 24వ తేదీ సాయంత్రం 6 గంటల్లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 9700775220, 9391279088 నెంబర్లలో సంప్రదించాలన్నారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారిని ఆగస్టు 3, 4వ తేదీల్లో విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు.

విద్యార్థినులకు ఉద్యోగ అవకాశాలపై చర్యలేంటీ!

» పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్నించిన ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ఉన్నతవిద్యను అభ్యసించే విద్యార్థినుల సంఖ్య దేశవ్యాప్తంగా ఎంతమేర పెరిగింది, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి సోమవారం పార్లమెంటు సమావేశాల్లో ప్రశ్నించారు. ఉన్నత విద్యను అభ్యసించి విద్యార్థినులకు ఎంతమేర ఉద్యోగ అవకాశాలు కల్పించారనే అంశంపై రాష్ట్రాలవారీగా వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు. కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సుంకతా మంజుదార్ ఈ ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. 2014-15 సంవత్సరంలో ఉన్నతవిద్యను అభ్యసించే విద్యార్థినుల సంఖ్య 1.57కోట్లుగా ఉండగా, 2021-22నాటికి 30శాతం వృద్ధిచెంది 2.07 కోట్లకు పెరిగిందన్నారు. విద్యార్థినులకు ఉద్యోగాలకల్పన విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా ఉన్నతవిద్యను అభ్యసించే విద్యార్థినులకు పరిశ్రమలు, వ్యాపారం, చేతివృత్తులలో శిక్షణ ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్టు మంత్రి తెలిపారు.

డ్రైవర్ పోస్టుల దరఖాస్తుకు గడువు ఆగస్టు 10

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): యంత్రపు నావ, బోటు ద్వారా చేపల వేటపై టిండాల్ కం డ్రైవర్ పోస్టులకు ఆగస్టు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కాకినాడలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ ప్రిన్సిపాల్ టి.సుమలత తెలిపారు. దరఖాస్తుదారులు ఆగస్టు 23న కాకినాడ జగన్నాథపురంలోని కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆమె కోరారు.

24 నుంచి వెబ్ ఆప్షన్లు

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలో ఈ ఏడాది పాలిటెక్నిక్ కోర్సులకు మొదటి దశ ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ఈనెల24 నుంచి 26వరకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని వర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రారావు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన శాప్ వీసీ, ఎండీ జిలానీ

విజయవాడ స్పోర్ట్స్, జూలై 22 : రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా మంజీర్ జిలానీ సమూన్ సోమవారం ఐజీఎంసీలోని శాప్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన ఐఏఎస్‌ల్లో సాధారణ పరిపాలనశాఖ మంజీర్‌ను శాప్ వీసీ, ఎండీగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు శాప్ పరిపాలన అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.



లబ్ధిదారులందరికీ టిడ్కో ఇళ్లు

» అన్ని వసతులతో పూర్తిస్థాయిలో అందిస్తాం

» గృహ నిర్మాణాల్లో అక్రమాలపై విచారణ జరిపిస్తున్నాం

» జిల్లా అధికారులతో మంత్రి సారథి సమీక్ష



మచిలీపట్నం టౌన్, జూలై 22 : టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల మౌలిక వసరులు కల్పించి త్వరలో లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖామంత్రి కేపీ సారథి అన్నారు. ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సోమవారం రాత్రి జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు గృహాలు అందచేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉద్దేశపూర్వకంగా టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లకు కేవలం 6.8 లక్షల ఇళ్లు మాత్రమే వైసీపీ హయాంలో నిర్మించడం జరిగిందన్నారు. పేదలు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల ఇళ్లకు ఇచ్చిన నిధులను కూడా వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించిందన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు అన్ని వ్యవస్థలను చక్కబెట్టేందుకు కృషి చేస్తున్నారన్నారు. క్రైమ్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. బందరు పోర్టు నిర్మాణంతో కృష్ణా జిల్లా రూపురేఖలు మారిపోతాయన్నారు. ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌పై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణలోకి తీసుకుని పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతామన్నారు. మదనపల్లి సబ్ కలెక్టరేట్‌లో జరిగిన ఫైళ్ల దగ్ధంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి డీజీపీని పంపారన్నారు. పాత్రికేయుల అక్రిడిటేషన్లు, న్యాయబద్ధమైన కోర్కెలను సీఎంతో మాట్లాడి ఆమోదించేలా చేస్తామన్నారు. సమాచార శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ చేయని తీర్మానం వైసీపీ నాయకులు చేశారని, జీవితాంతం జగన్‌మోహనరెడ్డి పార్టీ అధ్యక్షుడిగా ఉండాలని పేర్కొనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రజలే తిరగబడి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకున్నారన్నారు. కార్యకర్తలు ఏవిధమైన దౌర్జన్యాలకు దిగవద్దని సీఎం చంద్రబాబు హితవు పలికారన్నారు. టీడీపీ నాయకులపై దౌర్జన్యాలు జరిపిన వారిపై చట్టమే చర్యలు తీసుకుంటుందన్నారు. తొలుత మంత్రి సారథి జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు, ఆర్డీవో ఎం.వాణి, హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణలతో చర్చలు జరిపారు. అనంతరం కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావులు మర్యాద పూర్వకంగా కలిశారు. అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి ఆరా తీశారు.

పారదర్శకంగా అర్జీల పరిష్కారం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన.. » ప్రజా సమస్యల పరిష్కారం ద్వారా 90 అర్జీలు



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 22 : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించడం ముఖ్యమని కలెక్టర్ జి.సృజన అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల డీఎం జి.వెంకటేశ్వర్లు, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇ.కిరణ్మయి, హౌసింగ్ పీడీ రజనీకుమారి తదితరులతో కలిసి కలెక్టర్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను పరిశీలించి గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. జిల్లాస్థాయి, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

పటిష్ట సమన్వయానికి ప్రత్యేక అధికారులు

అర్జీల స్వీకరణకు ముందు కలెక్టర్ సృజన వివిధ ప్రాధాన్య అంశాలపై మాట్లాడారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాల అమలులో మెరుగైన పురోగతిని చూపి జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు తీసుకొంటున్న చర్యల్లో భాగంగా మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్టు కలెక్టర్ తెలిపారు. వివిధ శాఖల అధికారులతో పటిష్ట సమన్వయంతో పనిచేసి పథకాలు, కార్యక్రమాల ద్వారా మంచి ఫలితాలు వచ్చేలా ప్రత్యేక అధికారులు కృషిచేయాల్సి వుంటుందన్నారు. తమకు కేటాయించిన మండలానికి సంబంధించిన మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది భాగస్వామ్యంతో పనిచేయాలన్నారు. అదేవిధంగా ప్రతి బుధవారం పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టళ్లు, పీహెచ్‌సీలు, రైతుభరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలను సందర్శించాలని, చెక్‌లిస్ట్ ప్రకారం తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలన్నారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు నరేగా, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా తదితర శాఖల క్షేత్రస్థాయి పనులను కూడా తనిఖీ చేయాలని కలెక్టర్ సృజన ప్రత్యేక అధికారులను ఆదేశించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి..

బాల్య వివాహాలను సమూలంగా నిర్మూలించడానికి ప్రజాభాగస్వామ్యంతో సమన్వయ శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు గ్రామస్థాయి నుంచి సమిష్టిగా పనిచేయాలన్నారు. దానిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తీసుకోవాలన్నారు. చట్టాలు సమర్థవంతంగా అమలయ్యేలా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమం, విద్య, వైద్య, ఆరోగ్యం, పోలీస్ తదితర శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అంటూ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు.



మీడియా సమావేశంలో నిందితులతో ఎస్ఐ సత్యనారాయణ

గంజాయి ముఠా అరెస్టు

ఇబ్రహీంపట్నం, జూలై 22 : ఒడిసా రాష్ట్రానికి చెందిన ముఖేష్, పర్బిన్ బిల్లుంగ్, సుభాశ్ లక్రాలు కొండపల్లిలోని ఐడీఏ వద్ద జన్మభూమి కాలనీలో ఇళ్లు అద్దెకు తీసుకొని గంజాయి సేవిస్తున్నారు. సోమవారం గంజాయిని ఇతరులకు విక్రయించేందుకు యత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిసా రాష్ట్రానికి చెందిన అలోక్బాగ్ వద్ద 2,300 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి డబ్బు కోసం ఇతరులకు విక్రయిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. 2 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

రమణారావు కోసం గాలింపు

గన్నవరం, జూలై 22 : నరసాపురం ఎంపీడీవో రమణారావు ఆచూకీ కోసం పోలీసులు ముమ్మర గాలింపు చేస్తున్నారు. డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో మండలంలోని కేసరపల్లి ఏలూరు కాలువ నుంచి బుద్ధవరం, అజ్జంపూడి, దావాజీగూడెం వరకూ కాలువకు రెండు వైపుల కాలినడకన పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఉంగుటూరు ఎస్సై రవిచంద్రతో పాటు పోలీస్ సిబ్బంది విస్తృతంగా గాలించారు.

కోర్టు కేసులతో అప్రమత్తం

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కోర్టు కేసుల్లో సకాలంలో కౌంటర్ ఫైళ్లు పంపడం, అప్పీలు దాఖలుచేసే అంశంలో అప్రమత్తంగా ఉండాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక(మీకోసం)కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత వివిధ విభాగాల్లో పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోర్టు కేసులకు సంబంధించి సరైన సమాధానం ఇవ్వని అధికారులు, సిబ్బందిని ఉపేక్షించేది లేదన్నారు. ఏదైనా కేసుల్లో మధ్యంతర ఉత్తర్వులు వస్తే వాటిని రికార్డు చేసుకోవాలన్నారు. అప్పీలు చేయాల్సివస్తే వెంటనే పూర్తి చేయాలన్నారు. వచ్చే సమావేశం నాటికి పెండింగ్ కేసులకు సంబంధించిన పూర్తి వివరాలతో రావాలని సూచించారు. ఉద్యోగుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. ప్రజలు ఇచ్చే అర్జీలపై అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు సమస్యలపై 112 అర్జీలను అందజేశారు. మంగళవారం నుంచి ప్రారంభిస్తున్న యోగా తరగతులకు ఉద్యోగులు హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖర్‌రావు, ఆర్డీవో ఎం.వాణి, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీపీవో నాగేశ్వరనాయక్, పౌరసరఫరాల సంస్థ డీఎం టి.సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొడాలి నాని పిఏపై దాడి.. తీవ్రగాయాలు





గుడివాడ, జూలై 22 : మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని పిఏ ఆచంట లక్ష్మీజీపై గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం దాడిచేశారు. సేకరించిన వివరాల ప్రకారం.. మచిలీపట్నంలో పౌరసరఫరాలశాఖలో విధులు పూర్తిచేసుకుని వస్తున్న లక్ష్మీజీపై స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని సీఎస్ఐ చర్చి వద్ద ఎనిమిది మంది గుర్తు తెలియని వ్యక్తులు ఒక్కసారిగా దాడి చేశారు. ఈ క్రమంలో తీవ్ర గాయాలపాలైన లక్ష్మీజీని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో వైసీపీ శ్రేణులు ఆసుపత్రి వద్ద భారీగా మోహరించారు. తలకు తీవ్ర గాయమవడంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం లక్ష్మీజీని విజయవాడ ఆసుపత్రికి తరలించారు.

జిల్లాలోని ఉన్నత పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్లస్-2 ఉన్నత పాఠశాలలుగా మార్చారు. రెండేళ్లుగా ఆ పాఠశాలల్లో ఆశించినంత ఫలితాలు రాలేదు. ప్రయోగశాలలు, అధ్యాపకులు లేకపోవడమే ఇందుకు కారణం. ఇప్పటికే ప్లస్-2 బాలికల జూనియర్ కళాశాలల్లో ఫలితాలు అంతంత మాత్రంగా ఉండగా, కొత్తగా 18 కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలు ప్రారంభించారు. ఈ కళాశాలల్లో పీజీ అర్హత గల అధ్యాపకులను నియమించలేదు. ఉన్నత పాఠశాలల్లో ప్రస్తుత ఉపాధ్యాయులే జూనియర్ కళాశాల తరగతులకు పాఠాలు చెబుతున్నారు. ఇది ఉపాధ్యాయులకు అదనపు భారమవుతోంది.



అదే బాటలో..

» ప్లస్ 2 పాఠశాలల దారిలోనే.. ప్లస్ 2 జూనియర్ బాలికల కళాశాలలు

» నూతనంగా ప్రారంభించిన 18 జూనియర్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత.. వసతుల లేమి

మచిలీపట్నం టౌన్ : గత విద్యా సంవత్సరంలో ప్లస్ 2 బాలికల జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 283 మంది పరీక్షలకు హాజరు కాగా 37 శాతంతో 106 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో 146 మందికి 33 శాతంతో 48 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. అదే రీతిలో జిల్లాలో ప్లస్ 2 జూనియర్ బాలికల కళాశాలలను ప్రారంభించారు. ఈ కళాశాలల్లో కో-ఎడ్యుకేషన్ కళాశాలలుగా విద్యార్థులను ఆకర్షించడం లేదు. జిల్లాలో 24 ప్లస్ 2 జూనియర్ బాలికల కళాశాలలుండగా 580 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఎంపీసీలో 192, బైపీసీలో 314, సీఈసీలో 73 మంది బాలికలు చదువుతున్నారు. కాగా కొన్ని కళాశాలల్లో ఒక్క విద్యార్థిని కూడా చేరకపోవడం ఆశ్చర్యం. పెదపారుపూడి కళాశాలలో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి కళాశాలలో ఏడుగురు, పమిడిముక్కలలో 9, కృత్తివెన్ను మండలం పోడులో 10, ఉయ్యూరు మండలం కాటూరులో 11, తోట్లవల్లూరు మండలం నార్త్‌వల్లూరులో 12, అవనిగడ్డలో 14, చల్లపల్లి మండలం పురిటిగడ్డలో 14 మంది విద్యార్థినులు చేరారు. ఈ కళాశాలల్లో గ్రాడ్యుయేషన్‌తో పాటు పీజీ అర్హత గల ఉపాధ్యాయులు ఉన్నారు. అయినప్పటికీ ఈ కళాశాలలు విద్యార్థులను ఆకర్షించలేకపోతున్నాయి.

కో-ఎడ్యుకేషన్ కళాశాలల్లోనూ అదే పరిస్థితి..

జిల్లాలో తాజాగా ఈ విద్యా సంవత్సరంలో 18 బాలుర కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. వీటిల్లో కేవలం 180 మంది విద్యార్థినీ విద్యార్థులు మాత్రమే అడ్మిషన్లు పొందారు. ఎంపీసీ 93, బైపీసీ 20, సీఈసీ 67 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ 18 కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలల్లో తలగడదీవి, చల్లపల్లి కళాశాలల్లో ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. కంకిపాడులో 4, బేతవోలులో 6, ఉంగుటూరులో 8, పెనమలూరులో 3, కానూరులో 6, వెంట్రప్రగడలో 9, వి.కొత్తపాలెంలో ఆరుగురు మాత్రమే చేరారు. ఈ కళాశాలల్లో ఇంకా పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించకపోవడం ఒక కారణం అయితే.. లేబరేటరీలు, వనరులు, తరగతి గదులు కల్పించలేదు. దీంతో విద్యార్థులు వారికి దగ్గరలోని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల్లో చేరిపోయారు. ప్రభుత్వం ఉన్నత పాఠశాలలకు అనుబంధంగా ఉన్న ప్లస్ 2 కళాశాలలను పటిష్టపరిస్తే గానీ ఆశించిన విధంగా అడ్మిషన్లు ఉండవు. దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించాలని విద్యావేత్తలు కోరుతున్నారు. చాలా కాలంగా చిన్నాపురంలో జూనియర్ కళాశాల స్థాపించేందుకు మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు ఉద్యమిస్తూనే ఉన్నారు.

ఉన్న అధ్యాపకులతోనే పాఠాలు చెబుతున్నాం

జి.ఉదయభానుకుమారి,
ప్రధానోపాధ్యాయురాలు, చిన్నాపురం

కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలల్లో పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయిస్తానంటోంది. 10వ తరగతిలో మా పాఠశాలలో 97 శాతం ఉత్తీర్ణత సాధించాం. ముందుగా 35 మంది విద్యార్థులు చేరతామన్నారు. ప్రస్తుతం 20 మంది విద్యార్థులున్నారు. పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులతోనే పాఠాలు చెప్పిస్తున్నాం. చిన్నాపురంలో జూనియర్ కళాశాల ఏర్పడటం వల్ల ఈ గ్రామ విద్యార్థులు మచిలీపట్నం వెళ్లకుండానే ఇక్కడ చదువుకునేందుకు అవకాశం ఏర్పడింది.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

» అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, జూలై 22 : ఈనెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరాల్లో అన్ని రకాల డాక్యుమెంట్ల, బయోమెట్రిక్, మొబైల్, అడ్రస్ మార్పుల వంటి అన్ని సేవలు అందుబాటులో వుంటాయని తెలిపారు. ఆయా మండల, మున్సిపాలిటీ పరిధిలో క్యాంపులు ఎక్కడ నిర్వహించేది ఇప్పటికే ఆయా ప్రదేశాలను ప్రజలకు తెలియజేయడం జరిగిందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దగ్గరలోని ప్రత్యేక ఆధార్ శిబిరానికి వెళ్లి సేవలను వినియోగించుకోవాల్సిందిగా ఆమె తెలిపారు. ఎ.కొండూరు-2, జి.కొండూరు-2, గంపలగూడెం-2, ఇబ్రహీంపట్నం-3, జగ్గయ్యపేట అర్బన్-3, జగ్గయ్యపేట రూరల్-1, కొండపల్లి-1, మైలవరం-2, నందిగామ-1, నందిగామ అర్బన్-1, పెనుగంచిప్రోలు-2, రెడ్డిగూడెం-1, తిరువూరు-2, తిరువూరు అర్బన్-1, వత్సవాయి-1, వీరులపాడు-2, విజయవాడ రూరల్-4, విజయవాడ అర్బన్-25, విస్సన్నపేట-1 కిట్లు పనిచేస్తాయన్నారు.

పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ వారం రోజులపాటు నిర్వహణ

విజయవాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జాతీయ విద్యావిధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం నుంచి వారం రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మొదటి రోజున టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం)తో బోధన, అభ్యాసన సామగ్రిని తయారు చేసి ప్రదర్శించారు. మంగళవారం పునాది అభ్యాసన, సంఖ్యాశాస్త్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన క్రీడాదినోత్సవం, 25న సాంస్కృతిక దినోత్సవం, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం నిర్వహిస్తారు. 27న పోషణ దినోత్సవం జరుపుతారు. 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవాన్ని నిర్వహిస్తారు. సోమవారం నుంచి ప్రారంభమైన కార్యక్రమాలను ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు పరిశీలించారు.

కృష్ణా జిల్లాలో..

మచిలీపట్నం టౌన్ : ఈనెల 28వరకు పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కృష్ణా జిల్లా డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. 22న బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శన నిర్వహించాలని, పాఠశాలకు సెలవు ఇవ్వడం మరో రోజు నిర్వహించవచ్చన్నారు. 23న 1వ తరగతి నుంచి భాషాభ్యాసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సంఖ్యాశాస్త్రం, నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. 24న క్రీడల పోటీలు, 25న విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం కల్పించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు, పాటలు, ఫ్యాన్సీ డ్రస్ పోటీలు, 26న డిజిటల్ కార్యక్రమాలు అమలయ్యే నూతన నైపుణ్యాలను పెంపొందించాలన్నారు. 27న పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలన్నారు. కనీసం 35 మొక్కలు తల్లులతో కలిసి విద్యార్థులు నాటించే కార్యక్రమం చేపట్టాలన్నారు. 28న తల్లిదండ్రుల కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలన్నారు. వీటిపై డిప్యూటీ ఈవో, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.



వసతిగృహంలో విచారణ చేస్తున్న ఒన్‌టౌన్ సీఐ

వసతి గృహంలో విద్యార్థిని అదృశ్యం

గుడివాడ, జూలై 22 : స్థానిక లింగవరం రోడ్డులోని ఎస్సీ బాలికల వసతి గృహం నుంచి ఇంటర్ రెండోసంవత్సరం విద్యార్థిని అదృశ్యం కావడం సంచలనం రేకెత్తించింది. వార్డెన్ ఫిర్యాదు మేరకు ఒన్‌టౌన్ సీఐ ఎల్.రమేశ్ విచారణ చేపట్టారు. స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ విద్యార్థిని ఆదివారం అర్ధరాత్రి 12గంటల సమయంలో వాష్‌రూమ్ అని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, దీంతో వార్డెన్ ఫిర్యాదు మేరకు సీఐ విచారణ చేపట్టారు.

పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్

వసతిగృహం నుంచి విద్యార్థిని అదృశ్యంపై పూర్తిస్థాయి విచారణ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నైట్ వాచ్‌మెన్ బాధ్యతారాహిత్యం కారణంగానే విద్యార్థిని అదృశ్యమైందని ఆరోపించారు. అధికారులు దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థిని ఆచూకీని వేగవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం వసతిగృహాన్ని సందర్శించి వార్డెన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కన్వీనర్ సాధిక్, నాయకులు పాల్గొన్నారు.



గోవులను తరలిస్తున్న డీసీఎం లారీ

అక్రమంగా తరలిస్తున్న గోవులు స్వాధీనం

నందిగామ రూరల్, జూలై 22 : నందిగామ పట్టణ సమీపంలోని అంబారుపేట వై జంక్షన్ వద్ద అక్రమంగా కబేళాకు తరలిస్తున్న గోవులను నందిగామ హైవే పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సేకరించిన సమాచారం మేరకు.. ఆదివారం అర్ధరాత్రి ఆగిరిపల్లి నుంచి హైదరాబాద్ కబేళాకు రెండు డీసీఎం లారీల్లో తరలిస్తున్న 30 గోవులను పోలీసులు పట్టుకున్నారు. వాటిని పల్లగిరి గ్రామ సమీపంలోని గోసంరక్షణ కేంద్రాలకు తరలించారు. లారీలను స్వాధీనం చేసుకుని డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.20

ముగిసిన గురుపౌర్ణమి వేడుకలు



భవానీపురం, జూలై 22 : హెచ్‌బీ కాలనీ సంకల్ప సిద్ధి షిర్డీసాయిబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బాబాను కన్నులపండుగగా అలంకరించి, ప్రత్యేక హారతులిచ్చారు. భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం స్వీకరించారు.

ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్



అర్జీలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్

చిట్టినగర్, జూలై 22: ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు.

నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా ఇన్‌చార్జి కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 14 అర్జీలు వచ్చాయి. అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) కే.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి.సృజన, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బీ.సోమశేఖర్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైడ్ డ్రైయిన్లలో మంచినీటి పైపులైన్లను మార్చండి

నగరంలో సైడ్ డ్రెయిన్లలో ఎక్కడైనా మంచినీటి వాటర్ పైపులైన్లు ఉంటే వెంటనే మార్పు చేయాలని ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కేటీరోడ్డు, పాలఫ్యాక్టరీ, లంబాడీపేట, సితార జంక్షన్, గొల్లపూడి రోడ్డు ప్రాంతాల్లో అధికారులతో కలసి ఇన్‌చార్జి కమిషనర్ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ నెల 30 నాటికి నగరంలో సైడ్ డ్రెయిన్లలో ఉన్న మంచినీటి పైపులైన్లను గుర్తించి మార్పు చేయాలని ఆదేశించారు. వాటర్ పైపులైన్ల లీకులు లేకుండా చూసుకోవాలని, ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి అందించాలని ఆదేశించారు.

జీవనశైలిలో మార్పులతో మెదడుకు సాంత్వన

న్యూరో ఫిజీషియన్ ప్రశాంత్ బాబు



ప్రసంగిస్తున్న డాక్టర్ ప్రశాంత్‌బాబు

రైల్వేస్టేషన్,జూలై 22: జీవన శైలిలో మార్పులతో మెదడుకు సాంత్వన లభిస్తుందని రమేష్ ఆసుపత్రి న్యూరో ఫిజీషియన్ ప్రశాంత్ బాబు అన్నారు. విజయవాడ రైల్వే ఆసుపత్రిలో ప్రపంచ మెదడు దినోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నరాలకు సంబంధించే వ్యాధులన్నీ కూడా క్లిష్టతరమైనవేనని తెలిపారు. స్ట్రోక్, చిత్త వైకల్యం, మూర్ఛ ఎందుకు వస్తాయో వివరించి వాటి నివారణకు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తగినంత పోషకాహారం, ధ్యానం చేయడం, తగినంత నిద్ర తదితర జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మెదడుకు సాంత్వన లభిస్తుందని తెలిపారు. ఏసీఎంఎస్ డాక్టర్ ఎం. జైదీప్ స్వాగతం పలుకుతూ మెదడు దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శౌరిబాల బ్రెయిన్ హెల్త్, ప్రివెన్షన్ థీమ్‌ను వివరించారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉన్నతి సాధ్యం

స్టెల్లా కళాశాల సంస్కృత విభాగాధిపతి డాక్టర్ రామకృష్ణ



గెలుపొందిన విద్యార్థినికి సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తున్న డి.రామకృష్ణ

లబ్బీపేట, జూలై 22: ప్రతి విద్యార్థీ తన గురించి తాను తెలుసుకుంటూ మంచితనం, విలువలతో కూడిన విద్య నేర్చుకుంటే ఉన్నతి దానంతటదే వస్తుందని మారిస్ స్టెల్లా కళాశాల సంస్కృత విభాగాధిపతి, ఉపన్యాసకులు డాక్టర్ డి.రామకృష్ణ అన్నారు. వ్యాస పూర్ణిమ సందర్భంగా నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు నేటి సమాజంలో గురువు పాత్ర అనే అంశంపై గ్రీటింగ్ కార్డు ప్రిపరేషన్, చార్ట్ ప్రజంటేషన్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వ్యాసభగవానుడి పుట్టినరోజును మనం వ్యాసపూర్ణిమగా జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రిన్సిపాల్ ఎం.అనురాధ మాట్లాడుతూ విద్యార్థులు గురువులను ఆదర్శంగా తీసుకుని మంచి మార్గంలో ఉన్నతి స్థితికి ఎదగాలని అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల సంస్కృత విభాగాధిపతి టి.రత్న కుమారి, పి.ఫణికృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వనరులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

● గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ నియంత



విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో నియంత, రేష్మ

పటమట, జూలై 22 : పర్యావరణ సమస్యల నివారణకు కాలుష్య కారక విధానాలను గుర్తించడంతో పాటు ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని గోరా సైన్స్ సెంటర్ డైరెక్టర్ జి.నియంత తెలిపారు. పర్యావరణంపై గోరా సైన్స్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూమి మీద 80 శాతం ఉన్న జీవరాశిని కేవలం 0.01 శాతం ఉన్న మానవులు శాసించడం ప్రకృతి నాశనానికి దారితీస్తోందన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం మాట్లాడుతూ ప్రకృతిలోని విషయాలను నిశితంగా పరిశీలిస్తూ వాటిని ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. ఇటీవల పర్యావరణ పరిరక్షణపై నాస్తికకేంద్రంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ఇన్నర్‌వీల్ క్లబ్ విజయవాడ ప్రెసిడెంట్ రేష్మ, సభ్యులు రాధిక, సకల, రశ్మి సర్టిఫికెట్లను, బహుమతులను అందజేశారు. డాక్టర్ మారు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక స్పృహ పెంపొందించుకోవాలి

రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు



ప్రసంగిస్తున్న రావూరి సుబ్బారావు

వన్‌టౌన్, జూలై 22: విద్యార్థులు సామాజిక స్పృహ పెంపొందించుకోవాలని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్తా) అన్నారు. పొట్టి శ్రీరాములు కాలేజీలో రోటరాక్ట్ క్లబ్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సేవాభావాన్ని పెంపొందించేందుకు కాలేజీల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరాక్ట్ క్లబ్‌లు పనిచేస్తున్నాయన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రోటరాక్ట్ క్లబ్ సభ్యులకు ఆయన అభినందనలు తెలియజేశారు. క్లబ్ అధ్యక్షుడుగా హర్షిత్ భరద్వాజ్, కార్యదర్శిగా అచ్యుత, ఉపాధ్యక్షుడు శశాంక్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. సభ్యుడు ఎంవీ ప్రసాద్ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలి శాస్త్రి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.మణికంఠ, ఫ్యాకల్టీ కో- ఆర్డినేటర్ పి.నరేష్, విజయవాడ మిడ్‌టౌన్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన వర్షంనీరు ..రోడ్లు బురదమయం

● గోతులతో అస్తవ్యస్తంగా రోడ్లు ● 43వ డివిజన్‌వాసుల తిప్పలు



హెచ్‌బీ కాలనీ వీఎంసీ కల్యాణమండపం వెనుక రోడ్డు

భవానీపురం, జూలై 22 : ఎడతెరిపిలేని వర్షాలతో 43వ డివిజన్‌లో రోడ్లు దీనస్థితికి చేరాయి. ఏ రోడ్డు చూసినా చెరువును తలపించేలా పరిసరాలు అధ్వానంగా మారిపోయాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు ఈ రోడ్ల వంక కన్నెత్తి చూడలేదు. పశ్చిమ మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ నిధులను తనకు అనుకూలంగా ఉండేవారికే మంజూరు చేయించడంతో ఈ రోడ్లు బాగుపడలేదు. ఉన్న అంతంత మాత్రం రోడ్లపై రోజుల తరబడి వర్షపు నీరు నిలిచిపోవడంతో రోడ్లకు తూట్లు పడ్డాయి. ఏ రోడ్డు చూసినా బురదమయం కావడంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. న్యూ ప్రగతి హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో ఇళ్లు ఎత్తున ఉండడంతో రోడ్డు దిగువన ఉండి వర్షపునీరు నిలిచిపోయి ఎటూ కదలడం లేదు. ఎల్ఐసీ కార్యాలయం రోడ్డంతా గోతులమయంగా ఉంది. ఈ గోతుల్లో పడి ఆదివారం రాత్రి ఒక వ్యక్తి గాయపడ్డాడు. ఇక్కడ ఖాళీస్థలాలు ఎక్కువగా ఉండటం, ఇటీవల నిర్మాణాలు సాగడంతో డ్రెయిన్ల ఏర్పాటేక వర్షపునీరు రోడ్లపై నిలిచిపోవడంతో బీటీ, సీసీ రోడ్లు నామరూపాల్లేకుండా దెబ్బతిని గోతులు తేలుతున్నాయి. ఈ ప్రాంతంలో అధికారులు ప్రత్యక్ష పర్యటన చేసి రోడ్ల దుస్థితిని మార్చే విధంగా ప్రతిపాదనలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రగతి న్యూహౌసింగ్ బోర్డు కాలనీ వద్ద



హౌసింగ్ బోర్డు కాలనీ కామన్ సైట్ వద్ద

అధునాతన టెక్నాలజీతో కొండ ప్రాంత సమస్యలు పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



రోడ్డు పనులకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె

మాచవరం, జూలై 22 : కొండ ప్రాంతాల్లో సమస్యలను అధునాతన టెక్నాలజీతో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 6వ డివిజన్ రావిచెట్టు సెంటర్ వద్ద రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ ప్రాంత వాసుల సమస్యలు పరిష్కరించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారని తెలిపారు. కొండ ప్రాంతాల్లో ఉంటున్న వృద్ధులు, వికలాంగులు సైతం రాకపోకలు సులభంగా సాగేందుకు ప్రయోగాత్మకంగా కొండ ప్రాంతాల్లో మెట్లకు రెయిలింగ్ నిర్మాణం చేయించిన ఘనత చంద్రబాబుదే అని కొనియాడారు. నేతలు పడాల గంగాధర్, గురుప్రసాద్, మోహనరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ మోహన్‌రెడ్డి

పటమట, జూలై 22 : సైబర్ నేరాలపై పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పటమట సీఐ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌పై విద్యార్థులు చాలా అప్రమత్తత, అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఓటీపీ, గిఫ్ట్ ఓచర్లు, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన చేస్తామని ఆశలు కల్పించి మోసం చేయడం వంటి సంఘటనలకు లోను కాకుండా ముందస్తుగానే వీటిపై అవలోకన చేసుకోవాలన్నారు. వ్యక్తిగతంగా ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లోని వివరాలను బయటి వ్యక్తులకు చేరకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ వీర్రాజు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పాతరాజరాజేశ్వరి పేట, జూలై 22 : నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో స్థానిక పెజ్జోనిపేటలోని సీతోడు మానసిక వికాస కేంద్రంలో పూర్వ విద్యార్థుల కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హైదరాబాద్ ప్రావిన్స్ వైస్ ప్రివిన్షియల్ ఫాదర్ కిషోర్ మాట్లాడుతూ కుటుంబంలోని పిల్లల మంచి చెడ్డలను గమనించుకుని సక్రమమైన మార్గంలో పెట్టే బాధ్యతను కుటుంబ పెద్దలు తీసుకోవాలన్నారు. నవజీవన్ బాలభవన్ బాలల అభివృద్ధికి నిరంతరం దోహదపడుతుందని అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థుల కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ ఎన్. రత్నకుమార్, ప్రోగ్రాం మేనేజర్ శేఖర్‌బాబు, సైకాలజిస్టు జి. అనూష, జోనల్ కో-ఆర్డినేటర్స్ బి. రమేష్, కె. ప్రియాంక, ఎస్. జాకబ్ రాజు పాల్గొన్నారు.

62వ డివిజన్‌లో బొండా ఉమా పర్యటన



పాయకాపురం, జూలై 22 : పాయకాపురం 62వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బొండా ఉమామేశ్వరరావు సోమవారం పర్యటించారు. స్థానిక ఎల్‌బీఎస్ నగర్, ఏపీఎస్ రెడ్డి రోడ్డు, బర్మాకాలనీ, ఏడు అపార్ట్‌మెంట్లు ప్రాంతాల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వలన పేరుకుపోయిన ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులతో పర్యటించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నేతలు పైడి శ్రీను, పైడి తులసి, ఆరుమళ్ల గోపిరెడ్డి, బత్తుల కొండ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

వన్‌టౌన్,జూలై 22: కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధి పూలమార్కెట్ సమీపంలోని పాత బిల్డింగ్ వద్ద గంజాయి కలిగి ఉన్న యనమలకుదురుకు చెందిన సభావత్ శ్యామ్‌కుమార్ నాయక్ (29)ను కృష్ణలంక ఎస్ఐ ఎం. దుర్గారావు, సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద లభించిన కేజీ 500గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు నిందితుడిపై ఇప్పటికే పలు పోలీసుస్టేషన్ల పరిధిలో దోపిడీ, దొంగతనాలు, వివాదాల కేసులున్నాయి.

మధుమేహంపై లయోలాలో అవగాహన

భారతీనగర్, జూలై 22: లయోలా కళాశాల యాజమాన్యం, సంజీవని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో థైరాయిడ్, మధుమేహం వ్యాధులపై అవగాహన క్యాంప్ జరిగింది. సంజీవనీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సీహెచ్ వెంకట రాకేష్ పాల్గొన్ని థైరాయిడ్, మధుమేహం వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. 80మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. మెడికల్ క్యాంప్ కో- ఆర్డినేటర్ డాక్టర్ ఎల్.సుభా, స్టూడెంట్‌యాక్టివిటీస్ డీన్ డాక్టర్ వై.సుబ్బారెడ్డి, ఎన్సీసీ నేవీ విభాగం డాక్టర్ వై సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకూ పోస్టాఫీస్ రేపు

వన్‌టౌన్, జూలై 22 : స్థానిక శారదా డిగ్రీ కాలేజీలో ఈ నెల 24న డాక్ చౌ పాల్ (గడప గడపకు పోస్టాఫీస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విజయవాడ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎం.నరసింహస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వరశర్మ, తపాలా శాఖ ఇన్‌స్పెక్టర్ రవి కిషోర్‌లు పాల్గొని తపాలా శాఖ నిర్వహించే వివిధ కార్యక్రమాలను వివరిస్తారని తెలిపారు.

మహిళ కుటుంబానికి ఆర్థిక సహాయం

వన్‌టౌన్, జూలై 22: మహిళ కుటుంబానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ ఆర్థికసాయం అందించారు. వించిపేట కొప్పులవారి వీధిలో ఉంటున్న డి.రామలక్ష్మి సోమవారం మృతి చెందింది. ఆమె భర్త పక్షవాతంతో బాధపడుతున్నాడు. సమాచారం అందుకున్న బేగ్ మృతురాలి మట్టి ఖర్చులకు టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి రాధాకృష్ణ, టీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బూర కనకారావు, 53వ డివిజన్ ఉపాధ్యక్షుడు తాలి అజీజ్‌ల ద్వారా రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

అజిత్‌సింగ్‌నగర్, జూలై 22 : గుర్తు తెలియని వాహనం ఢీకొని పిరమర్తి తిరుపతమ్మ(72) అనే వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన సోమవారం చేపలమార్కెట్ వద్ద జరిగింది. వివరాల ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతానికి చెందిన తిరుపతమ్మ సోమవారం ఉదయం దగ్గరలోని బంధువుల ఇంటికి బయలుదేరింది. చేపలమార్కెట్ వద్దకు రాగా గుర్తు తెలియని వాహనం ఆమెను ఢీకొంది. చుట్టుప్రక్కల వారు చికిత్స నిమిత్తం ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ...

వన్‌టౌన్: చికిత్స పొందుతూ సోమవారం వృద్ధురాలు మృతి చెందింది. రిటైర్డ్ ఉద్యోగి గోగినేని గంగాధరావు, భార్య పద్మ(56), కుమార్తె హారిక ఆదివారం బందరు రోడ్డులో వస్త్ర దుకాణంలో షాపింగ్ నిమిత్తం వచ్చారు. షాపింగ్ అనంతరం ఆల్ ఇండియా రేడియో స్టేషన్ ఎదురుగా పద్మ, ఆమె కుమార్తెలు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొనడంతో పద్మ కింద పడి తీవ్రంగా గాయపడింది. కుమార్తె 108కు ఫోన్ చేయడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పద్మ సోమవారం మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు

విజయవాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం- 2 లో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పై నుంచి గుర్తుతెలియని యువకుడు(25) దూకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

అజిత్‌సింగ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో

కుర్చీలు లేక ప్రజల అవస్థలు



అజిత్‌సింగ్‌నగర్, జూలై 22 : ప్రభుత్వ కార్యాలయాల్లో నిత్యం అనేక పనులపై ప్రజలు వచ్చి పోతుంటారు. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజానీకానికి కూర్చోవటానికి సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే అజిత్‌సింగ్‌నగర్‌లోని నార్త్‌జోన్ తహసీల్దార్ కార్యాలయంలో సదుపాయాల మాట అటుంచి కార్యాలయంలో పనుల కోసం వచ్చే వారికి కుర్చీలు కూడా లేక అవస్థలు పడుతున్నారు. ఆఖరికి గంటల తరబడి నిలబడలేక వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు గోడలపై కూర్చోవడం ఇక్కడ కనిపిస్తుంటుంది. అధికారులు వచ్చే వరకు లేదా తమ పని పూర్తయ్యే వరకు పిట్టగోడలపైనే కూర్చుని ప్రజలు పడిగాపులు పడుతున్నారు. వృద్ధులు, వికలాంగులు నేలపైనే కూర్చోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కార్యాలయంలో కుర్చీలు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనుల పరిశీలన

భారతీనగర్, జూలై 22: మూడో డివిజన్ కామినేని నగర్ డొంకరోడ్డులో కృష్ణా జిల్లాపరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, టీడీపీ యువనాయకుడు గద్దె కాంత్రి కుమార్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రెయినేజీ నిర్మాణ పనులు పరిశీలించారు. పిన్నమనేని సాయిబాబు జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. డివిజన్ అధ్యక్షులు తాడి బాబురావు, పిన్నమనేని వాణి, గద్దె రమేష్, గుత్తి కొండ కృష్ణమోహన్, ఏసుబాబు, ఈశ్వర్ పేరేపి, మాధవరావు, సుబ్రహ్మణ్యం, లక్ష్మీ, చంటిమ్మ పాల్గొన్నారు.

ఏటా 78.5 లక్షల కొలువులు కావాలి

ఆర్థిక సర్వే పలు కీలక అంశాలను ప్రభుత్వం ముందుంచింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉపాధి కల్పన కీలకమని స్పష్టం చేసింది. ఇందుకోసం 2030 వరకు వ్యవసాయేతర రంగాల్లో ఏటా 78.5 లక్షల ఉద్యోగ/ ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంటుందని తెలిపింది. ఉద్యోగాల కల్పన ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని స్పష్టం చేసింది. ప్రైవేటు రంగమూ ఇందుకు కలిసి రావాలని కోరింది. పెద్దఎత్తున లాభాలు ఆర్జిస్తున్నా ప్రైవేటు కంపెనీలు కొలువుల కల్పనపై పెద్దగా ఆసక్తి చూపకపోవడాన్ని తప్పుపట్టింది. గత మూడేళ్లలో దేశంలోని 33,000 కంపెనీల స్థూల లాభాలు నాలుగింతలు పెరిగినా, ఆ కంపెనీల్లో ఉద్యోగాల కల్పన మాత్రం పెద్దగా లేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. అలాగే దేశ జనాభాలో వ్యవసాయ రంగంపై ఆధారపడేవారి సంఖ్య క్రమంగా తగ్గుతున్న విషయాన్ని గుర్తు చేసింది. 2023 నాటికి దేశ జనాభాలో 48.5 శాతం మంది తమ జీవనోపాధి కోసం ఈ రంగంపై ఆధారపడి ఉంటే, 2047 నాటికి ఇది 25 శాతానికి తగ్గుతుందని అంచనా వేసింది.



రాష్ట్రాలూ కలిసి రావాలి

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వాలదీ కీలక పాత్ర అని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇందుకోసం రాష్ట్రాలు భూ చట్టాలు, కార్మిక చట్టాలను సవరించాలని కోరింది. కొన్ని రాష్ట్రాలు కొత్త కార్మిక చట్టాలకు, పాత కార్మిక చట్టాల్లోని నిబంధనలు జోడించడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. కంపెనీలకు భారంగా మారిన కొన్ని నియంత్రణలకు రాష్ట్ర ప్రభుత్వాలు ఫుల్‌స్టాప్ పెట్టాలని కోరింది. కొత్త కార్మిక చట్టాలను కొన్ని రాష్ట్రాలు ఇంకా పూర్తి స్థాయిలో అమలు చేయక పోవడడాన్ని తప్పుపట్టింది. సులభతర కార్మిక చట్టాల ద్వారా ఆర్థిక వృద్ధి రేటు మరింత జోరందుకుంటుందని తెలిపింది.

వ్యవసాయంలో తక్షణ సంస్కరణలు

వ్యవసాయ రంగంలో తక్షణం సంస్థాగత సంస్కరణలకు సమయం ఆసన్నమైందని ఆర్థిక సర్వే పేర్కొంది. లేకపోతే మన వ్యవసాయ రంగంలో ఉన్న పూర్తి స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోలేమని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈ రంగంలో సంక్షోభమైతే లేదని పేర్కొంది. అయితే వాతావరణ మార్పులు, ముందు ముందు ఎదురయ్యే నీటి కొరతలను దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలో వెంటనే సంస్థాగత మార్పులు చేపట్టాలని సూచించింది. ఆగ్నేయాసియా దేశాలు, అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే, మన వ్యవసాయ రంగం ఇంకా వెనుకబడే ఉందని తెలిపింది. సాగునీరు, ఎరువులు, విద్యుత్ వంటి వాటిపై సబ్సిడీలతో పాటు వ్యవసాయ ఆదాయానికి పన్ను మినహాయింపు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) వంటి మద్దతు చర్యలు ఉన్నా, మన వ్యవసాయ రంగంలో మరిన్ని విధానపరమైన సంస్కరణలకు అవకాశం ఉందని సర్వే ముందు మాటలో కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ తెలిపారు. ఆహార ద్రవ్యోల్బణ నియంత్రణ, రైతుల పంటలకు సరైన గిట్టుబాటు ధరల కల్పన, చిన్న కమతాల సమస్య పరిష్కారం మన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న పెద్ద సవాళ్లని ఆర్థిక సర్వే తెలిపింది. ప్రస్తుత ఆహార భద్రత విధానం నుంచి పోషకాహార భద్రత వైపు మరలాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపింది. డిమాండ్ ఆధారిత ఆహార విధానాన్ని సర్వే సూచించింది.

ఆర్థిక సర్వే 2023-24

ఏఐతో కుదుపు తప్పదు

కొన్ని రంగాల్లోని ఉద్యోగాలపై కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం తప్పదని ఆర్థిక సర్వే హెచ్చరించింది. భవిష్యత్‌లో అన్ని రంగాల్లోని ఉద్యోగాల స్వరూప, స్వభావాలను ఏఐ మార్చి వేస్తుందని తెలిపింది. అయితే అన్ని రకాల ఉద్యోగులు, కార్మికుల నైపుణ్యాలపై ఏఐ ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై ఇంకా స్పష్టత లేదని పేర్కొంది. ఉత్పాదకతను భారీగా పెంచే ఏఐ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే మార్చివేసే అవకాశం ఉందని అంచనా వేసింది. విద్యుత్, ఇంటర్నెట్ లానే.. ఏఐ కూడా నిత్య జీవితంలో తప్పనిసరిగా మారుతోందని తెలిపింది. ఏఐ కారణంగా కస్టమర్ సర్వీసెస్ వంటి రంగాల్లో ఆటోమేషన్ పెరిగి ఉద్యోగాలు పోతాయని హెచ్చరించింది. అయితే ఇమేజ్, వీడియోల చిత్రీకరణ వంటి సృజనాత్మక రంగాల్లో ఏఐ టూల్స్‌ని విరివిగా ఉపయోగిస్తారని అంచనా వేసింది. ఏఐ ట్యూటర్ల కారణంగా విద్యా రంగంలోనూ మార్పులు తప్పవని పేర్కొంది. ఏఐ కారణంగా కొత్త ఔషధాల అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని సర్వే తెలిపింది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న ఏఐ టెక్నాలజీని మన దేశం ఎంత మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని కోరింది.

చైనా నుంచి మరింత ఎఫ్‌డీఐ

చైనా నుంచి మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడు (ఎఫ్‌డీఐ)లు ఆకర్షించేందుకు దృష్టి పెట్టాలని ఆర్థిక సర్వే ప్రభుత్వాన్ని కోరింది. ఇలా చేయడం ద్వారా అమెరికా, ఈయూ వంటి దేశాలకు మన ఎగుమతులు మరింత పెంచుకోవచ్చని సూచించింది. ప్రస్తుతం ఈ దేశాలు 'చైనా ప్లస్ వన్' వ్యూహంలో భాగంగా తమకు అవసరమైన వస్తు, సేవల కోసం భారత్ వంటి దేశాలవైపు చూస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. చైనా ఎఫ్‌డీఐని సరళీకృతం చేస్తే, ఆ దేశ కంపెనీలు మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేసుకుని, మన దేశం నుంచి తమ సరుకులను అమెరికా, ఈయూ దేశాలకు ఎగుమతి చేయగలుగుతాయని తెలిపింది. గల్వాన్ ఘర్షణల తర్వాత చైనా కంపెనీలు భారత్‌లో పెట్టే పెట్టుబడులను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. దీనికి తోడు చైనా కంపెనీలు కూడా మన దేశంలో తమ యూనిట్లు ఏర్పాటు చేయడం కంటే, తమ సరుకులను చౌకగా దిగుమతి చేయడంపైనే ఆసక్తి చూపిస్తున్నాయి. అమెరికా, ఈయు,సింగపూర్, జపాన్, కొరియా వంటి దేశాల నుంచి మన దేశానికి పెద్ద ఎత్తున ఎఫ్‌డీఐ వస్తోంది. గత పాతికేళ్లలో మన దేశానికి వచ్చిన మొత్తం ఎఫ్‌డీఐలో చైనా వాటా కేవలం 0.37 శాతం (250 కోట్ల డాలర్లు) మాత్రమే. ఈ నేపథ్యంలో ఆర్థిక సర్వే చైనా నుంచి మరింత ఎఫ్‌డీఐకి ప్రయత్నించాలని సూచించడం విశేషం. అయితే కీలకమైన వ్యూహాత్మక ఖనిజాల కోసం చైనాపై ఆధారపడడం ఏ మాత్రం మంచిది కాదని సర్వే స్పష్టం చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,850 ▼	67,700 ▼	96,000 ▼
ముంబై	73,218 ▼	67,068 ▼	88,196 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	520
వరంగల్	522	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	540
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	117
వరంగల్	112	గుంటూరు	118
కరీంనగర్	112	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	129
కర్నూలు	112	నెల్లూరు	129
విశాఖపట్నం	106	అనంతపురం	117
గోదావరి	117		

వికసిత్ భారత్‌కు ఆరంచెల వ్యూహం

ఈ ఏడాది వృద్ధి 6.5%

కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి వృద్ధి రేటు అంచనాను కుదించింది. ప్రపంచంలో పెరిగిన భౌగోళిక, రాజకీయ సంఘర్షణల ప్రభావం వృద్ధి రేటుపై పడుతుందని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరపు వృద్ధి రేటు అంచనాను 6.5 శాతం నుంచి 7 శాతానికే పరిమితం చేసింది. వడ్డీ రేట్లను నిర్ణయించే సమయంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోకూడదని సూచించింది. ఆర్థిక వ్యవస్థలో మరిన్ని ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉన్నదంటూ ఎగుమతులు ఉత్తేజితం చేయడానికి చైనా నుంచి మరిన్ని ప్రత్యక్ష పెట్టుబడుల ఆకర్షణకు మద్దతు ప్రకటించింది. ప్రస్తుత అమృత కాలానికి, 2047 నాటికి వికసిత్ భారత్ సాధనకు ఆరంచెల వ్యూహాన్ని ప్రతిపాదించింది. ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వీ అనంత నాగేశ్వరన్ రూపొందించిన 2023-24 ఆర్థిక సర్వే నివేదికను ఆర్థిక మంత్రి నిర్మల సోమవారం పార్లమెంటుకు సమర్పించారు. విభిన్న అంశాలపై ఆర్థిక సర్వే ప్రకటించిన అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.



వృద్ధికి ప్రపంచ సవాళ్ల అవరోధం

ఈ ఏడాది వృద్ధి రేటు 6.5 శాతం నుంచి 7 శాతం మధ్యన ఉండవచ్చు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన 8.2 శాతం వృద్ధిరేటు కన్నా ఇది తక్కువే. అలాగే ఆర్‌బీఐ ప్రకటించిన అంచనా 7.2 శాతం కన్నా కూడా తక్కువ. ఈ ఏడాది సాధారణ వర్షపాతం ఉండవచ్చని వాతావరణ పరిశోధనా శాఖ అంచనా. నైరుతి రుతుపవనాల గమనం ఇప్పటివరకు సంతృప్తికరంగానే ఉంది. దీనివల్ల వ్యవసాయ రంగం పనితీరు మెరుగుపడి గ్రామీణ ప్రాంతాల్లో డిమాండు పెరగవచ్చు. జీఎస్‌టీ, ఐబీసీ వంటి వ్యవస్థాత్మక సంస్కరణలు కూడా సత్ఫలితాలనిస్తున్నాయి. అయితే ప్రపంచ స్థాయిలో పెరిగిన భౌగోళిక, రాజకీయ సంఘర్షణలు వృద్ధికి సవాలు విసురుతున్నాయి. వీటి ప్రభావం వల్ల సరఫరా వ్యవస్థలో అంతరాయాలు పెరగవచ్చు. కమోడిటీ ధరలు కూడా పెరిగి ద్రవ్యోల్బణ ఒత్తిడులకు కారణం కావచ్చు. ఫలితంగా ద్రవ్య విధాన సడలింపు సైతం జాప్యం అయ్యే ఆస్కారం ఉంది.

రిటైల్ ఇన్వెస్టర్ల హల్‌చల్...తస్మాత్ జాగ్రత

స్టాక్ మార్కెట్లలో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పెరిగింది. రిటైల్ భాగస్వామ్యం పెరగడం మాత్రం ఆహ్వానించదగ్గ అంశమే. దీని వల్ల వారు పొదుపు మొత్తాలపై అధిక రాబడులు పొందగలుగుతారు. వారి రాకతో పెట్టుబడి మార్కెట్లలో స్థిరత్వం వచ్చినా వాస్తవిక మార్కెట్ పరిస్థితులతో ప్రమేయం లేకుండా అధిక రాబడులకు ఆశ పడి అతి విశ్వాసంతో పెట్టుబడులు పెడుతూ పోవడం మాత్రం ఆందోళనకరం. ప్రధానంగా డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో వారి ఆసక్తి పెరగడంపై ఒక కన్నేసి ఉంచాలి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈక్విటీ నగదు విభాగం టర్నోవర్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల వాటా 35.9 శాతానికి పెరిగింది. దేశంలోని రెండు డిపాజిటరీల వద్ద నమోదైన డీమ్యాట్ ఖాతాల సంఖ్య 1145 లక్షల (2022-23 ఆర్థిక సంవత్సరం) నుంచి 1514 లక్షల కోట్లకు (2023-24 ఆర్థిక సంవత్సరం) పెరిగింది. ఎన్‌ఎస్‌ఈలో నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య 2020 మార్చితో పోల్చితే 2024 మార్చి 31 నాటికి 9.2 కోట్లకు పెరిగింది. అంటే 20 శాతం మంది గృహస్థులు తమ పొదుపును ఆర్థిక మార్కెట్లకు తరలించారు. "ఈ పరిణామాలను నిశితంగా జాగ్రత్తగా పరిశీలించాలి. మితిమీరిన విశ్వాసంతో స్పెక్యులేషన్‌కు పాల్పడే ప్రమాదం అధికంగా ఉంది. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి". ప్రధానంగా మ్యూచువల్ ఫండ్ల మార్గంలో రిటైల్ భాగస్వామ్యం గణనీయంగా పెరిగింది. 2024లో ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.14 లక్షల కోట్లు (35 శాతం)పెరిగి రూ.53.4 లక్షల కోట్లకు చేరింది.

డెరివేటివ్స్ జోలికి పోవద్దు

మానవుల్లో సహజసిద్ధంగా ఉండే జూద లక్షణంతో రిటైల్ ఇన్వెస్టర్లు ఎఫ్ అండ్ ఓ విభాగంలో ప్రవేశిస్తున్నారు. అతి తక్కువ తలసరి ఆదాయం ఉన్న భారత్ వంటి వర్ధమాన దేశంలో స్పెక్యులేటివ్ వ్యాపారాలకు తావుండ కూడదు. స్టాక్ మార్కెట్లలో ఏ మాత్రం కరెక్షన్ ఏర్పడినా రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఎవరో కనిపించని వ్యక్తులు తమను మోసం చేశారన్న భావన వారిలో పెరిగి దీర్ఘకాలం పాటు పెట్టుబడి మార్కెట్ల వైపు చూడకపోవచ్చు.

ఆహార ద్రవ్యోల్బణంపై ఫోకస్ తగ్గించాలి

వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకునే సమయంలో ఆర్‌బీఐ ఆహార ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకునే వైఖరి మార్చుకోవాలి. అధిక ఆహార ధరల నుంచి పేదలకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం ఫుడ్ కూపన్లు, ప్రత్యక్ష నగదు బదిలీ వంటి అవకాశాలు అన్వేషించాలి. ఆహార ధరలను మినహాయించి ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోవడం మంచిది. తయారీ రంగంలో ద్రవ్యోల్బణం 2023-24 సంవత్సరంలో నాలుగు సంవత్సరాల కనిష్ఠ స్థాయికి తగ్గింది. మెరుగైన నిల్వల నిర్వహణ, ఓపెన్ మార్కెట్ కార్యకలాపాలు, నిత్యావసర వస్తువులపై సబ్సిడీ, వాణిజ్య విధాన చర్యల ద్వారా ఆహార ద్రవ్యోల్బణాన్ని చాలా వరకు అదుపులో ఉంచగలిగారు.

భారత వృద్ధిలో మార్కెట్ల పాత్ర కీలకం

భారత వృద్ధి గాథలో పెట్టుబడి మార్కెట్ల పాత్ర కీలకంగా ఉంది. భారత మార్కెట్ అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలను తట్టుకుంటూ పురోగమిస్తున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో అత్యుత్తమ పనితీరు ప్రదర్శించిన మార్కెట్‌గా భారత మార్కెట్ ఉంది. బీఎస్‌ఈ సెన్సెక్స్, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 50 ఇన్వెస్టర్లకు అద్భుతమైన రాబడులు అందించాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ 26.8 శాతం, సెన్సెక్స్ 25 శాతం వృద్ధిని నమోదు చేశాయి. భారత మార్కెట్‌ను ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యంగా ప్రపంచ ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. పబ్లిక్ ఇష్యూల జారీ కార్యకలాపాలు కూడా నిలకడగా సాగుతూ ఉండడంతో మార్కెట్ విలువపరంగా భారత మార్కెట్ ప్రపంచంలోనే ఐదో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మే నెలలో ఈక్విటీ మార్కెట్ విలువ 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.415 లక్షల కోట్లు) మైలురాయిని తాకింది. గత ఐదు సంవత్సరాల కాలంలో భారత జీడీపీలో మార్కెట్ విలువ వాటా 124 శాతానికి పెరిగింది. ప్రస్తుతం మార్కెట్లో 9.5 కోట్ల మంది రిటైల్ ఇన్వెస్టర్లు న్నారు. వారంతా కలిసి 2,500 లిస్టెడ్ కంపెనీల్లో 10 శాతం ప్రత్యక్ష వాటా కలిగి ఉన్నారు. దేశీయంగా ఆర్థిక స్థితి మెరుగ్గా ఉండడం, సానుకూల పెట్టుబడి వాతావరణం నేపథ్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల సమీకరణ రూ.10.9 లక్షల కోట్ల స్థాయిలో ఉంది.

అమ్మకాల వెల్లువ

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ నష్టాల బాటలోనే సాగాయి. కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించటంతో సోమవారం మార్కెట్లు ఆరంభం నుంచి పతనబాటలోనే సాగాయి. ఇండెక్స్ హెవీ వెయిట్ షేరు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లతో పాటు కోటక్ మహీంద్రా షేర్లలో భారీగా అమ్మకాలకు దిగటంతో బెంచ్ మార్క్ సూచీ సూచీ 102.57 పాయింట్ల నష్టంతో 80,502.08 పాయింట్ల వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో ఒక దశలో సెన్సెక్స్ 504 పాయింట్ల నష్టంతో 80,100.65 పాయింట్ల స్థాయిని తాకింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 21.65 పాయింట్ల నష్టంతో 24,509.25 పాయింట్ల వద్ద ముగిసింది.



ఆహార ధరలపై వాతావరణ ప్రభావం

గత రెండేళ్లుగా ఆహార ధరలపై వాతావరణ ప్రభావం అధికంగా ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రిజర్వాయర్లలో నీటి మట్టాలు తగ్గి పంటల నష్టం పెరిగింది. ప్రధానంగా కూరగాయలు, పప్పు దినుసుల ఉత్పత్తి తగ్గింది. ఫలితంగా 2022 ఆర్థిక సంవత్సరంలో 3.8 శాతం ఉన్న ఆహార ద్రవ్యోల్బణం 2023 ఆర్థిక సంవత్సరం నాటికి 7.5 శాతానికి పెరిగింది. ప్రధానంగా వాతావరణ మార్పుల వల్ల వేడి గాలులు, రుతుపవన అస్థిరతలు, తుపానులు పెరిగాయి. వీటికి తోడు క్రిమికీటకాలు, పంటలను ఆశించే వ్యాధుల కారణంగా టమాటా, ఉల్లి పంటలు దెబ్బ తిని వాటి ధరలు పెరిగాయి. ఒక పక్క అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తూ మరో పక్క వాతావరణ మార్పుల లక్ష్యాలకు కట్టుబడడం ఒక గారడీ వంటిదే. భారతదేశం ప్రకటించిన నెట్ జీరో లక్ష్యాలు సాధించడంలో శిలాజేతర ఇంధనాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్‌డీసీ లక్ష్యాలు సాధించాలంటే 2030 నాటికి 2.5 లక్షల కోట్ల ఆర్థిక వనరులు అవసరం.

ఆరంచెల వ్యూహం

భారత్ గత దశాబ్ది కాలంలో ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటూ మెరుగైన వృద్ధిరేటును సాధిస్తూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణల కారణంగా అల్పాదాయ దేశం స్థాయి నుంచి అల్ప మధ్యాదాయ దేశంగా ఎదిగింది. ఇప్పుడు మధ్యాదాయ, ఎగువ మధ్యాదాయ దేశంగా మారే క్రమంలో ప్రజల ఆకాంక్షలు విశేషంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మధ్యకాలిక దృక్పథంలో మనం ఆరంచెల వ్యూహం అనుసరించడం మంచిది.

ఆ వ్యూహంలో ముఖ్యాంశాలు...

- ప్రైవేట్ రంగ పెట్టుబడులు నిలకడగా పెరగాలి. దీని వల్ల ఉద్యోగాల్లో వృద్ధి ఏర్పడడంతో పాటు కార్మికులకు ఆదాయంలో న్యాయబద్ధమైన వాటా దక్కుతుంది.
- హరిత ఆర్థిక వ్యవస్థగా పరివర్తన చెందే క్రమంలో ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలు కీలకం కానున్నాయి. ఈ ప్రయాణానికి మద్దతు ఇచ్చేందుకు నవ్య దృక్పథంతో కూడిన ఆర్థిక సాధనాలు అందుబాటులోకి రావాలి. వీటి వల్ల ప్రైవేటు పెట్టుబడుల సమీకరణ తేలికవుతుంది.
- ఎంఎస్‌ఎంఈలకు రుణ లభ్యతలో వ్యత్యాసాల తొలగింపునకు ప్రభుత్వం మార్గాలు అన్వేషించాలి. నియంత్రణల సడలింపు; భౌతిక, డిజిటల్ కనెక్టివిటీ పెంపు, ఎంఎస్‌ఎంఈలు తమ మార్కెట్ పరిధిని విస్తరించుకోవడానికి వీలుగా మెరుగైన ఎగుమతి వ్యూహం ప్రతిపాదించడం అవసరం.
- భారత వృద్ధికి చోదక శక్తి కాగల సామర్థ్యం వ్యవసాయ రంగానికి ఉంది. ఈ నేపథ్యంలో పర్యావరణ, వాతావరణ పరంగా రైతులకు సహాయకారి అయ్యే విధానాలు రూపొందించాలి.
- జనాభాలో నైపుణ్యాల వ్యత్యాసాన్ని పూడ్చేందుకు అనువైన విద్య, నైపుణ్య విధానాలు అనుసరించాలి. ఇందుకు ఈయూ తరహాలో సమీకృత విధానం వంటిది అనుసరించడం మంచిది.
- ఈ పై అంశాలన్నీ ఫలవంతం కావాలంటే ప్రభుత్వ సామర్థ్యాలు, సమర్థతలు పెరగాలి. ప్రభుత్వ యంత్రాంగాన్ని పునరుజ్జీవింపచేయడంపై ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది.

పొంచి ఉన్నాయి.. జాగ్రత్త!

వానలు బాగా పడుతున్నాయి. డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రమాదకరమైన జైకా వైరస్ వ్యాపిస్తోందనే వార్తలొస్తున్నాయి. డెంగ్యూ, జైకాలకు సంబంధించిన కొన్ని లక్షణాలు ఒకే విధంగా ఉంటాయి. అందువల్ల ఎవరికైనా జ్వరం తగ్గకపోతే వెంటనే డాక్టర్‌ను సంప్రతించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఎలా వస్తాయి?

ఈ రెండు రకాల జ్వరాలు- ఏడియస్ అనే దోమల ద్వారా వ్యాప్తి చెందుతాయి. ఇవి సాధారణంగా పగటి పూటే కుడతాయి. డెంగ్యూ కేవలం దోమలు కుట్టడం ద్వారా మాత్రమే వ్యాప్తి చెందుతుంది. జైకా మాత్రం- దోమలతో పాటుగా రక్తం ద్వారా, లైంగిక సంపర్కం ద్వారా, గర్భంలో ఉన్న శిశువులకైతే తల్లుల ద్వారా సంక్రమిస్తుంది. వెంటనే చికిత్స చేయించుకోపోతే గర్భస్థ శిశువు లోపాలతో పుట్టే అవకాశం ఉంటుంది.

లక్షణాలేమిటి?

జైకా:

- జ్వర తీవ్రత ఎక్కువగా ఉండదు
- వళ్లంతా దద్దుర్లు వస్తాయి
- కళ్లు ఎర్ర బడతాయి
- కొద్దిగా కీళ్ల నొప్పులు వస్తాయి
- కొద్దిగా తలనెప్పి కూడా ఉంటుంది

గర్భిణిలకు జైకా జ్వరం వస్తే- ఆ ప్రభావం గర్భస్థ శిశువుపై పడే అవకాశముంది. అలాంటి శిశువులకు మెదడు సరిగ్గా ఎదగకపోవచ్చు. మెదడుకు సంబంధించిన ఇతర సమస్యలు ఏర్పడే అవకాశముంది.



డెంగ్యూ:

- జ్వరతీవ్రత చాలా ఎక్కువగా ఉంటుంది. 104 డిగ్రీల వరకూ చేరుకోవచ్చు
- తలనెప్పి తీవ్రంగా ఉంటుంది. నుదిటిపై కూడా నెప్పిగా ఉంటుంది.
- కీళ్ల నొప్పులు తీవ్రంగా ఉంటాయి.
- వాంతులు అవుతాయి.
- కొందరికి వళ్లంతా దద్దుర్లు కూడా వస్తాయి
- ప్రమాద హెచ్చరికలు

వెంటనే చికిత్స చేయకపోతే డెంగ్యూ ప్రమాదకరంగా మారుతుంది. లో బ్లడ్ ప్రెషర్, ప్లాసా తగ్గిపోవటం, పేట్‌లెట్ సంఖ్య పడిపోవటం వంటి అనేక సమస్యలు ఎదురవుతాయి.

ఏం చేయాలి?

వీలైనన్ని నీళ్లు, ఇతర ద్రవ పదార్థాలు తాగాలి. జ్వరం, వళ్ల నెప్పులు తగ్గటానికి మందులు వేసుకోవాలి.

గుడ్ ఫుడ్

తృణధాన్యాల్లో ప్రొటీన్

తృణధాన్యాలు ఆరోగ్యకరమైన పిండిపదార్థాలు. వీటిలో విటమిన్ బి, ఐరన్, వృక్షాధారిత మాంసకృత్తుల్లాంటి కీలకమైన పోషకాలుంటాయి. సాధారణంగా మాంసకృత్తులు అనగానే ఎవరికైనా మాంసం, చేపలు గుడ్లే స్ఫురిస్తాయ. కానీ కొన్ని తృణధాన్యాల్లో ఎముకలు, కండరాలను బలపరిచే మేలు రకం మాంసకృత్తులుంటాయి. వాటి గురించి తెలుసుకుందాం!



క్వినోవా

ఈ తృణధాన్యంలో అత్యధిక ప్రొటీన్లుంటాయి. పీచుతో కూడిన ఈ తృణధాన్యాన్ని నీళ్లలో ఉడికించి, కూరగాయలతో కలిపి తినొచ్చు. ఆకుకూరల సలాడ్ మీద చల్లుకుని తినొచ్చు. లేదాంటే ఓట్‌మీల్ మాదిరిగా పాలతో కలిపి, నట్స్, సీడ్స్ పండ్ల ముక్కలు చల్లుకుని తినొచ్చు. ఒక కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది.

అడవి బియ్యం

బ్రౌన్, వైల్డ్ రైస్‌లో తక్కువ పిండిపదార్థాలు ఎక్కువ పీచు, ప్రొటీన్ ఉంటాయి. పర్పుల్ బ్లాక్ రైస్‌లో బి విటమిన్లు, క్యాల్షియం, పొటాషియం, ఫాస్ఫరస్, జింక్ కూడా ఉంటాయి. ఈ బియ్యాన్ని ప్రధాన భోజనంలా లంచ్, డిన్నర్‌లో తినొచ్చు. ఒక కప్పు వైల్డ్ రైస్‌లో ఆరున్నర గ్రాముల ప్రొటీన్ ఉంటుంది.

అమరాంథ్

తోటకూర విత్తనాలు ప్రధానంగా హృద్రోగాలు, టైప్2 మధుమేహాలకు ఆరోగ్యకరం. తోటకూర విత్తనాల్లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. అలాగే బి విటమిన్లు, కాపర్, జింక్, మాంగనీస్ మొదలైన ఖనిజాలు ఉంటాయి. ఉడికించినప్పుడు మెత్తగా జారుడుగా తయారయ్యే ఈ విత్తనాలను ఓట్స్ మాదిరిగా తినొచ్చు. ఒక కప్పు తోటకూర విత్తనాల్లో తొమ్మిది గ్రాముల ప్రొటీన్ ఉంటుంది.

మీకు తెలుసా?

- వేడి నీటి స్నానాన్ని చల్లని నీళ్లతో ముగిస్తే, చర్మ రంధ్రాలు మూసుకుపోయి, వాటిలోకి ధూళి, బ్యాక్టీరియా చేరకుండా ఉంటుంది.
- ముక్కు దిబ్బెడ ఉంటే, రాత్రి నిద్రపోయేటప్పుడు, దగ్గర్లో ఒక ఉల్లిపాయను ఉంచుకోవాలి.
- మైగ్రెయిన్ తలనొప్పి తగ్గాలంటే, చల్లని నీళ్లలో అరచేతులను ముంచి ఉంచి, కొద్దిసేపు వేళ్లను మడిచి, విప్పారుస్తూ ఉండాలి.
- దోమ కాటు మీద డియోడరెంట్ పూసుకుంటే దురద తగ్గుతుంది.

లంగ్ కేర్

ఊపిరి... ఉల్లాసంగా

వానాకాలంలో దగ్గు, తుమ్ములు, ఆయాసం, అలర్జీలు విజృంభించడం సహజమే! అయితే అలాగని వాటిని తేలికగా తీసుకుంటే, ఊపిరితిత్తులు తిరిగి కోలుకోలేనంతగా దెబ్బతింటాయి. కాబట్టి తగిన ముందస్తు జాగ్రత్తలతో ఈ ఇబ్బందులకు అడ్డుకట్ట వేయాలంటున్నారు వైద్యులు.

ఫ్లూ, న్యుమోనియాలకు మంచి వ్యాక్సిన్లున్నాయి. వీటిని తీసుకుంటే ఇన్‌ఫెక్షన్లు సోకినా, వాటి ఉధృతి పెరగకుండా ఉంటుంది. కాబట్టి ఊపిరితిత్తుల సమస్యలున్నవాళ్లు, వ్యాధినిరోధకశక్తి తక్కువగా ఉన్నవాళ్లు, పెద్దలు తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయించుకోవాలి. అలాగే ఉబ్బసం ఉన్నవాళ్లు సమస్య అదుపులోకి రాగానే ఇన్‌హేలర్ల వాడకం మానేస్తూ ఉంటారు. అది సరి కాదు.

ఇంట్లోనే కాలుష్యం

ధూళి, జంతు విసర్జకాలు, పొగ.. ఇటీవలి కాలంలో ఊపిరితిత్తుల సమస్యలు పెరగడానికి ప్రధాన కారణాలు. పూజ కోసం ఒక అగర్‌బత్తీ వెలిగించినా, దోమలను తరమడం కోసం ఒక మస్క్యుటో కాయిల్ వెలిగించినా వాటి నుంచి వెలువడే పొగ 500 సిగరెట్లతో సమానం. అలాగే హోమాలకు బహిర్గతం కావడం కూడా ప్రమాదకరమే! ఇళ్లలో పెంపుడు జంతువులు ఉన్నంత మాత్రాన వాటి నుంచి ఊపిరితిత్తులెలా పాడవుతాయి? అని అందరూ అనుకుంటూ ఉంటారు. వాటిని దగ్గరకు తీయకుండా ఉంటే, మనకేమీ కాదు అనుకుంటే పొరపాటు. పక్షుల వల్ల కూడా ఊపరితిత్తుల వ్యాధులు వేధిస్తాయి. వాటి విసర్జకాల నుంచి వెలువడే అలర్జెన్స్ గాల్లో కలిసి ఊపిరితిత్తుల్లోకి చేరతాయి. ఇలా ఏళ్ల తరబడి వీటికి బహిర్గతమైతే ఊపిరితిత్తులు దెబ్బతింటూ హైపర్ సెన్సిటివిటీ న్యుమోనైటిస్ వ్యాధి బారిన పడతాం! ఈ వ్యాధి ఇన్‌హేలర్స్‌తో అదుపు కాదు. కాబట్టి స్టిరాయిడ్స్ వాడుకోవలసి వస్తుంది. వీటిని వాడుకోవడం వల్ల వాటి దుష్ప్రభావాలను కూడా భరించవలసి వస్తుంది. కాబట్టి పెంపుడు జంతువులను పెంచుకోకుండా ఉండడమే మేలు. కుక్కలు, పిల్లుల వెంట్రుకలు రాలిపడిపోతూ ఉంటాయి. ఇలా రాలిన వెంట్రుకల నుంచి 24 గంటలపాటు అలర్జెన్స్ విడుదలవుతూనే ఉంటాయి. వీటితో ఉబ్బసం వస్తుంది. కాబట్టి పెంపుడు కుక్కలు, పిల్లుల నుంచి కూడా దూరంగా ఉండాలి. అలాగే కార్పెట్లలో ఇరుక్కునే దుమ్ము, ధూళి, డస్ట్ మైట్స్ వల్ల, శుభ్రంగా లేని దుప్పట్లు, పిల్లో కవర్స్, కర్టెన్స్ వల్ల కూడా ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. కాబట్టి కార్పెట్లను తరచూ వ్యాక్యూమ్ చేస్తూ ఉండాలి. పగటి వేళ ఒక దుప్పటి, రాత్రి వేళ ఒక దుప్పటి వాడుకోవాలి.

ప్రివెంటివ్ ఇన్‌హేలర్స్ నిరంతరంగా వాడుకుంటూ ఉంటే, దుమ్ము, ధూళి, వైరస్ వల్ల ఊపిరితిత్తులు ఇన్‌ఫెక్షన్‌కు లోనైనా పరిస్థితి ఉబ్బసానికి దారి తీయకుండా ఉంటుంది. ఈ కాలంలో స్మోకింగ్ వల్ల సిఒపిడి రోగుల పరిస్థితి మరింత దిగజారుతుంది. కాబట్టి ఈ సిఒపిడి రోగులు స్మోకింగ్ మానేసి, తప్పనిసరిగా వ్యాక్సిన్లు వేయించుకోవాలి. అలాగే ఇన్‌హేలర్ల వాడకం కొనసాగించాలి. ఊపిరితిత్తుల్లో ధూళి కణాలు స్థిరపడిపోవడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయి. ఆ ధూళి కణాలు 2.5 మైక్రాన్ల కంటే పెద్దవిగా ఉంటే, అవి ఊపిరితిత్తుల్లో డిపాజిట్ అయిపోయి, వాటిని డ్యామేజ్ చేస్తాయి. మరీ ముఖ్యంగా వర్షాకాలంలో ఈ సమస్య ఎక్కువగా ఇబ్బంది పెడుతూ ఉంటుంది.

ఉబ్బసం ఇలా దూరం

వర్షాకాలంలో ఎక్కువగా ఇబ్బంది పెట్టే సమస్య ఉబ్బసం అనే విషయం మనందరికీ తెలిసిందే! అయితే ముందు నుంచీ ఉబ్బసం వాళ్లకే వర్షాకాలంలో సమస్యలు పెరుగుతాయనుకుంటే పొరపాటు. కొత్తగా ఉబ్బసం బారిన పడే సందర్భాలు కూడా ఈ కాలంలోనే పెరుగుతూ ఉంటాయి. కాబట్టి ఎడతెరిపి లేని దగ్గు, రాత్రివేళ లేదంటే తెల్లవారుఝామున దగ్గు పెరగడం, పిల్లికూతలు లాంటి లక్షణాలు కనిపిస్తే, పీక్ ఫ్లో మీటరుతో పరిస్థితి తీవ్రతను పరీక్షించుకోవాలి. 300 నుంచి 400 ధర పలికే ఈ పరికరంతో ఉబ్బసం తీవ్రతను కొలుచుకుని, రీడింగ్ 200 - 250కు తగ్గితే వైద్యులను కలవాలి. ఒకవేళ ఊపిరితిత్తుల పనితీరు తగ్గినట్టు లంగ్ ఫంక్షన్ టెస్ట్‌లో తేలితే, ఇన్‌హేలర్స్ వాడుకోవాలి. రోజూ వాడే ఇన్‌హేలర్‌తో పాటు, ఉబ్బసం అటాక్ వచ్చినప్పుడు వేరే ఇన్‌హేలర్‌ను కూడా వాడుకుంటూ ఉండాలి.

ఆ అలవాటు లేకపోయినా...


పొగకు ఎక్కువగా బహిర్గతమయ్యేవాళ్లకు సిఒపిడి (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ డిసీజ్) తప్పదు. ధూమపాన ప్రియులతో పాటు, ఆ అలవాటు లేని వాళ్లు కూడా ఈ సమస్య బారిన పడుతూ ఉంటారు. మరీ ముఖ్యంగా కట్టెల పొయ్యి దగ్గర పనిచేసే వాళ్లు, గర్భగుడిలో ధూపాల మధ్య ఎక్కువ సమయం గడిపే పూజారులు పొగ మూలంగా సిఒపిడికి గురవుతూ ఉంటారు. క్షయ నుంచి పూర్తిగా కోలుకున్నా ఆ వ్యాధితో ఊపిరితిత్తులు దెబ్బతినడం మూలంగా సిఒపిడి బారిన పడే వారి సంఖ్య కూడా మన దేశంలో పెరిగిపోతోంది. కాబట్టి దగ్గుతో పాటు పసుపుపచ్చ, ఆకుపచ్చ తెమడ కనిపిస్తూ, ఆయాసం వేధిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను కలవాలి. ఆయాసాన్ని బట్టి ఈ సమస్యను ఉబ్బసంగా భ్రమపడేవాళ్లు ఉంటారు. కానీ ఉబ్బసంలో తెమడ కనిపించదనే విషయం గుర్తు పెట్టుకోవాలి. ఉబ్బసంలో మాదిరిగానే లంగ్ ఫంక్షన్ టెస్ట్ చేసినప్పుడు, వాటి సామర్థ్యం తగినట్టు కనిపిస్తే, ప్రత్యేకించి సిఒపిడి కోసం నిర్దేసిత ఇన్‌హేలర్స్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. అలాగే వ్యాక్సినేషన్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ఈ సమస్య శాశ్వతంగా నయం కాకపోయినా చికిత్సతో అదుపులో పెట్టుకోవచ్చు.



అపోహలు మానండి

ఇన్‌హేలర్స్: ఇన్‌హేలర్స్ వాడుకుంటే వాటికి అలవాటు పడిపోతాం అనే ఒక ప్రధాన అపోహ నాటుకుపోయింది. చివరి దశలోనే ఇన్‌హేలర్స్ వాడుకోవాలి అనుకుంటూ ఉంటారు. కానీ నిజానికి ఇవి వ్యాధి ప్రారంభంలో వాడుకోవలసినవి. మిల్లీగ్రాముల పరిమాణంలో ఔషధాన్ని కలిగి ఉండే ఇన్‌హేలర్స్ మాత్రల కంటే సున్నితమైనవి. ఇవి మాత్రల్లా రక్తంలో కలిసి శరీరమంతా ప్రవహించకుండా, నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లి సమస్యను పరిష్కరిస్తాయి. పైగా వీటికి దుష్ప్రభావాలు ఉండవు. సమస్య కూడా వెంటనే పరిష్కారమవుతుంది. కాబట్టి ఇన్‌హేలర్స్ అన్ని విధాలా సురక్షితమైనవి.

ఉబ్బసం: కుటుంబ చరిత్రలో ఉబ్బసం ఉంటేనే ఆ వ్యాధి సంక్రమిస్తుందన్నది కూడా అపోహే! ఉబ్బసం ఎవరికైనా రావచ్చు.



పెరుగుతున్న కొత్త సమస్యలు

జలుబు, ముక్కు దిబ్బెడ, గొంతులో ఇబ్బంది, పొడి దగ్గు, ఒళ్లు నొప్పులు, జ్వరం... ఇవి అప్పర్ రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్ లక్షణాలు. ఈ సీజన్‌లో విజృంభించే రైనోవైరస్ వల్లే ఈ సమస్య వేధిస్తుంది. ఇది ప్రమాదకరమైనది కాకపోయినా, మధుమేహం, ఇతరత్రా దీర్ఘకాలిక వ్యాధులున్న వాళ్లలో ఈ సమస్య మరింత తీవ్రమవుతూ ఉంటుంది. కాబట్టి ఈ కోవకు చెందిన వాళ్లు వ్యాక్సినేషన్ తప్పనిసరిగా తీసుకోవాలి. ఐఎల్‌డి (ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజ్) తీవ్రత ఇటీవలి కాలంలో పెరుగుతోంది. ఊపిరితిత్తులు బిరుసుగా మారి వ్యాకోచించలేని పరిస్థితి ఇది. దాంతో నాలుగు అడుగులకే ఆయాసం, పొడి దగ్గు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది మొదలైన లక్షణాల వేధిస్తాయి. అలాగే బ్రాంకియెక్టేటిస్ అనే సమస్య కూడా వర్షాకాలంలో పెరుగుతుంది. ఏళ్ల తరబడి దగ్గు, తెమడతో బాధపడుతూ ఉన్న వాళ్లలో ఈ సమస్య తలెత్తుతుంది. వర్షాకాలంలో ఇన్‌ఫెక్షన్ పెరగడం వల్ల ఆకుపచ్చ, పసుపుపచ్చ తెమడతో పాటు కొన్ని సందర్భాల్లో తెమడతో పాటు రక్తం కూడా పడుతుంది. ఈ కోవకు చెందిన వాళ్లు దీర్ఘకాలం పాటు ఇన్‌హేలర్స్ వాడుకోవలసి ఉంటుంది.

డాక్టర్ ప్రద్యుత్ వాఘ్రే
సీనియర్ కన్సల్టెంట్ పల్మొనాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్,
జూబ్లీహిల్స్, హైదరాబాద్.



గర్భిణులకు వ్యాయామం

గర్భిణుల వ్యాయామానికి సంబంధించి బోలెడన్ని అపోహలు, భయాలను కలిగి ఉంటారు. నిజానికి వ్యాయామంతో సుఖ ప్రసవం జరిగే అవకాశాలు మెరుగవుతాయి. అయితే వైద్యు సూచించిన వ్యాయామాలనే ఎంచుకోవడం ఉత్తమం.

వ్యాయామంతో కటి కండరాలు, ఎముకలు దృఢపడతాయి. అంతే కాదు. ప్రసవ సమయంలో, ప్రసవం తర్వాత అవసరానికి మించి బరువు పెరిగే సమస్య తప్పుతుంది. ప్రసవ నొప్పులు కూడా తగ్గుతాయి. ప్రసవం తర్వాత కోలుకునే సమయం కూడా తగ్గుతుంది. కాబట్టి ఎలాంటి ప్రసవసంబంధ, పునరుత్పత్తి వ్యవస్థకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు లేనివారు తేలికపాటి వ్యాయామాలు గర్భిణిగా ఉన్న సమయంలోనూ చేయవచ్చు.

ఇలాంటి వ్యాయామాలు చేయకూడదు

పొత్తికడుపు మీద ఒత్తిడి పెంచే వ్యాయామాలతో పాటు, పరుగు, గెంతడం లాంటి వ్యాయామాలు చేయకూడదు. ఎంత ఫిట్‌గా ఉన్నవాళ్లైనా సరే వైద్యులను సంప్రతించకుండా ఎలాంటి వ్యాయామాలు చేయకూడదు. జంపింగ్ జాక్స్, స్క్వాట్స్, స్కిప్పింగ్, ఎక్కువ బరువులతో కూడిన వ్యాయామాలకు దూరంగా ఉండాలి.

గర్భ దశలో శరీరం ఎన్నో మార్పులకు లోనవుతూ ఉంటుంది. ఒత్తిడిని భరిస్తూ ఉంటుంది. రక్త పరిమాణం పెరగడం, ఫలితంగా రక్తపోటు పెరగడం లాంటి మార్పులూ జరుగుతూ ఉంటాయి. కాబట్టి విపరీతంగా అలసటకు లోను చేసేవి, విపరీతంగా చమటలు పట్టించేవి, ఊపిరి ఆడనంతగా ఒత్తిడికి లోను చేసే వ్యాయామాలకు దూరంగా ఉండాలి.

వాకింగ్

ఇది గర్భిణులకు సురక్షిత వ్యాయామం. తక్కువ తీవ్రతతో కూడిన ఈ వ్యాయామంతో గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. అయితే వేగం సౌకర్యవంతంగా ఉండేలా చూసుకోవాలి. నడుస్తున్నప్పుడు ఒక వాక్యం పూర్తిగా మాట్లాడలేకపోతున్నారు అంటే, అవసరానికి మించి శరీరాన్ని కష్టపెడుతున్నారు అని అర్థం. కాబట్టి వేగం తగ్గించి, సౌకర్యవంతంగా ఉండే వేగంతోనే నడవాలి. తొమ్మిదవ నెల నిండేవరకూ కూడా నడక కొనసాగించవచ్చు.

జాగింగ్

ఎంతో అనుభవం ఉన్న జాగర్ అయితేనే గర్భం దాల్చిన తర్వాత కూడా జాగింగ్ చేయవచ్చు. అయితే జాగింగ్ వేగం, దూరం మాత్రం తగ్గించుకోవాలి. శరీరం కుదుపులకు గురయ్యేలా జాగింగ్ చేయకూడదు. అలాగే నెలలు నిండేకొద్దీ శరీరం బరువు పెరుగుతుంది కాబట్టి జాగింగ్ వేగం తగ్గించాలి. జాగింగ్ ఇబ్బందిగా అనిపించినప్పుడు ఆపేసి, నడకతో సరిపెట్టుకోవాలి.

యోగా

గర్భం దాల్చినప్పుడు, కండరాలు, లిగమెంట్లు సాగుతాయి. ఈ స్థితికి శరీరం తట్టుకోవాలంటే అందుకు తోడ్పడే యోగాసనాలు వేయాలి. అయితే పూర్వ అనుభవం ఉన్నప్పుడు మాత్రమే అనుభవజ్ఞులైన శిక్షకుల సమక్షంలో యోగాసనాలు సాధన చేయాలి.

వెయిట్ ట్రైనింగ్

గర్భిణిగా ఉన్న సమయంలో కండర నిర్మాణానికి వెయిట్ ట్రైనింగ్ చేయవచ్చు. అయితే బరువులను పట్టుకుని వెల్లకిలా పడుకుని చేసే వ్యాయామాలు చేయకూడదు. ఎక్కువ బరువులను ఎత్తే ప్రయత్నం చేయకూడదు. పొత్తికడుపు కండరాల మీద ఒత్తిడి పడే భంగిమల్లో వెయిట్ ట్రైనింగ్ చేయకూడదు. మరీ ముఖ్యంగా నాల్గవ నెల నుంచి తొమ్మిదవ నెల గర్భం సమయంలో బరువులతో కూడిన వ్యాయామాలకు దూరంగా ఉండాలి.

ఫిట్‌నెస్



కీళ్లు జాగ్రత్త

ప్రసవ సమయంలో వ్యాకోచించడానికి అనువుగా గర్భిణిగా ఉన్న సమయంలోనే కీళ్లు కొంత వదులవుతాయి. ఈ సమయంలో కటి ప్రదేశంలోని కీళ్లు వదులుగా మారతాయి. కాబట్టి కటి ప్రదేశంలో బరువు పడే వ్యాయామాలకు దూరంగా ఉండాలి. యోగా, ఈత, నడక, పైలేట్స్ లాంటి వ్యాయామాలకే పరిమితం అవడం మేలు. వీటికి బదులు ఎగిరి దూకడం, గెంతడం లాంటి వ్యాయామాలు చేయకూడదు.

సమతౌల్యం జాగ్రత్త

గర్భంతో శరీరం బరువు పెరుగుతుంది కాబట్టి పూర్వంలా శరీరాన్ని బ్యాలెన్స్ చేయడం కష్టం. కాబట్టి వ్యాయామం చేసే సమయంలో శరీర కదలికల మీద ఓ కన్నేసి ఉంచాలి. తొట్రుపడడానికి, అదుపు తప్పడానికి వీలున్న వ్యాయామాలు చేయకూడదు. ఒంటి కాలు ఆసరాతో చేసే వ్యాయామాలు చేయకూడదు.

ఈత

గర్భిణులకు అన్నివిధాలుగా సురక్షితమైన వ్యాయామం ఇది. పెరిగిన శరీర బరువుతో అలసిన శరీరాలు ఈతతో సేద తీరతాయి. శరీరం తేలికైన భావన కలుగుతుంది. గుండె వేగం పెరిగి రక్తప్రసరణ మెరుగవుతుంది. స్వాంతన కూడా దక్కుతుంది.

సైక్లింగ్

సాధారణ సైకిల్ తొక్కడం మంచిది కాదు. దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువ. కాబట్టి స్టేషనరీ సైకిల్ తొక్కవచ్చు. ఇది తక్కువ ప్రభావం చూపించినా సురక్షితమైనది కాబట్టి ఈ సమయంలో దీన్ని ఎంచుకోవడమే ఉత్తమం.

నీళ్లు సరిపడా

వ్యాయామాలు చేసే గర్భిణిలు నీళ్లు తాగుతూ ఉండాలి. వ్యాయామంతో ఒళ్లు వేడెక్కకుండా, 140కి మించి గుండె వేగం పెరగకుండా చూసుకోవాలి. తల తిరిగినా, నీరసంగా అనిపించినా వెంటనే వ్యాయామం మానేయాలి. వ్యాయామానికి ముందు వార్మప్ తప్పనిసరి. సౌకర్యవంతమైన దుస్తులు, షూస్ ధరించాలి. కనీసం అరగంటపాటు వారంలో 4 నుంచి 5 సార్లు చేస్తే చాలు.

వాటర్ ఏరోబిక్స్

5వ నెల నుంచి ప్రసవం ముందు వరకూ నీళ్లలో నడుము వరకూ మునిగి చేసే ఏరోబిక్ వ్యాయామాలు మంచివి. కండరాలకు సుతిమెత్తని వ్యాయామం అందించే వాటర్ ఏరోబిక్స్‌వల్ల బడలిక, అలసట తొలగుతాయి. శరీరం మీద వ్యాయామంతో పడే ఒత్తిడి కూడా తక్కువే! నీళ్లలో మునిగి ఉండడం వల్ల కీళ్ల మీద ఒత్తిడి తగ్గుతుంది.

గమనిక:

పడక విశ్రాంతి, ప్రసవ సమస్యల గురించిన వైద్యుల సూచనలు పొందినవారు ఎట్టి పరిస్థితుల్లోనూ, ఎంత పూర్వ అనుభవం, అలవాటు ఉన్నా వ్యాయామాలు చేయకూడదు

ఊపిరితిత్తులు ఇలా బలం

- క్రమం తప్పక ప్రాణాయామం చేయాలి
- బెలూన్లు ఊదడం వల్ల కూడా ఊపిరి తిత్తులు బలపడతాయి
- బాల్ స్పైరోమీటర్ అనే పరికరాన్ని వాడుకుంటూ ఉండొచ్చు
- దుమ్ము, ధూళి, పొగలకు బహిర్గతం కాకుండా మాస్క్ పెట్టుకోవాలి.



అవేర్‌నెస్

ఐబిఎస్ శత్రువులు

ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్.. ఈ జీర్ణకోశ సమస్య పెద్ద పేగులకు సంబంధించినది. ఈ సమస్య ఉన్న వాళ్లు తరచూ పొట్ట నొప్పి, అసౌకర్యం, మలబద్ధకం, విరోచనాలతో బాధపడుతూ ఉంటారు. అయితే ఐబిఎస్ ఉన్నవాళ్లు కొన్ని ఆహార నియమాలు పాటిస్తే సమస్య అదుపులో ఉండే వీలుంది. వీళ్లు తినకూడదని పదార్థాలు ఏవంటే..



- **బీన్స్:** సెనగలు, పప్పులు, బీన్స్ ఐబిఎస్ సమస్యను పెంచుతాయి. వీటి నుంచి వెలువడే వాయువులు జీర్ణ ప్రక్రియను బాధాకరంగా మారుస్తాయి. కాబట్టి వీటిని తీసుకోకపోవడమే మేలు. ఒకవేళ తినాలనిపిస్తే, తేలికగా అరిగేలా, మెత్తని ముద్ద రూపంలో తీసుకోవాలి.
- **వేపుళ్లు:** వీటిని కొవ్వు ఎక్కువ కాబట్టి కడుపు ఉబ్బరిస్తుంది. కొన్ని సందర్భాల్లో విరోచనాలూ వేధిస్తాయి. కాబట్టి ఫ్రెంచ్ ఫ్రైస్ లాంటివి తినాలనిపిస్తే వాటిని బేక్ చేయడం లేదా, గ్రిల్లింగ్ చేయాలి.
- **క్రూసిఫెరస్ కూరగాయలు:** ఈ జాతికి చెందిన కూరగాయల్లో పీచు ఎక్కువ. నిజానికి జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే పీచు ఎక్కువగా ఉండే కూరగాయలకే ప్రాధాన్యం ఇవ్వాలి. కానీ ఐబిఎస్ ఉన్నవాళ్లు ఈ రకం కూరగాయలు తినడం వల్ల, వాటిలో 'రాఫినోస్' అనే జీర్ణం కాని సుగర్‌తో సమస్య మరింత పెరుగుతుంది. కాబట్టి క్యాబేజీ, కాలీఫ్లవర్, బ్రొకోలి కూరగాయలకు దూరంగా ఉండాలి.
- **చక్కెర ప్రత్యామ్నాయాలు:** చక్కెరకు ప్రత్యామ్నాయంగా వాడుకునే స్వీటెనర్లతో ఐబిఎస్ లక్షణాల తీవ్రత పెరుగుతుంది. పాలియోల్, సార్బిటాల్, క్సైలిటాల్, మానిటాల్ మొదలైన స్వీటెనర్లు రెడీమేడ్ ఫుడ్స్‌లో ఉంటాయి. ఇవన్నీ ఐబిఎస్ లక్షణాలను రెట్టింపు చేసేవే. కాబట్టి 'సుగర్ ఫ్రీ' అనే లేబుల్ ఉన్న రెడీమేడ్ ఆహారాలను మానేయాలి.

ఫుడ్ ఫ్యాక్ట్

తీపి ఎప్పుడు?

తీపిని ఇష్టపడని వాళ్లు ఉండరు. అయితే తీపితో క్యాలరీలు, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉండాలంటే ఒక ప్రధాన నియమం పాటించాలి. అదేంటంటే..

భోజనం చేసిన వెంటనే తీపి తినే అలవాటు ఎంతో మందికి ఉంటుంది. రోజు మొత్తంలో అడపాదడపా చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లూ, సంప్రదాయ పిండి వంటలు తినేవాళ్లు కూడా ఉంటారు. కానీ అతిగా తీపి తినడం వల్ల బరువు పెరగడంతో పాటు, అదనపు అనారోగ్యాలు తప్పవు. అయితే తీపిని ఆస్వాదిస్తూనే, తీపి తెచ్చే అనర్థాల నుంచి తప్పించుకోవాలంటే, మధ్యాహ్న భోజనం తిన్న గంట తర్వాత తీపి తినాలి. రాత్రి డిన్నర్




తర్వాత స్వీట్ తింటే కడుపుబ్బరం, ఛాతీలో మంట వేధిస్తాయి. అలాగే తీపి తినే ముందు గ్లాసుడు నీళ్లు తాగడం ద్వారా అతిగా తీపి తినే ప్రమాదం కూడా తగ్గుతుంది. తీపి తిన్న తర్వాత పది నిమిషాలు నడవడం ద్వారా తీపితో అందిన క్యాలరీలను ఖర్చు చేసుకోవచ్చు.

డిగ్రీతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం

ఎస్ఎస్సీ సీజీఎల్ఈ-2024

ఖాళీలు 17,727



స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్సీ)... కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో గ్రూప్-బీ, సి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టుల వివరాలు: గ్రూప్-బీలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్/అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఇన్స్పెక్టర్, అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్, సబ్ ఇన్స్పెక్టర్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, రీసెర్చ్ అసిస్టెంట్, డివిజన్ అకౌంటెంట్, జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి. గ్రూప్-సిలో ఇన్స్పెక్టర్ ఆఫ్ ఇన్కమ్ ట్యాక్స్/జూనియర్ అకౌంటెంట్, పోస్టల్ అసిస్టెంట్/సార్టింగ్ అసిస్టెంట్, సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్/అప్పర్ డివిజన్ క్లర్క్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, ట్యాక్స్ అసిస్టెంట్, సబ్ ఇన్స్పెక్టర్ పోస్టులు ఉన్నాయి.

అర్హతలు: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్మీడియట్ స్థాయిలో మేథమెటిక్స్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఆ తరవాత డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. లేదా డిగ్రీ స్థాయిలో స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్-2 పోస్టులకు స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్హెచ్ఆర్సీలో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు కనీసం ఏడాది రీసెర్చ్ అనుభవం ఉన్నవారికి, న్యాయశాస్త్రంలో డిగ్రీ లేదా హ్యూమన్ రైట్స్లో డిగ్రీ పూర్తిచేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. నిర్దిష్ట విద్యార్హతలన్నీ 2024 ఆగస్టు 1లోపు పొంది ఉండాలి.

వయసు: జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు 32 ఏళ్లు, గ్రూప్-సి పోస్టులకు 27 ఏళ్లు. మిగతా అన్ని పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 30 ఏళ్లు. నిబంధనల ప్రకారం రిజర్వేషన్ వర్గాలకు వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రెండు దశల్లో నిర్వహించే రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ఆన్లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 24
- **టైర్-1 పరీక్ష:** సెప్టెంబరు/అక్టోబరు
- **టైర్-2 పరీక్ష:** డిసెంబరు
- **వెబ్సైట్:** ssc.gov.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/SM4CD72లో చదవండి.

మొరార్జీ దేశాయ్ఇన్స్టిట్యూట్లో

డిప్లొమా

కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా(ఎండీఎన్ఐవై-న్యూఢిల్లీ)-డిప్లొమా ఇన్ యోగా సైన్స్ (డీవైఎస్సీ)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 75 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 33, ఓబీసీలకు 18, ఎస్సీలకు 10, ఎస్టీలకు 6, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 8 సీట్లు ప్రత్యేకించారు. అదనంగా మరో 22 స్పెషల్ కేటగిరీ సీట్లు కూడా ఉన్నాయి. వీటిని విదేశీ విద్యార్థులు, స్పోర్ట్స్/ఎన్సీసీ/ఎన్ఎస్ఎస్ అభ్యర్థులు, మాజీ సైనికులు, సంస్థ ఉద్యోగుల పిల్లలకు నిర్దేశించారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్, మెడికల్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు సెకండరీ స్కూళ్లు, ప్రీ యూనివర్సిటీలు, యూనివర్సిటీలలో యోగా ఇన్స్ట్రక్టర్లుగా రాణించవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. వయోపరిమితి నిబంధనలు లేవు. అభ్యర్థులు ఆరోగ్యవంతులై ఉండాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 2
- **వెబ్సైట్:** yogamdniy.nic.in

సెస్లో పీహెచ్డీ

బేగంపేట(హైదరాబాద్)లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్)- పీహెచ్డీ ప్రోగ్రామ్ ఇన్ డెవలప్మెంట్ స్టడీస్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్నకు నిజామాబాద్లోని తెలంగాణ యూనివర్సిటీ సహకారం అందిస్తోంది. మొత్తం 12 సీట్లు ఉన్నాయి. రీసెర్చ్ ప్రపోజల్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలంగాణ ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. స్థానికేతరులకు హాస్టల్ సౌకర్యం ఉంది. అర్హులైన అభ్యర్థులకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్/ఫెలోషిప్స్ అందిస్తారు.

విభాగాలు: ఎకనామిక్స్, సోషియాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్, డెవలప్మెంట్ స్టాటిస్టిక్స్, పొలిటికల్ సైన్స్/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్/బిజినెస్ మేనేజ్మెంట్

దిక్సూచి
DIKSUCHI

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్తో పీజీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. యూజీసీ జేఆర్ఎఫ్/యూజీసీ నెట్ అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు రెండో వారంలో
- **వెబ్సైట్:** www.cess.ac.in

డా.వైఎస్సార్ వర్సిటీలో డెంటల్ పీజీ ప్రవేశాలు


విజయవాడలోని డా.వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డావైఎస్సార్యూహెచ్ఎస్)-పోస్ట్ గ్రాడ్యుయేట్ డెంటల్ డిగ్రీ/డిప్లొమా ప్రోగ్రామ్లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ మైనారిటీ, అనుబంధ డెంటల్ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా, మేనేజ్మెంట్ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ డెంటల్ కళాశాలల్లో 50 శాతం సీట్లను స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద; మిగిలిన 50 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ డెంటల్ కాలేజీల్లో 50 శాతం సీట్లను కాంపిటెంట్ అథారిటీ కోటా కింద, మిగిలిన 50 శాతం సీట్లను మేనేజ్మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. ఎండీఎస్, డిప్లొమా ప్రోగ్రామ్లను అందిస్తున్న కాలేజీలు-సీట్ల వివరాలు వెబ్సైట్లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హతలు: పీజీ డెంటల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీడీఎస్(బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ) ఉత్తీర్ణతతోపాటు 2024 జూన్ 30 నాటికి ఇంటర్న్షిప్ పూర్తి కావాలి. రాష్ట్ర స్థాయి/జాతీయ స్థాయిలో ఉన్న డెంటల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి. నీట్ ఎండీఎస్ 2024 అర్హత పొంది ఉండాలి.

- **చివరి తేదీ:** జూలై 24
- **వెబ్సైట్:** drysr.uhsap.in

నవ్య | చిత్రజ్యోతి

ఆలోచనలే మన శత్రువులు



వెంకట సత్య దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'ఆపరేషన్ రావణ్'. 'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్ జంటగా నటించారు. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ను ధ్యాన్ అట్లూరి నిర్మించారు. ఈ నెల 26న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకట సత్య మీడియాతో ముచ్చటించారు.

"మన ఆలోచనలే మన శత్రువులు అన్నది ఈ సినిమా కథకు మూలం. ఈ పాయింట్ను నేను పురాణాల్లోంచి తీసుకున్నాను. ఈ సినిమా ఒక మనిషి ఎలా సైకోగా మారతాడో విజువల్గా చూపిస్తుంది. సినిమాలోని ప్రతీ పాత్రకూ విశిష్టత ఉంటుంది. ఇప్పటివరకూ ఏ సినిమాలోనూ చూడని అంశాలు 'ఆపరేషన్ రావణ్'లో ఉంటాయి. ఈ సినిమాను ప్రేక్షకులు చాలా బాగా రిసీవ్ చేసుకుంటారనే నమ్మకం ఉంది. ఇందులో మా అబ్బాయి రక్షిత్ స్టంట్స్ చేసేటప్పుడు ఒక తండ్రిగా భయపడ్డాను.. డైరెక్టర్గా జాగ్రత్తపడ్డాను. రక్షిత్ ఈ క్యారెక్టర్ను బాగా ఓన్ చేసుకున్నాడు. తన కష్టం స్ర్కీన్పై మంచి ఫలితాన్ని ఇస్తుంది. రాధిక పోషించిన పాత్ర.. చాలా కాలం పాటూ గుర్తుండిపోయేలా ఉంటుంది. సినిమాలోని ప్రతీ సన్నివేశం ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. అన్ని విభాగాల నుంచి మంచి అవుట్పుట్ వచ్చింది" అని చెప్పారు.

ప్రైమ్ షో కు డబుల్ ఇస్మార్ట్ హక్కులు



రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'డబుల్ ఇస్మార్ట్' ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో మాస్, యాక్షన్, డ్రామా, ఎంటర్టైన్మెంట్.. డబుల్ డోస్లో ఉంటాయంటున్నారు దర్శకుడు పూరి. తాజా సమాచారం ఏమిటంటే.. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల వరల్డ్ థియేట్రికల్ రైట్స్ ప్రైమ్ షో ఎంటర్టైన్మెంట్ అధినేతలు నిరంజన్ రెడ్డి, చైతన్యరెడ్డి సొంతం చేసుకున్నారు. సంజయ్దత్ ఓ పవర్ఫుల్ రోల్ పోషించిన 'డబుల్ ఇస్మార్ట్'లో కావ్య థాపర్ కథానాయిక. పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మాతలు.

నిర్మాతలతో ఇన్కమ్ టాక్స్ అధికారుల సమావేశం



తెలుగు నిర్మాతలతో ఆదాయపు పన్ను అధికారులు సోమవారం ఔట్ రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిల్మ్ ఛాంబర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయడానికి వివిధ గడువు తేదీల గురించి, సినిమాల నిర్మాణం, రాబడికి సంబంధించిన అకౌంటింగ్ గురించి ఈ కార్యక్రమంలో అధికారులు వివరించారు. ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ ఎస్. మూకాంబికేయన్, టి.మురళీధర్, కె.శ్రీనివాసరావు, సతీశ్ తదితర అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు దిల్ రాజు, కార్యదర్శి దామోదర ప్రసాద్ సహా పలువురు నిర్మాతలు పాల్గొన్నారు.

ఏడాదికి ఆరు చిత్రాలు



'బిగ్ బాస్' ఫేమ్ అలీ రజా హీరోగా నటించిన 'రామ్ ఎన్.ఆర్.ఐ.' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. సీతా నారాయణన్ కథానాయిక. 'పవర్ ఆఫ్ రిలేషన్షిప్' అనేది ఉప శీర్షిక. ఎన్. లక్ష్మీ నందా దర్శకత్వంలో ముప్పా సత్యనారాయణ నిర్మించారు. ఆదివారం రాత్రి జరిగిన చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్లో చిత్ర సమర్పకుడు సింగులూరి మోహన్కృష్ణ మాట్లాడుతూ 'సినిమా బాగా వచ్చింది. గోదావరి అందాలను అద్భుతంగా చూపించాం. ఈ నెల 26న విడుదల చేస్తున్నాం. ఇకపై ఏడాదికి ఆరు చిత్రాలైనా విడుదల చేయాలని నిర్ణయించుకున్నా. ప్రతి చిన్న చిత్రాన్నీ రిలీజ్ చేస్తా' అని చెప్పారు.

ఒక సిరీస్... అనేక మంది తారలతో!




ఒక సినిమాను ఇద్దరు దర్శకులు సంయుక్తంగా తెరకెక్కించడం అప్పుడప్పుడు జరుగుతుంటాయి. అనేక పాత్రలతో వైవిధ్యమైన కథలను కలుపుతూ ఒకే సినిమాగా తీయడం కూడా తెలిసిందే. కానీ విభిన్న కథలున్న ఒకే సినిమాను లేదా వెబ్ సిరీస్ను పలువురు దర్శకులు తీస్తే ఎలా ఉంటుంది?. లాక్ డౌన్ టైమ్లో మొదలైన ఈ సరికొత్త పంథా.. ఇప్పుడు అన్ని భాషల్లోనూ పాపులర్ ఫార్ములాగా మారింది. అదే అంతాలజీ. వెబ్ సిరీస్ల్లో ఎక్కువగా ఈ ట్రెండ్ కనిపిస్తుంది. అవేమిటో తెలుసుకుందాం.

లాక్డౌన్లో మొదటిసారిగా ఈ అంతాలజీ సిరీస్ను మన దక్షిణాది మేకర్స్ ప్రేక్షకులకు పరిచయం చేశారు. వెట్రిమారన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, విఘ్నేష్ శివన్, సుధా కొంగర దర్శకత్వం వహించిన 'పావై కథైగల్' 2020లో నెట్ఫ్లిక్స్లో విడుదలైంది. పరువు హత్యలు అంతర్భాగంగా విభిన్న కథలతో నాలుగు భాగాలుగా ఈ సిరీస్ తెరకెక్కింది. ఇందులో ప్రకాశ్ రాజ్, సాయి పల్లవి, అంజలి నటించారు. సమాజంలో జరిగిన కొన్ని వాస్తవిక సంఘటనల ఆధారంగా కల్పనను జోడించి తెరకెక్కించిన ఈ సిరీస్ అందరినీ గగుర్పాటుకు గురిచేసింది.







ప్రేమలోని డార్క్ సైడ్

ఆ తర్వాత తెలుగులో తొలి అంతాలజీ సిరీస్ 'పిట్టకథలు'. ఇప్పుడు కల్కి చిత్రంతో ప్రపంచ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన నాగ్ అశ్విన్ మరో ముగ్గురు దర్శకులు తరుణ్ భాస్కర్, సంకల్ప్ రెడ్డి, బి.వి. నందినీ రెడ్డి ఈ సిరీస్ను తెరకెక్కించారు. నాలుగు భాగాలుగా నెట్ఫ్లిక్స్లో 2021లో విడుదలైన ఈ సిరీస్లో జగపతిబాబు, సత్యదేవ్, లక్ష్మీ మంచు, శ్రుతీ హాసన్, ఈషా రెబ్బా నటించారు. ప్రేమలోని చీకటి కోణాల్ని.. ప్రేమికుల మధ్యన ఉండే విభిన్న పార్శ్వాలను టచ్ చేసిన ఈ అంతాలజీకి అప్పట్లో ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన లభించింది.

నవరసాలతో 'నవరస'

నవరసాలను తెరపై పలికించడమే లక్ష్యంగా.. తొమ్మిది మంది తమిళ దర్శకులు.. తొమ్మిది భాగాలుగా 2021లో వచ్చిన సిరీస్ 'నవరస'. ప్రియదర్శన్, గౌతమ్ వాసుదేవ్మీనన్, కార్తీక్ సుబ్బరాజ్, వసంత్, అరవింద్స్వామి, బిజోయ్ నంబియార్, కార్తీక్ నరేన్, సర్జున్ కే.ఎమ్, రతీంద్రన్ ప్రసాద్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్కు దర్శకుడు మణిరత్నంతో పాటు పలువురు కథలు అందించారు. సూర్య, విజయ్ సేతుపతి, సిద్ధార్థ్, అరవింద స్వామి, గౌతమ్ వాసుదేవ్ మీనన్, యోగిబాబు, రేవతి, పార్వతి తిరువోతు నటించిన ఈ సిరీస్ నెట్ఫ్లిక్స్లో అందుబాటులో ఉంది.

ఆరు విభిన్న ప్రేమ కథలతో..

న్యూయార్క్ టైమ్స్ పత్రికలో వచ్చిన 'మోడరన్ లవ్' ఆర్టికల్స్ ఆధారంగా తెలుగు, తమిళంలో 'మోడరన్ లవ్ హైదరాబాద్', 'మోడరన్ లవ్ చెన్నై' సిరీస్లను అమెజాన్ ప్రైమ్ వేదికగా తెరకెక్కించారు. 2022లో విడుదలైన 'మోడరన్ లవ్ హైదరాబాద్'.. 2023లో 'మోడరన్ లవ్ చెన్నై' రెండూ ఆరు భాగాలుగా వచ్చాయి. రెండింటిలోనూ హైదరాబాద్, చెన్నై నగరాల్లో వయసు, కుల మతాలకు అతీతంగా జరిగే ఆరు ఆసక్తికరమైన ప్రేమ కథలే కథాంశం. తెలుగు సిరీస్కు నగేశ్ కుకునూర్, వెంకటేశ్ మహా, ఉదయ్ గుర్రాల, దేవిక బహుధానం దర్శకత్వం వహించారు. ఆది పినిశెట్టి, రేవతి, నిత్యామీనన్, రీతూ వర్మ నటించారు. తమిళ సిరీస్ 'మోడరన్ లవ్ చెన్నై' సిరీస్కు భారతీరాజా, బాలాజీ శక్తివేల్, త్యాగరాజన్ కుమార్రాజా, రాజు మురుగన్, క్రిష్ణ కుమార్, అక్షయ్ సుందర్ దర్శకత్వం వహించారు. అశోక్ సెల్వన్, రీతూ వర్మ, వామికా గబ్బి ప్రధాన పాత్రలు పోషించారు.

వాసుదేవన్ నాయర్కు నివాళిగా...

జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, మలయాళ దర్శకుడు, రచయిత ఎమ్.టి.వాసుదేవన్ నాయర్ రచించిన షార్ట్ స్టోరీస్ ఆధారంగా తెరకెక్కిన వెబ్ సిరీస్ 'మనోరథంగళ్' ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కారణం కమల్ హాసన్, మమ్ముట్టి, మోహన్ లాల్, ఫహాద్ ఫాజిల్, పార్వతి తిరువోతు, అపర్ణ బాలమురళి, మధుబాల వంటి ప్రముఖ తారాగణం నటించడమే. ఎనిమిది మంది దర్శకులు దీనికి దర్శకత్వం వహించారు. ఈ వెబ్ సిరీస్ ఎమ్.టి.వాసుదేవన్ నాయర్కు, మలయాళ చిత్ర పరిశ్రమ మహోన్నత సంస్కృతికి ఇచ్చే నివాళి అని కమల్హాసన్ తెలిపారు. ఆగస్టు 15న జీ5లో ఇది విడుదలవుతుంది.

బాలీవుడ్లో ఈ అంతాలజీ సిరీస్ ట్రెండ్ ఎప్పుడో మొదలై.. సక్సెస్ఫుల్గా కొనసాగుతోంది. ఇప్పటివరకూ అక్కడ పదుల సంఖ్యలో ఇలాంటివి తెరకెక్కగా.. అధిక భాగం ఆకట్టుకున్నాయి. సౌత్లో ఈ తరహా ప్రయత్నాలు అప్పుడప్పుడు జరుగుతున్నాయి. మంచి కంటెంట్తో.. అనేక మందికి వినోదం అందించే దిశగా.. దక్షిణాది మేకర్స్ తరచూ ఇలాంటి ప్రయత్నాలతో ముందుకు వస్తే.. కొత్తదనాన్ని ఆదరించే ప్రేక్షకులు విజయం అందించడానికి సిద్ధంగా ఉన్నారు.

ఆ కుర్చీని మడత పెట్టి...




'డెడ్ పూల్' మూవీ ఫ్రాంఛైజ్ నుంచి వస్తున్న మూడో సినిమా 'డెడ్ పూల్ అండ్ వాల్వరిన్' ఈ నెల 26న విడుదల కానుంది, ఇందులో సూపర్ హీరోలు డెడ్ పూల్, వాల్వరిన్ చేసే సాహసాలు ప్రేక్షకులను అలరించనున్నాయి. ఇటీవల విడుదలైన టీజర్, ట్రైలర్స్ ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందాయి. ఈ నేపథ్యంలో మార్వెల్ టీమ్ ఈ సినిమాను అన్ని భారతీయ భాషల్లో విడుదల చేస్తోంది. అన్ని భాషల డబ్బింగ్స్ పూర్తయ్యాయి. తెలుగులో ఉన్న ట్రెండింగ్ పదాలు, యూత్ మధ్య విపరీతంగా వినిపించే డైలాగ్స్తో తెలుగు వెర్షన్ సిద్ధమైంది. 'కుర్చీ మడత పెట్టి', 'కెవ్వు కేక', 'రింగ రింగా' వంటి ప్రేక్షకులను అలరించే డైలాగ్స్ ప్రేక్షకులను అలరిస్తాయని చెబుతున్నారు. వాల్వరిన్గా హ్యూ జాక్మన్, డెడ్ పూల్గా రయన్ రెనాల్డ్స్ నటించారు.

ఆయనకు 41.. ఆమెకు 28!



ఔను... వాళ్లిద్దరు ఇష్టపడ్డారు

ప్రేమకు వయసుతో పని లేదు. మనసులు కలిస్తే చాలు. ఈ విషయాన్ని మరోసారి నిరూపిస్తున్నారు కన్నడ దర్శకుడు తరుణ్ కిశోర్ సుధీర్ (41). బాల నటుడిగా కొన్ని చిత్రాల్లో నటించి, పెరిగి పెద్దయ్యాక కూడా నటుడిగా కొనసాగిన సుధీర్ ఆ తర్వాత 'చౌక' చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'రాబర్ట్' (2021), 'కాటేరా' (2023) చిత్రాలకు దర్శకత్వం వహించారు తరుణ్. ప్రస్తుతం రేణుకా స్వామి హత్య కేసులో అరెస్ట్ అయిన దర్శన్ ఈ రెండు చిత్రాల్లో హీరో కావడం గమనార్హం. 'రాబర్ట్' చిత్రంలో హీరోయిన్గా నటించిన సోనాల్ మొంటెరో (28)తో తరుణ్ ప్రేమలో పడ్డారు. అయితే ఆ విషయాన్ని రహస్యంగా దాచారు. వీరిద్దరి గురించి రూమర్స్ వచ్చినా ఎవరూ బయట పడలేదు. తాజా ఇప్పుడు తమ ప్రేమ విషయాన్ని బయట పెట్టిన తరుణ్, సోనాల్.. ఆగస్ట్ 11న బెంగళూరులో పెళ్లి చేసుకోబోతున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.





అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ ఒకే పార్టీ నాయకులు. వెనుక బడిన ప్రాంతాలకు చెందినవారు. ఒకరు పల్లా శ్రీనివాస్.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడైతే మరొకరు ఎస్సీ విభాగం అధ్యక్షుడు ఎంఎస్ రాజు. ఒకరు ఉత్తరాంధ్ర నుంచి, మరొకరు సీమ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ లాబీల్లో వారిద్దరూ ఎదురుపడి పలకరించుకున్నారు. ఈ సన్నివేశాన్ని చూసిన ఇతర ఎమ్మెల్యేలు 'ఒకరు టాప్.. మరొకరు లాస్ట్' అంటూ సరదాగా చేసిన వ్యాఖ్య అసెంబ్లీ లాబీల్లో నవ్వులు పూయించింది. ఎన్నికల ఫలితాల్లో అత్యధికంగా 95 వేలకుపైగా ఓట్ల మెజారిటీతో పల్లా శ్రీనివాస్ గెలుపొందగా, ఎమ్మెస్ రాజు అత్యల్పంగా 351 ఓట్ల మెజారిటీతో గట్టెక్కారు. ఏదేమైనా ఇద్దరూ ఐదేళ్ల పాటు ఎమ్మెల్యేలే కదా! అని మరొకరు వ్యాఖ్యానించడం అక్కడ మరోమారు నవ్వులు పూయించింది.

గవర్నర్ ప్రసంగం.. 36 నిమిషాల్లో పూర్తి

- దానిని అడ్డుకోవడానికే సభకు జగన్ అండ్ కో
- గవర్నర్ ప్రసంగిస్తుండగా 16 నిమిషాలు వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నినాదాలు.. ఆ తర్వాత అసెంబ్లీ నుంచి వాకౌట్

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): గతం కంటే భిన్నంగా ఈసారి శాసనసభలో ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం 36 నిమిషాల్లోనే పూర్తయింది. గతంలో 40 పేజీలకు తగ్గకుండా ప్రసంగ పాఠం ఉండేది. అదంతా చదవడానికి ఎక్కువ సమయం పట్టేది. ఈదఫా 20 పేజీల ప్రసంగమే కావడంతో 36 నిమిషాల్లోనే పూర్తయింది. సోమవారం ఉదయం 10 గంటలకు కొత్త శాసనసభలో తొలిసారి ప్రసంగించేందుకు వచ్చిన గవర్నర్‌ను సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆహ్వానించారు. అనంతరం స్పీకర్, మండలి ఛైర్మన్ గవర్నర్‌తో పాటు పోడియం వద్దకు చేరుకున్నారు. ఇక గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకే మాజీ సీఎం సహా వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభలోకి అడుగుపెట్టారు. ఉదయం 10 గంటలకు రెండు నిమిషాల ముందుగా నినాదాలు చేస్తూ సభలో అడుగుపెట్టారు. జగన్ ముందు నడవగా ఆయన వెంటే ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు నల్లకండువాలు ధరించి వచ్చారు. హత్యా రాజకీయాలు నశించాలంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేయగా.. దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందంటూ కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు గట్టిగా అరిచారు. ఈ క్రమంలో జగన్ అందరికీ అభివాదం చేసుకుంటూ ముందుకు నడిచారు. గవర్నర్ ప్రసంగించడం ప్రారంభించగానే.. జగన్ తప్ప మిగతా వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరూ లేచి ప్లకార్డులు పట్టుకుని.. 'హత్యారాజకీయాలు నశించాలి', 'సేవ్ డెమోక్రసీ' అంటూ నినాదాలు చేశారు. కొద్దిసేపటి తర్వాత పోడియం వద్దకు వెళ్లి నినదించారు. 10 నిమిషాల తర్వాత మరింత బిగ్గరగా అరుస్తూ గవర్నర్ ప్రసంగానికి అంతరాయం కలిగే విధంగా ప్లకార్డులు చించి ఎగరేశారు. 15 నిమిషాల తర్వాత మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పోడియం వద్ద నుంచి వచ్చి జగన్‌తో మాట్లాడిన తర్వాత వైసీపీ సభ్యులు అక్కడి నుంచి తిరిగి వచ్చారు. ఆ వెంటనే అందరూ బయటకు వెళ్లిపోయారు. మొత్తంగా 16 నిమిషాల పాటు సభలో నినాదాలు చేసి వాకౌట్ చేశారు. కాగా, గతానికి భిన్నంగా ఈసారి గవర్నర్‌ను పోలీసు బ్యాండ్‌తో సభలోకి ఆహ్వానించారు. గతంలో సభలోకి వేరే మార్గం ద్వారా లోపలకు గవర్నర్‌ను తీసుకొచ్చేవారు. ఇప్పుడు ప్రధాన ద్వారం నుంచి లోపలకు సాదరంగా ఆహ్వానించి తీసుకొచ్చారు.

రూ.25 లక్షల కమోడ్ చూడడానికి టికెట్ పెట్టండి

- రుషికొండ ప్యాలెస్‌పై విష్ణుకుమార్‌రాజు సలహా

అమరావతి, జులై 22(ఆంధ్రజ్యోతి): 'జగన్ ప్రభుత్వం విశాఖలో రుషికొండ ప్యాలెస్ కట్టడానికి రూ.వందల కోట్ల ప్రజాధనం తగులబెట్టింది. బాత్‌రూంలో రూ.25 లక్షలు విలువ చేసే కమోడ్ పెట్టడం నేనెప్పుడూ వినలేదు. ప్రజలు కూడా దానిని చూడాలనుకుంటున్నారు. రూ.50 టికెట్ పెట్టండి. అందరూ చూస్తారు' అని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సూచించారు. అసెంబ్లీ భవనంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశంలో సీఎం చంద్రబాబుకు ఆయనీ సలహా ఇచ్చారు. 'నిజమే. అంత ఖరీదైన కమోడ్ ఏమిటో నేనూ చూడలేదు. ప్రజలకు చూపిద్దాం. కానీ టికెట్ యాభై రూపాయలంటే మరీ ఎక్కువ. తక్కువ ధరతో టికెట్ పెట్టి చూపిద్దాం' అని ముఖ్యమంత్రి కూడా సరదాగా అన్నారు.

లోకేశ్‌తో బీజేపీ ఎమ్మెల్యేల భేటీ

మంత్రి సత్యకుమార్ సహా బీజేపీ ఎమ్మెల్యేలు మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్‌తో అసెంబ్లీ ప్రాంగణంలోని ఆయన చాంబర్లో భేటీ అయ్యారు. వైసీపీ నేతల చేరికలపై ఈ సందర్భంగా కొంత చర్చ జరిగింది.

ఐదేళ్లుగా అశాంతి!



ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం మొదలు.. జగన్ గత నెలలో దిగేదాకా కొనసాగింది

ప్రసంగంలో అబ్దుల్ నజీర్ వెల్లడి

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో జగన్ దుష్పరిపాలన, విధ్వంసంతో ప్రజల్లో మానసిక అశాంతి, వేదన చెలరేగాయని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఇది రాష్ట్ర భౌగోళిక సరిహద్దులకే పరిమితం కాలేదని.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు మాట్లాడే ప్రజలంతా ఆ ప్రభుత్వ చర్యలతో కలత చెందారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను పలు దఫాలు విభజించడంతో ప్రజలు సుదీర్ఘ కాలం పాటు అభివృద్ధికి, పురోగతికి నోచుకోలేకపోయారని.. అయితే 2014లో రాష్ట్ర విభజన కారణంగా జరిగిన నష్టం కంటే జగన్ జమానాలో జరిగిన నష్టమే అధికంగా ఉందని పేర్కొన్నారు. సోమవారమిక్కడ అసెంబ్లీలో ఉభయసభలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసాన్ని వివరించారు. కొత్త ప్రభుత్వం ముందున్న సవాళ్లను తెలియజేశారు. 2014లో అశాస్త్రీయ విభజన వల్ల నవ్యాంధ్రకు 46 శాతం వనరులు మాత్రమే వారసత్వంగా వచ్చాయన్నారు. ఆర్థిక వ్యవస్థపై కనీవినీ ఎరుగని ఒత్తిడి కలిగించిందని చెప్పారు. 2014-19 మధ్య కాలంలో సాధించిన మైలురాళ్లన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి నాయకత్వం వల్లే సాధ్యమయ్యాయని.. రాష్ట్రం అత్యున్నత అభివృద్ధి పథంలో పయనిస్తున్న సమయంలో 2019లో జరిగిన పాలన మార్పు.. మళ్లీ నవ్యాంధ్రప్రదేశ్‌కు విఘాతం కలిగించిందని చెప్పారు. 2014లో రాష్ట్ర విభజన భారాన్ని చవిచూసిన రాష్ట్రం.. ఆ ఐదేళ్ల అసమర్థ పాలన రూపంలో మరో పెద్ద పరాజయాన్ని చూసిందని.. ఇది దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. జగన్ ప్రభుత్వం ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభించిన విధ్వంసం గత నెలలో పదవీకాలం ముగిసే వరకు నిరంతరాయంగా కొనసాగించిందని విమర్శించారు. 'ఈ ఐదేళ్లలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. జీవించే స్వేచ్ఛను కోల్పోయారు. ప్రతీకార రాజకీయాలు రాష్ట్ర శ్రేయస్సు, అభివృద్ధి అవకాశాలను దెబ్బతీశాయి' అని తెలిపారు. రాష్ట్రంలో రాజ్యాంగపరమైన విచ్ఛిన్నం జరిగిందా అనే అంశంపై న్యాయ విచారణ జరిపించాలని హైకోర్టు కోరిన విషయం గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్న కారణంగా బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరగడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని.. గతంలో ఎప్పుడూ లేని విధంగా బిల్లుల చెల్లింపుల కోసం 25 వేల కేసులు దాఖలయ్యాయని తెలిపారు. అనేక కేసుల్లో అధికారులు వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావడం, అరెస్టు, ధిక్కార కేసులు నమోదుతో బ్యూరోక్రసీ అవమానాలపాలైందని.. అధికారులను బలిపశువులను చేయడంతో పాటు పరిపాలన యంత్రాంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆక్షేపించారు. గవర్నర్ ఇంకా ఏం చెప్పారంటే...

జగన్‌తో రఘురామ ముచ్చట్లు

సభ్యులందరికీ అభివాదం చేస్తూ జగన్ సభలోకి ప్రవేశించారు. ఈ క్రమంలో ముందు వరుసలో ఉన్న ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజును పలకరించారు. జగన్ కదిలి ముందుకెళ్తుంటే రఘురామరాజు కాసేపు ఆపి ఏదో మాట్లాడడం కనిపించింది. ఈ సమయంలో సభ్యులంతా వారి వైపు దృష్టి సారించారు. ఏం మాట్లాడుకుంటున్నారోనని ఆసక్తిగా గమనించారు. తర్వాత 10 నిమిషాలకు రఘురామ జగన్ కూర్చున్న సీటు వద్దకు వెళ్లి ఏదో మాట్లాడడం ప్రారంభించారు. ఒక నిమిషం పాటు ముచ్చటించడం కనిపించింది. అనంతరం సభ వెలుపల పలువురు జగన్‌తో ఏం మాట్లాడారని రఘురామరాజును ప్రశ్నించారు. తాను కనిపించిన వెంటనే జగన్ హాయ్ అని పలకరించారని.. తన భుజంపై రెండుసార్లు చేయి వేసి మాట్లాడారని ఆయన తెలిపారు. రోజూ అసెంబ్లీకి రావాలని జగన్‌ను కోరానని, రెగ్యులర్‌గా వస్తాను.. మీరే చూస్తారుగా అని ఆయన చెప్పినట్లు తెలిపారు. తనకు జగన్ పక్కనే సీటు వేయించాలని శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌ను లాబీలో రఘురామ కోరగా.. తప్పకుండా అని పయ్యావుల కేశవ్ నవ్వుతూ సమాధానమిచ్చారు.


జగన్‌తో రఘురామరాజు (ఫైల్)

అమరావతి కలను నీరు కార్చారు..

నవ్యాంధ్ర వృద్ధికి కేంద్ర బిందువుగా భావించిన అమరావతి రాజధాని ప్రాంతం పూర్తిగా నాశనమైంది. అమరావతి కలను నీరుగార్చేందుకు గత ప్రభుత్వం పాలన వికేంద్రీకరణ ముసుగులో మూడు రాజధానుల ఆలోచనలతో ప్రజలను గందరగోళానికి గురిచేసింది. మూడు రాజధానుల ఏకపక్ష ప్రకటన ఫలితంగా రాజధానివాసులు 1,631 రోజులు నిరసన చేయాల్సి వచ్చింది. రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ(సీఆర్‌డీఏ) అధికార పరిధిని 6993 చ.కి.మీ.కు కుదించడం, ప్రాంతీయ బృహత్తర ప్రణాళికలను రూపొందించకుండా పక్కనబెట్టేయడంతో అమరావతి ప్రాంత పురోగతిని అడ్డుకున్నాయి.

మౌలిక వసతులేవీ..?: గత ఐదేళ్లలో ఒక్క నీటిపారుదల ప్రాజెక్టు పూర్తికాలేదు. కొత్త పరిశ్రమలేవీ రాలేదు. రోడ్లు, భవనాలు, ఆస్పత్రులు, తాగునీటికి సంబంధించి ఎలాంటి మౌలిక సదుపాయాలు చేపట్టలేదు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరాన్ని పూర్తి చేయడం అత్యంత ముఖ్యం. కానీ గత ఐదేళ్లలో ఆ ప్రాజెక్టు పూర్తిగా పట్టాలు తప్పింది. కాంట్రాక్టులను రద్దుచేసి రివర్స్ టెండరింగ్‌ను ప్రవేశపెట్టి, ప్రాజెక్టుకు మాత్రమే కాకుండా నదులను అనుసంధానం చేసి ప్రతి ఎకరం భూమికీ సాగునీటిని అందించాలనే భావనకు కూడా తీరని నష్టం చేశారు. రాష్ట్ర ఇంధన రంగం రూ.1,29,503 కోట్ల మేర భారీ నష్టాలకు గురైంది. ఐదేళ్లలో భూమి, గనులు, ఖనిజాలు, అడవుల వంటి సహజ వనరుల దుర్వినియోగం, దోపిడీ ఎక్కువయ్యాయి. భూ ఆక్రమణలు, ఇంటి స్థలాల పట్టాల కేటాయింపులో అక్రమాలు, భూ కేటాయింపులో ఉల్లంఘనలు, అనర్హులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, రీసర్వే, ఏపీ భూహక్కు చట్టం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీశాయి. ఇసుక, ఖనిజ సంపదను కొల్లగొట్టడంతో ఖజానాకు భారీ నష్టం వాటిల్లింది. ఈ రంగాల్లో అక్రమ కార్యకలాపాల వల్ల ప్రాథమికంగా రూ.19 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. ఈ అనైతిక ఇసుక విధానం వల్ల 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారు. అసమర్థ, అసమంజస విధాన రూపకల్పన, అమల్లో అలసత్వం కారణంగా ఖనిజ రాబడిలో రూ.9,750 కోట్ల మేర నష్టం వచ్చింది. ఎర్రచందనంలో 2014-19 మధ్య రూ.1,623 కోట్ల ఆదాయం రాగా, గత ఐదేళ్లలో అక్రమ రవాణా కారణంగా ఆ ఆదాయం రూ.441 కోట్లకు పడిపోయింది. విశాఖపట్నంలోని రుషికొండ, మడ అడవుల విధ్వంసంతో రాష్ట్ర వారసత్వ సంపదను, సంస్కృతిని కూడా దెబ్బతీశారు.

సూపర్‌సిక్స్ అమలు దిశగా..

పరిపాలనను తిరిగి గాడిలో పెట్టడం చాలా సవాళ్లతో కూడిన పని. ప్రభుత్వం ఇప్పటికే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ప్రారంభించింది. సూపర్ సిక్స్ హామీల అమలుకు కట్టుబడి ఉంది. అధికారంలోకి వచ్చిన వెంటనే 16,347 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి మెగా డీఎస్సీ ప్రకటించాం. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయడం, పింఛన్లను రూ.4 వేలకు పెంచడం, నైపుణ్య గణన నిర్వహించడం, పేదలకు నాణ్యమైన ఆహారాన్ని రూ.5లకు అందించేందుకు అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించడం, ఉచిత ఇసుక వంటి వివిధ చర్యలతో తన ట్రేడ్‌మార్క్ అయిన ప్రజాకేంద్రీకృత పరిపాలనకు శ్రీకారం చుట్టింది. ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమర్థ నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడాన్ని అన్ని ప్రయత్నాలూ చేస్తుందని విశ్వసిస్తున్నా. ఎన్నికల్లో గెలవడం, బాధ్యతలను స్వీకరించడం సంతోషకరమైన విషయమే అయినా.. దేశంలోనే మొదటిసారిగా క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నాం. రాష్ట్ర విభజనకు సంబంధించిన అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నందున సామరస్యపూర్వక పరిష్కారాలను త్వరగా కనుగొనాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్ర మంత్రులను, అధికారులను కలిశారు. తెలంగాణ ప్రభుత్వంతోనూ సమావేశమయ్యారు.

పునర్నిర్మాణానికి సహకరించాలి..

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు అపూర్వమైన తీర్పుతో ప్రజాహిత ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఐదు కోట్ల మంది ప్రజలు చూపిన సంకల్పాన్ని అభినందించాలి. అలాగే ప్రస్తుత ఆందోళనకర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వానికి సహకరించాలి. సంక్షోభాన్ని అధిగమించే మార్గాలను అన్వేషించడానికి సమష్టి ఆలోచన, మేధావులు, విద్యావేత్తలతో విస్తృతమైన చర్చలు అవసరం. 2047 నాటికి వికసిత్ భారత్ అనే నూతన అభివృద్ధి నమూనా దృష్ట్యా స్వల్ప, మధ్యస్థ, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా అభివృద్ధి సంబంధిత వ్యవస్థను ప్రారంభించే చర్యలు తీసుకుంటాం.


టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మన మంచే మన బ్రాండ్!

> జగన్ కుట్రల వల్ల నేను 53 రోజులు జైల్లో ఉన్నాను. ఈ అవమానానికి ప్రతీకారం అందరి కంటే ముందు నేనే తీర్చుకోవాలి. కానీ వద్దనుకున్నాను. కక్షలు, కార్పణ్యాలే పనిగా పెట్టుకుంటే నష్టపోతాం. ప్రజలు మనల్ని గెలిపించింది కక్షలు తీర్చుకునేందుకు కాదు.
> - చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా సోమవారం మధ్యాహ్నం ఆయన అసెంబ్లీ కమిటీ హాల్లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "సామాజిక పింఛన్‌ను మొదటి నెలలోనే రూ.వెయ్యి పెంచి రూ.4 వేలు చేశాం. గత 3 నెలల బకాయిలు కలిపి ఒకేసారి రూ.ఏడు వేలిచ్చాం. దివ్యాంగుల పింఛను పెంచాం. ఉచిత ఇసుక తెచ్చి దోపిడీ లేకుండా చేశాం. మన నిర్ణయాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఇవి పక్కకు వెళ్లి.. వేరే విషయాలు వారి ముందుకు రాకుండా చూసుకోవాలి" అని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగుండాలని, రాజకీయ ప్రతీకారాల జోలికి వెళ్లవద్దని తేల్చి చెప్పారు. ఇసుక వ్యవహారాల్లో ఎవరూ తలదూర్చవద్దన్నారు.

జగన్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

జగన్ తీరు మారలేదని, రాష్ట్రంపై బురద చల్లడానికి వెనకాడటం లేదని చంద్రబాబు ఘాటుగా వ్యాఖ్యానించారు. "వినుకొండలో ఇద్దరు వైసీపీ కార్యకర్తల మధ్య చాలాకాలంగా తగాదాలు ఉన్నాయి. వారిలో ఒకరు మరొకరిని హత్య చేశారు. జగన్ దానికి రాజకీయ రంగు పులమాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. వివేకానందరెడ్డి హత్యను టీడీపీ నేతల మీద రుద్దడానికి ఇదే తరహా ప్రయత్నం చేశారు. రాష్ట్రం ప్రశాంతంగా ఉన్నా ఘోరాలు జరిగిపోతున్నాయని, వందల హత్యలు జరుగుతున్నాయని బురద చల్లాలని చూస్తున్నారు. ఆయన హయాంలో అరాచకాలతో పెట్టుబడులు రాలేదు. ఇప్పుడు కూడా అప్రతిష్ట తెచ్చి పెట్టుబడులు, పరిశ్రమలు రాకుండా చేయాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు. ఈ కుట్రలపై చర్చ పెట్టాలి" అని పిలుపునిచ్చారు.

వ్యవస్థ నాశనానికి ఇదే ఉదాహరణ

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం జరిగి ఫైళ్లు దగ్ధమైన ఘటనను కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. "రాత్రి 11.20కి జరిగింది. ప్రభుత్వ కార్యాలయంలో ఇలాంటి ఘటన జరిగితే వెంటనే మంటలు ఆర్పాలి. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి అనుమానితుల కోసం గాలించాలి. కానీ జరగలేదు. అధికారులు చాలా ఉదాసీనంగా స్పందించారు. గత ఐదేళ్లలో అధికార వ్యవస్థను ఎంత నాశనం చేశారో చెప్పడానికి ఇదే పెద్ద ఉదాహరణ. అందుకే దర్యాప్తునకు సీనియర్ అధికారులను పంపాను" అనిచెప్పారు.

అందరికీ అవకాశాలు ఇవ్వండి: మనోహర్

మూడు భాగస్వామ్య పక్షాల మధ్య రాజకీయ మైత్రి మరింత బలపడటానికి నామినేటెడ్ పదవుల్లో అందరికీ భాగస్వామ్యం కల్పించాలని మంత్రి నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు. దానికి ఇబ్బందేమీ లేదని, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో మిత్రపక్షాల వారి పేర్లు కూడా ఇవ్వాలని చంద్రబాబు చెప్పారు. వరదల కారణంగా నాట్లు వేసిన రైతులు చాలా నష్టపోయారని, వారికి తాత్కాలిక సాయం ఎకరానికి రూ.వెయ్యి చొప్పున కాకుండా ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.ఆరు వేలు ఇవ్వాలని నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ విజ్ఞప్తి చేశారు. పరిశీలిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. వరదలపై ప్రస్తుత సమావేశాల్లో అరగంట చర్చ కూడా నిర్వహిద్దామన్నారు. ఇసుక సమస్యలను ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. ప్రజల అవసరాలకు చాలినంత ఇసుక లభ్యం కావడం లేదని, దీంతో రేట్లు తగ్గడం లేదని ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, శ్రీనివాసరావు తదితరులు చెప్పారు. లోడింగ్, రవాణా చార్జీలు గోదావరి జిల్లాల్లో అధికంగా ఉన్నాయని, తూర్పు కలెక్టర్ తమ వద్ద ఉన్న ఇసుకను పశ్చిమ గోదావరి జిల్లాకు వెళ్లనీయడం లేదని మరో ఎమ్మెల్యే చెప్పారు. వరదల సీజన్‌లో ఈ ఇబ్బంది ఉంటుందని, తర్వాత రేవులన్నీ తెరిస్తే ఇసుక లభ్యత పెరిగి ధరలు తగ్గుతాయని చంద్రబాబు పేర్కొన్నారు. "ఆర్థిక సమస్య చాలా తీవ్రంగా ఉంది. కేంద్రం నుంచి కొంత ఆదుకోవాలని కోరాం. ఖజానా పూర్తిగా ఖాళీగా ఉంది. కానీ అత్యవసరమైన పనులు ఆపలేం. రోడ్ల పరిస్థితి ఘోరంగా ఉంది. ముందు వాటిని బాగుచేయాలి. వాటి మరమ్మతులకు రూ.250 కోట్లు ఇవ్వాలని నిర్ణయించాం. చాలకపోతే మరో రూ.500 కోట్లయినా ఇస్తాం' అని వివరించారు. ఢిల్లీలో జగన్ ఎన్ని విన్యాసాలు చేసినా అతనిని పట్టించుకొనే పరిస్థితి లేదని బీజేపీ నేత, మంత్రి సత్యకుమార్ అన్నారు.

జగన్‌కు తత్వం బోధపడలేదు: పవన్

అసెంబ్లీ సమావేశాలకు వచ్చిన సమయంలో వైసీపీ సభ్యుల తీరు అసహ్యం కలిగిస్తోందని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. "జగన్‌కు ఇంకా తత్వం బోధపడలేదు. నెల రోజుల్లోనే ప్రభుత్వంపై యుద్ధం చేయాలని అనుకుంటున్నారు. సభలోకి వచ్చే ముందు పోలీసులతో గొడవ, సభ లోపల గవర్నర్ ప్రసంగానికి అడ్డుపడమని ఎమ్మెల్యేలను రెచ్చగొట్టడం ఆయన అహంకారానికి నిదర్శనం. ఎల్లకాలం తానే ముఖ్యమంత్రిగా ఉంటానన్న భ్రమ నుంచి ప్రజలు బయట పడేసినా ఆయన ఇంకా ఆ భ్రమలోనే ఉన్నట్లు అనిపిస్తోంది" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు తీసుకుంటున్న నిర్ణయాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు.


శాసనసభ వ్యవహారాల కమిటీ సమావేశంలో స్పీకర్ అయ్యన్న, సీఎం చంద్రబాబు, విష్ణుకుమార్ రాజు, పయ్యావుల, నాదెండ్ల తదితరులు

26 వరకు అసెంబ్లీ

- రెండు బిల్లులు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు ఐదు రోజులపాటు కొనసాగనున్నాయి. సభా వ్యవహారాల కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆ వివరాలను సోమవారం తన చాంబర్‌లో మీడియాకు వెల్లడించారు. 26వ తేదీ(శుక్రవారం) వరకూ సమావేశాలు జరుగుతాయని, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, ఆరోగ్య విశ్వ విద్యాలయానికి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరణ బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం చర్చ, ఆమోదం ఉంటాయని చెప్పారు. బుధవారం నుంచి మూడు రోజులపాటు మూడు శ్వేతపత్రాలను ప్రభుత్వం ప్రవేశపెడుతుందని, వాటిపై చర్చ కూడా జరుగుతుందన్నారు. మంగళవారం నుంచి ప్రశ్నోత్తరాలను ప్రారంభిస్తామని, జీరో అవర్ తదితరాలు కూడా మొదలవుతాయని వివరించారు. 'ఈసారి సభకు వచ్చిన ఎమ్మెల్యేల్లో 88 మంది కొత్తవారు ఉన్నారు. వారికి అసెంబ్లీ వ్యవహారాలు, రాజ్యాంగ అంశాలపై త్వరలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాం. దానికి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఆహ్వానించాలని ముఖ్యమంత్రి సూచించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు తదితర ప్రముఖులను కూడా ఆహ్వానించాలనుకుంటున్నాం' అన్నారు. అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రుల నివాస భవనాల నిర్మాణం 80 శాతం పూర్తయినట్టు స్పీకర్ చెప్పారు. ఆరు నెలల్లో వాటిని పూర్తి చేయాలని తాను కోరగా, తొమ్మిది నెలల్లో పూర్తి చేస్తామని సీఆర్‌డీఏ అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. నలుగురు ప్యానల్ స్పీకర్లను నియమించాలని నిర్ణయించామని, వారి పేర్లు ఈ సమావేశాల్లోనే ప్రకటిస్తామని చెప్పారు.

తాగునీరు, డ్రైనేజీ సమస్యలు తీర్చండి

- పవన్ కల్యాణ్‌కు జనసేన ఎమ్మెల్యేల వినతి

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం పూర్తయిన వెంటనే ఆయన తన చాంబర్‌లో ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. నియోజకవర్గాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను వివరించారు. ఈ సమస్యలు పరిష్కరిస్తే కొంత మేరకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

డిప్యూటీ లీడర్‌గా మనోహర్

శాసనసభలో జనసేన ఉపనేతగా నాదెండ్ల మనోహర్ ఎంపికయ్యారు. ఈ మేరకు సభాపతికి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమాచారం అందించారు. పార్టీ విప్‌గా లోకం మాధవి, కోశాధికారిగా పులపర్తి రామాంజనేయులు, కార్యదర్శులుగా వంశీకృష్ణ శ్రీనివాస్, వరప్రసాద్‌ను నియమించారు.


అసెంబ్లీ వద్ద వేలు చూపిస్తూ పోలీసులను హెచ్చరిస్తున్న జగన్

- అసెంబ్లీ రూల్స్‌పై జగన్ క్లాస్
- నాడు సభలోకి ప్లకార్డులొద్దని సుద్దులు
- నేడు అడ్డుకున్నందుకు చిందులు
- పోలీసు అధికారులకు వార్నింగ్

అప్పుడలా.. ఇప్పుడిలా..!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తాము అధికారంలోకి ఉన్నప్పుడు ప్రభుత్వం, అధికారులు ఏది చేస్తే అదే రూల్. ప్రతిపక్షాలు ఎలా నడుచుకోవాలో, ఎలా ప్రవర్తించకూడదో కూడా చెబుతారు. అదే తాము ప్రతిపక్షంలోకి వచ్చాక అవేవీ వర్తించవు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడుతారు. వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి తీరు ఇది. సోమవారం అసెంబ్లీ గేటు వద్ద పోలీసు అధికారులకు జగన్ ఇచ్చిన వార్నింగ్ చూసి అధికారులే ఔరా అని ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్ చెప్పిన సుద్దులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రతిపక్ష సభ్యులు సభలోకి ప్లకార్డులు పట్టుకురావడం తప్పన్నారు. ఇంకా చాలా చాలా చెప్పారు. అయితే తాజా అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జగన్ పార్టీ సభ్యులు ప్లకార్డులను పట్టుకుని వచ్చారు. ప్రతిపక్ష నేత హోదాలేని జగన్‌ను భద్రతాసిబ్బంది సాధారణ ఎమ్మెల్యేగానే పరిగణించి నాలుగో నంబరు గేటు వద్ద ఆయన వాహనాన్ని బయటే నిలిపివేశారు. తర్వాత ఎమ్మెల్యేలతో కలిసి ఆయన నల్ల కండువాలతో లోపలకు వెళ్తుండగా అడ్డుకున్నారు. వాటికి అనుమతి లేదని స్వాధీనం చేసుకున్నారు. ప్లకార్డులను, పేపర్లను చించివేశారు. దీనిపై జగన్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ పోలీసు అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. ఏకవచనంతో బెదిరించేలా మాట్లాడారు.

నాడు జగన్ ఏం చెప్పారంటే...

ఐదేళ్ల క్రితం ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టినప్పుడు ప్రతిపక్షాలు ఎలా వ్యవహరించాలో క్లాస్ తీసుకున్నారు. కాలినడకన ఊరేగింపుగా నాటి ప్రతిపక్షనేత చంద్రబాబు రావడంపై కూడా జగన్ అభ్యంతరం చెప్పారు. ఆయన్ను, టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మార్షల్స్ అడ్డుకున్నారు. ప్రధాన గేటును మూసేశారు. ఆ రోజున అసెంబ్లీలో జగన్ మాట్లాడుతూ.. చంద్రబాబు కాలినడకన ఊరేగింపుగా ఎమ్మెల్యేలూ, ఎమ్మెల్యేలు కానివారు, ఇతరులు, పార్టీ కార్యకర్తలు, బ్లాక్‌క్యాట్ కమెండోలతో ప్రదర్శనగా గేటులో నుంచి ప్రవేశించబోయారని అన్నారు. వారిని అడ్డుకున్న మార్షల్స్‌ను సమర్థించారు. ప్రతిపక్ష సభ్యులు పోడియం వద్దకు వస్తే ఆటోమెటిక్‌గా అనర్హత వేటు వేసేయాలంటూ ఆదేశాలూ ఇచ్చారు. గవర్నర్ ప్రసంగం సమయంలో పోడియం వద్దకు వచ్చి నిరసన తెలియజేస్తే తప్పుబట్టారు. సభ్యులు తమ సీటు వద్ద నిలుచునే నిరసన చెప్పాలన్నారు. పోడియం ఎదుట గీత పెట్టాలని.. అది దాటి వచ్చిన వారిని అనర్హులుగా ప్రకటించాలని నాటి స్పీకర్ తమ్మినేని సీతారాంకు సూచించారు. అవన్నీ మరిచిపోయి ఇప్పుడు సభలో గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగులుతామని జగన్ ఆదివారం ప్రకటించారు. ప్లకార్డులతో సభకు వచ్చి హంగామా చేశారు.

జగన్ చిందులు!

(మొదటి పేజీ తరువాయి)

మినహా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల వాహనాలను అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించరు. ప్రతిపక్ష నేత హోదాలేని జగన్ వాహనాన్ని సోమవారంభద్రతా సిబ్బంది అసెంబ్లీ నాలుగో నంబరు గేటు వద్ద నిలిపివేశారు. ఆ తర్వాత వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి జగన్ నల్ల కండువాలు ధరించి, ప్లకార్డులతో ప్రదర్శనగా వెళ్తుండగా అడ్డుకున్నారు. వాటికి అనుమతి లేదని స్వాధీనం చేసుకున్నారు. ప్లకార్డులను, పేపర్లను లాగేసుకున్నారు. దీంతో జగన్ ఆగ్రహంతో ఊగిపోయారు. ప్లకార్డులు చించే అధికారం ఎవరిచ్చారని భద్రతా సిబ్బందిని నిలదీశారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని.. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీసు అధికారి చొక్కాకు ఉన్న నేమ్‌ప్లేట్‌ను చూస్తూ.. 'మధుసూదనరావ్! గుర్తుపెట్టుకో.. ఎల్లకాలం ఇలాగే ఉండదు' అని ఏకవచనంతో హెచ్చరించారు. అనంతరం తన వాళ్లతో కలిసి సభలోకి వెళ్లారు. గవర్నర్ ప్రసంగం ముగియకముందే జగన్ బయటకు వచ్చేశారు. మండలిలో వైసీపీ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు గదిలోకి వెళ్లి కూర్చున్నారు. గవర్నర్ ప్రసంగం ముగిసి.. వెళ్లిపోయాక జగన్ బయటకు వచ్చారు. ఈలోపు.. అసెంబ్లీ ప్రాంగణంలోకి జగన్ వాహనాన్ని రప్పించే విషయమై భద్రతా సిబ్బంది శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌ను సంప్రదించారు. ఆయన మాజీ సీఎం కాబట్టి వాహనాన్ని అనుమతించాలని సిబ్బందిని మంత్రి ఆదేశించారు. లోపలిదాకా వాహనం రావడంతో... జగన్ అందులో కూర్చుని వెళ్లిపోయారు.

ఆయన పేరు మధుసూదన్‌రావు కాదు

అసెంబ్లీ గేటు ముందు పోలీసు అధికారికి జగన్ వార్నింగ్ ఇవ్వడం సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. మధుసూదనరావు అని జగన్ సంబోధించిన పోలీసు అధికారి పేరు సుధాకరరావు. తననూ, తన వెంట వస్తున్న ఎమ్మెల్యేలను అడ్డుకున్నారన్న ఆవేశంతో సుధాకరరావును మధుసూదనరావుగా పేర్కొంటూ వార్నింగ్ ఇచ్చారు. 'పేపర్లు గుంజుకొని మీ ఇష్టం వచ్చినట్లుగా చేసే అధికారం ఎవరిచ్చారు? మధుసూదనరావ్! గుర్తుపెట్టుకో.. ఎల్లకాలం ఇలాగే ఉండదు' అని హెచ్చరించారు. 'మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. నీ టోపీపై ఉన్న సింహాలకు అర్థమేంటో తెలుసా? అధికారంలో ఉన్నవారికి సెల్యూట్ కొట్టడం కాదు.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మీరు ఉన్నారు గుర్తు పెట్టుకోండి' అని జగన్ ఊగిపోయారు.

పాపాలకు 'నిప్పు'?

(మొదటి పేజీ తరువాయి)

ద్వారకా తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ సోమవారం మధ్యాహ్నం సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మూడు గంటల పాటు సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. ఇది ప్రమాదం కాదు.. ఉద్దేశ్యపూర్వకంగా జరిగిన సంఘటనగా తేల్చారు.

ఇలా మొదలైంది...

పోలీసులు, ఇతర వర్గాల సమాచారం ప్రకారం... ఆదివారం రాత్రి 11.15 గంటల సమయంలో మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిప్పు రాజుకుంది. అక్కడ కాపలాగా ఉన్న నిమ్మనపల్లె అగ్రహారం వీఆర్ఏ రమణయ్య ఈ విషయాన్ని తొలుత గుర్తించారు. వెంటనే మండల డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)కు ఫోన్‌లో ఈ సమాచారం అందించారు. డీటీ ఈ విషయాన్ని ఆర్డీవో క్యాంప్ క్లర్కుకు ఫోన్‌లో తెలియజేశారు. ఆ తర్వాత 11.22 సమయంలో ఫోన్ ద్వారా సీసీ, డీటీలు కలిసి ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయానికి పక్కనే ఉన్న ఫైర్ స్టేషన్ నుంచి 11.44 గంటలకు ఫైరింజన్లు వచ్చాయి. గంట పాటు కష్టపడి మంటలను అదుపు చేశాయి. ఈలోపే.. 25 విభాగాలలో ఫైళ్లు కాలిబూడిదయ్యాయి. ఆర్డీవో చాంబర్, ఏవో చాంబర్‌లకు ఎటువంటి నష్టం వాటిల్లలేదు. సమాచారం అందుకున్న ఆర్డీవో హరిప్రసాద్, వన్‌టౌన్ సీఐ వలిబషలు సంఘటనా స్థలానికి వచ్చారు. కానీ.. వీరెవరూ సంఘటన గురించి తమ పైఅధికారులకు తెలియచేయలేదు. పైగా.. ఆర్డీవో మీడియాతో అర్ధరాత్రి మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని చెప్పారు. దీంతో అందరూ దీనిని 'ప్రమాదం'గానే భావించారు. కానీ... మెల్ల మెల్లగా అనేక అనుమానాలు ముసురుకున్నాయి.

ఆర్డీవో, సీనియర్ అసిస్టెంట్ పాత్ర?

సబ్ కలెక్టర్ ఆఫీసులో 22ఏ(నిషేధిత భూముల జాబితా) విభాగంలోనే మంటలు మొదలు కావడం గమనార్హం. ఆదివారం సెలవు. అయినప్పటికీ.. సీనియర్ అసిస్టెంట్ గౌతమ్‌తేజ్, మరికొందరు రాత్రి 11 గంటల వరకు అక్కడే ఉన్నారు. గతంలో ఇక్కడ మురళి అనే అధికారి ఆర్డీవోగా పని చేశారు. అప్పట్లో మంత్రిగా ఉన్న పెద్దిరెడ్డి చెప్పినట్లల్లా నడుచుకున్నారు. డీకేటీ భూముల డాక్యుమెంట్లను అక్రమంగా మార్చేసినట్లు అనుమానాలున్నాయి. అంతకుముందు ప్రకాశం జిల్లాలో జరిగిన అవకతవకల నేపథ్యంలో... ఎన్నికల ముందు ప్రభుత్వం ఆయనకు ఎమ్మార్వోగా రివర్షన్ ఇచ్చింది. మదనపల్లి ఆర్డీవోగా హరిప్రసాద్ అనే అధికారిని నియమించింది. అన్నింటికంటే ముఖ్యంగా... తాజాగా ప్రభుత్వం ఐఏఎస్ అధికారి శ్యాంస్వరూప్‌ను మదనపల్లి సబ్‌కలెక్టర్‌గా నియమించింది. ఆయన ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు. ఐఏఎస్ అధికారి సబ్‌కలెక్టర్‌గా వస్తే... పాత పాపాలన్నీ తవ్వే అవకాశముందని, దొరికిపోతామని 'పాత అధికారులు' బెంబేలెత్తినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే... వ్యూహాత్మకంగానే సబ్ కలెక్టర్ ఆఫీసులో మంటలు పుట్టించారనే అనుమానాలు తలెత్తుతున్నాయి. వారంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సీసీ కెమెరాలు పని చేయడంలేదు. గతంలో ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన మురళి శని, ఆదివారాలు సబ్ కలెక్టర్ కార్యాలయంలోకి వచ్చినట్లు సమాచారం. వీటన్నింటి నేపథ్యంలో ఇంటిదొంగలే ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉంటారని ప్రాథమికంగా అధికారులు అంచనాకు వచ్చారు.

రంగంలోకి డీజీపీ, సీఐడీ చీఫ్

ఫైళ్ల దహనం ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని పరిశీలించారు. జరిగిన సంఘటనను చూస్తే ఇది ప్రమాదం కాదని, ఉద్దేశపూర్వకంగా జరిగిన సంఘటనగా ఉందని డీజీపీ మీడియాకు తెలిపారు. 25 విభాగాలకు చెందిన రన్నింగ్ ఫైళ్లు కాలిపోయినట్లు కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు.

సెల్‌ఫోన్లు సీజ్

దీనిపై పోలీసులు సోమవారం ఉదయం నుంచే విచారణ ముమ్మరం చేశారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షణలో పలు పోలీసు బృందాలు విచారణ చేపట్టాయి. ప్రస్తుతానికి సీనియర్ అసిస్టెంట్ గౌతంతేజ్, వాచ్‌మెన్‌తో పాటు మరికొందరు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. అనుమానితుల సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనపర్చుకుని సీజ్ చేసినట్లు తెలిసింది.

ఈ ఫైళ్ల కోసమేనా?

పుంగనూరు మండల పరిధిలో 900 ఎకరాలకు పైగా భూములను మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అప్పట్లో కట్టబెట్టారు. ప్రస్తుత ప్రభుత్వం ఇటీవలే వీటిని రద్దు చేసింది. ఈ ఫైళ్లు ఇంకా మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలోనే ఉన్నట్లు సమాచారం. అదే విధంగా పెద్దతిప్పసముద్రం మండలంలోని కర్ణాటక రాష్ట్రానికి చెందిన మఠం భూములు 500 ఎకరాలకు పైగా ఉన్నాయి. వీటిని కూడా పెద్దిరెడ్డి అనుచరులు, బినామీలు ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మదనపల్లి రింగురోడ్డు బండమీదికమ్మపల్లె పరిధిలోని సర్వే నెంబరు 552లో సుమారు రూ.20 కోట్ల విలువ చేసే 2.5 ఎకరాల భూమి పెద్దిరెడ్డి భార్య స్వర్ణలత పేరు మీద రిజిస్టర్ అయింది. ఈ భూమి ఎన్‌వోసీ విషయంలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే విధంగా మదనపల్లి మండలం వలసపల్లె పరిధిలోని 247 సర్వే నెంబరులో 2.73 ఎకరాల భూమి ఉంది. దీంట్లోనూ అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కురబలకోట మండలంలో అత్యంత విలువైన అనేక భూములను పెద్దిరెడ్డి కుటుంబం అక్రమంగా స్వాధీనపర్చుకుందనే ఆరోపణలు ఉన్నాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలో సైతం అనేక విలువైన భూములను మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు, బినామీలు కాజేశారు. ఇదే సమయంలో గత ప్రభుత్వ హయాంలో డీకేటీ భూముల యాజమాన్య హక్కులు లబ్ధిదారులకు ఇచ్చే చట్టం తెచ్చారు. ఈ చట్టం రావడంతో పెద్దిరెడ్డి, ఆయన అనుచరులు, బినామీలు వందల ఎకరాలకు తప్పుడు డాక్యుమెంట్లతో నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. మూడు రోజుల కిందటే రాష్ట్ర ప్రభుత్వం ఈ ఫ్రీహోల్డ్ భూములను రిజిస్టర్ కాకుండా నిలుపుదల చేసింది. పెద్దిరెడ్డి సోదరుడు ద్వారకానాథరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న తంబళ్లపల్లె నియోజకవర్గంలోనూ.. అనేక భూఅక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో గతంలో జరిగిన అక్రమాలన్నీ వెలికి తీస్తున్నారు. ఈ క్రమంలోనే మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయం అగ్నికి ఆహుతి కావడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

కొత్త భవనమే...

రాష్ట్రంలోనే పెద్ద రెవెన్యూ సబ్ డివిజన్ మదనపల్లి. దీని ప్రాధాన్యత దృష్ట్యా ఐఏఎస్ అధికారిని సబ్‌కలెక్టర్‌గా నియమించడం రివాజు. కానీ.. వైసీపీ హయాంలోనే ఆర్డీవోలే చక్రం తిప్పారు. ఈ భవనం కూడా కొత్తదే. నాలుగైదేళ్ల కిందటే ప్రారంభించారు. విభాగాల వారీగా పార్టిషన్ చేసి ఆధునికంగా మార్చారు. విద్యుత్ వైరింగ్ కూడా కొత్తదే. షార్ట్ సర్క్యూట్ జరగలేదని ఇప్పటికే ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. పెట్రోలు లేదా డీజిల్ పోసి మండించినట్లుగా ఒక్కసారిగా మంటలు వ్యాపించినట్లు తెలుస్తోంది. కార్యాలయంలోని ఫైళ్లన్నీ దాదాపుగా తగలబడిపోగా... మరికొన్ని ఫైళ్లు కొంత దూరంగా కనిపించాయి. సోమవారం ఉదయానికి కూడా అవి మండుతూనే ఉన్నాయి. ఈ ఘటన నేపథ్యంలో సబ్ కలెక్టరేట్ పరిధిలోని 11 మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో రాత్రి అధికారులు తనిఖీలు జరిపారు.



మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో కాలిపోయిన ఫైళ్లు

యాక్సిడెంట్ కాదు.. ఇన్సిడెంట్!

▸ షార్ట్ సర్క్యూట్ జరగలేదు.. డీజీపీ ద్వారకా తిరుమలరావు స్పష్టీకరణ

మదనపల్లి టౌన్, జూలై 22: సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగింది అగ్ని ప్రమాదం కాదని డీజీపీ ద్వారకా తిరుమల రావు స్పష్టం చేశారు. ఈ ఘటనపై అనేక అనుమానాలున్నాయని చెప్పారు. సోమవారం ఆయన సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, జిల్లా కలెక్టర్ శ్రీధర్, ఇతర అధికారులతో కలిసి మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని నిశితంగా పరిశీలించారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే... ఆదివారం రాత్రి 11.30 గంటలప్పుడు మదనపల్లి సబ్ కలెక్టర్ ఆఫీసులో ఫైర్ ఇన్సిడెంట్ జరిగింది. నేను యాక్సిడెంట్ అనడంలేదు. ఇన్సిడెంట్ అనే అంటున్నాను. ప్రాథమిక ఆధారాల ప్రకారం చూస్తే... అది ప్రమాదంగా కనిపించలేదు. ఆదివారం రాత్రి వాచ్‌మన్ వీఆర్ఏ రమణయ్య ఈ ఘటన గురించి డిప్యూటీ తహసీల్దార్‌కు చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ ఆర్డీవోకు... ఆర్డీవో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఆర్డీవో కూడా ఇక్కడికి వచ్చారు. ఈ ఘటనపై ఆయన వెంటనే కలెక్టర్‌కు సమాచారం ఇవ్వలేదు. నిషేధిత జాబితా నుంచి భూములకు మినహాయింపు ఇచ్చే సెక్షన్ 22ఏ సెక్షన్‌లో ఈ సంఘటన జరిగింది. రెవెన్యూలో ఇది చాలాకీలకమైన సెక్షన్. ఎక్కువ అవకతవకలు జరిగే అవకాశమున్న సెక్షన్! ఇక్కడే సంఘటన జరగడం అనుమానాలకు తావిస్తోంది. సబ్ కలెక్టర్ ఆఫీసు పక్కనే సబ్‌స్టేషన్ ఉంది. విద్యుత్ శాఖ సిబ్బందితో, విద్యుత్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడాం. సమీపంలోనే సబ్‌స్టేషన్ ఉన్నందున ఓల్టేజీలో హెచ్చు తగ్గులకు అవకాశం లేదని చెప్పారు. ఇటీవలి కాలంలోనూ ఓల్టేజీ సమస్యలు నమోదు కాలేదని వారి రికార్డులు చెబుతున్నాయి. విద్యుత్తు సిబ్బందితోపాటు ఫోరెన్సిక్ సిబ్బంది కూడా పరిశీలించారు. షార్ట్ సర్క్యూట్‌కు అవకాశంలేదని తేల్చారు. షార్ట్ సర్క్యూట్ జరిగితే... వైర్ లోపలున్న రాగి తీగలు కూడా కాలిపోతాయి. ఇక్కడ అలా జరగలేదు. పైన ఉన్న ఇన్సులేషన్ మాత్రమే కాలిపోయింది.

అక్కడే అగ్గిపుల్లలు...

సంఘటనపై ఆర్డీవో వెంటనే కలెక్టర్‌కు చెప్పకపోవడం... రాత్రి 2 గంటలకు పోలీసు ఇన్‌స్పెక్టర్ వచ్చి చూసినా ఎస్పీ, డీఎస్పీకి సమాచారం ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అలసత్వం కనిపిస్తోంది. ఆదివారం రోజు రాత్రి 10.30 గంటల వరకు ఎందుకు పని చేశారు, ఎవరి అనుమతితో పని చేశారు, ఆ సెక్షన్‌లో ఫైళ్లు ఎందుకు డీల్ చేశారనే అంశంపైనా విచారణ జరగాల్సి ఉంది. ఇదంతా 22ఏ జాబితా నుంచి కొన్ని భూములను తప్పించే ప్రయత్నంగా కనిపిస్తోంది. అంతేకాదు... ఆఫీసు కిటికీ వద్ద బయట కాల్చిన అగ్గిపుల్లలు కనిపించాయి. అవి ఎప్పుడో పడేసినవి కావు... కొత్తవి. అలాగే.. ఆఫీసుకు 50 అడుగుల దూరంలో మరికొన్ని ఫైళ్లు కుప్పగా పోసినవి.. కాలిపోతున్నాయి. వాటిలో ఒక ఫైలులో మీద... 'పిటిషనర్ తెలిపిన ప్రకారం ఈ భూమిని 22ఏ జాబితా నుంచి మినహాయించడానికి అనుమతి కోరుతున్నాము' అని కూడా ఉంది. కాలిపోతున్న ఫైళ్లను బయటికి విసిరేస్తే... దగ్గరే పడాలి. దారిపొడవునా చెల్లాచెదురుగా పడిపోయి ఉండాలి. కానీ... ఒకే చోట, 50 అడుగుల దూరంలో ఫైళ్లను కుప్పగా వేశారు. మేం వచ్చేసరికి కూడా అవి కాలుతున్నాయి. బీర్‌బాటిళ్లవంటివీ కనిపించాయి. ఇవన్నీ చూస్తుంటే.. ప్రత్యేకంగా అనుమానాలు తలెత్తుతున్నాయి. అక్రమాల ఆధారాలను మాయం చేసేందుకు ప్రయత్నించిన సంఘటనలు ఇదివరకూ జరిగాయి. ఈ విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉంది. పాతవాళ్లు, కొత్త వాళ్లు... ఎవరైనాసరే... తప్పు చేస్తే వదిలేది లేదు.

పది ప్రత్యేక బృందాలతో...

దీనికి సంబంధించి ప్రజల వద్ద ఎలాంటి సమాచారం ఉన్నా జిల్లా కలెక్టర్, ఎస్పీకి తెలియజేయండి. 112కు డయల్ చేసి చెప్పండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఈ సంఘటనపై విచారణకు 10 బృందాలు ఏర్పాటు చేశాం. లోపలున్న సీసీ టీవీలు కొన్నాళ్లుగా పని చేయడం లేదని తెలిసింది. బయట ఉన్న సీసీ టీవీలు చెక్ చేయడానికి, అనుమానితులను ప్రశ్నించేందుకు, ఫైళ్ల పంచనామా, ఏ ఫైలు ఏమిటో తెలుసుకుంటాం. జిల్లా అదనపు ఎస్పీ రాజ్‌కమల్ ప్రధాన దర్యాప్తు అధికారిగా ఉంటారు. అవసరాన్ని బట్టి కేసును సీఐడీకి అప్పగించడంపై నిర్ణయం తీసుకుంటాం. కేసును మొదటి నుంచీ పరిశీలించాలనే ఉద్దేశంతోనే సీఐడీ చీఫ్ అయ్యన్నార్ కూడా ఈరోజు ఇక్కడికి వచ్చారు. 'కుట్ర' అనే విషయాన్ని ఇప్పటికిప్పుడు చెప్పలేం. 982 ఎకరాల గురించి పత్రికల్లో వచ్చింది కదా! అన్నీ బయటికి తీస్తాం.

ఫైళ్ల దహనంపై సీఎం సీరియస్

▸ ఒక్కరోజులోనే మూడుసార్లు సమీక్ష

▸ తక్షణం అక్కడకు వెళ్లాలని ఆదేశం

▸ హెలికాప్టర్‌లో అప్పటికప్పుడు మదనపల్లికి డీజీపీ, సీఐడీ ఏడీజీ



అసెంబ్లీ ఆవరణలో చంద్రబాబు, డీజీపీ ద్వారకా తిరుమల రావు

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. సీఎస్, డీజీపీ, సీఐడీ ఏడీజీ, ఇంటెలిజెన్స్ చీఫ్ తదితర ఉన్నతాధికారులతో అత్యవసరంగా మాట్లాడి విచారణకు ఆదేశించారు. తక్షణమే మదనపల్లికు వెళ్లాలని ముఖ్యమంత్రి ఆదేశించడంతో డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీఐడీ ఏడీజీ రవిశంకర్ అయ్యన్నార్ అప్పటికప్పుడు హెలికాప్టర్‌ను ఏర్పాటుచేసుకుని అక్కడకు బయలుదేరి వెళ్లారు. అన్యాక్రాంతమైన భూములకు సంబంధించిన ఫైళ్లు ఉద్దేశపూర్వకంగానే తగలబెట్టారనే అనుమానాలు వ్యక్తం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అప్రమత్తమైంది. గత ప్రభుత్వ దోపిడీకి సహకరించే ఉద్యోగులు ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. రాష్ట్రంలో వరుసగా ప్రభుత్వ డాక్యుమెంట్లు తగలబడుతుండటంపై సీరియస్ అయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత సీఐడీ సిట్ కార్యాలయం తాడేపల్లిలో మొదలైన ఫైళ్ల దహన పర్వం తాజాగా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ కొనసాగుతోంది. ముఖ్యమంత్రి సోమవారం దీనిపై మూడుసార్లు సమీక్షించారు. అసెంబ్లీ ప్రారంభానికి ముందు, వాయిదా పడిన తర్వాత, సాయంత్రం కూడా సమీక్షించారు. ఆదివారం రాత్రి 11.24 గంటలకు జరిగిన అగ్ని ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఆ జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. ఆదివారం రాత్రి 10.30వరకూ గౌతమ్ అనే ఉద్యోగి.... సబ్ కలెక్టర్ కార్యాలయంలోనే ఉన్నారని సీఎంకు జిల్లా అధికారులు తెలిపారు. సెలవు రోజు ఆ సమయం వరకూ ఎందుకున్నాడని చంద్రబాబు ఆరా తీశారు. ఆదివారం రాత్రి ఘటన జరిగితే సోమవారం ఉదయం వరకూ ఎందుకు బయటికి చెప్పలేదని జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించారు. మంటలు చెలరేగిన సమయంలో విధుల్లో ఉన్న వీఆర్ఏ ఎవరికి సమాచారం ఇచ్చారని అడిగారు. ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ, మధ్యాహ్నం వరకూ పోలీసు జాగిలాలు అక్కడికి వెళ్లక పోవడం, ఇతరత్రా లోపాలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని సీఎం ఆదేశించారు. నేరాలు చేసి సాక్ష్యాలు చెరిపేయడంలో ఆరితేరిన వ్యక్తులు మొన్నటివరకూ అధికారంలో ఉన్నారంటూ జగన్‌కు చంద్రబాబు చురక అంటించారు. గతంలో సాక్ష్యాలు మాయం చేసిన ఘటనలను అధికారులు మరిచిపోరాదని, ఆ కోణంలో లోతుగా దర్యాప్తు జరపాలని పోలీసు, రెవెన్యూ అధికారులను సీఎం ఆదేశించారు. మొత్తం ఘటనపై సీసీ కెమెరాలు పరిశీలించి, సెల్‌ఫోన్ లోకేషన్, కాల్ డేటా పరిశీలించి మినిట్ టూ మినిట్ ఎవరెవరు ఏమి చేశారో తనకు చెప్పాలని డీజీపీని ఆదేశించారు.

ఫైళ్ల దహనం వెనక ఎవరున్నా వదలం:అనగాని



మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు తగలబడిన ఘటన వెనుక ఎవరు ఉన్నా వదిలే ప్రసక్తే లేదని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం అమరావతి సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి మీడియాతో మాట్లాడారు. "మదనపల్లి సబ్ కార్యాలయంలో ఫైళ్ల దహనం ఘటన ఉద్దేశపూర్వకంగానే చేసినట్లు ఉంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి, స్థానిక వైసీపీ నేతలపై అనుమానాలున్నాయి. గత ప్రభుత్వ అవినీతిని కప్పిపుచ్చే ప్రయత్నాలకు ఉద్యోగులు సహకరిస్తే చర్యలు తప్పవు" అని అనగాని హెచ్చరించారు.

అది భూకబ్జాదారుల పనే : సీపీఐ నారాయణ

మదనపల్లి ఘటన భూకబ్జాదారుల పనేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. "మదనపల్లిలో మా పార్టీ నేత మురళి నాలుగైదు నెలలుగా భూకబ్జాలను వెలుగులోకి తీసుకువస్తున్నారు. ఇంతలోనే ఈ ఘటన జరిగింది. దీనిని తేలిగ్గా తీసుకోరాదు. మురళీకి రక్షణ కల్పించాలి" అని ప్రభుత్వాన్ని నారాయణ కోరారు.

అప్పిరెడ్డే గొప్ప!

▸ వైసీపీ ఎమ్మెల్సీకి మండలిలో విపక్ష నేత హోదా

▸ ఆయన బాస్ జగన్ మాత్రం ఎమ్మెల్యేగానే సభలోకి

▸ అప్పిరెడ్డికి ప్రత్యేక చాంబర్, ప్రోటోకాల్ గౌరవం

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన లేళ్ల అప్పిరెడ్డి జగన్ ప్రభుత్వం హయాంలో కేవలం ఒక ఎమ్మెల్సీ. వైసీపీ కార్యాలయ కార్యదర్శి కూడా. అప్పటి సీఎం జగన్‌తో పోల్చుకుంటే అప్పిరెడ్డి స్థాయి చిన్నది. కానీ, ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. శాసనమండలిలో అప్పిరెడ్డిని ప్రతిపక్షనేతగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ హోదాకు తగినట్లుగా అప్పిరెడ్డికి ప్రత్యేక చాంబర్, ప్రోటోకాల్, గౌరవ మర్యాదలు లభిస్తాయి. కానీ, ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రికి మాత్రం ఇవేవీ ఉండవు. 58 స్థానాలు కలిగిన శాసనమండలిలో వైసీపీకి 38 సభ్యుల బలం ఉంది. దీంతో అప్పిరెడ్డిని ఆ సభలో ప్రతిపక్ష నేతగా ప్రభుత్వం గుర్తించింది. ఆ హోదా లేని కారణంగా అప్పిరెడ్డికి లభించే గౌరవమర్యాదలు, ప్రోటోకాల్ జగన్‌కు లభించవు. ఎందుకంటే...175 స్థానాలు కలిగిన అసెంబ్లీలో 11 సీట్లు మాత్రమే వైసీపీ గెలుచుకుంది. దీంతో ఆ సభకు ఎన్నికైన జగన్ ఒక ఎమ్మెల్యేగానే మిగిలిపోయారు. ఓడలు బండ్లు, బండ్లు ఓడలవడం అంటే ఇదే!

పాత మండలాలకు నో

▸ తహసీల్దార్ల పునర్‌నియామకాలపై సీసీఎల్ఏ స్పష్టత

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల నుంచి సొంత జిల్లాలకు వస్తున్న తహసీల్దార్ల పోస్టింగ్‌ల్లో గందరగోళానికి తెరదించుతూ రెవెన్యూ శాఖ స్పష్టత ఇచ్చింది. పునర్‌నియామకంలో భాగంగా తహసీల్దార్లకు గతంలో పనిచేసిన మండలాల్లో పోస్టింగ్‌లు ఇవ్వకూడదని భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జయలక్ష్మి సోమవారం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్లకు ఈ మేరకు దిశానిర్దేశం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తహసీల్దార్లను వారు పనిచేసిన పాత మండలాల్లో పోస్టింగ్ వేయవచ్చంటూ తొలుత ఇచ్చిన ఉత్తర్వులపై గందరగోళం నెలకొన్న సంగతి తెలిసిందే. కొందరు కలెక్టర్లు ఈ నియామకాలను వ్యతిరేకించారు. ఈ అంశంపై 'మళ్లీ పాత మండలాలకే' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' వార్తను ప్రచురించింది. ఈ వార్తపై సీసీఎల్ఏ జయలక్ష్మి స్పందించారు. తహసీల్దార్లకు గతంలో పనిచేసిన మండలాల్లో పోస్టింగ్ ఇవ్వొద్దంటూ స్పష్టత ఇచ్చారు.

రాగానిపల్లె భూములపై 25కు విచారణ వాయిదా

▸ మృతుల కుటుంబీకులకు నోటీసులు జారీ చేయాలని సీసీఎల్ఏ ఆదేశం

పుంగనూరు, జూలై 22: చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం రాగానిపల్లెలో 982 ఎకరాల పరాధీనంపై సోమవారం సీసీఎల్ఏ కోర్టు కేసు విచారణ ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది. 74 ఏళ్లుగా వివాదంలోఉన్న కేసుకు సంబంధించిన ఈ భూమి అనాధీనంలో ఉండగా గత ప్రభుత్వంలో పెద్దిరెడ్డి ఒత్తిళ్లతో అధికారులు ఏకపక్షంగా పట్టాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవల పుంగనూరు తహసీల్దార్ శివయ్య అమరావతిలోని సర్వే సెటిల్‌మెంట్స్ ల్యాండ్ రికార్డు కమిషన్‌లో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. కాగా ఈ భూములకు సంబంధించినవారిలో ఐదుగురు చనిపోయారు. వారు ఎవరనేది విచారించి హక్కుదారులకు నోటీసులు జారీ చేయాలని సీసీఎల్ఏ ఆదేశించింది.

అలా వదిలేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

అధికారం. మేం ఏం చేసినా చెల్లుతుంది' అనేలా విచ్చలవిడిగా తప్పులు చేశారు. కానీ.. ఎన్నికల్లో దారుణంగా ఓడిపోయారు. దీంతో... 'తప్పులు' దొరక్కుండా ఫైళ్లు మాయం చేయడం మొదలైంది. కార్యాలయాల నుంచి అనధికారికంగా తీసుకెళ్లడం, ఆఫీసు ఆవరణలోనే కాల్చేయడం, దూరంగా కరకట్ట మీదకు తీసుకెళ్లి నిప్పంటించడం ఇలా వరుస ఘటనలు జరిగాయి. వీటిపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించిన దాఖలాలు కనిపించలేవు. దీంతో.. 'ఫైళ్లు తగలబెట్టినా పర్వాలేదు' అనే ధోరణి పెరిగింది. ఈ క్రమంలోనే ఏకంగా మదనపల్లి సబ్‌కలెక్టర్ ఆఫీసులోనే నిప్పు రాజుకుంది. ప్రభుత్వం దీనిపై మొదట్లోనే కఠినంగా వ్యవహరించి ఉంటే పరిస్థితి ఇక్కడిదాకా వచ్చేది కాదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఫైళ్ల మాయం, కాల్చివేతలపై సీరియస్ దర్యాప్తు మొదలుపెట్టినట్టుగా కనీసం సంకేతాలూ పంపలేకపోయారు. అరాచకాలకు ఫైళ్లే కీలక ఆధారాలు. తీవ్ర అవినీతి జరిగిన విభాగాలను సీజ్ చేసి... ఫైళ్లను సంరక్షించాలనే ఆలోచనా ప్రభుత్వం చేయలేదు. "సీఎస్, డీజీపీ, సెక్రటరీలను, కలెక్టర్లను, హెచ్‌ఓడీలను మార్చితే పరిస్థితులు మారవు. క్షేత్రస్థాయిలో పని చేసిన అధికారులకు గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి పనులతో ఎంతో కొంత సంబంధం ఉంటుంది. వారి అక్రమాలను నిరూపించేది ఫైళ్లే. ఈ క్రమంలోనే ఫైళ్ల మాయం, దహనాలు జరుగుతున్నాయి" అని ఒక అధికారి అభిప్రాయపడ్డారు.

ఇప్పటిదాకా ఇవీ...

- కూటమి ప్రభుత్వం రాగానే బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి ఇళ్లలో సీఐడీ సోదాలు చేశారు. దాని ఫలితం ఏంటో ఎవరికీ తెలీదు. వివాదాస్పద ఫైళ్లను వాసుదేవరెడ్డి కారులో తరలించారంటూ ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. దీనిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి?
- ఆంధ్రా యూనివర్సిటీలో కూడా ఫైళ్లు కాలిపోయాయి. ఏకంగా కంప్యూటర్లనే కాల్చేశారు.
- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి సమీర్ శర్మ డ్రైవర్ బస్తాల కొద్దీ ఫైళ్లను కరకట్ట పక్కన కాల్చేశాడు. దీనిపై ఎలాంటి చర్యలూ లేవు.
- సీఐడీ వాళ్లు కొద్దిరోజులపాటు ఈ-ఆఫీస్ మూసేశారు. తెరవెనుక ఏం చేశారో, ఏం జరిగిందో ఎవ్వరికీ తెలియదు. ప్రభుత్వమూ పట్టించుకోలేదు.
- కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏపీఎండీసీ కార్యాలయానికి తాళాలు వేశారు. ఆ తర్వాత ఏం జరిగిందో, ఏం తేల్చారనేది మిస్టరీ! పైగా... తీవ్రమైన ఆరోపణలు ఉన్న మైనింగ్ కార్పొరేషన్ ఉద్యోగి ఒకరిని... మైనింగ్ మంత్రి వద్ద పెట్టారు.
- టూరిజంలో పనిచేసిన ఐఏఎస్ కన్నబాబు వ్యక్తిగత సిబ్బంది కొన్ని ఫైళ్లు తగలబెట్టారు. ప్రభుత్వం తూతూ మంత్రపు విచారణ చేసినట్టు లేదు.

పోలవరానికి 12,157 కోట్లివ్వండి

▸ కేంద్రానికి మంత్రి నిమ్మల వినతి



కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌తో సమావేశమైన కేంద్ర మంత్రులు రామ్మోహన్, వర్మ, మంత్రి నిమ్మల తదితరులు

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు తక్షణమే రూ.12,157.53 కోట్లు విడుదల చేయాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను రాష్ట్ర జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అభ్యర్థించారు. సోమవారం ఢిల్లీలో ఆయన కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ప్రభుత్వ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావులతో పాటు పాటిల్‌ను కలిశారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని జలశక్తి శాఖ, కేంద్ర జల సంఘం నిర్ణయించినందున.. గతంలో వాల్‌ను నిర్మించిన కాంట్రాక్టు ఏజెన్సీతో దానిని నిర్మించాలా.. లేక మళ్లీ టెండర్లు పిలిచి కొత్త ఏజెన్సీకి బాధ్యత అప్పగించాలా అనే విషయంలో వీలైనంత త్వరగా స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత కీలకమైన భూసేకరణ కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మొదటగా రూ.12,157.53 కోట్లు మంజూరు చేస్తే అందులో రూ.8 వేల కోట్లను తొలి దశలో 41.15 మీటర్ల కాంటూరు పరిధిలోని నిర్వాసితులకు సహాయ పునరావాసం అందజేస్తామని తెలిపారు. ఈ జాతీయ ప్రాజెక్టును కేంద్రం తరఫున రాష్ట్రం నిర్మిస్తోందని గుర్తుచేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో భూ నిర్వాసితులు కూడా ప్రధానమని.. వరదలు వచ్చిన ప్రతిసారీ లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. ఈ ముంపు సమస్యను పరిష్కరించాలంటే నిర్వాసితులకు పరిహారం చెల్లించి పునరావాస కేంద్రాలకు తరలించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరితగతిన పూర్తి చేసేందుకు ముందు కూడా సహకరించాలని కోరారు. పోలవరం సందర్శనకు రావాలని పాటిల్‌ను రామానాయుడు ఆహ్వానించారు.

ఐదేళ్లలో 63 వేల కోట్లిచ్చాం

▸ కేంద్ర సహాయ మంత్రి పంకజ్ చౌధరి వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రూ.63 వేల కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి తెలిపారు. సోమవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన స్పందిస్తూ.. కేంద్ర ఆర్థిక శాఖ ఈ నిధులను విడుదల చేస్తుందని, అయితే మార్గదర్శక సూత్రాల ప్రకారం ఆయా పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతు నిధులను కేటాయించాల్సి ఉంటుందని తెలిపారు. కేంద్రం కేటాయించిన నిధులను వినియోగించినట్లు యూసీలు పంపాకే తదుపరి వాయిదా నిధులు అందుతాయని చెప్పారు. జగన్ ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి.. నిర్దిష్ట సమాచారం అందితే కేంద్రం పరిశీలిస్తుందన్నారు.

పోలవరానికి నిధులు విడుదల చేయండి

▸ లోక్‌సభలో కేంద్రానికి ఎంపీ కేశినేని చిన్ని వినతి



న్యూఢిల్లీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): లక్షలాది మంది రైతులకు జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయడానికి కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధికి, భవిష్యత్‌కు ప్రాణాధారమన్నారు. తమ ముఖ్యమంత్రి చంద్రబాబు మిషన్ మోడ్ కింద పోలవరాన్ని తిరిగి గాడిలో పెట్టడానికి నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఆయన సోమవారం లోక్‌సభలో రూల్ 377 కింద ఈ ప్రాజెక్టుపై మాట్లాడారు. పోలవరం నిర్మాణం పూర్తయితే ఆరు రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందని.. గత ఐదేళ్లలో సివిల్ పనులు 3.84 శాతం, భూసేకరణ పనులు 3.89 శాతమే జరిగాయని తెలిపారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయంలో ఈ ప్రాజెక్టు సివిల్ పనులు 71.93 శాతం, భూసేకరణ, సహాయ పునరావాసం 18.66 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. పోలవరం నిర్మాణ పనులు గాడిలో పెట్టేందుకు చంద్రబాబు ప్రతి సోమవారాన్ని పోలవరం డే గా ప్రకటించి.. సమీక్ష చేస్తున్నారని వివరించారు.

బాబాయ్ హత్య జరిగితే ఢిల్లీలో ధర్నా చేయలేదేం?

▸ వినుకొండ వ్యక్తిగత హత్యను రాజకీయం చేస్తారా?

▸ అధికారంలో ఉన్నప్పుడూ జగన్‌వి హత్యా రాజకీయాలే: షర్మిల



అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా వినుకొండ వ్యక్తిగత కక్షలతో హత్య జరిగితే రాజకీయం చేస్తూ ఢిల్లీలో ధర్నా చేసేందుకు సిద్ధమైన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. నాడు బాబాయ్ వివేకానందరెడ్డి హత్య జరిగితే ఎందుకు ధర్నా చేయలేదని జగన్ సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. విజయవాడ ఆంధ్రరత్నాభవన్‌లో సోమవారం షర్మిల మీడియాతో మాట్లాడారు. వినుకొండ హత్య వ్యక్తిగత కక్షలతోనే జరిగిందని తమ పరిశీలనలో తేలిందన్నారు. అయినా దీనికి రాజకీయ రంగు పులిమి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ ఢిల్లీలో ధర్నా చేయడం ఏమిటని జగన్‌ను షర్మిల నిలదీశారు. వర్షాలతో పంటలన్నీ నీటి మునిగి రైతులు అతలాకుతలమైపోయారని, ఈ సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించకుండా ఢిల్లీలో ధర్నా చేసేందుకు వెళతారా అని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో హత్యా రాజకీయాలు చేశారని ఆరోపించారు. జగన్ గొడ్డలి రాజకీయాలు చేశారని విమర్శించారు.

హోదాపై ఎన్నిసార్లు ధర్నా చేశారు జగన్?

హోదా మీద బీజేపీ ద్రోహం చేస్తే ఒక్కరోజు కూడా జగన్ మాట్లాడలేదని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా కోరుతూ అధికారంలో ఉండగా జగన్ ఎందుకు ధర్నా చేయలేదని నిలదీశారు. జగన్ తన పాలనలో హోదా కోసం ఎన్నిసార్లు ధర్నాలు చేశారో చెప్పాలన్నారు.

ఇంకా భ్రమల్లోనే జగన్!

▸ ఇప్పటికైనా ఓటమి కారణాలు తెలుసుకోండి: లోకేశ్



అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు ఇంకా తత్వం బోధపడినట్లు లేదని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఎద్దేవా చేశారు. '50 రోజుల ప్రభుత్వంలో మేం భయంతో ఉండటం కాదు. ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల బాధ్యతతో ఉన్నాం. మీరే ఇంకా భ్రమల్లో ఉన్నారని తెలుసుకోండి' అంటూ సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'మీ మాటల్లో, చేష్టల్లో, కుట్రలో అడుగడుగునా అధికారం దూరమైందనే బాధ, అక్రమార్జన ఆగిపోయిందనే ఆవేదన, ఫేక్ రాజకీయం పండలేదనే ఫ్రస్టేషన్, ఉనికి చాటుకోలేకపోతున్నామనే నిస్పృహ, ప్రజల్లో ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందనే ఉక్రోషం కనిపిస్తున్నాయి. మీకు ప్రతిపక్ష హోదా కూడా రానిస్థాయి ఓటమిని కట్టబెట్టింది ప్రజలు. దానికి కారణాలు ఇప్పటికైనా తెలుసుకోండి. వాస్తవాలు అంగీకరించండి. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా ఉండబట్టే మొన్నటి ఎన్నికల్లో 151లో 5 మాయమైంది. ఇప్పుడు 11లో ఒకటి మాయమవుతుంది. శిశుపాలుడు ఎవరో.. ఎవరి పాపం పండిందో మొన్న ప్రజలు తేల్చి చెప్పారు' అని లోకేశ్ వ్యాఖ్యానించారు. కాగా, అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డాక్టర్ హారిక మృతదేహాన్ని స్వస్థలం తెనాలికి తీసుకురావటానికి ఎన్నారై టీడీపీ అధికారులతో సమన్వయం చేస్తోందని మంత్రి లోకేశ్ 'ఎక్స్'లో తెలిపారు.

బాబాయి హత్యపై ధర్నా చేయండి: సంధ్యారాణి

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచకాలకు పాల్పడుతోందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న జగన్‌రెడ్డికి దమ్ముంటే వివేకానందరెడ్డి హత్యపై ఢిల్లీలో ధర్నా చేయాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి సవాల్ చేశారు. చంద్రబాబు ప్రజాశ్రేయస్సు కోరుకునే వ్యక్తి అని మాజీ స్పీకర్ ప్రతిభాభారతి అన్నారు. 'గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి ఒక్క అర్జీ తీసుకోలేదు. బయటకు రావాలంటే పరదాలు కట్టుకున్నాడు. పోలీసుల పహారా పెట్టుకున్నాడు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్న ప్రజా నాయకుడెవరో ప్రజలే గమనించాలి' అని వ్యాఖ్యానించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

రిజర్వేషన్లలో బీసీలకు జరుగుతున్న
అన్యాయాన్ని సరిచేయండి
● ఎస్‌జేఎఫ్ నేతలు

ధర్నాచౌక్, జూలై 22: విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల రిజర్వేషన్ల అ మల్లో జరుగుతున్న సామాజిక అన్యాయం, అసమానతలను సరిచేసి అందరికీ సమ న్యాయం చేసి అవకాశాలు కల్పించాలని సామాజిక న్యా యపోరాట వేదిక (ఎస్‌జేఎఫ్) నేతలు డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మా ట్లాడారు. రాజ్యాంగ విరుద్ధమైన మత ప్రాతిపదికగా ముస్లిం, మైనార్టీల రిజర్వేషన్లతో అత్యధిక జనాభా కలిగిన బీసీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. బీసీ(సీ), బీసీ(డీ), బీసీ(ఈ) గ్రూపులను విలీనం చేసి ఒకే గ్రూపుగా బీసీ(సీ)గా ఏర్పాటు చేయాలన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లోనే కాకుండా విద్య, ఉద్యోగాల్లోనూ 34శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాపులతో బీసీలకు ఇబ్బంది లేకుండా స్థా నిక సంస్థల బీసీ రిజర్వేషన్లల్లో ఎ,బీ,సీ,డీ వర్గీకరణ ప్రవేశపెట్టాలన్నారు. సంఘం రాష్ట్ర చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్, వర్కింగ్ చైర్మన్ కోటిపల్లి అయ్యప్ప, రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు

అలవెన్సుల సమస్యలను పరిష్కరించండి
మంత్రి పయ్యావులను కలిసిన పీఆర్ఎన్ఎంయూఏ ప్రతినిధులు

బస్‌స్టేషన్, జూలై 22: అలవెన్సుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ప్రజా రవాణా సంస్థ నేషనల్ మ జ్దూర్ యూనిటీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. సోమవారం సెక్రటరీయట్‌లోని కార్యాలయంలో మంత్రిని కలిసిన అసోసియేషన్ రాష్ట్ర అ ధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. తొలుత మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. పీవీ శివారెడ్డి, శ్రీనివాసరాజు, రాజేష్‌కుమార్, రామారావు, మోహన్ ఉన్నారు.


నియామక పత్రాన్ని అందుకుంటున్న నరహరిశెట్టి

అమరావతి కాపునాడు గౌరవాధ్యక్షుడిగా నరహరిశెట్టి

ధర్నాచౌక్, జూలై 22: అమరావతి కాపునాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడి గా నరహరిశెట్టి సత్యనారాయణ నియమించబడ్డారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నియామక పత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షు డు సుంకర శ్రీనివాస్ ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ 40ఏళ్లుగా వంగవీటి రంగా ఆశయాలకు అనుగుణంగా కాపుల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కాపుల అభివృద్ధికి సత్యనారాయణ కృషి చేశారన్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ సంఘం అభివృద్ధితో పాటు కాపుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణను పలువురు అభినందించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఘంటా ఫణికుమార్, వీర్ల జ్యోతిబసు, చల్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గుంటూరు నుంచి నగరం మీదుగా
విమానాశ్రయానికి బస్సులు నడపండి

బస్‌స్టేషన్, జూలై 22: గుంటూరు నుంచి నగరం మీదుగా విమానాశ్రయం వరకు ఏసీ లేదా నాన్ ఏసీ బస్సు లు ఏవైనా నడపాలని అఖిలభారత పంచాయ తీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర చైర్మన్ జాస్తి వీరాంజనేయులు సోమవారం బస్ భవన్‌లో అదనపు కమిషనర్ చంద్రశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విమానాశ్రయానికి బస్సులు లేకపోవడంతో ప్రయాణికులతో పాటు విమానాశ్రయంలో పనిచేసే సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో నడిచిన బస్సులు ఆపేశారని, ఢిల్లీ నుంచి వచ్చిపోయే ప్రయాణికులకు బస్సు వల్ల సౌకర్యంగా ఉంటుందన్నారు. మాజీ ఎంపీటీసీ చిలకా వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ చిలకా ఆనందరావు ఉన్నారు.


చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న జాస్తి


దివ్యాంగ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన డాక్టర్ రేవతి

సామాజిక సేవలకు ప్రాధాన్యం
ఈస్ట్ ఇన్నర్ వీల్ క్లబ్ నూతన అధ్యక్షురాలు డాక్టర్ రేవతి

వన్‌టౌన్, జూలై 22: సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తానని ఇన్నర్ వీల్ క్లబ్ నూతన అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి.రేవతి అన్నారు. ఎస్ఏసీ కల్యాణమండపంలో సోమవారం విజయవాడ ఈస్ట్ ఇన్నర్‌వీల్ క్లబ్ సమావేశం జరిగింది. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గం బాధ్యతలు తీసుకుంది. అనంతరం ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ డీ అరుణ, ఇతరసభ్యులు ప్రమాణం చేశారు. క్లబ్ అంతర్జాతీయ మాజీ కోశాధికారి సరిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 175 మంది శారీరక, మానసిక దివ్యాంగులకు స్కూల్ బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు.

అవకతవకలపై విచారణ చేయాలి

ధర్నాచౌక్, జూలై 22: ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండలోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘంలో జరిగిన అవకతవకలు, మోసాలపై విచారించాలని శ్రీహరిపురం ప్రభుత్వ ఉద్యోగుల కాలనీ లే అవుట్ బాధితుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాస్, వి.రత్నప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం వారు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. రిజిస్ట్రేషన్ పూ ర్తయిన 655 మందికి ప్లాట్స్ అభివృద్ధి చేసి ఇవ్వాలన్నారు. నగదు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్న 72మందికి ప్లాట్స్ రిజిస్ట్రేషన్ చేయాలని డి మాండ్ చేశారు. మార్టిగేజ్ ప్లాట్‌లకు అడ్వాన్స్ తీసుకుని 3నెలల తర్వాత రిజిస్ట్రేషన్ చేస్తామని అగ్రిమెంట్ చేసి 24నెలలు గడుస్తున్నా నేటికీ రిజిస్ట్రేషన్ చేయలేదన్నారు. సొసైటీ సభ్యత్వం రద్దు చేసిన 84మంది సభ్యత్వాన్ని పునరుద్ధరించాలన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన సొసైటీ మేనేజింగ్ కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 29 విచారణ పూర్తయి 4 నెలలు గడుస్తున్నా ఆ నివేదికను నేటికీ బహిర్గతం చేయలేదని తక్షణమే దాన్ని బహిర్గతం చేయాలన్నారు. సొసైటీలోని అనర్హుల సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


వన్‌టౌన్ దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న ఖాతాదారులు

డిపాజిట్ డబ్బులు వెంటనే చెల్లించాలి
దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారుల సంక్షేమ సంఘం

వన్‌టౌన్, జూలై 22: కుటుంబ అవసరాలకు తాము డిపాజిట్ చేసిన డబ్బును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వద్ద సోమవారం బ్యాంక్ ఖాతాదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఖాతాదారులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు ఖాతాదారులు మాట్లాడుతూ తాము తమ కుటుంబ అవసరాల కోసం దాచుకున్న డబ్బు తిరిగివ్వాలని అడుతుంటే బ్యాంకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రెండేళ్లుగా డబ్బులివ్వడం లేదని విమర్శించారు. 1500 మంది ఖాతాదారులు బ్యాంక్‌లో డిపాజిట్ చేశారన్నారు.

ప్రత్యక్ష ఆందోళనకు దిగుతాం: సీపీఐ

దుర్గా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ తమ డిపాజిటర్లకు డబ్బును వెంటనే చెల్లించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు బ్యాంకు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కొత్తపేటలోని లెనిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన దుర్గా కో-ఆపరేటివ్ బ్యాంక్‌పై నమ్మకంతో రిక్షా కార్మికుడి నుంచి పదవీవిరమణ చేసిన ఉద్యోగుల వరకు సుమారు 10 వేల మంది రూ.40 కోట్ల మేర డిపాజిట్ చేశారన్నారు. వీరిలో రూ.5వేల నుంచి రూ.10లక్షల వరకు డిపాజిట్ చేసిన వారున్నారన్నారు. అయితే రెండేళ్ల నుంచి ఖాతాదారులకు డిపాజిట్ చేసిన డబ్బులు చెల్లించకుండా బ్యాంక్ కాలయాపన చేయడం దుర్మార్గమన్నారు. పాలకవర్గం తమ ఇష్టానుసారంగా వ్యవహరించి సుమారు 1500 మందికి రూ.250 కోట్ల వరకు హౌసింగ్ లోన్లు, ఇతర లోన్లు ఇచ్చినట్టు చెప్పారు. ఆ రుణాలను రికవరీ చేయడంలో బ్యాంక్ ఘోరంగా విఫలం కావడంతో ఆర్‌బీఐ ఆంక్షలు విధించిందన్నారు. 2002లోనే రుణాలు తీసుకుని ఎగ్గొట్టిన వారి ఆస్తులను జప్తు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నప్పటికీ బ్యాంక్ మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్నారు. డబ్బు చెల్లింపులో ఇక ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా సీపీఐ చూస్తూ ఊరుకోదని డిపాజిటర్లతో కలిసి పెద్ద ఎత్తున ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. దీనిపై ఎంపీ, ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని డిపాజిటర్లకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు ఖాతాదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రమణయ్య కూల్‌డ్రింక్ షాపు వద్ద ధర్నా చేశారు. లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి
● కలెక్టర్‌కు సీఐటీయూ నేతల వినతి

వన్‌టౌన్, జూలై 22: మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు సీఐటీయూ అనుబంధ మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్, ఎంప్లాయిస్ గౌరవాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సరఫరా మెకానిక్‌లు, పార్కుల్లోని కార్మికులు వీధి దీపాల, పట్టణ ప్రణాళిక విభాగాల్లో పనిచేసేవారికి జీతాలు పెంచాలని, కార్మికులందరికీ ఆదివారం సెలవు ప్రకటించాలని కోరారు మునిసిపల్ కార్మికులకు యూనిఫారం, చెప్పులు, కొబ్బరి నూనె సరఫరా చేయాలన్నారు. ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికులకు రూ.5లక్షలు పరిహారంతో పాటు మట్టి ఖర్చులు, మృతుల కుటుంబాల్లోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. యూనియన్ నగరాధ్యక్షుడు ఎస్ జ్యోతిబసు, కార్యనిర్వాహక కార్యదర్శి టీ ప్రవీణ్, నగర ఉపాధ్యక్షుడు వి.సాంబులు, వెహికల్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు కొండా హరిబాబు, జలసూత్రం నాగరాజు పలువురు నేతలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులను కాపాడండి

కృష్ణలంక: టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించకుండా వారి పేరున ఇంటి మరమ్మతుల కోసమంటూ గత వైసీపీ ప్రభుత్వం ఒక్కొక్కరి పేరున బ్యాంకు నుంచి రూ.3.50 లక్షలు రుణం ఇప్పించి ఆ డబ్బును వైసీపీ ప్రభుత్వం వాడేసుకొందని, అయినా ఇళ్ల రిపేరు చేయించలేదని లబ్ధిదారులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సృజనకు సీపీఎం రాష్ట్ర నేత దోనేపూడి కాశీనాథ్ వినతి పత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు బ్యాంకు అధికారులు ఫోన్‌లో డబ్బు కట్టమని, లేదంటే ఇంకెలాంటి రుణాలు (ఎడ్యుకేషన్ లోన్, మార్టిగేజ్ లోన్) మంజూరు చేయబోమని, మీ ట్రాక్ రికార్డు బాగోలేదని అన్ని బ్యాంకులకు సమాచారం అందిస్తామని బెదిరిస్తున్నారని విన్నవించారు. మరమ్మతుల కోసం వైసీపీ ప్రభుత్వం తీసుకున్న రుణాల్లో చిల్లిగవ్వ కూడా తమ చేతికి రాలేదని, ఇంటి నెంబరు తప్పించి తమ ఇల్లు ఎక్కడుందో కూడా తెలియదని లబ్ధిదారులు కలెక్టర్ వద్ద వాపోయారు. కావున లబ్ధిదారులకు ఇల్లు కేటాయించి, ఇళ్లల్లోకి వెళ్లిన 6 మాసాల తర్వాత మాత్రమే బ్యాంకు అధికారులు రుణం గురించి అడిగేలా చర్యలు తీసుకోవాలని అప్పటివరకు రుణ వసూలును వాయిదా వేయాలని కలెక్టర్‌ను కాశీనాథ్ కోరారు. సీపీఎం నేతలు పుప్పాల కృష్ణ, కోరాడ రమణ, లబ్ధిదారులు సుంకర ప్రసాద్, పద్మిని, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.


ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేత దోనేపూడి కాశీనాథ్


దర్పణం కథా సంకలనం ఆవిష్కరణ సభలో మండలి బుద్ధప్రసాద్, గోళ్ల నారాయణరావు తదితరులు

అనువాద సాహిత్యం విస్తృతం కావాలి
● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

విజయవాడ కల్చరల్, జూలై 22: అనువాద సాహిత్యం విస్తృతం కావాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. రచయిత్రి కోనేరు కల్పన హిందీభాషలో వచ్చిన కథలను 'దర్పణం-హిందీ కథ స్రవంతి' పేరుతో అనువదించిన సంకలనాన్ని సోమవారం గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్లో ఆవిష్కరించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన బుద్ధప్రసాద్ మాట్లాడుతూ వివిధ భారతీయ భాషల్లో వచ్చిన సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించాల్సిన అవసరముందన్నారు. తెలుగు నేలపై అనువాదకుల సంఖ్య చాలా తక్కువగా ఉందని ఈ సంఖ్య పెరగాల్సిన అవసరముందన్నారు. కామ్రేడ్ జీఆర్కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ అనువాదకురాలు కోనేరు కల్పన మూలానికి భంగం లేకుండా సరళమైన భాషలో అనువదించినట్టు తెలిపారు. కవయిత్రిగా, అధ్యాపకురాలిగా అనువాదకురాలిగా తన ప్రతిభను చాటుకున్నారన్నారు. కేంద్ర సాహిత్య అనువాద పురస్కార గ్రహీత డాక్టర్ వెన్నా వల్లభరావు కథా సంకలనాన్ని సమీక్షించారు. సాహితీవేత్తలు చలపాక ప్రకాష్, డాక్టర్ దుట్టా శమంతకమణి, తారా ప్రసూన, కల్పన, సాహిత్య జీవిత విశేషాలను వివరించారు.

ఎటువైపు ఎవరొస్తారో..!
● ప్రమాదకరంగా కేదారేశ్వరపేట మసీదు సెంటర్

పాతరాజరాజేశ్వరి పేట, జూలై 22: స్థానిక కేదారేశ్వరపేట మసీదు సెంటర్ అంటేనే వాహనదారులు కంగారు పడుతున్నారు. పశ్చిమ నుంచి మధ్య, తూర్పు నియోజకవర్గ ప్రాంతాలకు చేరుకోడానికి ఎర్రకట్ట రోడ్డు సులభతరంగా ఉంటుంది. దీంతో చిట్టినగర్ వైపు నుంచి వాహనదారులు ఈ దారిలోనే రాకపోకలు చేస్తారు. కానీ కేదారేశ్వరపేట మసీదు సెంటర్ చేరుకునే సరికి వాహనదారులు భయపడుతున్నారు. దీనికి కారణం కేదారేశ్వరపేట మసీదు సెంటర్‌లో ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడమే. అటు ఎర్రకట్ట వైపు నుంచి ఇటు సెంట్రల్ వేర్ హౌసింగ్ వైపు నుంచి మరోవైపు కేదారేశ్వరపేట 6 లైన్ల నుంచి వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. దీంతో కేదారేశ్వరపేట మసీదు సెంటర్‌కు చేరుకునే సరికి వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు. దీనికి తోడు రోడ్డును ఇరువైపులా వ్యాపారులు ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి, రోడ్డు ఆక్రమణలు తొలగిస్తే సమస్యకు చెక్ పడుతుంది. పోలీసులు చర్యలు తీసుకుని వాహనదారులకు ఉపశమనం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మసీదు సెంటర్ వద్ద గందరగోళంగా వెళ్తున్న వాహనాలు

విశాఖ ఉక్కుకు కూటమి సర్కారు అండ
▸▸ గనుల పునరుద్ధరణకు సీఎం ఆదేశం

విశాఖపట్నం, జూలై 22(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారానికి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పల్లా శ్రీనివాసరావు తాము అధికారంలోకి వస్తే స్టీల్ ప్లాంటు కష్టాలు తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున వీలైనంత సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌తో కలిసి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో సమావేశం అయ్యారు. స్టీల్ ప్లాంటుకు విజయనగరం జిల్లా సరిపల్లిలో ఇసుక రీచ్, గర్భాంలో మాంగనీస్ గని లీజులో ఉండగా, వైసీపీ ప్రభుత్వం వాటిని రెన్యువల్ చేయలేదని చంద్రబాబుకు వివరించారు. ఈ విషయమై అప్పటి సీఎం జగన్‌ను ఎన్నికల ముందు స్టీల్ ప్లాంటు నాయకులు కలిసి మాట్లాడితే వాటి గురించి మరిచిపోవాలని చెప్పారని గుర్తు చేస్తూ.. కూటమి ప్రభుత్వం తరఫున ప్లాంటుకు సాయం చేయాలని కోరారు. దానికి వెంటనే స్పందించిన చంద్రబాబు.. తక్షణమే ఆ రెండు గనుల లీజును పునరుద్ధరించాలని సీఎంఓ అధికారులను ఆదేశించారు. దీనిపై స్టీల్ ప్లాంటు కార్మిక వర్గాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. గర్భాంలో మాంగనీస్ గని పునరుద్ధరణ వల్ల ఏడాదికి రూ.10 కోట్ల ఆదాయం మిగులుతుందని తెలిపారు.

ప్లాంటు నుంచి స్టీలు కొనుగోలు చేస్తే మరింత మేలు!

స్టీల్ కొనుగోలు విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విశాఖ ఉక్కు అధికారుల సంఘం కోరుతోంది. రాష్ట్ర ప్రభుత్వం పేదల గృహ నిర్మాణానికి స్టీల్ కొంటోందని, అది విశాఖపట్నం ప్లాంటు నుంచి తీసుకుంటే తమకు సాయం చేసినట్టు అవుతుందని, కనీసం రూ.2 వేల కోట్ల స్టీల్‌ను తీసుకోవాలని సంఘం నాయకులు అడుగుతున్నారు. ఈ విషయాన్ని కూడా సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని ఎంపీ, ఎమ్మెల్యేలను కోరుతున్నారు.

గంగవరం పోర్టులో అగ్నిప్రమాదం
▸▸ కేసు నమోదు చేయని పోలీసులు

▸▸ వివరాలు వెల్లడించని సంస్థ యాజమాన్యం


గంగవరం పోర్టులో కాలిపోతున్న కన్వేయర్ బెల్ట్

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలోని పరిశ్రమల్లో జరుగుతున్న వరుస ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత వారం రెండు ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు సంభవించాయి. తాజాగా ఆదివారం రాత్రి గంగవరం పోర్టులో మరో ప్రమాదం జరిగింది. వెల్డింగ్ పనులు చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి 13వ నంబరు కన్వేయర్ బెల్టులకు మంటలు అంటుకున్నాయి. మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. భారీ ప్రమాదమే జరిగింది. పోర్టు నుంచి కన్వేయరు బెల్ట్ ద్వారానే స్టీల్‌ప్లాంటుకు బొగ్గు సరఫరా అవుతుంది. ఎంత సరకు కాలిపోయిందో తెలియదు. పోర్టులో రెండు ఫైరింజిన్లు ఉండగా, వాటితో మంటలు అదుపులోకి రాకపోవడంతో గాజువాక నుంచి మరో అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపులోకి తెచ్చింది. దీనిపై గాజువాక పోలీసులు ఎటువంటి కేసూ నమోదు చేయలేదు. ప్రమాదంలో నష్టమేమీ జరుగనందున యాజమాన్యం ఫిర్యాదు చేయలేదని పోలీసులు చెబుతున్నారు. ప్రైవేటు సంస్థలో ప్రమాదం సంభవించినప్పుడు..వారు ఫిర్యాదు చేస్తేనే కేసు నమోదు చేయడం, లేదంటే మిన్నకుండడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై పరిశ్రమల శాఖ అధికారులు కూడా ప్రకటన జారీ చేయలేదు. గంగవరం పోర్టులో వేల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. అవి అంటుకుంటే స్టీల్‌ప్లాంటుకు సరఫరా ఆగిపోతుంది. ఇప్పటికే కష్టాలు ఎదుర్కొంటున్న స్టీల్‌ప్లాంటు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. ఇంత క్లిష్టమైన అంశంపై అధికారులు కేసు నమోదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

రెండు వారాల్లో కౌంటర్ వేయండి
▸▸ వివేకా హత్యకేసులో సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. శివశంకర్ రెడ్డికి హైకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేయడాన్ని వివేకానందరెడ్డి కుమార్తె సునీతా రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేసిన విషయం తెలిసిందే. ఆ పిటిషన్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఎదుట సోమవారం విచారణకు వచ్చింది. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేసేందుకు తమకు ఇంకాస్త సమయం కావాలని సీబీఐ తరఫు న్యాయవాది కోరగా, రెండు వారాల్లో సీబీఐ కౌంటర్ దాఖలు చేయాలని, ఆ తర్వాత రెండు వారాల్లో రీజాయిండర్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబరు రెండో వారానికి వాయిదా వేసింది.

తెలంగాణ మద్యం స్వాధీనం

తిరువూరు, జూలై 22: మునుకుళ్ల పెట్రోలుబంక్ సమీపంలో తెలంగాణ మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఈబీ సీఐ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంపలగూడెం మండలం ఊటుకూరుకు చెందిన ఉప్పతల తిరుపతిరావు బైక్‌పై మద్యం తీసుకువెళుతుండగా అదుపులోకి తీసుకున్నామని, అతని నుంచి 51 మద్యం సీసాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. విస్సన్న పేట మండలం కొండపర్వ గ్రామంలో కాపుసారా విక్రయించిన కేసులో పంది రాజ్యలక్ష్మిని తహసీల్దార్ వద్ద హాజరుపరిచామని, ఆమెకు రూ.20 వేలు జరిమానా విధించారని తెలిపారు. దాడుల్లో ఎస్సై జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారని సీఐ పేర్కొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు..తప్పిన ప్రమాదం

రెడ్డిగూడెం, జూలై 22: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు రెడ్డిగూడెం బీసీ కాలనీలో చంద్రగిరి మారేసు ఇల్లు కూలింది. ఆ సమయంలో ఎవరూ ఇంట్లో లేకపోవడంతో పెద్ద ప్రమా దం తప్పింది. టీడీపీ మం డల అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, జానలపాటి వేణుగోపాల్ రెడ్డి, ఉయ్యూరు సుబ్బారెడ్డిలు ఆ ఇంటిని పరిశీలించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి సాయం అందించారు.

పారిశ్రామికవాడల అభివృద్ధే లక్ష్యం
● ఏపీఐఐసీ అధికారులతో ఎమ్మెల్యే యార్లగడ్డ సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జూలై 22: నియోజకవర్గంలో పారిశ్రామికవాడలను అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులతో సమీక్ష చేశారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఏపీఐఐసీ జడ్ఎం, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. పారిశ్రామికవాడల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలన్నారు. పోలీసు చెక్‌పోస్టు, ఫైర్‌స్టేషన్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, వాటర్ సప్లయి, ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ముందు తామిచ్చిన హామీలను నెరవేర్చేందుకు అధికారులు కృతనిశ్చయంతో పనిచేయాలన్నారు. పారిశ్రామికవేత్తలు పరిశ్రమలను స్థాపనకు ఆసక్తి చూపుతున్నారని, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. గన్నవరంలో ఇప్పటికే చీర్ ఆఫ్ ఐటీ సంస్థ ప్రతినిధులు తమ సంస్థ ఏర్పాటుకు అనువైన భూములను పరిశీలించినట్టు తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు.

పాయింట్స్ మెన్ దినేష్‌కు మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డు

రైల్వేస్టేషన్, జూలై 22: రైల్వే డివిజన్‌లోని కొమ్మలపూడి రైల్వేస్టేషన్‌కు చెందిన పాయింట్స్ మెన్ ఎస్.దినేష్ మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది జూన్ 26న బిట్రగుంట-అల్లూరు రోడ్డు మధ్య లెవల్ క్రాసింగ్ నెంబర్ 143టీ వద్ద గేట్‌మెన్‌గా దినేష్ పనిచేస్తున్నాడు. ఆ సమయంలో గూడ్స్ రైలు నుంచి 24వ వ్యాగన్ చక్రాలు కదలకపోవడాన్ని గమనించి వెంటనే బిట్రగుంటలోని డ్యూటీ స్టేషన్ మాస్టర్‌కు తెలిపాడు. వెంటనే స్పందించి తీసుకున్న చర్యల కారణంగా బిట్రగుంట-తలమంచి మధ్య రైలును లూప్‌లైన్‌లోకి అనుమతించి ఆ తరువాత తనిఖీ చేసి చక్రాలను పరిశీలించి లోపాలను సవరించు. అనంతరం గూడ్స్ రైలు యథావిధిగా వెళ్లిపోయింది. చక్రంలోని లోపాన్ని గుర్తించి ప్రమాదంపై సమాచారమిచ్చినందుకు పాయింట్స్ మెన్ ఎస్.దినేష్‌కు అవార్డును అందజేశారు. కాగా సికింద్రాబాద్‌లోని రైలు నిలయం నుంచి డిపార్ట్‌మెంట్స్ ప్రిన్సిపాల్ హెడ్స్, విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్, గుంతకల్, గుంటూరు, సికింద్రాబాద్, నాందేడ్ డివిజన్లకు చెందిన ఆర్ఎంలతో సోమవారం దక్షిణ మధ్య రైల్వే మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ భద్రత గురించి, ప్రయాణికులకు మెరుగైన సేవల గురించి వివరించారు. సౌత్ సెంట్ర ల్ రైల్వేలో మొత్తం 9మందికి మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులను అందజేశారు.



మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డు అందుకున్న పాయింట్స్ మెన్ దినేష్

వసతి గృహంలో అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యం
యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు

పాయకాపురం, జూలై 22: స్థానిక రాధానగర్‌లోని వసతి గృహంలో శనివారం అదృశ్యమైన మైనర్ బాలిక ఆచూకీ లభ్యమైంది. ఈ కేసులో ఓ యువకుడిపై నున్న రూరల్ పోలీసులు సోమవారం కిడ్నాప్ కేసు నమోదు చేశారు. స్థానిక రాధానగర్‌లోని వసతి గృహంలో ఉంటున్న ఇంటర్ విద్యార్థిని (16) శనివారం కళాశాలకని వెళ్లి అదృశ్యమైన విషయం తెలిసిందే. మిస్సింగ్ కేసు నమోదు చేసిన నున్న రూరల్ పోలీసులు వివిధ కోణాల్లో కేసు దర్యాప్తు చేపట్టారు. కళాశాలకు వెళ్లడం ఇష్టం లేకనే గృహం నుంచి వెళ్లిపోయినట్టు తేలింది. శనివారం మధ్యాహ్నం వెళ్లిన బాలిక అక్కడి నుంచి బస్టాండ్‌కు వెళ్లింది. అక్కడ హోటల్లో పనిచేసే ప్రసాద్ అనే యువకుడు పరిచయం చేసుకుని వన్‌టౌన్‌లో తానుంటున్న రూమ్‌కు తీసుకెళ్లి అక్కడే ఉంచాడు. రెండు రోజుల తరువాత సోమవారం ఉదయం విద్యార్థిని రూమ్ బయటకు వచ్చి బంధువులకు ఫోన్ చేసి మాట్లాడింది. ఫోన్ కాల్ ఆధారంగా విద్యార్థి అడ్రస్‌ను గుర్తించిన పోలీసులు బాలికను స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలికను తీసుకెళ్లిన యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు.

సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశకు లైన్‌క్లియర్

- రైతులతో ఫలించిన చర్చలు.. భూములిచ్చేందుకు అంగీకారం
- భూ సమీకరణ పనులు ప్రారంభించిన సీఆర్‌డీఏ అధికారులు

విజయవాడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశ పనులకు లైన్ క్లియర్ అయింది. ఈ రోడ్డును ఎన్‌హెచ్-16కు అనుసంధానించడానికి వీలుగా భూ సమీకరణ కింద భూములివ్వడానికి రైతులు అంగీకారం తెలిపారు. రైతులు, సీఆర్‌డీఏ కమిషనర్ భాస్కర్ మధ్య జరిగిన చర్చలు సఫలమవడంతో సీఆర్‌డీఏ అధికారులు సోమవారం ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్‌పీఎస్) ప్రక్రియను చేపట్టారు. సోమవారం నుంచే సీఆర్‌డీఏ రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో ఎల్‌పీఎస్ పనులు చేపట్టారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సీడ్ యాక్సెస్ రోడ్డును మొత్తం 23 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. బోరుపాలెం నుంచి వెంకటపాలెం వరకు 18.2 కిలోమీటర్ల మేర మొదటి దశలో అభివృద్ధి చేశారు. అప్పట్లో కోర్టు కేసులు, రైతుల అభ్యంతరాల కారణంగా రెండో దశలో 3.8 కిలోమీటర్ల మేర పనులు చేపట్టడం కుదరలేదు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డును పూర్తిగా పక్కన పెట్టేశారు. తిరిగి టీడీపీ ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో సీడ్ యాక్సెస్ రోడ్డుపై దృష్టి సారించింది. భూ సమీకరణకు అభ్యంతరాలేమీ లేవని రాయపూడి, ఉండవల్లి, పెనుమాక రైతుల నుంచి లిఖిత పూర్వకంగా తీసుకుంటారు. ఈ ప్రక్రియ రెండు రోజులు పడుతుంది. తర్వాత భూములను స్వాధీనం చేసుకుని రోడ్డు పనులు చేపడతారు. కనకదుర్గ వారధి దిగువన, మణిపాల్ హాస్పిటల్ పక్కన ఎన్‌హెచ్-16 వరకు దీన్ని అనుసంధానిస్తారు.



వెబ్‌ల్యాండ్‌తో సంబంధం లేకుండా సీఆర్‌డీఏ పరిధిలో ప్లాట్ల రిజిస్ట్రేషన్

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అమరావతి పరిధిలో రైతుల ప్లాట్లు, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. వెబ్‌ల్యాండ్‌తో సంబంధం లేకుండా కార్డ్-2 ప్రాజెక్టులో రైతుల ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మినహాయింపు సీఆర్‌డీఏ పరిధికి మాత్రమే పరిమితం చేయాలని భావిస్తోంది. ఈ నెల 25న ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగే కీలక సమావేశంలో అధికారులు ఈ ప్రతిపాదన చేయనున్నారని తెలిసింది. సోమవారం సచివాలయంలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియాతో రెవెన్యూ, సీఆర్‌డీఏ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమావేశమయ్యారు. సీఆర్‌డీఏ పరిధిలో అసైన్డ్ ఫ్రీ హోల్డ్ భూములు, రైతులకు ఇచ్చే ప్లాట్ల రిజిస్ట్రేషన్లు సాగడం లేదు. రిజిస్ట్రేషన్ శాఖ తీసుకొచ్చి కార్డ్-2 సాఫ్ట్‌వేర్ సహకరించకపోవడమే దీనికి కారణం. వెబ్‌ల్యాండ్‌లోని భూముల డేటాను కార్డ్-2 కింద పొందలేకపోతున్నారు. దీంతో కొంతకాలంపాటు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిలిపివేశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ భూములతోపాటు, రైతులకిచ్చే ప్లాట్ల రిజిస్ట్రేషన్ వెంటనే జరిగిపోవాలని భావిస్తోంది. అడ్డంకులేమిటో కనిపెట్టి వెంటనే రిజిస్ట్రేషన్లకు మార్గం సుగుమం చేయాలని రెవెన్యూ స్పెషల్ సీఎస్ సిసోడియాను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఆయన సోమవారం నిర్వహించిన సమావేశంలో సీసీఎల్ఏ జయలక్ష్మీ, రిజిస్ట్రేషన్, సీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు. వెబ్‌ల్యాండ్ డేటాను కార్డ్-2 కింద వినియోగించుకోలేకపోతున్నందున సీఆర్‌డీఏ పరిధి వరకు వెసులుబాటు ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అంటే.. వెబ్‌ల్యాండ్ డేటాతో సంబంధం లేకుండా, ఒరిజినల్ రెవెన్యూ రికార్డుల ఆధారంగానే కార్డ్-2లో భూముల రిజిస్ట్రేషన్ చేపట్టాలని అనుకుంటున్నారు. ఈ ప్రతిపాదనను ముఖ్యమంత్రి ముందు ఉంచి ఆమోదం పొందనున్నారు.

బైక్‌పై మృతదేహం తరలింపు!

- అల్లూరి జిల్లా జడ్డంగి గ్రామంలో ఘటన


మృతదేహాన్ని బైక్ మీద తీసుకెళ్తున్న బంధువులు

రాజవొమ్మంగి జూలై 22: ప్రభుత్వాస్పత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో మహిళ మృతదేహాన్ని ఐదు కిలోమీటర్ల దూరంలోని ఇంటికి బైక్‌పై తరలించాల్సి వచ్చింది. అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామంలో సోమవారం జరిగిందీ హృదయవిదారక ఘటన. రాజవొమ్మంగి మండలం మిరియాలవీధి గ్రామానికి చెందిన కుంజం అన్నపూర్ణ(60) అనారోగ్యంతో బాధపడుతుండటంతో సోమవారం ఉదయం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న జడ్డంగి ప్రభుత్వాస్పత్రికి ఆటోలో తీసుకొచ్చారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. ఆమె మృతదేహాన్ని ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకెళ్లేందుకు జడ్డంగి ప్రభుత్వాస్పత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేదు. ఐటీడీఏ అంబులెన్స్ మరమ్మతులకు గురవడంతో రెండు వారాలుగా పనిచేయడం లేదు. దీంతో అన్నపూర్ణ మృతదేహాన్ని బంధువులు బైక్ మీదే ఐదు కిలోమీటర్ల దూరంలోని స్వగ్రామానికి తరలించారు.

గొడ్డలి.. కోడికత్తి.. గులకరాయి డ్రామాలు చాలక

ఇప్పుడు ఢిల్లీలో ధర్నా డ్రామా

- ఓడినా జగన్ నియంతృత్వ పోకడలు మానట్లేదు: టీడీపీ ఎంపీలు

న్యూఢిల్లీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డిపై ఆరోపణలను పక్కదారి పట్టించేందుకు ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఢిల్లీలో ధర్నాకు పూనుకున్నారని టీడీపీ ఎంపీలు విమర్శించారు. గొడ్డలి, కోడికత్తి, గులకరాయి డ్రామాలు చాలక ఇప్పుడు రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందని జగన్ ధర్నా డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం పోయినా జగన్ తన నియంతృత్వ పోకడలను మానుకోవట్లేదని విమర్శించారు. సోమవారం, ఇక్కడ మీడియా సమావేశంలో టీడీపీ ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, నాగరాజు, పుట్టా మహేష్‌కుమార్, శ్రీభరత్ మాట్లాడారు. అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేక జగన్ ధర్నాలు అంటున్నారని దగ్గుమళ్ల విమర్శించారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో ఏపీలో జరిగిన విధ్వంసం అంతా ఇంతా కాదన్నారు. తాను చేసిన అరాచక పాలనను జనం మరిచిపోకముందే ఢిల్లీలో ధర్నా అంటూ జగన్ నానాయాగి చేస్తున్నారని ఎంపీ నాగరాజు విమర్శించారు. అప్పులు తెచ్చుకోవడానికి, పైరవీలు చేసుకోవడానికే గతంలో జగన్ ఢిల్లీకి వచ్చేవారని ఎంపీ పుట్టా మహేష్ విమర్శించారు. గొడ్డలి, కోడికత్తి, గులకరాయి డ్రామాలు చాలక ఇప్పుడు కొత్త డ్రామాకు తెరలేపారన్నారు.

జగన్... అసెంబ్లీకి రా.. మీ అరాచకాల్ని కడుగుతాం

- మేం సరిగ్గా ఫీల్డ్ చేసి ఉంటే ఆ 11 కూడా వచ్చేవి కావు: బుచ్చయ్య

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): 'హత్యా రాజకీయాలకు ఆదిపురుషుడు జగన్ కుటుంబమే. అసెంబ్లీకి వచ్చి చర్చిస్తే నీ బాగోతం అంతా బయటపెడతాం. జగన్ పెట్టిన తప్పుడు కేసులూ చర్చకు వస్తాయి' అని టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సోమవారం జరిగిన ఎన్‌డీఏ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశం తర్వాత బుచ్చయ్య చౌదరి ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. కక్షసాధింపు రాజకీయాలు అక్కర్లేదని ఎవరి తప్పులకు వారే బలైపోతారని చంద్రబాబు చెప్పారని తెలిపారు. 'ఇసుకపాలసీలో లోటుపాట్లు ఉన్నాయని వాటన్నింటినీ సరిచేసుకుని ముందుకు వెళ్దామని సీఎం చెప్పారు. రెండు మూడు నెలల్లో సీజన్ వస్తుందని ఆ సీజన్ వచ్చే సరికి ఇసుక పాలసీలో పూర్తి మార్పులు చేద్దామనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు' అని బుచ్చయ్య అన్నారు. టీడీపీ సరిగ్గా ఫీల్డ్ చేసి ఉంటే జగన్‌కు ఆ 11 సీట్లు కూడా వచ్చేవి కావని జగన్ జీరోకి వెళ్లిపోయేవారని అన్నారు.

కూటమి వైఫల్యాలను ఎండగడతాం: వైసీపీ

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఢిల్లీ ధర్నాలో ఎండగడతామని వైసీపీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హెచ్చరించారు. సోమవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగ సమయంలో సభ నుంచి వాకౌట్ చేసిన వైసీపీ నేతలు బయట మీడియాతో మాట్లాడారు. ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో దమనకాండ జరుగుతున్నా సీఎం చంద్రబాబు కనీసం బాధితులను పరామర్శించడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ కళ్యాణి మాట్లాడుతూ రాష్ట్రంలో రోజుకో హత్య, అత్యాచారం జరుగుతున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రశ్నించిన గొంతుని కూటమి ప్రభుత్వం తొక్కుతుందని ఆరోపించారు.

జగన్ సర్కారులో విద్యా రంగం విధ్వంసం: పీడీఎఫ్

అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విద్యారంగాన్ని విధ్వంసం చేసిందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్లా వెంకటేశ్వరరావు అన్నారు. విద్యాశాఖలో ఉన్న ఖాళీలను జగన్ సర్కారు భర్తీ చేయలేదన్నారు. కొత్త ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని సూచించారు. ప్రభుత్వం భవిష్యత్తులో ఏం చేయబోతుందనే వివరాలు గవర్నర్ ప్రసంగంలో లేవని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. అమరావతి ఎలా ఉండబోతోంది, పోలవరాన్ని ఏం చేయబోతుందనే వివరాలే లేవన్నారు. ప్రజలకు మేలు చేసేలా అనుకూల విధానాలు అవలంబిస్తే ప్రభుత్వానికి మద్దతు ఇస్తామని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తే గత ఐదేళ్లు అనుసరించిన విధానాన్నే అనుసరిస్తామని లక్ష్మణరావు స్పష్టం చేశారు.

తిరుపతి ఐఐటీతో అమరరాజా ఎంఓఏ

హైదరాబాద్ సిటీ, జూలై 22 (ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్‌డ్ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీస్‌కు సంబంధించి తిరుపతిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)తో అమరరాజా సంస్థ మెమోరాండం ఆఫ్ అగ్రిమెంట్ (ఎంఓఏ) కుదుర్చుకుంది. అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ రామచంద్ర నాయుడు గౌరవార్థం ఐఐటీ తిరుపతిలో విజిటింగ్ చైర్ ప్రొఫెసర్ షిప్‌ను ఏర్పాటు చేసేందుకు అమరరాజా సంస్థ అంగీకారం తెలిపిందని తిరుపతి ఐఐటీలో జరిగిన ఓ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ గల్లా జయదేవ్ ప్రకటించారు. విజిటింగ్ చైర్ ప్రొఫెసర్‌షిప్ 2025 నుంచి పదేళ్లపాటు కొనసాగుతుందని చెప్పారు. ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ.. విజిటింగ్ చైర్ ప్రొఫెసర్‌షిప్ అనేది ఒక అధ్యాపకుడికి ఒక సంస్థ అందించే అత్యుత్తమ గౌరవమని చెప్పారు. దేశంలో ఇంధన అవసరాలను తీర్చడానికి, స్థిరమైన సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి తమ సంస్థ ఎల్లప్పుడూ కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జేఎస్‌డబ్ల్యు మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు గోపాలక్రిష్ణన్, అమర హాస్పటల్స్ డాక్టర్ రమాదేవీ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షాను కలిసిన విజయసాయి రెడ్డి

న్యూఢిల్లీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షాను వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయి రెడ్డి కలిశారు. సోమవారం పార్లమెంట్‌లోని అమిత్ షా చాంబర్‌లో ఆయన్ను కలిసి రాష్ట్రానికి సంబంధించి పలు విషయాలపై చర్చించానని 'ఎక్స్'లో విజయసాయి పేర్కొన్నారు.

స్టేషనరీ.. కిరికిరి!

- నాటి మంత్రులు పెన్సిళ్లు, రబ్బర్లూ వాడారా?!
- జగన్ హయాంలో జీఏడీ అధికారుల విన్యాసాలు
- ప్రజాధనం అడ్డగోలుగా దుర్వినియోగం
- కోటీ 11 లక్షలతో అనవసరమైన స్టేషనరీ
- కోడ్ ఉన్నా కేబినెట్ సమావేశాలంటూ కొనుగోలు
- బ్లాక్‌లిస్టులోని రమ్య ఎంటర్‌ప్రైజెస్‌కే కాంట్రాక్టు
- ఒకపూట టీ/కాఫీ, స్నాక్స్, లంచ్ ఖర్చు రూ.4.12లక్షలు
- చక్రం తిప్పిన డిప్యూటీ సెక్రటరీ?!
- పొలిటికల్ సెక్రటరీకి తెలీకుండా ఇప్పటికీ ఫైలు!
- విచారణ చేస్తేనే అవినీతి గుట్టు బయటికి..

> జగన్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని ఎంతలా దుబారా చేయాలో అంతలా బరితెగించి ఖర్చు చేసిన వైనం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే! తను అడుగుతీస్తే పరదాలు కట్టే పరిస్థితి నుంచి రుషికొండ ప్యాలెస్ వరకు కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేశారు. ఆఖరికి పెన్నూ పెన్సిల్ అంటూ.. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసిన బాపతు జగన్ సర్కారుదే! అసలు జగన్ హయాంలో కేబినెట్ సమావేశాలు జరిగిందే తక్కువ. ఐదేళ్లలో 55 సమావేశాలు మాత్రమే జరిగాయి. ఇందులో పేపర్లు, పెన్నులు దాదాపు వినియోగించారు. పెన్సిళ్లు, రబ్బర్లు, షార్ప్‌నర్లు అసలు వాడరు. కానీ, కేబినెట్ సమావేశాల పేరుతో అక్కర్లేని స్టేషనరీని భారీగా కొనుగోలు చూపి.. ప్రజాధనాన్ని అడ్డగోలుగా దుర్వినియోగం చేయడమే కాకుండా, అందులో ఎక్కువశాతం నిధులు దారిమళ్లించినట్లు తెలుస్తోంది. అదికూడా బ్లాక్ లిస్టులో ఉన్న సంస్థకే ఈ కాంట్రాక్టును కట్టబెట్టి నిధులు బొక్కేశారని ఉద్యోగులే చెప్పుకొంటున్నారు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం ఉండగా.. ఎన్నికల కోడ్ వచ్చిన మార్చి నెలలో కోటీ పదకొండు లక్షల ఖర్చుతో పెన్నులు, పేపర్లు, డస్ట్‌బిన్నులు, స్టాప్లర్లు, వాటర్ బాటిళ్లు, వగైరాలు భారీగా కొనుగోలు చేశారు. అయితే, కొన్నామంటూ పేపర్ మీద చూపుతున్న లెక్కలే తప్ప గోడౌన్‌లో ఆ వస్తువులు కనపడడం లేదని తెలుస్తోంది. కేబినెట్ సమావేశంలో 25 మంది మంత్రులు, అవసరాన్ని బట్టి అధికారులు సమావేశ మందిరంలోకి వెళ్లి వస్తుంటారు. వీరికోసం 11,550 పెన్నులు కొన్నారు. వీటిని ఎన్ని సంవత్సరాలు వాడుతారు. ఏళ్ల తరబడి నిల్వచేస్తే పెన్నులు పనికిరావు. జగన్ హయాంలో అధికంగా షార్ట్ సర్క్యులేషన్ విధానంలో కేబినెట్ ప్రతిపాదనలకు ఆమోదం తీసుకున్నారు. ఈ తరహా సమావేశాలకు స్టేషనరీ అవసరమే ఉండదు. మరెందుకు ఇంత భారీ స్థాయిలో కొన్నారు. ఏ కంపెనీ లేనట్టూ రాష్ట్ర అసెంబ్లీ, ప్రముఖ కంపెనీ హెచ్‌పీ బ్లాక్ లిస్టులో పెట్టిన రమ్య ఎంటర్‌ప్రైజెస్‌కే ఏరికోరి ఎందుకు అప్పజెప్పారు? అసెంబ్లీకి, సచివాలయానికి ఒక గోడే అడ్డం. అయినప్పటికీ అసెంబ్లీ వద్దనుకున్న ఆ కంపెనీకే జీఏడీ పట్టం కట్టడం వెనుక మతలబు ఏంటన్నది అర్థం చేసుకోవచ్చు!

కోటి బడ్జెట్ ఉంది కదా.. కొంత నొక్కేద్దాం!

2024 మార్చి నాటికి జీఏడీ పొలిటికల్‌కు రూ.2 కోట్ల బడ్జెట్ అందుబాటులో ఉంది. మార్చి 31 నాటికి ఈ నిధులు మురిగిపోతాయి. వీటిని ఎలాగైనా జేబులో వేసుకోవాలని భావించి కేబినెట్ సమావేశాలకు స్టేషనరీ అంటూ టెండర్లు పిలిచారు. నాలుగు కంపెనీలు వచ్చాయి. అందులో రమ్య ఎంటర్‌ప్రైజెస్ కూడా ఒకటి. నిబంధనల ప్రకారం ఆ 4 కంపెనీలకు కాంట్రాక్టు అప్పజెప్పాలి. ఈ కంపెనీలతో జీఏడీ అధికారులు ఇందులో 20 శాతం వస్తువులు సరఫరా చేయనక్కర్లేదని, తాము చూసుకుంటామని డీల్ కుదుర్చుకున్నట్టు సమాచారం. ఇందులో జీఏడీలోని ఒక ఎస్వో, జీఏడీలో ఐదారుగురు ఎమ్ఎల్‌వోలు ఉన్నప్పటికీ జీఏడీ అంతా తానై నడిపిస్తున్న ఒక డిప్యూటీ సెక్రటరీ హస్తం ఉన్నట్టు సమాచారం. దీనిపై పొలిటికల్ సెక్రటరీ ఆరాతీస్తున్నట్టు తెలిసింది. కేబినెట్ సమావేశాల్లో 25 మంది మంత్రులు, సెక్రటరీ, హెచ్ఓడీ స్థాయి అధికారులు మాత్రమే ఉంటారు. అందరూ కలిపి ఒక 50 మంది వరకూ ఉండొచ్చు. వీరు వాడుకోవడానికి ఏకంగా 11,550 పెన్నులు కొన్నారు. ఇంకా.. కేబినెట్‌లో వాడుకోవడానికంటూ పేపర్ల కోసం రూ.3,55,110, పేపర్ల కోసం రూ.4,83,304 ఖర్చు పెట్టారు. అలాగే, 2021లో డిసెంబరు 10వ తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో పాల్గొన్న మంత్రులు, అధికారులకు టీ/కాఫీ, స్నాక్స్, లంచ్ కోసం రూ.4,12,000 ఖర్చు చేశారు. ఈ రమ్య ఎంటర్‌ప్రైజెస్ బ్లాక్‌లిస్టులో ఉన్న విషయాన్ని జీఏడీ పొలిటికల్ సెక్రటరీ దృష్టికి వెళ్లకుండా ఆ ఉన్నతాధికారి నెలన్నర నుంచి ఆ ఫైలును ఇప్పటికీ తొక్కిపెడుతున్నారు. 2021లో, 2024 మార్చిలోనూ ఈ ఖర్చుల వెనుక ఉన్నది ఈ డిప్యూటీ సెక్రటరీనేనని వినిపిస్తోంది. మొత్తంగా ఈ పేపర్లు, పెన్నులు, టీ, కాఫీల కోసం లక్షల్లో చేసిన ఖర్చుపై ప్రభుత్వం విచారణ చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

కేసుల విముక్తి ఎప్పుడో?

- కోర్టుల చుట్టూ తిరుగుతున్న రాజధాని రైతులు

తుళ్లూరు, జూలై 22: రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులు ఇప్పుడు అక్రమ కేసుల వాయిదాల కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. 2019లో రాష్ట్రంలో ఏర్పడిన వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేయడంతో దాన్ని వ్యతిరేకిస్తూ రైతులు అమరావతి ఉద్యమం చేపట్టారు. ఉద్యమాన్ని అణచివేయడానికి అప్పటి ప్రభుత్వం రైతులపై అక్రమ కేసులను బనాయించింది. ఈ కేసులకు సంబంధించి రైతులు సోమవారం మంగళగిరి కోర్టుకు హాజరయ్యారు. కూటమి గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావటంతో అక్రమ కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకొని విముక్తి కలిగిస్తారని రైతులు ఎదురు చూస్తున్నారు.

ఇక 'ఏసీ ఎకానమీ'గా గరీబ్ రథ్ రైళ్లు

న్యూఢిల్లీ, జూలై 22: కొత్తగా రూపొందించిన ఏసీ ఎకానమీ కోచ్‌లను అన్ని గరీబ్ రథ్ రైళ్లకు అమర్చాలని రైల్వే శాఖ నిర్ణయించింది. 'ప్రస్తుతం గరీబ్ రథ్ రైళ్లకు ఉన్న కోచ్‌లన్నీ పురాతనమైనవి. అవి బాగా పాతబడిపోయాయి. వాటి స్థానంలో ఎల్‌హెచ్‌బీ ర్యాక్‌లతో కూడిన థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లు అమర్చాలని నిర్ణయించాం' అని రైల్వేశాఖ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. కొత్త ర్యాక్‌లతో కూడిన రైళ్లను కొన్ని రూట్‌లలో ఈనెల నుంచే నడపనున్నామన్నారు.

'సంఘ్'లో ప్రభుత్వ ఉద్యోగులపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ, జూలై 22: ప్రభుత్వ ఉద్యోగులు ఆరెస్సెస్ కార్యకలాపాల్లో పాల్గొనకుండా 1966లో విధించిన నిషేధాన్ని కేంద్రం ఎత్తివేసింది. ఈ నెల 9న ఈ ఉత్తర్వులిచ్చినట్లు బీజేపీ ఐటీ విభాగం ఇన్‌చార్జి అమిత్ మాలవీయ సోమవారం 'ఎక్స్'లో తెలిపారు. అసలు నిషేధమే విధించి ఉండాల్సింది కాదని, 58 ఏళ్లనాటి ఈ ఉత్తర్వులు రాజ్యాంగవిరుద్ధమని, వాటిని మోదీ సర్కారు ఎత్తివేసిందని వ్యాఖ్యానించారు. మోదీ సర్కారు నిర్ణయంపై విపక్షాలు మండిపడ్డాయి. ఇది దురదృష్టకర నిర్ణయమని.. ప్రజాతీర్పు నుంచి బీజేపీ ప్రభుత్వం పాఠాలు నేర్వడం లేదని కాంగ్రెస్ విమర్శించింది. వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు కూడా ఈ నిషేధాన్ని పొడిగించారని.. సంఘ్‌తో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించుకునేందుకే ప్రధాని మోదీ దానిని ఎత్తివేశారని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్'లో ధ్వజమెత్తారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులు నిక్కర్లు వేసుకుని ఆఫీసులకు వస్తారని ఎద్దేవాచేశారు.

అదిరేటి డ్రెస్సు మీరేస్తే..!

మోదీ, బైడెన్, ట్రంప్, పుతిన్ ర్యాంప్ వాక్.. ఏఐ వీడియోను విడుదల చేసిన ఎలాన్ మస్క్



న్యూఢిల్లీ, జూలై 22: నరేంద్ర మోదీ, జో బైడెన్, డొనాల్డ్ ట్రంప్, వ్లాదిమిర్ పుతిన్, బరాక్ ఒబామా.. వీళ్లంతా ప్రపంచస్థాయి నాయకులు. నిత్యం సంప్రదాయ దుస్తులతో దర్శనమిస్తూ ఉంటారు. వీళ్లంతా ఒకరోజు ఫ్యాషన్ ప్రపంచంలోకి అడుగుపెట్టి.. ఒకే వేదికపై అదిరేటి డ్రెస్సులతో ర్యాంప్ వాక్ చేస్తే ఎలా ఉంటుంది..? ఈ చిత్రాన్ని కలలో కూడా ఊహించలేం కదా..! అయితే.. టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్.. ఈ కాల్పనిక దృశ్యాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా సృష్టించారు. ఏఐకి ఫ్యాషన్‌ను మేళవిస్తూ అగ్రస్థాయి నేతలకు కొత్త కొత్త మోడల్ డ్రెస్సులు తొడిగి.. వాళ్లతో ర్యాంప్ వాక్ చేయించారు. ఈ వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసి 'ఫ్యాషన్ షోకు వేళయింది' అంటూ క్యాప్షన్ పెట్టారు. ఈ వీడియోలో భారత ప్రధాని మోదీ.. ఒంటి నిండా రంగురంగుల దుస్తులు, నల్ల కళ్లద్దాలు, నుదుటిన బొట్టుతో స్టైల్‌గా వాకింగ్ చేస్తూ కనిపించారు. అమెరికా సైనిక దుస్తుల్లో ఉన్న బైడెన్‌ను వీల్‌చైర్‌లో వస్తున్నట్టు చూపించారు. ఖైదీలు ధరించే డ్రెస్, చేతిలో బేడీలు, సీరియస్ లుక్‌తో ట్రంప్ ర్యాంప్‌పై నడిచారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, కెనడా ప్రధాని ట్రూడోను మహిళా దుస్తుల్లో చూపించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాను మాత్రం రంగు రంగుల దుస్తుల్లో, రాజుల కాలం నాటి వేషధారణలో రకరకాల కాస్ట్యూమ్స్‌తో ర్యాంప్‌పై నడిపించారు. ఎలాన్ మస్క్ కూడా టెస్లా, ఎక్స్ థీమ్‌లో ఉన్న స్పేస్ సూట్‌లో సూపర్ హీరోలా కనిపించారు. ఇంకా.. హిల్లరీ క్లింటన్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్, ఉత్తర కొరియా అధినేత కిమ్, ఫేస్‌బుక్ చీఫ్ మార్క్ జుకెర్ బర్గ్ వంటి ప్రముఖులు కూడా ఈ వీడియోలో ర్యాంప్ వాక్ చేశారు. ఇటీవల మైక్రోసాఫ్ట్ సర్వర్ క్రాష్ అయిన విషయాన్ని గుర్తుచేస్తూ 'బ్లూ స్క్రీన్' కనిపించేలా ల్యాప్‌టాప్ పట్టుకుని ర్యాంప్ వాక్ చేస్తున్న బిల్ గేట్స్‌ను కూడా ఈ వీడియోలో చూపించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు ఫన్నీ కామెంట్లు పెడుతున్నారు. ఒక యూజర్ 'ట్రంప్ నిజమైన విజేత' అని కామెంట్ పెట్టారు.

పడకేసిన సీలేరు జల విద్యుత్కేంద్రం

- ప్రస్తుతం నాలుగో వంతే ఉత్పత్తి
- సాంకేతిక లోపాలతో మూడు యూనిట్లు మూత
- నీరు పుష్కలంగా ఉన్నా వాడుకోలేని దుస్థితి


సీలేరు జలవిద్యుత్ కేంద్రం

సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం గుంటవాడ జలాశయంలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ సీలేరు విద్యుత్ కేంద్రంలో ఒక్క యూనిట్ ద్వారా మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోంది. సీలేరు జల విద్యుత్ కేంద్రం సామర్థ్యం 240 మెగా వాట్లు. ఒక్కొక్కటీ 60 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసే నాలుగు యూనిట్లు ఉండగా, వాటిలో ప్రస్తుతం ఒక్కటి మాత్రమే పనిచేస్తోంది. వీటిలో మొదటి దశలో నిర్మించిన ఒకటి, రెండు యూనిట్లు 50 సంవత్సరాలకు పైబడినవి కాగా, మూడు, నాలుగు యూనిట్లు 30 సంవత్సరాలకు పైబడినవి. ఈ యూనిట్ల జీవితకాల పరిమితి (లైఫ్ టైమ్) మించడంతో ఇటీవల తరచుగా మరమ్మతులకు గురవుతూ మొరాయిస్తున్నాయి. మొదటి యూనిట్‌లో స్టాటర్ ఎర్త్ సమస్యతో 40 రోజుల క్రితం ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ యూనిట్‌కు ఏడాది క్రితం పూర్తి ఓవర్‌హాలింగ్ నిర్వహించినప్పటికీ కొద్దిరోజులకే మళ్లీ స్టాటర్ ఎర్త్ సమస్య రావడంతో పనులు నిర్వహించిన కంపెనీపై విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే రెండో యూనిట్ కూడా ప్రస్తుతం వినియోగంలో లేదు. వారం క్రితం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గల బస్‌బార్ల నుంచి నీరు లోపలకు ప్రవేశించి ఎర్త్ సమస్య తలెత్తడంతో నాలుగో నంబరు యూనిట్‌లో కూడా విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. ప్రస్తుతం మూడో యూనిట్‌లో మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఈ ప్రాంతంలో కురుస్తున్న భారీవర్షాలకు గుంటవాడ జలాశయంలోకి పుష్కలంగా నీరు చేరినప్పటికీ విద్యుత్ ఉత్పత్తి చెయ్యడానికి యూనిట్లు అందుబాటులో లేవు. నాలుగో యూనిట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు బస్‌బార్‌లలోకి నీరు లీక్ కాకుండా స్థానిక జెన్‌కో అధికారులు కాంక్రీట్ పనులు, గ్రౌటింగ్ పనులు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. మరోపక్క జలాశయంలో నీటి నిల్వలు రోజురోజుకు పెరిగిపోతుండడంతో నీటిని వృథాగా దిగువకు వదిలి పెట్టాల్సి వస్తోందని జెన్‌కో అధికారులు అంటున్నారు. యూనిట్ల నిర్వహణ పనులను సరైన సంస్థలకు అప్పగించకపోవడం వల్లనే తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయని విమర్శలు తలెత్తుతున్నాయి.


ఉండవల్లిలోని తన నివాసానికి వచ్చిన హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయతో చంద్రబాబు

బాబుతో హరియాణా గవర్నర్ దత్తాత్రేయ భేటీ

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయకు చంద్రబాబు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. శాలువాతో సత్కరించారు. రాజకీయాల్లో దాదాపు పదిహేనేళ్లుగా పరిచయమున్న ఇరువురు నేతలు కాసేపు ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.


అంత భయం ఎందుకు జగన్?

- 'ఎక్స్'లో బుద్దా వెంకన్న కౌంటర్



విజయవాడ, జూలై 22: 'కేవలం 50 రోజులపాటు పదవి లేకపోతేనే నీలో ఇంత భయం ఎందుకు జగన్?' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వేసే ప్రతి అడుగులో భయం కనపడుతోందంటూ 'ఎక్స్'లో జగన్ చేసిన పోస్టుపై బుద్దా వెంకన్న 'ఎక్స్' వేదికగానే స్పందించారు. 'ప్రజలంటే భయం కాబట్టే రాజుల కాలం మాదిరి ప్యాలెస్‌లు కట్టుకుని, వాటి చుట్టూ 30 అడుగుల ఎత్తులో ఇనుప కచ్చడాలు పెట్టుకుని, చుట్టూ వందల మంది ప్రైవేటు సెక్యూరిటీని పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నావు జగన్ రెడ్డీ. నీపై 31 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏ క్షణాన సీబీఐ వాళ్లు వచ్చి ఎత్తుకెళతారా అని నీకు భయం. నీ అరాచకాలు, దోపిడీతో విసిగిపోయిన వాడు ఎవడైనా నీపై దాడి చేస్తాడని నీకు భయం. బాబాయ్‌ని గొడ్డలి వేటుతో చంపిన పాపం వెంటాడుతుందని నీకు భయం' అంటూ ఎద్దేవా చేశారు.

రాజధానిలో సిటీస్ చాలెంజ్ ప్రాజెక్టు పనులు: మంత్రి నారాయణ



అమరావతి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాజధానిలోని పలు గ్రామాల్లో సిటీస్ చాలెంజ్ ప్రాజెక్టు కింద అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఆయా పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో మంత్రి నారాయణ సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెలాఖరులోపు అన్ని నిర్మాణాలూ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లోని 24 గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రాజెక్టులో భాగంగా 14 ప్రభుత్వ పాఠశాలల నిర్మాణం, 17 అధునాతన అంగన్‌వాడీ సెంటర్ల నిర్మాణం, 16 ఈ-హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు, ఒక బహుళ అత్యాధునిక పర్యావరణ శ్మశాన వాటిక నిర్మాణం చేపడతామని నారాయణ తెలిపారు.

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు: సీపీఐ

అమరావతి, జూలై 22(ఆంధ్రజ్యోతి): పెద్దవాగు ముంపు మండలాలతో పాటు గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టి బాధితులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సోమవారం ఆయన లేఖ రాశారు. పెద్దవాగు ప్రాజెక్టు తెగిపోవడం వల్ల వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వేలాది కుటుంబాలవారు నిరాశ్రయులయ్యారని ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 23 జూలై 2024
diksuchi@andhrajyothy.com

డిగ్రీతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం
ఎస్ఎస్‌సీ సీజీఎల్ఈ-2024

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)... కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో గ్రూప్-బి, సి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్(సీజీఎల్ఈ) 2024

మొత్తం ఖాళీలు: **17,727**

పోస్టుల వివరాలు

- గ్రూప్-బిలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్/అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, సబ్ ఇన్‌స్పెక్టర్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, రీసెర్చ్ అసిస్టెంట్, డివిజన్ అకౌంటెంట్, జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయి.
- గ్రూప్-సిలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్/జూనియర్ అకౌంటెంట్, పోస్టల్ అసిస్టెంట్/సార్టింగ్ అసిస్టెంట్, సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్/అప్పర్ డివిజన్ క్లర్క్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, ట్యాక్స్ అసిస్టెంట్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఉన్నాయి.

అర్హతలు: ఏదైనా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్మీడియట్ స్థాయిలో మేథమెటిక్స్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఆ తరవాత డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. లేదా డిగ్రీ స్థాయిలో స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్-2 పోస్టులకు స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్‌హెచ్ఆర్‌సీలో రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు కనీసం ఏడాది రీసెర్చ్ అనుభవం ఉన్నవారికి, న్యాయశాస్త్రంలో డిగ్రీ లేదా హ్యూమన్ రైట్స్‌లో డిగ్రీ పూర్తిచేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది. నిర్దిష్ట విద్యార్హతలన్నీ 2024 ఆగస్టు 1లోపు పొంది ఉండాలి.

వయసు: జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు 32 ఏళ్లు, గ్రూప్- సి పోస్టులకు 27 ఏళ్లు. మిగతా అన్ని పోస్టులకు గరిష్ఠ వయోపరిమితి 30 ఏళ్లు. నిబంధనల ప్రకారం రిజర్వేషన్ వర్గాలకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

వేతనం: పే లెవల్-4, 5, 6, 7లతో ప్రారంభ వేతనం లభిస్తుంది. కనిష్ఠ ప్రారంభ వేతన శ్రేణి రూ.25,500 - రూ.81,00; గరిష్ఠ ప్రారంభ వేతన శ్రేణి రూ.44,900 - రూ.1,42,00.

ఎంపిక ప్రక్రియ: రెండు దశల్లో నిర్వహించే రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

టైర్-1 పరీక్ష: దీనిని 200 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్(25 ప్రశ్నలు), జనరల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు), ఇంగ్లిష్ కాంప్రహెన్షన్(25 ప్రశ్నలు) నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఈ పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులతో ఉత్తీర్ణులైన వారిని టైర్-2 పరీక్షకు ఎంపిక చేస్తారు.

టైర్-2: ఈ పరీక్షను మొత్తం నాలుగు పేపర్లలో నిర్వహిస్తారు.

- పేపర్-1లో రెండు సెషన్లు ఉంటాయి. సెషన్-1(సెక్షన్-1)లో మేథమెటికల్ ఎబిలిటీ(మాడ్యుల్-1), రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్(మాడ్యుల్-2) విభాగాల నుంచి 30 ప్రశ్నల చొప్పున మొత్తం 60 ప్రశ్నలు వస్తాయి. ఒక్కో ప్రశ్నకు 3 మార్కుల చొప్పున మొత్తం 180 మార్కులు కేటాయించారు. సెషన్-1(సెక్షన్-2)లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(మాడ్యుల్-1)లో 45 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్(మాడ్యుల్-2)లో 25 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 70 ప్రశ్నలకు 210 మార్కులు కేటాయించారు. సెషన్-1(సెక్షన్-3)లో కంప్యూటర్ నాలెడ్జ్(మాడ్యుల్-1) నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. దీనికి కేటాయించిన మార్కులు 60. సెషన్-2(సెక్షన్-3)లో డేటా ఎంట్రీ స్పీడ్ టెస్ట్(మాడ్యుల్-2)ని 15 నిమిషాల్లో పూర్తి చేయాలి. పేపర్-2 స్టాటిస్టిక్స్‌కి సంబంధించింది. దీనిని 100 ప్రశ్నలు- 200 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్-3ని జనరల్ స్టడీస్ (ఫైనాన్స్ అండ్ ఎకనామిక్స్)తో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో 100 ప్రశ్నలు ఉంటాయి. అన్ని పోస్టుల అభ్యర్థులు పేపర్-1కు తప్పనిసరిగా హాజరు కావాలి. పేపర్-2 జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు మాత్రమే ఉంటుంది. అదేవిధంగా పేపర్-3ని అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 24
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** ఆగస్టు 10, 11
- **టైర్-1 పరీక్ష:** సెప్టెంబరు/అక్టోబరు
- **టైర్-2 పరీక్ష:** డిసెంబరు
- **వెబ్‌సైట్:** https://ssc.gov.in/

ప్రిపరేషన్

ఇంటెలిజెన్స్-రీజనింగ్: ఈ విభాగం కోసం వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్‌పై అవగాహన పెంచుకోవాలి. ఇందుకు కోడింగ్, డీకోడింగ్, నెంబర్ సిరీస్, ఎనాలజీ, క్లాసిఫికేషన్, సిలాజిజమ్స్ మ్యాట్రిక్స్ కోడింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి వాటిపై పట్టు సాధించాలి.

జనరల్ అవేర్‌నెస్: ఇందులో చరిత్ర, జాగ్రఫీ, ఆర్థిక వ్యవస్థ, రాజ్యాంగం, కరెంట్ అఫైర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి అంశాలపై ప్రశ్నలు వస్తాయి. దీని కోసం దినపత్రికలు, ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్, మనోరమ ఇయర్ బుక్ ఫాలో కావాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్: ఇందులో శాతాలు, స్క్వేర్‌రూట్స్, సరాసరి, లాభ-నష్టాలు, కాలం-పని, కాలం-దూరం వంటి అంశాలే కాకుండా జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ టాపిక్స్‌ను కూడా ప్రిపేర్ కావాలి. ఇందుకోసం 10వ తరగతి వరకు గల మేథ్స్ పుస్తకాల్లోని సంబంధిత అంశాలను అధ్యయనం చేయాలి.

ఇంగ్లీష్: ఇందులో కాంప్రెహెన్షన్, ఎర్రర్ డిటెక్షన్స్, సినానిమ్స్, ఎంటానిమ్స్, కరెక్ట్ స్పెల్లింగ్ వంటి ప్రశ్నలు వస్తాయి. మంచి స్కోర్ సాధించాలంటే వొకాబులరీపై ఎక్కువగా దృష్టి సారించాలి.

పేపర్-2, పేపర్-3: జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే పేపర్-2, అదే విధంగా అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టుల అభ్యర్థులకు నిర్వహించే పేపర్-3లో విజయం సాధించాలంటే అభ్యర్థులు బ్యాచిలర్స్ డిగ్రీ స్థాయిలో అకడమిక్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదేవిధంగా గత ప్రశ్న పత్రాలు, నమూనా ప్రశ్న పత్రాలను సాధన చేయాలి.

సెస్‌లో పీహెచ్‌డీ

బేగంపేట(హైదరాబాద్)లోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఇన్ డెవలప్‌మెంట్ స్టడీస్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌నకు నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ సహకారం అందిస్తోంది. మొత్తం 12 సీట్లు ఉన్నాయి. రీసెర్చ్ ప్రపోజల్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలంగాణ ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. స్థానికేతరులకు హాస్టల్ సౌకర్యం ఉంది. అర్హులైన అభ్యర్థులకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్/ఫెలోషిప్స్ అందిస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి ఆరేళ్లు. మొదటి ఏడాది రెండు సెమిస్టర్లు ఉంటాయి. వీటిలో కోర్సు వర్క్‌లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో రీసెర్చ్ మెథడాలజీ, పర్‌స్పెక్టివ్స్ అండ్ పారాడైమ్స్ ఆఫ్ డెవలప్‌మెంట్, ఫండమెంటల్స్ ఆఫ్ ఎకనామెట్రిక్స్/ డెవలప్‌మెంట్ స్టాటిస్టిక్స్ పేపర్లు; రెండో సెమిస్టర్‌లో ఇండియాస్ డెవలప్‌మెంట్ డిబేట్, అప్లయిడ్ ఎకనామెట్రిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్, పారాడైమ్స్ ఇన్ సోషల్ సైన్సెస్ పేపర్లు ఉంటాయి. ఈ రెండు సెమిస్టర్లు పూర్తయిన తరవాత అభ్యర్థులు ప్రీ పీహెచ్‌డీ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం 50 శాతం మార్కులు సాధించినవారిని మాత్రమే పీహెచ్‌డీ రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. పీహెచ్‌డీలో చేరినవారు అయిదేళ్లపాటు రీసెర్చ్/థీసిస్ వర్క్ చేయాల్సి ఉంటుంది.

విభాగాలు: ఎకనామిక్స్, సోషియాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్, డెవలప్‌మెంట్ స్టాటిస్టిక్స్, పొలిటికల్ సైన్స్/పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్/బిజినెస్ మేనేజ్‌మెంట్

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. యూజీసీ జేఆర్ఎఫ్/యూజీసీ నెట్ అర్హత తప్పనిసరి.



ఎంపిక: అభ్యర్థులు దరఖాస్తుతోపాటు కనీసం 1500 పదాలతో రీసెర్చ్ ప్రపోజల్ సబ్మిట్ చేయాలి. దీని ఆధారంగానే అభ్యర్థులను షార్ట్‌లిస్ట్‌చేసి పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. రీసెర్చ్ ప్రపోజల్ సబ్మిట్ చేయనివారి దరఖాస్తులను పరిశీలించరు.

- యూజీసీ జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి పర్సనల్ ఇంటర్వ్యూలో సాధించిన స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. యూజీసీ నెట్ అర్హత ఉన్నవారికి నెట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఉంటుంది.


- **దరఖాస్తు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 20
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** ఆగస్టు 30
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు రెండో వారంలో
- **చిరునామా:** డీన్, డివిజన్ ఆఫ్ గ్రాడ్యుయేట్ స్టడీస్, సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్, నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్, బేగంపేట్, హైదరాబాద్-500016.
- **వెబ్‌సైట్:** www.cess.ac.in

డా.వైఎస్సార్ వర్సిటీలో డెంటల్ పీజీ ప్రవేశాలు

విజయవాడలోని డా.వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డావైఎస్సార్‌యూహెచ్ఎస్)-పోస్ట్ గ్రాడ్యుయేట్ డెంటల్ డిగ్రీ/డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ మైనారిటీ, అనుబంధ డెంటల్ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. ప్రభుత్వ డెంటల్ కళాశాలల్లో 50 శాతం సీట్లను స్టేట్ కోటా/కాంపిటెంట్ అథారిటీ కోటా కింద; మిగిలిన 50 శాతం సీట్లను ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ నాన్ మైనారిటీ డెంటల్ కాలేజీల్లో 50 శాతం సీట్లను కాంపిటెంట్ అథారిటీ కోటా కింద, మిగిలిన 50 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేస్తారు. ఎండీఎస్, డిప్లొమా ప్రోగ్రామ్‌లను అందిస్తున్న కాలేజీలు-సీట్ల వివరాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత వివరాలు: పీజీ డెంటల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీడీఎస్(బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సర్జరీ) ఉత్తీర్ణతతోపాటు 2024 జూన్ 30 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తి కావాలి. రాష్ట్ర స్థాయి/జాతీయ స్థాయిలో ఉన్న డెంటల్ కౌన్సిల్ గుర్తింపు తప్పనిసరి. నీట్ ఎండీఎస్ 2024 అర్హత పొంది ఉండాలి.

- నీట్ ఎండీఎస్ 2024 కటాఫ్ స్కోర్: మొత్తం 960 మార్కులకుగాను జనరల్ అభ్యర్థులకు 263; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ అభ్యర్థులకు 230; జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 246గా నిర్దేశించారు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.7080; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5,900
- **వెరిఫికేషన్ ఫీజు:** ఏపీ మినహా ఇతర రాష్ట్రాల్లో బీడీఎస్ పూర్తిచేసిన వారికి రూ.3,540; విదేశాల్లో చదివినవారికి రూ.8,260
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 24
- **వెబ్‌సైట్:** https://drysr.uhsap.in

మొరార్జీ దేశాయ్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా



కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా(ఎండీఎన్ఐవై-న్యూఢిల్లీ)-డిప్లొమా ఇన్ యోగా సైన్స్(డీవైఎస్సీ)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 75 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 33, ఓబీసీలకు 18, ఎస్సీలకు 10, ఎస్టీలకు 6, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 8 సీట్లు ప్రత్యేకించారు. అదనంగా మరో 22 స్పెషల్ కేటగిరీ సీట్లు కూడా ఉన్నాయి. వీటిని విదేశీ విద్యార్థులు, స్పోర్ట్స్/ఎన్‌సీసీ/ఎన్ఎస్ఎస్ అభ్యర్థులు, మాజీ సైనికులు, సంస్థ ఉద్యోగుల పిల్లలకు నిర్దేశించారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్, మెడికల్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఇంగ్లీష్, హిందీ మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు సెకండరీ స్కూళ్లు, ప్రీ యూనివర్సిటీలు, యూనివర్సిటీలలో యోగా ఇన్‌స్ట్రక్టర్లుగా రాణించవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. వయోపరిమితి నిబంధనలు లేవు. అభ్యర్థులు ఆరోగ్యవంతులై ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్: ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ అవేర్‌నెస్(ఇండియన్ హిస్టరీ, ఇండియన్ జాగ్రఫీ, ఫండమెంటల్ రైట్స్ అండ్ డ్యూటీస్, నేషనల్ అకడమిక్ ఇన్‌స్టిట్యూట్స్, నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ కరెంట్ అఫైర్స్, నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్స్, ముఖ్యమైన రోజులు); జనరల్ బయాలజీ(ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు సీబీ ఎస్ఈ నిర్దేశించిన సిలబస్); కాంప్రహెన్షన్ ఎబిలిటీ(రీడింగ్ కాంప్రహెన్షన్, ఒకాబులరీ బిల్డింగ్, పార్ట్స్ ఆఫ్ స్పీచ్, యాక్టివ్ పాసివ్ వాయిస్, డైరెక్ట్ - ఇన్‌డైరెక్ట్ స్పీచ్); యోగా(జీకే-యోగా, ఇంటర్నేషనల్ డే ఆఫ్ యోగా, కామన్ యోగా ప్రొటోకాల్) విభాగాల నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. ఈ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్, ఈడబ్ల్యూఎస్, స్పెషల్ కేటగిరీల అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు; దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 35 శాతం మార్కులు రావాలి. విదేశీ విద్యార్థులు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. వీరికి అకడమిక్ మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 2
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** ఆగస్టు 11
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** ఆగస్టు 19
- **మొదటి కౌన్సెలింగ్ తేదీలు:** ఆగస్టు 22, 23
- **రెండో కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** ఆగస్టు 27
- **రెండో కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 28
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **వెబ్‌సైట్:** yogamdniy.nic.in

జాబ్ కార్నర్

ఎన్ఎంఎల్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

జంషెడ్‌పూర్‌లోని ఎన్‌టీపీసీ మైనింగ్ లిమిటెడ్(ఎన్ఎంఎల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: **144**

అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా(మెకానికల్/మైనింగ్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ప్రొడక్షన్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 5 నాటికి 30 ఏళ్లు, ఒకేషనల్ ట్రెయినింగ్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు 40 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ/ఎక్స్- సర్వీస్‌మెన్ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు మైనింగ్ సర్దార్ పోస్టుకు రూ.40,000; మిగిలిన ఖాళీలకు రూ.50,000.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 5


వెబ్‌సైట్: https://ntpc.co.in/



అరుదైన పురాతన మెట్లబావి

మహారాష్ట్రలోని పర్భని జిల్లా సేలు తాలూకాలో సుమారు వెయ్యి లేదా పదిహేను వందల యేళ్ల నాటిదిగా భావిస్తున్న అత్యంత పురాతన వర్తులాకార మెట్లబావి అక్కడి స్థానిక ప్రజల చొరవతో ఈ మధ్య శుభ్రపడి, మరలా అందంగా రూపు దిద్దుకుంది. ఈ బావికి ఎనిమిది వైపులా ఎనిమిది సర్పిలాకార మెట్ల వరుసలు ఉన్నాయి. భారతీయ వాస్తు నిపుణుల పనితనానికి, మన సంప్రదాయ నిర్మాణాలకు ఈ బావి ఒక మచ్చు తునక అని చెప్పుకోవచ్చు.యేళ్ల తరబడి చెత్తా చెదారం పేరుకుని పోయి ఉన్న ఈ బావిని కొన్ని రోజుల క్రితం వాలూరు స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, ఆ చెత్తను అంతా తొలగించి, బావికి మునుపటి వైభవాన్ని తీసుకొచ్చారు.


6 తేడాలను గుర్తించండి?




దారి కనుక్కోండి



జత ఉన్న బొమ్మ ఏది?



సరైన నీడ ఏది?



	1	3	
			1
4			
	2	4	

డైలీ సుడోకు - 365

సుడోకు - 364 సమాధానం

5	2	1	6	3	4
3	6	4	1	5	2
4	5	6	3	2	1
1	3	2	5	4	6
6	4	5	2	1	3
2	1	3	4	6	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.